# బహుళ

త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక


సంపుటి - 2 సంచిక 4 https://www.bahulabyjwalitha.com జులై - సెప్టెంబర్ 2023



డాక్టర్ రీతు కరిధాల్



డాక్టర్ నందిని హరినాథ్


అనురాధ టి.కె.


మినల్ రోహిత్


మౌమితా దత్తా


టెస్సీ థామస్


డాక్టర్ వి.ఆర్. లలితాంబిక


ముత్తయ్య వనిత




కల్పనా కాళహస్తి


పి. మాధురి



## (చంద్రయాన్ 3) చందమామను చేరడంలో మహిళా శక్తి


కవిత

# పిల్లలు



అనువాదం : డా.గీతాంజలి-
8897791964

మీ పిల్లలు మీకు మాత్రమే పిల్లలు కాదు
ఏదో సాధించాలనే అఖండ జీవితేచ్ఛకు వారసులు వాళ్ళు.
వాళ్లు మీ ద్వారా ఈ లోకం లోకి వచ్చారు నిజమే కానీ మీ నుండి కాదు.
వాళ్ళని ఎంతైనా ప్రేమించండి కానీ
మీ ఆలోచనల బరిలోబంధించకండి,
వాళ్లకీ స్వతంత్ర భావాలు ఉంటాయి.
వాళ్ళకు శరీరాలను మీరు ఇచ్చి ఉండవచ్చు కానీ..
వాళ్ళ మనసులు మీవి కావు
వాళ్ళ మనసులు ఎప్పుడూ..
రేపు అనే అందమైన భావనలో దోబూచులాడుతూ ఉంటాయి.
ఆ సుందర భవిష్యత్తును మీరెన్నటికి దర్శించలేరు
కనీసం కలలోకూడా చూడలేరు
మీరేం చేయాలంటే..
మీరు వాళ్ళలా ఎదగటానికి ప్రయత్నించండి
వాళ్ళని మీలాగా మార్చే ప్రయత్నం మాత్రం చేయకండి.
ఎందుకంటే..
జీవితమెప్పుడూ తిరోగమించదు.. గతంలోనే కూరుకుపోదు
పెద్దవాళ్ళు మీరేమో విల్లు వంటి వారు !
కానీ పిల్లలు ?
మీ నుంచి విడివడి ముందుకు దూసుకుపోయే శక్తివంతమైన బాణాలు.!
ఓ విలుకాడు.. అల్లంత దూరాన ఉన్నలక్ష్యాన్ని గురి చూసి బాణం వదులుతాడు
అతను లక్ష్యాన్నితాకే బాణాన్ని ప్రేమిస్తాడు.. స్థిరంగా ఉండే విల్లునూ ప్రేమిస్తాడు
బాణాల వలెనే మీ పిల్లలు తామెక్కడికి చేరాలో అక్కడికి వారే చేరుతారు.
పిల్లలను మీ ఆలోచనలో బంధించకండి
మీలా ఉండాలని భావించకండి
వాళ్ళ భవిష్యత్తుని వాళ్ళే నిర్ణయించుకుంటారు



ఖలీల్ జీబ్రాన్ (1883 - 1931)
(లెబనాన్ దేశ కవి, తత్వవేత్త)

★★★

# 'చూపుడు వేలే ఆయుధం'



"మనకి ఒకే ఒక్క శత్రువు ఉన్నాడు.. ఆ శత్రువు పేరే అజ్ఞానం. విద్యావంతులమై ఆ శత్రువును తుదముట్టడించడమే మన లక్ష్యం" అన్నారు సావిత్రీబాయి పూలే.

మనని విద్యకు దూరం చేస్తూ కొన్ని వేల సంవత్సరాలు అజ్ఞానంలో ఉంచారు కొందరు. విద్యను వ్యాపారం చేసి కొంత ముంచేశారు మరికొందరు. విద్యను మతంగా మార్చి మరింత అజ్ఞానంలోకి నెట్టడం మొదలై చాలా దశాబ్దాలయింది.

ప్రజలు వివేక వంతులు కాకుండా కన్ఫ్యూజన్ క్రియేట్ చేయడం ఒక వ్యూహం. దేశ ప్రజలను విద్యకు, ఆరోగ్యానికి దూరం చేసి మత్తులో ముంచడం మరో వ్యూహం. ఈ రెండు వ్యూహాత్మక వలల్లో చిక్కుకున్న ఎరలం మనం.

"దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాలమేడలు, రంగుల గోడలు కాదు. పౌరుని నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి" అని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన

ఈ మాటలను మనం పదే పదే మననం చేసుకోవాలి.

దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడేనా అంటే నాకు ఊహ తెలిసినప్పటి నుండి అంతే ఉంది. కాకపోతే ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ సంక్లిష్టంగా మారింది. ప్రశ్నలను అంతమొందిస్తున్న కాలమిది. మనను కాపాడే రాజ్యాంగమే ప్రమాదంలోకి నెట్టబడి, ఒక్కొక్క అధికరణ అవకరణకు లోనవుతుంటే, దేశ ప్రజలమైన మన పరిస్థితి చెప్పడానికి ఏముంటుంది. ఇక రెండో తరగతి పౌరులమైన మహిళల పరిస్థితి అగమ్యగోచరమే.. 'ఆకాశంలో సగం' అంటూ ఎదుగుతున్న మన స్త్రీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గౌరవ మర్యాదలకు, ప్రాణాలకు భద్రత లేక భయం భయంగా బ్రతకాల్సిన పరిస్థితి మనది. స్వేచ్ఛారెక్కలను విరిచేసి, కలల కంఠాలకు ఉరులు బిగిస్తున్నారు. ఏది మాట్లాడాలో, ఏది బోధించాలో, ఏది రాయాలో, ఏది ధరించాలో, ఏది తినాలో, ఎక్కడ సంచరించాలో నియంత్రిస్తూ.. 'కులం – మతం – అధికారం – అహంకారం' నాలుగు పడగల హైందవ నాగరాజై బ్రతుకులను భయపెడుతుంటే.. ఎక్కడికి పారిపోతాం ? ఎలా రక్షించుకుంటాం ? బంధించి బాధితే పిల్లి అయితే మీద పడి రక్కేసి తప్పించుకుంటుంది. మరి మనుషులం కదా.. కర్మ సిద్ధాంతాన్ని, ఆత్మ – పరమాత్మలను విశ్వసిస్తూ బ్రతికీడుస్తున్నాము. చిన్న చిన్న ప్రలోభాలకే జీవితాలను తాకట్టు పెట్టేస్తాము. సైన్స్ విజయాలకు కూడా భక్తిని పులిమి జబ్బలు చరుచుకుంటాం.

ఈ పాలకులకు భయపెట్టి పాలించమని రాజకీయ సూత్రాన్ని బోధించింది ఎవరో కానీ, సమాజపు పరువు మోసే బాధ్యత మహిళల భుజాలపై ఉంచి, విజయాలను మాత్రం స్త్రీల రెండు కాళ్ల మధ్య కండరాల దగ్గర వెతుక్కుంటున్నారు. ఈ వికృతత్వాన్ని నిలదీయాల్సిన తరుణం ఇది. మణిపూర్ మారణకాండ మానవహననం, నగ్నదేహాల ఊరేగింపు, హత్యాచారాల కొనసాగింపు ఎంత దారుణం. అక్కడేనా మన తెలుగు రాష్ట్రాలు ఏం తక్కువ తిన్నాయి. గాంధీ చెప్పిన 'అర్ధరాత్రి ఆడవారు నడిరోడ్డుపై నడవగలిగే స్వాతంత్రం' మనకు ఇంకా రాలేదు, అనడానికి నిదర్శనం ఎల్బీనగర్లో  బంజారా యువతి వద్యా లక్ష్మీ పై జరిగిన దాష్టికం. ఠాణాలో మరణించిన మరియమ్మ సంగతి మరవకముందే మళ్లీ మళ్లీ కొనసాగుతూనే ఉన్నాయి ఇటువంటి సంఘటనలు.

'చంద్రయాన్–3' లో మహిళా శక్తి భాగస్వామ్యాన్ని చూసి గర్వపడాలో.. నిత్యం జరిగే హత్యాచారాలకు సిగ్గుపడాలో ఆలోచించ వలసింది మనమే..

ఇప్పుడు రాబోయే మరో పెద్ద విపత్తు.. ఎన్నికల ప్రహసనం మరి మనమేమి చేయాలో ఆలోచించండి. ముందు ముందు మనదేశంలో ఎన్నికలే జరగవట, మనది ప్రజాస్వామ్య దేశంగా ఉండబోదని ప్రజాస్వామికంగా ఎన్నికలు కాక, నియంతల పాలన కొనసాగబోతుందని మేధావుల హెచ్చరికలు.. వింటున్నారా..

'పవర్ ఈజ్ ద మాస్టర్ కీ' అని మనకు ఓటు అనే ఆయుధాన్ని అందించాడు ఆ మహానుభావుడు. ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దు మనం. మన ఓటు హక్కును వేరొకరు ఉపయోగించుకోకుండా జాగ్రత్త పడదాము.

వచ్చే ఎలక్షన్స్ లో మనం పోలింగ్ బూత్ కి వెళ్లేసరికి అక్కడ మన ఓటు లేకపోయినా, ఓటర్ లిస్ట్ లో మన పేరు గల్లంతైనా, మన ఓటరుకార్డు / ఆధార్ చూపించి సెక్షన్ 49A క్రింద 'ఛాలెంజ్ ఓటు' వేయొచ్చు!

మన ఓటు అప్పటికే వేరే ఎవరైనా వేసేసినట్లయితే, భయపడకుండా ధైర్యంగా 'టెండర్ ఓటు' అడగొచ్చు!

ఏ బూత్ లో అయినా 14% దాటి 'టెండర్ ఓట్లు' పోలైతే, అక్కడ రీ–పోలింగ్ జరుగుతుంది. ఈ మెసేజ్ రానున్న 2024 ఎలక్షన్ల సమయానికి అందరికీ తెలియాల్సిన అవసరం ఉంది, ప్రచారం చేద్దాము. ఎన్నికల్లో అక్రమాలు అరికట్టడానికి పౌరులుగా మన వంతు బాధ్యతలను మనం నిర్వహిద్దాం!

రాజ్యాధికారం కోసం పోరాడితే పాలకులము అవుతాము. పని కోసం పోరాడితే సేవకులము అవుతాము. దేని కోసం నిలబడి కలబడదామో తేల్చుకోవాలిసింది మనమే.

మేకల్ని బలి ఇస్తారు. కానీ పులుల్ని బలివ్వరు మనం పులులుగా బ్రతకాలి మరి..

– జ్వలిత, ప్రధాన సంపాదకురాలు 9989198943.


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**సంపాదక వర్గం**
డా. తిరునగరి దేవకీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి
ఆచార్య సూర్య ధనుంజయ
ఆచార్య కె. ఆశాజ్యోతి
డా. వంగరి త్రివేణి
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. గోగు శ్యామల
డా. నందిగామ నిర్మల కుమారి
డా. మారోజు దేవేంద్ర
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి



బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.



**రచనలు పంప వలసిన చిరునామా :** జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ - 500072, తెలంగాణ
editorbahula@ gmail.com Cell : 9989198943

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | చందమామను చేరడంలో మహిళా శక్తి | – సేకరణ : జ్వలిత......................... 1 |
| 2. | అనువాద కవిత | పిల్లలు ఖలీల్ జీబ్రాన్ (1883 – 1931) | – డా. గీతాంజలి ........................... 2 |
| 3. | వ్యాసం | పాకాల యశోదారెడ్డి సాహితీసేవ | – ఆచార్య సూర్య ధనుంజయ ............ 5 |
| 4. | కథ | పాలాల్ల | – డాక్టర్ కొండపల్లి నీహారిణి........... 11 |
| 5. | అవగాహన పత్రం | 'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరమ్ | ............................................. 14 |
| 6. | కవిత | తిరుగుబాటు రుతువు | – మందరపు హైమవతి ................. 17 |
| 7. | సమీక్ష | ఒక సబల సచిత్ర స్వీయచరిత్ర | – ప్రొ. సిహెచ్. సుశీలమ్మ.............. 18 |
| 8. | కవిత | ఎడారి వసంతం | – జంగం స్వయంప్రభ .................. 20 |
| 9. | వ్యాసం | ఈనాటి హింసాత్మక సంఘటనల నేపధ్యంలో ఆనాటి నా మణిపూర్ అనుభవాలు | – కొండవీటి సత్యవతి .................. 21 |
| 10. | కథ | ఊపిరి | – రమాదేవి బాలబోయిన............... 31 |
| 11. | కవిత | అయినా | – నస్రీన్ ఖాన్ ............................ 32 |
| 12. | వ్యాసం | ఇక మారాల్సింది మహిళలే..! | – నాంపల్లి సుజాత...................... 33 |
| 13. | కథ | ఊహల మడుగు | – వనజ తాతినేని........................ 35 |
| 14. | పుస్తక సమీక్ష | వ్యవస్థను ప్రశ్నించే స్త్రీల కథలు | – బి వి ఎన్ స్వామి ..................... 39 |
| 15. | కవిత | ఆమె | – సరోజన బోయిని..................... 41 |
| 16. | వ్యాసం | అవసరమైన అవగాహన | – శ్రీమతి అనురాధా రావు.............. 42 |
| 17. | కథ | పాలపుంతలు | – యేలూరి శేష బ్రహ్మం, ............... 44 |
| 18. | కవిత | సిగ్గు ... సిగ్గు ... | – హిమజ ................................ 46 |
| 19. | కథ | షీ | – రోహిణి వంజారి...................... 49 |
| 20. | కవిత | ఎక్కడ చూసినా ఆమే! | – యలమర్తి అనూరాధ ................ 51 |
| 21. | కథ | ఊహల దెయ్యం ...... | – లంకా సీత ............................. 52 |
| 22. | కథ | మోచేతి మోక్షము | – కాంతి నల్లూరి ........................ 54 |
| 23. | కవిత | నేను | – శైలజామిత్ర ............................ 59 |
| 24. | కథ | దిగ్బంధనం | – జయంతి వాసరచెట్ల .................. 60 |
| 25. | కవిత | జెండా పండుగ | – చల్లా సరోజినీ దేవి .................... 65 |
| 26. | కవిత | ఏ పేరు పెట్టాలి | – సోని కట్కూరి .......................... 66 |
| 27. | కథ | బంగారు మురుగు | – శ్రీరమణ................................ 67 |
| 28. | కొత్త పరిచయం | బాల చిత్రకారిణి | – యేలూరి శేషబ్రహ్మం ................. 75 |
| 29. | బాల బహుళ | | ............................................... 76 |

వ్యాసం

# పాకాల యశోదారెడ్డి సాహితీసేవ



- ఆచార్య సూర్యా ధనంజయ్
హైదరాబాద్, 9849104186

పాకాల యశోదారెడ్డి తెలంగాణ ముద్దుబిడ్డ. 'తెలంగాణ ఎట్లుంటది' అని ఎవరైనా అడిగితే యశోదారెడ్డిని చూపించవచ్చు. అంతగా ఆమె అందరి హృదయాల్లో నిలిచిపోయారు. ఆమె గురించి మాట్లాడాలన్నా, రాయాలన్నా తెలంగాణ భాష అస్తిత్వాన్ని ఆవిష్కరించడమే తప్ప మరొకటి కాదు.

యశోదారెడ్డి తన జీవితకాలమంతా తెలంగాణ మాండలిక పదసంపద పరిరక్షణ కొరకు పాటుపడిన విదుషీమణి. వాడుకభాషలో అన్యభాషా పదాల చేరికతో తెలంగాణ భాష సొగసు కోల్పోయిందని ఆవేదన చెందేవారు. అందుకే తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వ్యావహారిక భాషను ఉపయోగించి తెలంగాణ జీవితాన్ని తమ రచనల్లో ప్రతిఫలింపజేశారు. తాను పుట్టి పెరిగిన గడ్డమీది మమకారంతో భాష, యాసలపై ఉన్న ప్రేమతో పూర్తిగా తెలంగాణ మాండలికంలోనే రచనలు చేసిన తొలి కథా రచయిత్రి యశోదారెడ్డి అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

మహిళలు చదవడమే కష్టమైన రోజుల్లో ఎం.ఏ., పిహెచ్.డి.లు చేసి విశ్వవిద్యాలయ స్థాయికి ఎదిగారు యశోదారెడ్డి. అన్ని రంగాల్లో ఉన్నట్లుగానే సాహిత్య రంగంలోను పురుషుల సంఖ్య ఎక్కువ, స్త్రీల సంఖ్య తక్కువగా ఉన్న తరుణంలో –రచయిత్రిగా తన ప్రయాణం ప్రారంభించి ఉన్నతశ్రేణి రచయిత్రిగా చిరస్థాయిగా మిగిలిపోయారు. ఆమె రాసిన కథా సంపుటాలు 'మావూరి ముచ్చట్లు', 'ఎచ్చమ్మ కథలు', 'ధర్మశాల'లు తెలుగు సాహిత్యంలో విలక్షణతను సంతరించుకున్న గ్రంథాలు. అయితే ఆమె కథల్లోని వస్తువు పాఠకులను ఆకర్షించకపోవచ్చు. వస్తువుల్లో సామాజిక స్పృహ ఉండకపోవచ్చు. కాని ఆమె కథల్లో తెలంగాణ అస్తిత్వం ఉంది, భాష ఉంది, యాస ఉంది, జీవం ఉంది, ఆత్మ ఉంది, అణగారిన వర్గాల ఆక్రందన ఉంది, పల్లె సంస్కృతి ఉంది, తిట్లున్నాయి, ఒట్లున్నాయి, వారి సాధక బాధకాలన్నీ ఉన్నాయి. మొత్తంమీద తెలంగాణ సంపూర్ణ మూర్తిమత్వం ఆమె కథల్లో ఆవహించి ఉంది.

పాలమూరుగా పిలుచుకునే మహబూబ్నగర్ జిల్లాలో ఆగస్టు 8, 1929న జన్మించారు యశోదారెడ్డి. తల్లి సరస్వతమ్మ, తండ్రి కాశిరెడ్డి. యశోదారెడ్డి తల్లి తన చిన్నతనంలోనే మరణించడంతో రుక్మిణమ్మ దగ్గర పెరిగారు. రుక్మిణమ్మ ఆమెను ముద్దుగా 'ఎచ్చమ్మ' అని పిలిచేది. యశోదారెడ్డి ప్రాథమిక విద్యను బిజినేపల్లిలోనూ ఆ తర్వాత మాడపాటి హనుమంతరావు స్కూల్లోనూ చదివారు. డిగ్రీ ఉమెన్స్ కళాశాలలో, ఎం.ఏ., పిహెచ్.డి.లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పూర్తిచేశారు. ఆమెను ఆగ్రా యూనివర్సిటీ డి.లిట్తో సత్కరించింది. అంతే కాదు జర్మనీ భాషలో డిప్లొమా కూడా చేశారు. ప్రముఖ చిత్రకారుడు పి.టి.రెడ్డితో ఆమెకు వివాహం జరిగింది. పుట్టినిల్లు బిజినేపల్లి అయితే మెట్టినిల్లు కరీంనగర్ జిల్లా. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్య పదవిని అలంకరించారు. అధ్యాపకురాలిగా ఉంటూనే నిరంతరం తన రచనా ప్రతిభా పాఠవాలని కొనసాగించారు. తెలంగాణ ప్రాంత ముద్దుబిడ్డగా, భాషాభిమానిగా, మాండలిక పరిరక్షకురాలిగా ఎంత చేయాలో అంత సాహితీ కృషి చేసిన అసమాన్యురాలు యశోదారెడ్డి.

**యశోదారెడ్డి సాహితీ సృజన**

తెలుగు సాహిత్యంలో యశోదారెడ్డి అనేక ప్రక్రియలను తమదైన పంథాలో స్పృశించారు. కథలు, కవిత్వం, వ్యాసాలు, పరిశోధనా వ్యాసాలు, సమీక్షల వంటి అనేకాంశాలలో విరివిగా కృషిచేశారు. వారు ఏ రంగాన్ని ఎంచుకున్నా దాని లోతుల్ని అన్వేషించేవారు. ఆ క్రమంలో సాధారణ కార్యాల్ని కాంక్షించక, అసాధారణ గమ్యాలనే శోధించేవారు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అన్నట్లుగ యశోదారెడ్డిలోని రచయిత్రి బాల్యంలోనే అంకురించింది. మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాలో ఎనిమిదవ తరగతి చదువుతున్నప్పుడే 'మాతృభారతి పత్రిక'లో 'యశోదా ఆనందఘట్టం' అనే కథను 1934లోనే రాశారు. ఆనాడు మొదలైన వారి రచనా ప్రాభవం జీవిత చరమాంకం వరకు సుదీర్ఘంగా కొనసాగింది. ఈ నడుమకాలంలో వారు ఇరవైరెండు పుస్తకాలను, ఏడు లఘు గ్రంథాలను, రెండు కవితా సంపుటాలను, ఎనభై పరిశోధనా వ్యాసాలను వెలువరించి సాహితీ జగత్తులో ఉన్నతమైన రచయిత్రిగా కీర్తి గడించారు.

కథకు యశోదారెడ్డికి విడదీయరాని అవినాభావ సంబంధం ఉంది. సి. నారాయణరెడ్డి ఎన్నో ప్రక్రియల్లో ప్రతిభ చూపినారు. కాని వారిపేరు వినగానే మనకు గుర్తొచ్చేది కవిత్వం. అట్లాగే ఆమె ఎన్ని పార్శ్వాల్లో రచనలు చేసినా, యశోదారెడ్డి అనగానే వెంటనే పాఠకుల మదిలో మెదిలేది వారి కథలే. తన కథల ద్వారా సాహిత్య ప్రపంచంలో తిరుగులేని మాండలిక ప్రయోగకర్తగా శాశ్వత ముద్రను వేసుకున్నారు.

ప్రాచీన కవయిత్రులైన మొల్ల, ముద్దుపళని, తిరుమలాంబ మొదలైనవారు దైవభక్తిని, రాజభక్తిని, ప్రకృతి ప్రీతిని ఆశ్రయించి కవిత్వం రాశారు. ఆధునిక కవయిత్రులు స్త్రీ, సమాజం, సాంఘిక జీవితాలను గురించి కవిత్వం రాశారు. వాటిలో కవితలు, కథలు, నవలలు, నాటికల రూపాల్లో వారి ప్రతిభను చాటుకున్నారు. ఈ పరంపరలో తెలంగాణలోనే కాక మొత్తం తెలుగు ప్రాంతాలలో ఎందరో రచనలు చేశారు. అటువంటి వారి రచనా వస్తువులను, యశోదారెడ్డి రచనలతో సాధారణీకరణం చేసి పరిశీలిస్తే తెలంగాణ మాండలిక సౌరభాలను దేశ నలుమూలలా చాటి చెప్పిన గొప్ప రచయిత్రిగా యశోదారెడ్డి ఒకడుగు ముందుంటారన్నది వాస్తవం.

యశోదారెడ్డికి తెలుగునాట శాశ్వత గుర్తింపుని, కీర్తిని తెచ్చి పెట్టినవి కథలే. ఆ కథా శీర్శికలేవైనా, సంపుటి పేరేదైనా పాఠకులు మాత్రం 'యశోదారెడ్డి కథలు' అనే పిలుచుకుంటారంటే వారు ఎంతటి ప్రభావం తెలుగు కథపై చూపారో అర్థం చేసుకోవచ్చు. యశోదారెడ్డి నూట అరవైకి పైగా కథల్ని రాశారు. ప్రతి కథలోనూ తెలంగాణ భాష, యాస ఆ కథంతా పరచుకుని మాండలిక మాగాణులుగా దర్శనమిస్తుంటాయి. తన కథలను మూడు సంపుటాలుగా వెలువరించి తెలుగు సాహిత్యంలో ఒక ప్రభంజనాన్ని సృష్టించారు.

1972లో వెలువడిన సంపుటి 'మా ఊరి ముచ్చట్లు'. ఇందులో ఉత్తమమైన పది కథలున్నాయి. 2000ల సంవత్సరంలో 'ఎచ్చమ్మ కథల'ను గ్రంథ రూపంలో తీసుకురావడం జరిగింది. ఇందులో ఇరవై కథలున్నాయి. వీటిల్లో ఎచ్చమ్మ కథల సంపుటి కంటే ముందే ధర్మశాల కథల సంపుటి వెలువడినప్పటికీ ఎచ్చమ్మ కథలనే –యశోదారెడ్డి ముందుగా రాశారు.

మా ఊరి ముచ్చట్లు' కథల్లో గంగరేగి చెట్టు, మ్యానరికం, జతగాళ్ళు, పీర్లపండుగ, ఎంకన్న వంటి ఉత్తమ కథలు ఉన్నాయి. ఎచ్చమ్మ కథల సంపుటిలో తరాలనాటి తెగులు, జమ్మి, పుర్రెకో బుద్ధి, జిహ్వాకో రుచి, కోడలమ్మ ఎతలు, ఎదుర్కోళ్లు, బుక్కిందే దక్కింది లాంటి కథలున్నాయి. 'ధర్మశాల'లో నిప్పుతో చెలగాటం, అకాయ్చేసిన పెళ్లి, ప్రమీల, గుళ్ళో గంటలు, దిబ్బరొట్టి, పేరులో ఏముంది, ఎదల్లోని పొరలు, అందిన కందిరీగ, సీతమ్మగారి సీమ ప్రయాణం, మాధవీలత నవ్వింది వంటి కథలున్నాయి. ఈ కథలన్నింటిలో మూడు ప్రత్యేకాంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆసక్తికరమైన

శీర్షికలను కథవైపు పాఠకుడి దృష్టి కలిగేలా పెట్టడం. కథల్లో వాక్యాలు ముచ్చట్లు చెబుతున్నట్లు ఉండి పాఠకుడిని రంజింపజేయడం, మాండలికాలు, యాసలు కథల్లో ఆసాంతం నిండి వుండడం ఇందలి విశేషం.

యశోదారెడ్డి కథలు ఆనాటి తెలంగాణ సమాజానికి సామాజిక జీవనానికి అద్దం పట్టాయి. తెలంగాణ పల్లెలలోని పండుగలు, పబ్బాలు, రోజువారి కూలీపనులు, కులవృత్తులు, కట్టుబాట్లు, భాష, సంస్కృతి, సంప్రదాయాలు సమగ్రంగా ఆమె కథల్లో దృశ్యమానం చేశారు. ఒక్కొక్క కథలో ఒక్కో ఇతివృత్తం ఉన్నప్పటికీ ప్రతి కథలోనూ అంతర్లీనమైన యాసభాషల స్పృహ, మాండలిక ప్రాముఖ్యం తప్పకుండా కనిపిస్తూనే ఉంటాయి. మాఊరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, ధర్మశాల ఈ మూడు సంపుటాల్లోనూ యశోదారెడ్డి తెలంగాణ భాషాసాహిత్యాలపై తనకున్న మక్కువను ప్రీతిపాత్రంగా చాటుకున్నారు. సామెతలు, జాతీయాలు, నుడికారాలు, పదబంధాలు, మాండలికాలు వీలైనన్ని కథల్లో దూరి పాఠకుడికి చేరువ కావడానికి ఆమె శక్తికొద్ది సృజన గావించారు. తెలంగాణ నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు, సాంఘికాచారాలు, సామాజిక పరిణామాలు ప్రతిబింబించే విధంగా కథల్ని తీర్చిదిద్దారు. 'పీర్లపండుగ' కథ హిందూ ముస్లింల సామరస్యాన్ని, అనుబంధాన్ని చాటి చెబుతుంది. ఇదే వస్తువు గల మరో కథ 'జతగాళ్లు'. ఇందులో ఇతివృత్తం వేరేదైనా వస్తువు మాత్రం హిందూ ముస్లింల ఐక్యతే. ఇక 'మేనరికం' కథలో కుటుంబ సంబంధాలు, పట్టింపులు, నమ్మకాలు, ఆచారాలు, మగపెళ్ళి, ఆడపెళ్ళివారి ఆడంబరాలు, బంగళా జీవితం మొ॥న అంశాలు ఉన్నాయి. యశోదారెడ్డి బంగళాలో పెరగకున్నా కథల్లో బంగళాను వర్ణించే తీరు నిజంగా బంగళాలో ఉన్నవారికే అంతటి పరిశీలన ఉంటుందేమో అన్నంత సూక్ష్మంగా వర్ణించారు. బంగళాలో ఉండే వస్తువులు, పనివారు, వాళ్ళపనులు, మర్యాదల వంటి విషయాలన్నీ వర్ణనలో కనిపిస్తాయి.

ఆకలి, సామాజిక వెనకబాటు, పేదరికం మనిషిని దొంగగా ఎట్లా చేస్తాయో, చివరికి ఆ దొంగ మంచి మనిషిగా మారితే సమాజంలో ఏ విధమైన మార్పు వస్తుందో తెలుపుతూ చిత్రించిన కథ 'నాగి'. దీనిలో అల్లరి చిల్లరగా తిరిగే నాగి కౌమార దశను చాలా సహజంగా పల్లె వాతావరణంలో చిత్రించారు యశోదారెడ్డి.

సన్యాసిగా రూపం మార్చిన ప్రతివాదు ప్రవచనాలు చెబితే మనం విని అమాయకంగా మోసపోవద్దని హెచ్చరిస్తూ, దొంగ స్వాములు గంజాయి తాగుతూ మత్తులో ఎట్లా జోగుతారో తెలిపిన సామాజిక చైతన్యం గల కథ 'జోగులయ్య'. ఈ కథ శీర్షికలోనే ఇతివృత్త ఆంతర్యం దాగి ఉంది. యశోదారెడ్డి ప్రత్యక్షంగా చూశారో, ఎక్కడన్నా చదివినారో కాని మత్తులో ఉండి కుటుంబాలను, వారి జీవితాలను ఆగంజేసుకునే బలహీన మనస్కులను వాస్తవికానికి అతి దగ్గరగా వివరించారు.

జానపదులకి పశుపక్ష్యాదులపై ఉండే మమకారాన్ని చెప్పిన కథ 'ఎంకన్న'. దసరా పండుగ తెలంగాణలో జరుపుకొనే తీరుని కళ్ళకు కట్టించే కథ 'జమ్మి' కథ. తెలంగాణ ఇళ్ళలో పెళ్ళిని, పెళ్ళి సందడిని, పెళ్ళిలో వాడే వస్తువులను తెలుపుతూ రాసిన కథ 'ఎదుర్కోళ్ళు'. ఇందులో మగపెళ్ళివారు, ఆడపెళ్ళివారు చేసే సందడి, మర్యాదలు, పిలుపులు వివరిస్తూనే, గరిగెముంత (గరిగబుట్ట), ఐరేణి కుండలు, కుంకుమ, బుక్క, బులాలును గురించి తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వర్ణించారు.

ధర్మశాల కథల సంపుటిలోని 'దిబ్బరొట్టి' కథ పల్లె జీవితానికి, నగర జీవితానికి ఉన్న తేడా, పట్నాల్లోని ఫాస్ట్ఫుడ్స్ కంటే పల్లెల్లోని వంటలే మేలన్న విషయాన్ని ప్రాక్టికల్గా చూపించిన కథ దిబ్బరొట్టి. ఇట్లా యశోదారెడ్డి కథల్లో సామాజిక, సాంఘిక, జీవితాలు సమాజానికి దగ్గరగా వుంటాయి. ఈ కథలే ఆల్ ఇండియా రేడియోలో మహాలక్ష్మి ముచ్చట్లుగా వినిపించేవి. అవి అన్నీ పాలమూరు జిల్లా బిజినేపల్లి యాసలో ఉండేవి. వాటిని మనం చదివిన దానికంటే ఆమె చదువుతుంటే చాలా రక్తి కట్టేవి. చక్కని ఉచ్చారణ, మధురమైన గొంతుకను రేడియోలో వినిపించి తెలంగాణ భాషా సౌందర్యాన్ని అందులోని

మాధుర్యాన్ని శ్రోతలకు రుచి చూపించి అందరి అభిమానాన్ని పొందారు.

### యశోదారెడ్డి రచనల్లో మాండలిక మాధుర్యం

మాతృభాష తల్లి పాలవంటిదైతే పరభాష దాదిపాల వంటిది' అని కొమర్రాజు లక్ష్మణరావు చెప్పినట్లు మాండలిక పద ప్రయోగాలతో మనసుని తాకే భాషను ప్రదర్శించిన రచయిత్రి యశోదారెడ్డి. వ్యవహారికంలోని సంభాషణలతో పోల్చితే మాండలికంలో చెప్పే ముచ్చట్లే సూటిగా హృదయాలను చేరుతాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు. వారి కథలను చదివితే యశోదారెడ్డి మాండలికానికే మారు పేరుగా నిలిచారని అర్థమవుతుంది.

యశోదారెడ్డి తొలి కథా సంపుటియైన 'మా ఊరి ముచ్చట్ల'లో మాండలిక పదాలు రాసులుగా కుప్పపోశారు. వాటిల్లో లాట్సాబ్, తాలూర్దార్, వొయ్యిలల్ల, బాగెఆమ్, బిజిలి పంకలు, నెత్తిముసుగు, గత్తర, మిత్తి, దౌడు, ఛత్రి, పురాగ, దోల్కపోవడం, సంకటి, పైనింద, వైనాలు, చన్నుబుడ్డి, దిడ్డి తలుపు, గీమాలు, కీసలు, పంక, నాదాని, ముంగల, ఎరికేనా, గిర్కి, సెర్లకోల, సోయి, ఎచ్చులు లాంటి పదాలు గంపలకొద్ది స్వచ్ఛమైన పల్లె మాండలికాలు కనబడతాయి.

కొత్తబాట' కథలో, తొవ్వపొంటి, ఉల్కవు, పల్కవ్, ఎగవాకి, ఈడికి, శికెళ్ళ, ఇంగోటి, తీర్థ, అద్దమ్మ రాత్రిళ్లు, పాలోండ్లు వంటి పదాలున్నవి. మరోకథ 'ఎదుర్కోళ్లు'లో వాకిలి, పెద్దిరం, ఇసురౌతు, ఆత్రం, వోకుంటే, సాపుచేసుకొని, యాది, సెవుల, సదువులు, పానం, తువ్వాల మొదలగు తెలుగు మాండలిక పదాలు కనపడతాయి. గంగరేగిచెట్టు కథలో యాళ్ళపాళ్ల, గొంచకపోయి, పల్కపెయ్యి, ఈత్యాప, మ్యానల్లుడు, గట్టిజేస్తడు, పుట్కలవడ్డ, గోలెం, అసోంటి, ఉర్కిపోయి, మీదికెళ్ళి, పోరి, కసరుగాయలు, కమ్మలకత్తి, ట్యాలకు అనే సహజమైన తెలంగాణ మాండలిక పదాలతో తన కథల్ని తడిపిన తెలంగాణ భాషా ప్రేమికురాలు యశోదారెడ్డి.

యశోదారెడ్డి కథలన్నింటిలోనూ ఇటువంటి మాండలిక పదాల సువాసన పరిమళిస్తూనే ఉంటుంది. అయితే యశోదారెడ్డి సహజంగానే పాలమూరు బిడ్డవడం వలన ఆమె జీవన విధానంలో మాండలికం నిరంతరం అంతర్భాగంగా ప్రవహించింది కాబట్టి ఆ అనుభవాన్ని రచనా వ్యాసంగంలోనూ అంతే బలంగా కొనసాగించారు.

### యశోదారెడ్డి కథల్లో సామెతలు

యశోదారెడ్డి ఔచిత్యం తెలిసిన రచయిత్రి. పండితుడికి పాండిత్యంకన్నా ఆ పాండిత్యాన్ని సందర్భోచితంగా ఉపయోగించడం తెలియాలి. అట్లా ఔచిత్యభరితంగా, సందర్భానుసారంగా సామెతలను కథల్లో ప్రయోగించడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. వాక్యాన్ని రసవత్తరంగా చెప్పే సందర్భంలో సామెతలని జతచేసి చెప్పడం జానపదులకు బాగా అలవాటు. యశోదారెడ్డి పల్లెల్లో పెరగడంతో ఆమెపై సామెతల ప్రభావం ఎక్కువగానే ఉందని తెలుస్తుంది. ఈ విషయాన్ని వారి కథల్లోని అనేక సామెతలు స్పష్టం చేస్తాయి. వాటిని పరిశీలిస్తే... పురాగ వెలుతురుకు దడిగట్టినట్లు, మనసు ఉట్టి ఊగినట్లు, ఆవులిస్తే పేగులు లెక్కించే బాపతు, కొండను తొవ్వి తొండను తీసినట్లు, మాటలు కోటలు దాటుతాయి కాని సేతలు గీతలు దాటవు, సూర్యుడు తనోడైతే సుక్కలన్నీ తన కుక్కలంట, ఉట్టి ఎంత ఊగినా ఊగి ఊగి ఉన్నకాడికే వస్తది, కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది, నెత్తి నీడ వోంగనే వడదెబ్బలకు కరువా, గంగాలంల చేప చెర్లబడ్డట్లు, ఎవరి పెరటి పువ్వు వాళ్ళకి సువాసనే, ముక్కు మీద ఈగ వాలితే ముక్కు కోసుకునే బంటు, అరుసుణ్ని జూసి పురుషుణ్ని పోగొట్టుకొనే, కసురుగాయలతోటి పసర్లు కక్కించినట్లు లాంటి సామెతలెన్నో కథల్లో ఇమిడి ఉన్నాయి.

ఈ సామెతలు అచ్చమైన జానపదీయతకు అద్దం పడుతున్నాయి. కాలక్రమంగా జరిగిన భాషా ప్రయోగాల్లోని మార్పుల ఫలితంగా ఇటువంటి అందమైన సామెతలు నేడు చాలావరకు మరుగున పడ్డాయి. యశోదారెడ్డి తన కథల్లో అవకాశం ఉన్నచోట తప్పనిసరిగా సామెతలను పెట్టడం వల్ల

ఆ సమయంలో కథ వేగం, నడక, శిల్ప సౌందర్యాలు మరింత ప్రస్ఫుటంగా పాఠకుడిని చేరుతాయి. తెలుగులో ఇప్పటివరకూ వివిధ రచనలు చేసిన అనేకమంది రచయిత్రుల రచనలను పరిశీలిస్తే యశోదారెడ్డిలా కథల్లో సామెతలను ఇంత ఎక్కువగా ఉపయోగించిన వారు తక్కువనే చెప్పవచ్చు.

**యశోదారెడ్డి కథల్లో జాతీయాలు**

తెలుగు రచయిత్రులలో యశోదారెడ్డి తన శక్తి, ప్రతిభ పాటవాలను రచనల్లో బలంగా చూపించారని వారి కథలను బట్టి చెప్పవచ్చు. కవిత్వం, కథ, విమర్శ, వ్యాసం, ప్రసంగాలలో రచన ఏదైనా, ప్రక్రియ ఏదైనా తనదైన ప్రత్యేకతను నిరంతరం చాటడంలో ఎప్పుడూ తాను ముందు వరుసలో ఉన్నారు. ముఖ్యంగా ఆమె తన కథల్లో జాతీయాలను ప్రయోగించిన తీరు అనన్యసామాన్యం. ఒక్కొక్క కథలో జాతియాలు చంద్రుడి చుట్టూ వెలిగే తారల్లా తళుక్కున మెరుస్తూ అబ్బురపరుస్తాయి.

మావూరి ముచ్చట్లు' కథా సంపుటిలో ఒక స్త్రీ ఆనందాన్ని చెబుతూ "మొకం పూల పుద్క తీరు జేసి" అంటారు. ఆనందంతో వెలిగిపోతున్న ముఖాన్ని నిజంగా సాధారణ వాక్యంలో చెబితే ఇంత అందంగా ఉంటుందా? అదే యశోదారెడ్డిలోని రసజ్ఞత, దూరదృష్టి, ఇట్లాంటి చక్కటి జాతీయాలు ఆమె కథల్లో ఇరగకాసిన చింతచెట్టు కాయలలెక్క గుత్తులుగా కనిపిస్తాయి. పరిశోధన అనే దుడ్డు కర్రతో తెల్లకాగితంపై రాల్చుకోవడమే మన పని. జనిగెపట్టు, వసదాగిన పిట్ట, గండగత్తెర, గూట్లెదీపం, బెల్లంకొట్టిన రాయి, లొట్టిమీది కాకి, గోడమీది పిల్లి వంటి జాతీయాలు కొండంత అర్థాన్ని ఒక్క ముక్కలో చెప్పగలిగేవే. ఏదైనా విశాలమైన భావాన్ని పొదుపుగా చిన్న జాతీయంతో చెప్పినప్పుడు ఆ వాక్యం నిర్మాణం, ఆ సన్నివేశం సరళత మరింత బాగా ప్రకాశిస్తాయని యశోదారెడ్డి చెప్పిన జాతీయాలను పరిశీలిస్తే బోధపడుతుంది. ఇట్లా అనేక కథల్లో యశోదారెడ్డి జాతీయాలపై, జానపదంపై గల మమకారాన్ని, వాత్సల్యాన్ని ప్రదర్శించారు. అట్లాగే గజ్జెగాసినట్లు, పల్లు ఇడిసిన పెయ్యదూడ, ఫిరంగిపిట్ట, మనసు రాయి చేసుకొను, గజ్జెల గుర్రం, చిల్ల గింజేసిన నీళ్ళబాయి తిరుగ, నోట్లే దూసిపడ్డట్లు, ఎత్తైత్తు మాణిక్యం, కడుపాత్రం మొ॥ జాతీయాలను చూస్తే సంక్లిష్ట భావాన్ని కూడా ఒక్క జాతీయంలో ఇమిడ్చి సులభంగా పాఠకుడికి అర్థమయ్యేట్లు చెప్పవచ్చన్న విషయం తెలుస్తుంది.

జాతీయాలను యశోదారెడ్డి ఎక్కడా అప్రస్తుతంగా ఉపయోగించలేదు. ప్రతి సందర్భానికి తగిన యోగ్యమైన జాతీయాలన్నీ ఆమెకు కరతలామలకాలే. సాహిత్యాన్ని ఒకమెట్టు పైకెక్కించేలా రచనా వ్యాసంగం చేయడం అందరికీ సాధ్యమయ్యేది కాదు. రచనకై ఎంచుకున్న వస్తువు, ఇతివృత్తాలకు సంబంధించిన పూర్వ జ్ఞానంతో పాటు, భవిష్యత్ కాలం మార్పులకు సంబంధించిన అవగాహన, దూరదృష్టి ఉన్నవారే ఇటువంటి కృషిచేయగలరు. ఈ విషయంలో యశోదారెడ్డి నూటికి నూరుపాళ్ళ యోగ్యులు కనుకనే తన రచనల్లో భాషని ప్రస్ఫుటంగా ప్రయోగించారు.

**తెలంగాణ కథకుల్లో ప్రత్యేక స్థానం**

తెలంగాణలో పాటకు, గేయానికి ఎంతటి వైభవం ఉందో కథకూ అంతే ప్రాచుర్యం ఉంది. ఒక దశలో తెలంగాణ శ్రామిక దోపిడీకి, దొరల పాలనకు, సాంఘిక జీవనానికి సంబంధించిన సమాజాన్ని కథలే ప్రస్ఫుటంగా చిత్రించి పాఠకులను కదిలించాయి. ఆ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఎంతోమంది కథా రచయితలు వెలుగులోకి వచ్చారు. వారిలో యశోదారెడ్డిది శిఖరాయమానమైన స్థానం. మాండలిక ధోరణిలో కథా రచయితలని పరిశీలించినపుడు మొత్తం తెలుగు కథా రచయితలలోనే యశోదారెడ్డి అంతటి మాండలిక వైదుషీమణి లేరంటే అతిశయోక్తి కాదు.

తెలంగాణలో కథల్ని రాసిన చాలామంది రచయితలు సమాజ దృక్కోణంతో కథలు రాసినవారే ఉన్నారు. అదే ఆనాటికి ప్రధాన కథా వస్తువు అయింది. సురవరం ప్రతాపరెడ్డి, పొట్లపల్లి రామారావు, వట్టికోట ఆళ్వారు స్వామి, గూడూరు సీతారాం,

కాళోజీ, నెల్లూరి కేశవస్వామి, రఘోత్తమరెడ్డి, అంపశయ్య నవీన్, బి.ఎస్.రాములు, కాలువ మల్లయ్య, ముదిగంటి సుజాతారెడ్డి, బోయ జంగయ్య, పెద్దింటి అశోక్ కుమార్ వంటి వారి కథలు తెలంగాణ అంతటా బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ కథా రచయితలంతా తెలంగాణ భాష, యాసలను ఉపయోగిస్తూనే తెలంగాణ అస్తిత్వాన్ని అనేకానేక ఇతివృత్తాలతో కథలుగా చెప్పారు. వీరితో పోల్చితే యశోదారెడ్డి సృష్టించిన సాహిత్యాలు భిన్నమైనవి. ముఖ్యంగా ఆమె ఇల్లు, వాకిలి, ఊరు, కుటుంబం వంటి అంశాలను ఎంచుకుని ముచ్చట్ల రూపంలో అందించేది. కొన్నిసార్లు పాఠకుడిని అర్థసౌందర్యం కన్నా శబ్దసౌందర్యమే రంజింపచేస్తుందంటారు అలంకారవేత్తలు. యశోదారెడ్డి కథల్ని, సాహిత్యాన్ని ఆ కోణంలో పరిశీలిస్తే పాలమూరు బిజినేపల్లి భాష, యాసలు సుందరంగా ధ్వనిస్తూ మాండలిక పదపుష్టి పుష్కలంగా ప్రసరిస్తాయి. యశోదారెడ్డి కథలు చదువుతున్నప్పుడు మన చుట్టుప్రక్కలనో, ఇంట్లోనో జరుగుతున్న భావన కలుగుతుంది. కథకుడి ఉద్దేశాల్ని, పాత్రల స్వభావాన్ని పాఠకుడు అనుభూతి చెందాలంటే ఆ కథలు మాండలికంలో ఉంటే అది త్వరగా సిద్ధిస్తుందని యశోదారెడ్డి కథలు నిరూపించాయి. కాబట్టి తెలంగాణ కథకుల్లో యశోదారెడ్డి అగ్రశ్రేణి రచయిత్రిగా కీర్తిని పొందారు.

ఇంత పరిధి, విస్తృతి యశోదారెడ్డి సాహిత్యానికి ఉంది. సాధారణ విద్యార్థిగా పాఠశాల విద్యనభ్యసించిన ఆమె అసాధారణ రీతిలో ఉస్మానియా యూనివర్సిటీ ఆచార్యురాలిగా ఎదగడం వెనుక ఏళ్ళనాటి కృషి, దీక్ష, పట్టుదలలే కారణం. గుంపులు గుంపులుగా వెలువడుతున్న వచన కవితలకు ఎడిక్ట్ కాలేదు ఆమె. కాలంతో పాటు కవిత్వంలో కొట్టుకుపోవడాన్ని ఇష్టపడలేదు. కదిలేది, కదిలించేది, పెను నిద్దుర వదిలించేది, మునుముందుకు నడిపించేది కవిత్వం మాత్రమే కాదు కథ కూడా కదిలిస్తుంది, హృదయాలను స్పృశిస్తుంది, అస్తిత్వాలను ప్రదర్శిస్తుందని నమ్మారు యశోదారెడ్డి. అందుకోసమై వారు కథలను నిర్విరామంగా రాసారు. ఆ కథల్లో పూర్తి తెలంగాణ వాతావరణం అణువణువునా ఆవిష్కృత మయ్యింది. మావూరి ముచ్చట్లు కథా సంపుటి ముందు మాటలో ఆమే స్వయంగా ఇలా చెప్పారు. "గ్రామీణ జన వ్యవహారమందున్న పద ప్రయోగములను కాపాడవలెననెడి తాపత్రయమే ఈ కథల సంపుటికి కారణం. కేవలం పదములే పట్టిక వలె ఇచ్చిన విసువు జనింపజేయునను తలంపుతో కథలుగానల్లి చూపుటకు ప్రయత్నించినాను" అన్నారు. ఆ విధంగానే ఆమె కథలు రాశారు.

యశోదారెడ్డి విశాలంగా విస్తరించడాన్ని కాంక్షించలేదు. ఉన్నదగ్గరే లోతుగా ప్రసరించారు. మనిషి ఆరాటాలు, పోరాటాలు, మధ్యతరగతి, దిగువ తరగతి దినదిన బాధలు, ఎతలు, కథలను అవధులు లేకుండా అక్షరీకరించారు. ప్రతి పాత్రలోకి ప్రవేశించి ఆత్మ ప్రబోధమైన భాషను పలికించారు. కథల్లోని పాత్రల గొంతుక తానై మాండలికానికి యాస భాషలతో తావులద్దారు. ఇతివృత్తం, వస్తువులను మించి మాండలికాన్ని ప్రేమించారు. తన రచనల్లో మాండలికాలను పువ్వులుగా యాస అనే దారంతో పూలదండవలె గుదిగుచ్చి అందించారు.

ఒకపక్క అధ్యాపకురాలిగా, మరోపక్క రచయిత్రిగా, పరిపాలకురాలిగా, ఆకాశవాణి ప్రసంగకురాలిగా, అధికార భాషా సంఘం అధ్యక్షురాలిగా బహుముఖ కోణాల్లో విశేషకృషి చేసిన ప్రజ్ఞాశాలి. కథ, కవిత్వం, పరిశోధన, ప్రసంగం వేదిక ఏదైనా తెలంగాణ భాషా సౌందర్యాన్ని సొంత గొంతుకతో నలుదిశలా వినిపించేలా భాషాసృజన చేసిన మేటి రచయిత్రి యశోదారెడ్డి. గొప్ప రచయిత్రిగా తెలంగాణకే తలమానికంగా నిలిచిన బహుభాషా కోవిదురాలు యశోదారెడ్డి జీవితం, సాహితీసేవ నేటి తరాలకు ఆదర్శం, ఆచరణీయం...

(కేంద్ర సాహిత్య అకాడమీ 30 జూలై 2017 తేదీలలో 'తెలంగాణ తేజో మూర్తులు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో చేసిన ప్రసంగం)

కథ

# పాలాల్ల



డా. కొండపల్లి నీహారిణి

9866360082

ఆకాశం మేఘావృతమైంది. ఆషాఢపు వానలు అప్పుడప్పుడు కురుస్తున్నాయి. సుధాకర్, విజయ ఆటో కోసం నల్లకుంట రోడ్డుమీద నిలబడ్డారు. బోనగిరికి పోవాలంటే ఆర్టీసీ డిస్ట్రిక్ట్ బస్ ఎక్కాలి. ఉప్పల్ వరకు ఆటోలో వెళ్తేగాని బస్సులు దొరకవు. ''పొద్దున పొద్దున్నే బేరాలొద్దు సర్, బోణీ కాలేదు'' అన్నాడొక ఆటోతను. ''ఏ బేరమాడకు ఎక్కుదాం పద'' అన్నట్టు విజయ కనుసైగ చేసేసరికి సుధాకర్కు తప్పలేదు. ఆటో కంటే వేగంగా సుధాకర్ ఆలోచనలు సాగుతున్నాయి. ''మా నాయినమ్మ అదృష్టవంతురాలేనే, మంచాన బడకుండనే బోయింది'' ఆటోలో సర్దుకుని కూచున్నాక అన్నాడు సుధాకర్. ''ఆఁ అవును మరి అంతేగాదు అయినోళ్ళందరు దగ్గర్నే ఉన్నరు బిడ్డలు, కొడుకులు'' అన్నది విజయ.

''చావుకు బోతుంద్రా సార్'' అన్నాడు ఆటో అతను. ''ఆఁ అవును ముసలామె నిన్న రాత్రి జారిపడ్డదట. అదాట్న ప్రాణం బోయిందట, తెల్వంగనే బయల్దేరినం''.

''కారణం లేందే కాటికి పోరని అంటరు గదా సార్, అందుకే పడుడు పడుడే ఆయపట్న దెబ్బదాకి ఉండొచ్చు, అయినా ఇట్ల ఏంగాకుండ పానం బోవుడే నయం'' అంటూ డబ్బులు తీసుకున్నాడు ఆటో వాలా.

బస్సెక్కగానే ఒక చుట్టం కనిపించిండు సుధాకర్ కు. ఈ విషయం చెప్పగానే ''అరేరరే షాకు, మంచి మనిషి, అయినా అదృష్టవంతురాలులే'' అని సానుభూతి వాక్యాలు అన్నాడు. విజయకు సీటు దొరికింది గాని, సుధాకర్ కు దొరకలేదు. ''అయ్యో నిలవడ్డవా?'' అన్నది. ''ఆఁ ఏం గాదులే ఎంత గంట, గంటన్నరల బోతం, ఏంగాదులే'' అన్నాడు సుధాకర్. బస్సు వేగం పెరిగింది.

★ ★ ★

ఊళ్ళె బాగనే పేరున్నోళ్ళు కాబట్టేమో జనం బాగనే ఉన్నరు ఇంటి ముందర. పెద్ద వెంకటయ్య భార్యగా కన్నా సత్తెమ్మగా మంచితనంతో ఊరోళ్ళకు దగ్గరయ్యింది గదా ఆడోళ్ళైతే ఏడుస్తనే ఉన్నరు. వాకిట్లో పాడె సిద్ధంగా ఉన్నది. శవం రెండు కాళ్ళ బొటనవేళ్ళకు తాడుతో కట్టేసి ఉన్నది. విజయ, సుధాకర్ లు చెప్పులిడిచి సత్తెమ్మ కాళ్ళకు మొక్కి లోపలికి పోయింద్రు. ఆమె గౌరవార్థం ఆ రోజు ఊరు మొత్తం బంద్ పెట్టింద్రు. ఆ ఇంటితో అనుబంధమున్న గ్రామపెద్దలు పూలదండలు వేసి సత్తెమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు.

పుట్టుకకు చావుకు మధ్య మజిలీలోనే నలుగురిని వెనకేసుకోవాలి. నాలుగు రాళ్ళు వెనకేసుకునే ఈ రోజుల్లో మనిషి తనమనే మంచి ఎట్లా అర్థమవుతుంది పెద్దగా సంబోధిస్తూ, ఎదుర్రొమ్ములు కొట్టుకుంటూ సత్తెమ్మ శవం మీద పడి ఏడుస్తున్న భూలచ్చమ్మను ఎవరూ ఆపలేకపోయారు. ఆమె సత్తెమ్మ బిడ్డనా? అంటే కాదు. సత్తెమ్మ చెల్లెనా? అంటే కాదు. ఒకప్పుడు పొలం పనులకు కూలిగా వచ్చినామె. ఎవరికి ఎక్కడ ఏ బంధం పడుతుందో గాని సత్తెమ్మ అంతిమయాత్రలో అపశ్రుతులు లేని దుఃఖగీతాలే వినిపించాయి. ఆమె వయసున్న పక్కింటి గౌరమ్మనే గాదు, అన్ని వాడల నుండీ ఆమెకు ఆప్తులే ఉన్నట్టున్నారు. ఊరు గదా దాపరికాలేముండవు, బోరున ఏడ్వడం వాళ్ళ తీరు.

★ ★ ★

దహన కార్యక్రమాలన్నీ ముగించుకొని అందరూ సేద తీరుతున్నారు. రాత్రి ఏడవుతుంది. కరెంట్ పోయింది. టి.వి బంద్ అయిపోయింది. ఆ బాలగోపాలాన్ని తనముందు అతుక్కునేట్టు చేసిన దృశ్య మాధ్యమం నుండి బయట పడ్డరు. ఇంటి అరుగుమీద కూర్చొని అందరు పిచ్చాపాటి

మాట్లాడుకుంటున్నరు.

సుధాకర్ చిన్నాయన రామభద్రయ్య తల్లితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ''మా అమ్మ చాలా ధైర్యవంతురాలు ఉండెరా సుధాకరు, ఇప్పుడీ కాలపోళ్ళతో పోలిస్తేనైతే నిజంగ. మహా గుండె ధైర్యం అవ్వది. ఓసారి మా తాతకు ఎదురు తిరిగింది తెల్సా? పొలం పనులల్ల జూడాలే! అబ్బో మా పట్టుదలుండేదిరా. మా నాయిన జెర్ర కోపిష్టోడు. ఆడోళ్ళ కష్టాలు, లేనోళ్ళ కష్టాలు నీకు దెల్వదానయ్యా. గట్ల నారాజ్ అయితే ఎట్ల. జెర్ర అటు ఇటు అయితె ఏమైతది? పసిగుడ్డు నొదిలి ఒస్తే తల్లి ప్రాణం ఎంత తల్లడిల్లుతది ఏంది? ''జర ఎక్కువసేపు పోతే పోనీలే'' అని ఆలస్యం జేసే కూలామెకే సపోర్ట్ చేసి మాట్లాడింది తెల్సా!'' అన్నాడు. ''తర్వాత తర్వాత దాన్ని ఒక రూల్ జేసింది. ఊరంత చాటింపేసేదాంక దూసుకుపోయిందనుకో, దొరలు, పెద్దోళ్ళు యెవుసం జేసేటోళ్ళు అందరూ పాలాల్లను పాటించేటట్లు చేసింది''.

''అంతేగాదు ఒక ముచ్చట జెప్త విను'', ''అసలు వీళ్ళముందు మనం వేస్ట్ అనిపిస్తదిరా'' అన్నాడు. ''తాతా ఏంది ఏంది? తాతమ్మ గురించి ఏమైన చెప్పవా ధైర్యం గలదన్నవ్'' అన్నది సుధాకర్ చెల్లెలు బిడ్డ మల్లిక కుతూహలంగా అడిగింది.

''ఓ ఒకటా రెండా, ఎన్నిలేవు గని ఒక్క ముచ్చట జెప్త, మా అమ్మ నాకు షానాసార్లు చెప్పింది'' అన్నాడు.

''అవ్వి దాదాపు ఇప్పటికి 60, 70 ఏండ్ల కిందటి ముచ్చట ''మనకు అప్పుడు వ్యవసాయం బాగా ఉండేది. ఒరి పంట, మొక్కజొన్న, పచ్చజొన్న, కందులు... ఏ ఒకటేంది అన్ని పండిచ్చేటోళ్ళు. మరి పంటలకు నాట్లు వెట్టుడు, కలుపుదీసుడు, కోతలు కోసుడు అన్నీ ఆడికూలోళ్ళు చేద్దురు గదా''

''ఒకసారట పాలాల్ల అయ్యిందని ఓ బాలెంత ఇంటికి బోతున్నదట''. అంటుంటేనే ''పాలాల్లా? అంటే ఏంది తాతా'' అన్నది మల్లిక.

''పాలాల్ల అంటే కూలి పని నుండి మధ్యల ఇంటికిబోయి బిడ్డకు పాలిచ్చి ఒచ్చేటిది. ఇప్పుడు బ్రేక్ టైమ్, ఇంటర్వెల్ అంటరు గదా, అట్లనుకోరాదు. కొంతమంది ఇంట్ల పిల్లలను చూసేదానికి ఎవ్వరు లేకుంటే కూలి దగ్గరికి ఎంటదీస్కపోయేటోళ్ళు, అక్కణ్ణే ఓ చెద్దరో, ఓ జంపకానానో, గొంగడో ఏసి పిల్లలను పండబెట్టి పని చేస్తురు''.

''అయ్యో! అవునా తాతా, పాపం కదా!'' అన్నది మల్లిక.

''ఔనే నిజంగనే వాళ్ళు కూడ బాలెంతలు గూడా పనులు జేయాల్నాయె. ఈ పనులు గాక ఏం జీతాలు ఏం జేస్తరు గని అప్పుడు చదువుల లేవాయె! వేరే పనులేమీ రావాయె, చేతులగల్ల పని గదా నాట్లు వెడితేనే వాళ్ళకు పనులు దొరికేది. యెవుసం లేకుండా బతుకులేడ ఉంటయి''.

''సారీ తాతా నేను టాపిక్ ఎటో తీస్కబోయిన. ఇంతకు నాయనమ్మ ధైర్యానికి ఈ కూలీల ముచ్చటకు ఏంది సంబంధం?''

చుట్ట ముట్టించి, ''గదే గదే ఒస్తున్న ఒస్తున్న గాడికే ఒస్తున్న, మా అమ్మ కూడ రోజు నాయినతోబాటు సద్ది గట్టుకొని బాయికాడికి పోయేదట.'' అంటూనే ''మేం చిన్నపిల్లలం గద బళ్ళకు పోయేది. అయితే పాలాల్ల అయ్యిందంటే చాలు మా అమ్మ పనోళ్ళ దగ్గరికి పోయి బాలెంతలను పని ఆపి తొందరగ ఇంటికి పొమ్మని చెప్పేది.''

''ఒకరోజట భూలచ్చమ్మ ఉన్నది గద పొద్దునొచ్చి బాగ పని జేసిపోయింది చూడు.''

''ఆఁ ఆ! అబ్బ ఆమెనైతే భూలచ్చమ్మ గాదే, మన అందరోలే ఎంత ఏడ్చిందో తాతమ్మను తీసుకుపోతుంటే, ఆఆ అయితే, ఆమె'' అని మల్లిక అనగానే,

''ఆమె కోడలు నీళ్ళాడింది, ఈ ఊళ్ళనే అత్త గారింట్లనే, అయితే ఆ చంటోణ్ణి ఏసుకోని కల్పు దీయొచ్చింది. మరీ షాన సంటిగుడ్డు గదా అని! అయితే బాయికాడ ఆ చెట్టుకింద పండబెట్టిన ఆ పిల్లగాని మీదికి ఓ పెద్దపాము ఒచ్చింది. జర్రంతల కాటేస్తుండెనట. మా అమ్మ బోయి కట్టెందుకొని దాన్ని కొట్టి పిల్లగాన్ని కాపాడిందట. ఆ పామును మా అమ్మ చూడకున్నా, దాన్ని చంపకున్నా ఆ పిల్లవాడు ఆ రోజు హరీమనేటోడు... లేక లేక కలిగిన సంతానం వాడు. అవును వాడు గూడ ఒచ్చిండు ఇయ్యాల. ఎన్ని పనులు చేసిండో. దానమయ్యేదాన్క నా యెన్కనే ఉన్నడు. తాతమ్మ, వాళ్ళకు తాతయ్యలకు వారి కుటుంబంతో మంచి ఇది ఉండేది.''

''మా అమ్మ ఇట్లా ఎందరి ప్రాణాలు కాపాడింది ఏంది? ఎన్ని కుటుంబాలను ఆదుకున్నది ఏంది?''

''అవును తాతయ్యా మీ అమ్మ మా తాతమ్మ గ్రేట్. పామును చూస్తేనే పారిపోతరు. అటువంటిది! అమ్మో గ్రేట్ గ్రేట్'' అంటున్నది మల్లిక.

''కాని, తాతయ్యా ఆ పాలేళ్ళ'' అని మల్లిక అంటుంటేనే... ''అహ అహ కాదు కాదు పాలేల్ల కాదే పాలాల్ల, పాలకువేళ, పాలవేళ పాలాల్ల అనాలె'' అన్నాడు రామభద్రయ్య. పడమటి దిక్కుకు పొద్దు ఒంగినంక ఆడవాండ్లు పాలియ్యడానికి ఇండ్లకు పోవుడన్నట్లు పాలాల్ల అంటె'' రామభద్రయ్య మాట పూర్తి కాకుండానే.

''ఆఁ ఆఁ సరే సరే 'పాలాల్ల'' నవ్వుతూ మల్లిక అంటుంటే అప్పుడే కరెంట్ వచ్చింది.

★ ★ ★

''ఏం, మల్లికా మా చిన్నాయిన చెప్పిందంతా తలకెక్కిందా? మీ విజయత్త ఏమంటుందెరికేనా? చట్టాలు హక్కులు అని ఈ రోజులలో ఉంటున్నవన్నీ ఏమి ఎరుకలేని అప్పుడు కూడా పాటించేవాళ్ళు అని''. ''యజమాని, కూలీ మధ్య మంచిగనే ఉండేది. ఎక్కణ్ణో ఓచోట దుర్మార్గం ఉన్నదో గని, షానావరకు రైతులైనా, భూస్వాములైనా, కూలోళ్ళకు ఇట్లా పాలాల్ల ప్రొవైడ్ చేసేవాళ్ళు.'' అంటుంటే మల్లిక ''అవును మామయ్య నేను ఎన్ని పుస్తకాల్లో చదివాను అవ్వి కాని మంచిని కూడా చెప్పే ఇటువంటివి బయటికి రావాలి మామయ్య. అప్పుడే అవ్వి కూడా ఎక్జాంపుల్స్గా నిలుస్తాయి. చూడు మన తాతమ్మే ఇంత గ్రేట్ పని చేసింది. కాని ఎవరికెరుకని అసలు ఇన్నేళ్ళకు ఇప్పుడు తెలిసింది జూడు'' అన్నది.

అందరు శ్రద్ధగా వింటుంటే, ''ఇప్పుడు విదేశాలలో జూడు జాబ్ చేసే ఆడవాళ్ళకు ఎన్నో సౌకర్యాలను కల్పిస్తుంటారు. డెలివరీకి మెటర్నిటీ లీవ్ అని వీళ్ళకు ఇస్తరు, తండ్రిగా పెటర్నిటీ లీవ్ అని మగవాళ్ళకూ ఇస్తరు. అంతేగాదు ఆఫీస్లల్ల పాలు పిండి స్టోర్ చేసుకునేందుకు ప్రత్యేకమైన రూమ్స్ను ప్రొవైడ్ చేస్తారు తెల్సా?''

అని మల్లిక చెప్తుంటే రామభద్రయ్య కొడుకు బిడ్డ స్వప్న వచ్చి కూర్చుంటూ ''అదేందే మల్లిక ఈ మధ్య ఇండియాల గూడ వర్కింగ్ లేడిస్ కోసం మెటర్నిటీ లీవ్స్ ఇస్తున్నరు గదానే'' అన్నది. ''అవును అవును ఇస్తున్నరు ఇస్తున్నరు. ఓ ఎన్ని పోరాటాలు చేస్తే ఆడోళ్ళ కోసం ఈ మార్పులొచ్చినయి ఏంది నాకు దెల్సు'' అని మల్లిక అంటుంటెనే, ''ఇవన్ని మన ఎన్కటోళ్ళ నుండే అందరు నేర్చుకొని ఉంటరు అన్నడు'' సుధాకర్.

''తాతమ్మ అటువంటి నిర్ణయం చెయ్యడానికి కారణం ఏందంటకని ఆమె అనుభవాలనుండే నేర్చుకోలేదంటావా?'' స్వప్నకు తాతమ్మంటే ఉన్న ఇష్టాన్ని అట్లా వ్యక్తపరిచింది.

పల్లెటూరైనా రాత్రి సద్దుమణగలేదు. పక్క ఇంట్లనించి టీవీ మోత వినబడుతుంటే లోపల్నించి రామభద్రయ్య భార్య చుక్కమ్మ బయటికొచ్చి ''ఓ, ఏందయ్య ఇంగ పండుకోరాదు ఎంతసేపు ముచ్చట్లు'' అన్నది. వయసు మీద పడిన ఛాయలు కొట్టొచ్చినట్టు కనబడుతున్నా చుక్కమ్మ మొహంల కళ ఏమాత్రం తగ్గలేదు. విజయ, మల్లిక తల్లి వీరమణి టీవీ సీరియల్లో నిమగ్నమై ఉన్నరు. అప్పుడే సిటీకి పోయొచ్చిన మల్లిక తండ్రి, రామభద్రయ్య కొడుకూ ఇంటి ముందర గోలెంల నీళ్లతోని కాళ్ళు కడుక్కుంటూ ''బాపూ నాయినమ్మ ఫోటో ఫ్రేమ్ గట్టిచ్చుకొచ్చిన్నే; చూడు అగో గా సంచిల ఉన్నది'' అన్నాడు. పరుగునపోయి మల్లిక ఫోటోకున్న పేపర్ తీసేసి చూస్తూ ''అబ్బ! తాతమ్మ ఎంత బాగుంది. ఎప్పుడు దిగిందోగాని, ఆహా! కండ్లు చూడు ఎంత షార్ప్గ ఉన్నయో'' అని అక్కడున్న వాళ్ళందరికి ఇటూ అటూ తిప్పి చూపించింది.

ఆ పెద్దామె ముచ్చట వాలిన పొద్దు నుండి కొత్త వెలుగురేఖలు తెచ్చే మరోరోజు ఉదయించడానికి సిద్ధంగా ఉన్నది. స్వచ్ఛమైన మనస్సు ఉన్నవాళ్ళకు మరణమన్నదే ఉండదు. భూలచ్చమ్మ ఇంటి వెలుగును కాపాడిన ఆ తల్లి అప్పటినుండి ఆ ఊరి బాలెంతల పాలాల్ల కోసం పరితపించింది.

ఆరోజు చుట్టాలందరి గుండెల్లో దయగల తల్లిగా నిలిచిపోయింది సత్యమ్మ రూపం. ఆ లోగిలిలో పరివ్యాపితమైన గాలి సన్నని స్పర్శతో ఏదో సత్యాన్ని బోధించింది.

# 'సమూహ' సెక్యులర్ రైటర్స్ ఫోరమ్
## అవగాహనా పత్రం

ఆధునిక నాగరిక సమాజాల్లో రాజ్యాంగబద్ధ పాలన ఉంటుంది. ఈ ప్రాథమిక లక్షణాన్నే మనం ప్రజాస్వామ్యం అంటున్నాం. ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. ఒకటి ప్రజలచేత ఎన్నికైన ప్రజాప్రతినిధుల పాలన. రెండు ఆ పాలనకు దిశా నిర్దేశం చేసి గాడి తప్పకుండా నియంత్రించే న్యాయ వ్యవస్థ, పత్రికారంగం. ఈ రెండు పార్శ్వాలు చక్కగా పనిచేసినప్పుడే అది ఆధునిక ప్రజాస్వామిక సమాజం అవుతుంది. ఇవేగాక సమాజంలోని స్వతంత్ర సంస్థలు ప్రజాస్వామికీరణకు దోహదం చేస్తాయి, దానిని వేగవంతం చేస్తాయి. కానీ మనదేశంలోనే కాక చాలా దేశాలలో ఎన్నికల ప్రక్రియ ద్వారా గద్దె ఎక్కిన పాలకులు ఆధునిక ప్రజాస్వామిక విలువలను ధ్వంసం చేస్తున్నారు. ఏం చేసైనా అధికారంలోకి రావడమే వారికి పరమావధిగా మారింది. దీంతో రాజ్యాంగ నైతికత, రాజ్యాంగ మౌలిక ఆదర్శాలు, విలువలు మాయమవుతున్నాయి.

భారత రాజ్యాంగం ప్రకారం కులం, మతం, ప్రాంతం, భాష, జెండర్, వర్గం వంటి భేదాలు లేకుండా దేశ పౌరులందరూ సమానులే. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలతో కూడిన నిజమైన లౌకిక ప్రజాస్వామిక దేశాన్ని నిర్మించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే. దీని కోసం సమాజంలో హేతుబుద్ధిని, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంచి, దేశాన్ని ఆధునికంగా తీర్చిదిద్దవలసి ఉన్నది. కానీ అనేక అసమానతలు, అంతరాలు, ఆధిపత్యాలు దేశంలో కొనసాగుతూనే ఉన్నాయి. అధికశాతం ప్రజలు కుల, మత, పితృస్వామిక అణచివేతలకు గురవుతున్నారు. బహుళ అస్తిత్వాలకు, భిన్న ఆహారపు అలవాట్లకు, ఆహార్యాలకు, భిన్న భాషా సంస్కృతులకు, విశ్వాసాలకు చోటు లేకుండా పోతున్నది. వైవిధ్యంతో ప్రజలు జీవించటాన్ని సహించని వాతావరణం తీవ్రమవుతున్నది. మన సామాజిక రాజకీయ పరిస్థితులు అసహనాన్ని, విద్వేషాన్ని, సాంస్కృతిక ఆధిపత్యాన్ని రోజురోజుకూ పెంచుతున్నాయి.

మొత్తంగా ఉపశ్రేణి సమూహాల భిన్న సంస్కృతులను ఆధిపత్య సంస్కృతి నిరంకుశంగా అణచివేస్తున్నది. పీడిత ప్రజా సమూహాల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నది. వీటి నుంచి ప్రజలలో రేకెత్తే భావోద్వేగాలను పాలకులు ఓట్లుగా మలుచుకుంటూ ఉన్నారు. అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ మౌలిక స్ఫూర్తినే దెబ్బ తీస్తున్నారు. ఏకరూప సంస్కృతిని అందరి మీదా రుద్దుతున్నారు. మతతత్వ ధోరణులను ప్రవేశపెట్టి అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారు. చారిత్రకంగా భిన్న మత సముదాయాల మధ్య కొనసాగుతున్న సామరస్య, సహజీవన విలువలన్నిటినీ పాతర వేస్తున్నారు. చరిత్రలోని వైరుధ్యాల, వైషమ్యాల జ్ఞాపకాలను మాత్రమే నొక్కి చెబుతున్నారు. వీటి ప్రాతిపదిక మీద దేశ చరిత్రను తిరగరాస్తున్నారు. పౌర సమాజ సంబంధాలలో, రాజ్య నిర్వహణలో మతప్రసక్తి ఉండరాదనే లౌకిక వాదాన్ని దెబ్బతీస్తున్నారు. అల్ప సంఖ్యాకుల మతాలను శత్రువుగా చూపెడుతూ అధిక సంఖ్యాక మతస్తులను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. లౌకికవాదమంటే మైనారిటీలను బుజ్జగించటం అనే విపరీత అర్థాన్ని ఫాసిస్టు పాలకులు సృష్టించారు. తద్వారా మతతత్వాన్ని రెచ్చగొట్టి ప్రజల మెదళ్లలో హింసోన్మాదాన్ని నింపటానికి ప్రయత్నిస్తున్నారు.

దీనినే దాదాపు యాభై ఏళ్ల క్రితం ప్రజాకవి కాళోజీ ఏకీభవించనోడి పీక నొక్కు సిద్ధాంతమే ఫాసిజం అని చెప్పాడు. ఏకీభవించని వాళ్ళు ఎవరు? రాజ్యాంగం పట్ల స్పృహ, హక్కుల చైతన్యం, ఆధునిక ప్రజాస్వామిక విలువలపట్ల అవగాహన ఉన్నవాళ్లు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలతో వీళ్లు ఏకీభవించడం లేదు. సమాజంలోని సమస్త అసమానతలను ప్రశ్నిస్తున్నారు. అనేక రూపాల్లోని ఆధిపత్యానికి, హింసకు, అణచివేతకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజల పోరాటాలకు స్పందిస్తున్నారు. నిరంకుశత్వాన్ని నిరసిస్తున్నారు. అదే దేశద్రోహ నేరం అవుతున్నది. శిక్షార్హం అవుతున్నది. ఇలాంటి వర్తమానంలో మనం ఉన్నాం.

ఈ నేపథ్యంలో హేతుబద్ధత, సమానత్వం, స్వేచ్ఛ,

వైజ్ఞానిక చింతన మొదలైన విలువలను, లౌకికవాద స్పృహను సమాజంలో వ్యాపింప చేయటం కవులుగా, కళాకారులుగా, చింతనాపరులుగా మనముందున్న కర్తవ్యం. స్నేహం, ప్రేమ, సహృదయత, సానుభూతి, సహానుభూతి, మానవత్వం వంటి సున్నిత విలువల ఉమ్మడి స్వరాన్ని బాధిత సమూహాల తరపున వినిపించాల్సి ఉన్నది. వ్యక్తులుగానూ, వేరువేరు సంస్థల్లో భాగంగానూ సృజనకారులుగా మనం ఆ పని చేస్తూనే ఉన్నప్పటికీ అది ఇంకా బలహీనంగానే ఉన్నది. దాన్ని బలోపేతం చేయాలంటే మనం ఏకం కావాలి. అలాంటి అత్యవసరమైన సమకాలీన చారిత్రక సందర్భంలో మనం ఉన్నాం. ఈ అవసరాన్ని తీర్చడానికే ఈ వేదిక నిర్మాణం.

ప్రపంచ మార్కెట్ కోసం దేశాల మధ్య చెలరేగిన ఆధిపత్య పోరుకు పుట్టిన వికృత శిశువు ఫాసిజం. ఇది దేశకాల పరిస్థితులనుబట్టి మారుతూ వస్తున్నది. మన దేశంలో భిన్న జాతులను, భిన్న ఆచార సంప్రదాయాలను, భిన్న అభిప్రాయాలను, ప్రతివాదాలను, ప్రతిపక్షాలను సహించని పెను ఉప్పెనగా ఫాసిజం బలపడుతున్నది. బహుళత్వానికి, ప్రజాస్వామ్యానికి ప్రబల శత్రువు ఇది. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గపు ప్రయోజనాల కోసం అది పనిచేస్తున్నది. కాలంచెల్లిన భూస్వామ్య అంధ కుల మత విశ్వాసాలను జాతీయత పేరుమీద ప్రచారం చేస్తున్నది.

మానవతకు, సహనానికి శత్రువు అయిన ఫాసిజం ప్రమాదాన్ని గుర్తించి ప్రతిఘటించటంలో సాహిత్యకారులు వంద సంవత్సరాల నుంచి ముందు భాగాన ఉంటున్నారు. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో ఇటలీ, జర్మనీ స్పెయిన్ దేశాలలో పెచ్చరిల్లిన ఫాసిజం ప్రమాదం నుంచి ప్రజలను, ప్రజా సంస్కృతిని రక్షించాలని అంతర్జాతీయంగా రచయితలు పిలుపు నిచ్చారు. దాన్ని అందుకొని భారతదేశంలో రచయితలు ప్రతి సందర్భంలోనూ ఫాసిస్టు వ్యతిరేక కూటమి వైపు నిలబడ్డారు. అభ్యుదయ రచయితల సంఘం, ప్రజానాట్యమండలి, ఇప్టా ఏర్పడక ముందే ఈ కృషి ప్రారంభమైంది. ఆ తరువాత మరెన్నో ప్రగతిశీల సాహిత్య సంస్థలతో ఈ ఒరవడి ముందుకు సాగింది. దేశంలో ప్రతిపక్షాన్ని, ప్రతివాదాన్ని తుడిచిపెట్టిన ఎమర్జెన్సీ నిరంకుశత్వాన్ని కూడా తెలుగు సాహిత్యకారులు నిరసించారు. ఆ తర్వాత ఫాసిస్టు ధోరణులు పడగ విప్పినప్పుడల్లా కవులు, రచయితలు ఐక్యమవుతూనే ఉన్నారు.

గుజరాత్ మారణకాండలోని గాయపు నొప్పిని తెలుగు కవులు, రచయితలు, సాంస్కృతిక కార్యకర్తలు తమదిగా అనుభవించారు. ఉమ్మడి నిరసనల రూపంలో కవిత్వంగా వ్యక్తమయ్యారు. పత్రికా రచయితలు పరిశోధనాత్మక నివేదికలు సమర్పించారు. జాతి విద్వేష ఘటనలకు వ్యతిరేకంగా వేదికలు పెట్టి పనిచేసిన అనుభవం మనకు ఉంది. ఆ అనుభవాల నుండి గుణపాఠాలు నేర్చుకొంటూ హేతు దృష్టితో, సత్యశోధనకు, స్వతంత్ర పరిశోధనలకు పూనుకొనాలి. స్వేచ్ఛగా, నిక్కచ్చిగా రాయటానికి, తినటానికి, బతకటానికి అవకాశం రోజురోజుకు తగ్గిపోతున్న పరిస్థితులతో తలపడాలి. మూఢత్వానికి, నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని నిర్మించాలి. పోరాటాలకు సంసిద్ధం చేయాలి. ఆ లక్ష్యాలతోనే ఇప్పుడీ వేదికను నిర్మించుకొంటున్నాం.

**వేదిక లక్ష్యాలు :**

1. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మౌలిక రాజ్యాంగ విలువలను సామాజిక జీవిత విలువలుగా గుర్తించటం, గౌరవించటం, అమలు కావటానికి ప్రయత్నించటం.
2. కులం, మతం, జెండర్, భాష, ప్రాంతం, వర్గం, వయసు, వరుస వంటి అనేక అసమానతలు ప్రజల లోకజ్ఞానంలో వారికి తెలియకుండానే ఇంకిపోయాయి. వారి ప్రవర్తనలను ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి రక రకాల ఆధిక్య, న్యూనతా భావనల గురించి, వివక్షను గురించి అవగాహనలను అభివృద్ధిపరచటం.
3. వ్యక్తిగత జీవితానికి మాత్రమే పరిమితం కావాల్సిన మతపరమైన భక్తి విశ్వాసాలను సామాజిక ఆవరణలో ఉన్మాదస్థాయిలో ప్రేరేపిస్తున్న పాలకవర్గ దుర్మార్గాన్ని గురించి అవగాహన కల్పించటం.
4. కులోన్మాదానికి, మతోన్మాదానికి, అసహనానికి, ద్వేషానికి, మారణహోమానికి కారణమవుతూ ప్రజలను నిలువునా చీలుస్తున్న స్వార్థ అధికార రాజకీయాల గురించి పౌర సమాజంలో చైతన్యాన్ని కలిగించటం. సమాజాన్ని మరింత మానవీయంగా మార్చుకొనే

సంసిద్ధతను పెంచడం.

5. సమాజంలో ఆధిక్యతా న్యూనతల సంబంధాలు అనుక్షణం ఉత్పత్తి అవుతుంటాయి. స్థిరీకరించబడుతూ ఉంటాయి. వివిధ సంస్థల ద్వారా, రకరకాల మాధ్యమాల ద్వారా అవి కొనసాగుతూ ఉంటాయి. ప్రచారమవుతూ ఉంటాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది విద్యా వ్యవస్థ. ఆధిపత్య వర్గాలకు విద్యావ్యవస్థ భావజాల ప్రచార సాధనంగా మారింది. ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనే నైతికతను, శాస్త్రీయతను అభివృద్ధి పరచటం మీద కేంద్రీకరించి పనిచేయటం.

6. విద్యారంగం నుంచి నుండి ప్రభుత్వ వ్యవహారాల దాకా సంస్కృతం, హిందీ భాషల ఆధిక్యాన్ని, ఆధిపత్యాన్ని స్థాపించటానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకొనటం.

7. అసమానతలతో కొనసాగుతున్న సంస్కృతిని, నాగరికతను ఆధునికత, ప్రజాస్వామికత గీటురాయిగా తీర్చిదిద్దటానికి భావజాలరంగంలో కృషి చేయటం.

**వేదిక కార్యక్రమాలు:**

రచయితల కోసం అంతర్గతంగా చేయవలసినవి, జనంలోకి తీసుకుపోవటానికి బహిరంగంగా చేయవలసినవి అనే రెండు కోణాలలో వేదిక కార్యక్రమాలు రూపొందించుకొంటుంది.

**I. రచయితల కోసం కార్యక్రమాలు:**

1. ఫాసిస్టు భావజాల ధోరణులు, ప్రక్రియల గురించి రచయితలుగా మనం సరైన జ్ఞాన చైతన్యాన్ని పెంచుకోవాలి. దీనికి కనీసం దేశవిభజన కాలం నుంచి అయినా దేశ చరిత్రను తిరిగి అధ్యయనం చేయాలి. అందులో భాగంగా భారతీయ ఫాసిజాన్ని అన్ని వైపుల నుండి సమగ్రంగా అర్థం చేసుకోవాలి. దీనికి అవసరమైన అవగాహనా తరగతులను, కార్యశాలలను నిర్వహించుకోవాలి.

2. ఫాసిజం గురించి మాట్లేడేటప్పుడు, రాసేటప్పుడు వాడే పదాలు, భాష, పరిభాషల విషయంలో ఎక్కువమందికి ఆమోదయోగ్యంగా, ఎక్కువ మందిని కలుపుకు వచ్చేలా తీసుకోవలసిన జాగ్రత్తలు, సూత్రాలు నిర్దేశించుకొనటానికి చర్చలు నిర్వహించుకోవాలి.

3. మనకు తెలియకుండానే మన లోకజ్ఞానంలో కూడా ఇంకిపోయి మనలను నడిపిస్తున్న ఆధిక్య అధికార లక్షణాల గురించి, వివక్ష, న్యూనత భావాల గురించి హెచ్చరికగా ఉండటానికి నిరంతరం సంభాషణలకు అవకాశం కల్పించుకోవాలి. ఎప్పటికప్పుడు మనలను మనం సరిచేసుకొనటానికి సిద్ధంగా ఉండాలి.

4. ఈ క్రమంలో మనం ఎదుర్కొనే ఆంతరంగిక, బహిరంగ సంఘర్షణలను సాహిత్య వస్తువు చేయగలిగితే మన సంభాషణ, చర్చ మరింత విస్తారం, అర్థవంతం అవుతాయి.

5. ఫాసిజానికి వ్యతిరేకంగా మనం చేసే రచనలను ఎక్కడికక్కడ అధ్యయన సమూహాలను ఏర్పరచుకొని చర్చించుకొనటం ద్వారా రచయితలం నిరంతర సంభాషణలో మరింత సన్నిహితం కావచ్చు.

**II. రచయితల చేత కార్యక్రమాలు:**

1. ఊడలమర్రిలా సమాజ సంబంధాలలో వేళ్లూనుకొని విస్తరించిన ఫాసిజం బహురూపాలను గుర్తిస్తూ వాటిని ప్రజలకు అర్థమయ్యే రీతిలో పాటో, కవిత్వమో, కథా, నవలో, నాటకమో, వ్యాసమో రాయటం. పాటలు పాడటం, ప్రదర్శన రూపాలను అభివృద్ధి చేయటం రచయితలుగా, కళాకారులుగా మన మొదటి పని.

2. కవి సమ్మేళనాలు, కథా పఠనాలు, పాటల జాతరలు, సాహిత్య పండుగలు, అవగాహనా సదస్సులు, చర్చా గోష్టులు, నాటక ప్రదర్శనలు నిర్వహించటం. వీటిని పాడ్ కాస్టుల ద్వారా, వీడియోల ద్వారా ప్రచారంలో ఉంచటం.

3. సృజన విమర్శన విశ్లేషణా రచనలు, కరపత్రాలు ప్రచురించటం.

4. సాంకేతిక మాధ్యమాల్లో వివిధ రూపాలను తయారుచేసుకోవడం. తద్వారా సహనశీలమైన సహజీవన విలువలతో కూడిన, సరైన ప్రజాస్వామిక

ఆలోచనా విధానానికి ప్రాచుర్యం కల్పించటం.

5. అసహన, విద్వేష సంస్కృతిపాలు కాకుండా యువతను హెచ్చరించి సరైన ఆలోచనా విధానం వైపు మళ్లించాలి. దానికి వినూత్న, సృజనాత్మక కార్యక్రమాలతో పాఠశాలలను, కళాశాలలను కార్యక్షేత్రాలుగా చేసుకొని పని చేయటం.

6. వైవిధ్య పూరితమైన బహుళ సాంస్కృతిక విలువలను విద్యార్థులలోకి, యువతరంలోకి తీసికెళ్లడానికి తగిన కార్యక్రమాలు రూపొందించుకోవడం.

7. కులోన్మాదంతో, మతోన్మాదంతో మారణహోమాలు జరిగిన ప్రతిసారీ మహిళలే మరింత క్రూరమైన దాడులకు గురవుతున్నారు. కాబట్టి ఫాసిస్టు నేపథ్యంలో వివిధ వర్గాల స్త్రీల అనుభవాలను మరింత నిశితంగా అధ్యయనం చేయటం. దానిని సాహిత్య కళా వస్తువుగా మలిచి చర్చలోకి తేవటం.

8. రచయితలను, కళాకారులను సమీకరించటానికి జిల్లా స్థాయి రచయితల సమావేశాలు నిర్వహించటం.

9. బుద్ధిజీవులను, సామాజిక శాస్త్ర, విజ్ఞాన రంగాలకు సంబంధించిన నిపుణులను, పత్రికా రచయితలను, ప్రగతిశీల ప్రచురణ సంస్థలను వేదికలో చేర్చుకొంటూ వేదికను విస్తరించటం, బలోపేతం చేసుకొనటం.

10. మనలాగే ఆలోచించే సంఘాలను, వ్యక్తులను సమీకరించడం.

11. తక్షణ అవసరాలపై పని చేస్తూనే దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా వేదిక పని విధానాన్ని రూపొందించుకోవడం.

12. వేదిక పక్షాన మూడు నెలలకు ఒక బులిటెన్ ప్రచురించటం.

**(2023 ఆగస్టు 12 వ తేదీన, హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'సమూహ' ఆవిర్భావ సభలో, చలనచిత్ర నటుడు, కవి, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ ఆవిష్కరించిన అవగాహన పత్రం)**

**కవిత**

# తిరుగుబాటు రుతువు



**- మందరపు హైమవతి**
**9441062732**

బిరడా బిగించిన సీసాలా గొంతు పెగలదే
నువ్వేమీ మాటలురాని అర్భకుడివి కాదు
మధ్య మధ్యలో మహాకవుల కవితా పంక్తులతో
"మనసులో మాట"తో మైమరిపించే మాంత్రికుడివి
మేరా భారత్ మహాన్ అంటూ వల్లిస్తావు పదేపదే
వీళ్లు మాత్రం నీ దేశ వాసులు కాదా!
బహుళ కుల మతాల ఈ దేశం ఏడు రంగుల
ఇంద్రధనుస్సులో
ఒకే రంగు కాషాయవర్ణాన్ని పులమాలనుకోవడం
అన్యాయం
మీ ఇంటి ఆడపడుచులు
ఇంత అన్యాయానికి గురైనప్పుడు
నల్లగుడ్డ కట్టుకుని కళ్ళు మూసుకున్న న్యాయదేవతలా
బిగుసుకుపోతావెందుకు
మాటలాడాల్సిన చోట మౌనమే మహాపరాధం
ఈ కుల మతాల తెగల కుమ్ములాటల వెనక
ఏమర్మముందో ఎవరికెరుక
అడవుల ఒడి నుండి కొండల బడి నుండి
ఆదివాసీలను గెంటేసి
కార్పొరేట్ బకాసురుల పళ్లెంలో
ఫలహారాలనందిస్తారేమో
ఐదేళ్లకోసారి ప్రజలను ఓటర్లుగా
ప్రతి ఏటా పన్నుల విందులకు వినియోగదార్లుగా
గుర్తించే
ఏలికల్లారా!
పచ్చని తరువులన్నీ ఆకుల తుపాకుల్ని పూసి
పాలక నియంతల్ని తరిమికొట్టే తిరుగుబాటు రుతువు
వస్తుంది తొందరలోనే

సమీక్ష

# ఒక సబల సచిత్ర స్వీయచరిత్ర



ప్రొ. సి.హెచ్. సుశీలమ్మ
9849117879




తాను నడుస్తున్న మార్గమంతా రాళ్లు రప్పలు, ముళ్ళు ములుకులు, నిండి వున్నా, దెబ్బలు తింటున్నా, నొచ్చుకుంటున్నా, సహనంతో మెల్లగా దారి చూసుకుంటూ, చేసుకుంటూ, తన వెనక వచ్చే వారికి మార్గం ఏర్పరుస్తూ, ధైర్యంగా నడిచిన ఒక సబల సచిత్ర స్వీయ చరిత్ర డాక్టర్ అమృత లత గారి నా ఏకాంత బృందగానం .

అమృతలత కలిగోట ప్రక్కనున్న పడకల్ గ్రామంలో జన్మించి, జక్రాన్ పల్లిలో పెరిగారు. ఆమె బాల్యమంతా ఆ మూడు గ్రామాలు మధ్యనే గడిచింది. సరిగా ఊహ కూడా రాకముందే తల్లిని కోల్పోవడం, తండ్రి జాగ్రత్తగా కుటుంబ భారాన్ని మోస్తూ ఉండటం గమనించిందామె. తను బాగా చదువుకొని డాక్టర్ అవ్వాలని తన తండ్రి కోరిక అని ఆమెకు తెలుసు. కానీ చిన్నతనంలో తన ఆకతాయి పనిలో భాగంగా ప్రమాదవశాత్తు పేలుడు జరగడంతో ఎడమ చేతి వేళ్ళు మూడు కోల్పోవడం జరిగింది. మెడిసిన్ లాంటి చదువులకి కష్టం అని భావించి ఎం.ఏ. పొలిటికల్ సైన్స్, ఎం.యిడి. చదివి, ఎడ్యుకేషన్ లోనే పరిశోధన చేసి డాక్టరేట్ తెచ్చుకున్నారామె.

తన పిహెచ్.డి. గైడ్ పద్మావతీ విశ్వవిద్యాలయం, తిరుపతి, ప్రొ. నిర్మల జ్యోతి గారి ప్రోత్సాహంతో స్వీయచరిత్ర రాయడం ప్రారంభించారు.

చిన్నప్పటినుండి ఉత్సాహం, ఏకాగ్రత, అనుకున్నది సాధించే కార్యదీక్ష ఆమె ప్రత్యేకతలు. కానీ బాగా చదువుకోవాలి అన్న ప్రగాఢమైన వాంఛను తీర్చుకోవటం అంతా తేలిగ్గా జరగలేదు. అన్నయ్యలు, వదినలు, అక్కా చెల్లెళ్ళు, బావలు సహకారంతో పట్టుదలతో ఒక్కో మెట్టే ఎక్కి శిఖరాగ్రానికి చేరుకున్నారు. టీచింగ్ అంటే ఇష్టంతో జిల్లా పరిషత్ స్కూల్లో వచ్చిన ఉద్యోగంలో చేరి విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్నారు. తను పెరిగిన ప్రాంతాలలో ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఎంత నష్టపోతున్నారో గమనించి, తొమ్మిది ఏళ్లు చేసిన ఉద్యోగానికి రిజైన్ చేసి, తన చెల్లెలు విజయ పేర "విజయ్ హై స్కూల్" (ఇంగ్లీష్ మీడియం) ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో మరో సెంటర్ ఏర్పాటు చేయవలసి వచ్చింది. తర్వాత పాలిటెక్నిక్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కాలేజీలు కూడా ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్స్ కూడా ఏర్పాటు చేశారామె.

ఛాలెంజ్ లను స్వీకరిస్తూ, ఎదిరిస్తూ ఒక స్త్రీ సాధించిన ఈ విజయాన్ని "నా ఏకాంత బృందగానం" సచిత్ర స్వీయ

చరిత్ర పుస్తకంగా రాకపోతే ఈ ప్రపంచానికి తెలిసేది కాదు. ఎందరో స్త్రీలకు మార్గదర్శకం అయ్యేది కాదు. తన దగ్గర తన బంధువుల దగ్గర ఉన్న ఫోటోలు కూడా ఈ పుస్తకం లో ప్రచురించ దలిచారు. కొన్ని ఫోటోలు లేకపోవడంతో ప్రఖ్యాత చిత్రకారులు సరసి గారికి సందర్భాన్ని, విశేషాలను వివరంగా చెప్పి బొమ్మను గీయించారు. ఆ బొమ్మల వల్ల 70 ఏళ్ల క్రిందటి గడీ , గ్రామాలు, గుడులు, బడులు, ఇళ్ళు అన్నీ మనకు తెలిసే అవకాశం దక్కింది. చిన్ననాటి సంఘటనలు ఆమెకు ఎన్నో జీవిత పాఠాలు నేర్పాయి. "ఆడపిల్లలు మగవారికి ఏమీ తక్కువ కాదు" అన్న తండ్రి గడ్డం హనుమంత్ రెడ్డి మాటలు ఆమెపై ప్రభావం చూపాయి. అలాగే ఆమె ఎప్పుడూ ఏ విషయంలోనూ వెనుకంజ వేయలేదు. మనుషులకు, సంఘానికి ఏది ఉపయోగకరమైనదో దాన్ని ఎలాంటి పరిస్థితి ఎదురైనా చేసి తీరాలన్న దృఢసంకల్పం ఆమెది. ఆ సంకల్పానికి కుటుంబ సభ్యులు, స్నేహబంధం ఇచ్చిన సహకారం ఇంత అని చెప్పడానికి వీలుకానిది. ముఖ్యంగా "నాణ్యమైన విద్య"కు ఆమె మొదటి పీఠం వేశారు.

బడి తర్వాత గుడి నిర్మాణం. తనకు కలిగిన కొన్ని ఆధ్యాత్మిక అనుభవాల వల్ల వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించాలని నిర్ణయించుకున్నారు అమృతలత. ఆ దైవకార్యానికి చాలామంది సహకరించారు. శ్రీవారి దేవాలయం అపురూపంగా నిర్మించటమే కాక అనుబంధంగా కళ్యాణమండపం, అతిథి గృహం కూడా ఏర్పాటయ్యాయి. శ్రీ శ్రీ శ్రీ చినజీయర్ స్వామి విచ్చేసి అనుగ్రహ భాషణం చేశారు.

అమృత ఎనిమిదో తరగతిలోనే చిన్నన్న ప్రభావంతో ఒక కవిత రాయడంతో ఆమె రచనా వ్యాసంగం ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆ తర్వాత తను చదువుకునే సమయంలోనే కవితలు, కథలు రాయటం వివిధ పత్రికల్లో ప్రచురింపబడటం జరిగింది. చాలా వాటికి బహుమతులు కూడా లభించాయి. ఆ ఉత్సాహంతోనే "అమృత కిరణ్" అని పక్షపత్రికను ప్రారంభించారు. దాదాపు రెండేళ్లపైన నిర్వహించారు. వాటిలో ఆమె రాసిన "అమృత వర్షిణి" సంపాదకీయాలు చాలా పదునుగా ఉండి, జనాల్లోకి వెళ్లాయి. అంతేగాక కొన్నాళ్లు దినపత్రిక కూడా నడిపారు. కానీ కొన్ని కారణాలవల్ల ఆ రెండు పత్రికలను నడపలేక ఆపివేయాల్సి వచ్చింది. కానీ వివిధ పత్రికలకు కథలు, కవితలు, స్కెచెస్, కొన్ని కార్టూన్లు, నవలలు రాయడం ఆపలేదు.

సృజనాత్మక రచనలకు ప్రాధాన్యం ఇచ్చే అమృతలత అనేకమంది రచయిత్రులకు అవార్డులు ఇచ్చి ఘనంగా సన్మానించారు. తర్వాత పురుషులకు కూడా అవార్డులు ఇవ్వసాగారు. "అమృతలత అవార్డులు, ఇందూర్ అవార్డులు, అపురూప అవార్డులు" ఇవ్వటం, ప్రతి సంవత్సరం సభలను భారీగా నిర్వహించడం, దానికి వివిధ రంగాల్లో నిష్ణాతులైన ప్రముఖులను ఆహ్వానించడం, తర్వాత ఆ విశేషాలతో ప్రత్యేక సావనీర్ లను తీసుకురావడంతో ఆమెలోని రచనా వ్యాసంగం ఏనాడు వెనకబడలేదు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాటానికి మద్దతునిస్తూ కవయిత్రులు/ రచయిత్రులతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. అనేక నిర్ణయాలు తీసుకున్నారు. జ్వలిత, రాజీవ సంపాదకత్వంతో "గాయాలే గేయాలై" అనే కవితా సంపుటిని తెచ్చారు. అనిశెట్టి రజిత, తుర్లపాటి లక్ష్మి , కిరణ్ బాల సంపాదకత్వంతో "వెతలే కథలై" కథల సంపుటి తీసుకొచ్చారామె. ఆమె తో పనిచేయడం ఆహ్లాదకరంగా ఉంటుందని, ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని, వత్తిడి లేని వాతావరణం ఆమె సన్నిధిలో ఉంటుందని ఎందరో భావిస్తారు. అమృతలత షష్టిపూర్తి సందర్భంగా "అల", సప్తతి సందర్భంగా "ఆమె ఒక అద్భుతం" అంటూ ఆమె గురించి ఎందరో ఆప్యాయంగా రాసిన వ్యాసాలతో ప్రత్యేక సంచికలు వచ్చాయి.

చిన్నప్పుడు తన చదువు కోసం గంగవ్వ అనే ఆమె బీడీలు చుట్టి డబ్బు ఇచ్చి సహాయం చేయడం అమృతలత మర్చిపోలేదు. తమ హాస్టల్లో బట్టలు ఉతికే ఆయా పాడే పాటల్లోని పల్లె యాసని మర్చిపోలేదు. పెద్దక్క, చిన్నక్క ప్రేమానురాగాలు, చెల్లెలు విజయ సహకారం మర్చిపోలేదు. తను ఎలా ఎదిగి వచ్చిందో గుర్తుంది కాబట్టే తన స్కూల్స్, కాలేజీలలో పనిచేసే ఉద్యోగినులను అన్ని విధాలా ఉత్సాహపరుస్తూ, మార్గ నిర్దేశన గావిస్తూ, వారు మరింత నైపుణ్యాలను సాధించేందుకు

ప్రోత్సహించేవారు.

అన్ని రంగాల్లోనూ విశేష కృషి చేసిన డా. అమృతలత గారికి వచ్చిన అవార్డులు –

* ఆదర్శ వనిత భరతముని ఆర్ట్స్ అకాడమీ శ్రీకాకుళం 1996
* ద బెస్ట్ అవుట్ స్టాండింగ్ విమెన్ ఎంటర్ప్రెన్యూర్ అవార్డు, నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారిచే. 1997– 98
* బెస్ట్ ఎడ్యుకేషనిస్ట్ అవార్డు, ఐ టి టి ఆర్ ఓ డి డి హైదరాబాద్. 1999–2000
* కీర్తి పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం. 2013
* శ్రీపాద విజయలక్ష్మి జీవన సాఫల్య పురస్కారం, ప్రముఖ నటులు శ్రీపాద కుమార శర్మ గారిచే. 2013
* శంకరాభరణం అవార్డు, కె. విశ్వనాథ్ గారిచే. 2017
* శ్రీమతి తిరుమల స్వరాజ్యలక్ష్మి స్మారక సాహిత్య పురస్కారం, 2018
* శ్రీమతి మాదిరెడ్డి సులోచన & వంశీ సాహితీ అవార్డు. 2018
* ప్రమీల శక్తిపీఠం అవార్డు, ప్రొఫెసర్ మసవ చెన్నప్ప. 2021
* స్వాతంత్ర సమరయోధుడు వి. చిన నాగయ్య (జీవిత చరిత్ర రంగంలో) అవార్డు. 2022
* శ్రీరామనవమి ప్రతిభా పురస్కారం, సనాతన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ 2023

ఇంకా ఎన్నెన్నో పురస్కారాలు, సన్మానాలు ఆవిడను వచ్చి వరించాయి. సన్మానాలకు అతీతంగా సమాజానికి మేలు చేసే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ, తన లక్ష్యం వైపు సాగిపోతున్నారు డాక్టర్ అమృతలత. ఆమె మరెన్నో విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

కవిత

# ఎడారి వసంతం



**జంగం స్వయంప్రభ**
**కర్నూలు జిల్లా, 8897552022**

బీటలు వారిన బడిలో చినుకుని
తడి పాయలో చిగురుటాకుని
ఆనవాలు లేని నదిని
ఆకాశంలో సగాన్ని
అణువంత విశ్వాన్ని
గర్భానదాచుకున్న అంబరాన్ని
అవమానాల ధ్వజస్తంభాన్ని
మాటలకు ముడి సరుకుని
ముగింపు లేని నేటి వార్తని
చలించని సమాజంలో చెల్లని నోటుని
రహస్యం లేని రహదారిని
రాక్షసత్వానికి బలైన మాతృత్వాన్ని
హింస పంటికి మేత నిండిన ఘాటిని
అహింస తెలిసిన అంశాన్ని
నాగరికతలో ఉల్క
కథ కథనంలో నాయకని
సత్కారాల పారిజాతాన్ని
సంస్కృతుల గడపకు గీటు రాయిని
కోర్కెలను అణచివేసిన సన్యాసిని
కనికరం లేని వేటుకు కదిలే రక్త ప్రవాహాన్ని
నేటికీ యెన్నటికీ ప్రశ్నార్థకాన్ని
యెవరిని నేనెవరిని.....??

వ్యాసం

# ఈనాటి హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఆనాటి నా మణిపూర్ అనుభవాలు




కొండవీటి సత్యవతి
96187 71565


2008లో పూనాలో జరిగిన మహిళా జర్నలిస్టుల ఆరో సదస్సులో 2009లో జరగబోయే సదస్సు ఇంఫాల్‌లో జరుగుతుందని ప్రకటించిన దగ్గర నుంచి ఈశాన్యభారతాన్ని చూడడానికైనా తప్పనిసరిగా ఈ సమావేశాలకి హాజరవ్వాలని అనుకున్నాను. ఎలాగైనా ఇంఫాల్ వెళ్ళాలని డబ్బులు దాచుకోవడం మొదలుపెట్టాను. మణిపూర్ చాలాదూరం కాబట్టి ప్రయాణ ఖర్చులకే ఇరవైవేలు కావాలి. సొంత డబ్బులతోనే వెళ్ళాలి.

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో వున్న మహిళా జర్నలిస్టులు 2003లో ఢిల్లీలో సమావేశమైనపుడు ఒక వెబ్‌సైట్ నిర్మాణంతో పాటు ప్రతి సంవత్సరం కలవాలనే నిర్ణయం తీసుకున్నారు. ఆ మొదటి సమావేశానికి నేను హాజరయ్యాను. మీడియాలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల మీద చర్చలతో పాటు, ఎన్నో అంశాల మీద మూడురోజులపాటు సమావేశాలు జరుగుతాయి.

మూడునెలల క్రితం ఇంఫాల్‌లో సదస్సు నిర్వహణా బాధ్యతని స్వీకరించిన అంజులిక నుంచి చక్కటి కవితాత్మకమైన ఆహ్వానం నెట్‌వర్క్ సభ్యులందరికీ అందింది. అంజులిక రాసిన ఈమెయిల్ అందరిలో ఉత్సాహాన్ని నింపింది. ఇక అప్పటినుండి ప్రయణపు ఏర్పాట్లు మొదలయ్యాయనే చెప్పాలి. అయితే ఎన్నో అనుమానాలు. మణిపూర్ గురించి గాని మిగతా ఈశాన్యభారతం గురించి గానీ మీడియాలో ఎలాంటి వార్తల, సమాచారం లేకపోవడం వల్ల ఎన్నెన్నో సందేహాలు. అసలు ఎలా వెళ్ళాలి? ఇంఫాల్‌కి రైల్వేలైను లేదు. విమానంలో వెళితే ఎక్కడ దిగాలి? కోల్‌కతానా? గౌహతీనా? అక్కడి నుండి బస్సులుంటాయ? ఎన్ని గంటల ప్రయణం? ఇంటర్‌నెట్ నుండి కొంత సమాచారం సేకరించినా తృప్తిలేదు. మొబైల్ ఫోనులు మౌనవ్రతం పడతాయని, ఎటిఎమ్‌లు మొత్తానికే మొరాయిస్తాయని కొందరు భయపెట్టారు. అవసరమైన డబ్బులు మోసుకెళ్ళాలన్నమాట.

ఈ అనుమానాలన్నీ ప్రశ్నలరూపంలో సంధిస్తూ అంజులికకు ఎన్ని మెయిల్స్ రాసినా సమాధానాల్లేవు. మణిపూర్‌లో పరిస్థితి, అంజూలిక నిస్సహాయస్థితి తెలియక కోపం తెచ్చుకున్న సందర్భాలూ ఉన్నాయి. ఇంటర్నెట్ సరిగ్గా పనిచేయడం లేదని, త్వరలోనే అన్ని వివరాలు రాస్తానని తన మెయిల్, ఆ మర్నాడే కల్పనాశర్మ నుండి మెయిల్ వచ్చింది. అంజులిక కజిన్ ఇంఫాల్‌లో దారుణ హత్యకు గురయ్యాడని తను చాలా దుఃఖంలో వుందని దాని సారాంశం. అందరం చాలా బాధపడుతూ తనకి రాసాం. తను కాన్ఫరెన్స్ నిర్వహించగలుగుతుందా అనే భయాలను పటా పంచలు చేస్తూ అంజులిక అన్ని వివరాలతో మెయిల్ ఇచ్చింది. తన దుఃఖాన్ని దిగమింగి ప్రోగ్రామ్ జరపడానికే తను రెడీ అయ్యింది. ఆంధ్రప్రదేశ్ నుండి ఎంతమంది వెళతారో, ఎవరెవరు వెళతారో స్పష్టత లేకపోవడం వల్ల నేను నా ప్రోగ్రామ్ ఒంటరిగానే తయారుచేసుకున్నాను. గౌహతిలో ఐఐటి చదువుతున్న, నా ఫ్రెండ్ గీత కూతురు వైష్ణవి నా కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. క్యాంపస్‌లోను, షిల్లాంగ్‌లో నా కోసం గెస్ట్‌హౌస్ బుక్ చేసి, టాక్సీ మాట్లాడి గౌహతి ఏయిర్‌పోర్ట్‌లో వుంచింది.ఈశాన్య రాష్ట్రాలకి ఎపుడూ వెళ్ళకపోయినా సరే ఎలాంటి సంకోచం పెట్టుకోకుండా ఒక్కదాన్ని తిరుగుదామనే నిర్ణయించుకున్నాను కొన్నిసార్లు ఒంటరి ప్రయాణాలు గొప్ప గొప్ప అనుభవాలను అందిస్తాయి. ఇంఫాల్ వెళ్ళిన తర్వాతే ఆంధ్రా నుండి వచ్చిన వాళ్ళని కలుసుకోవడం జరిగింది.

4వ తేదీన ఉదయం ఎనిమిది గంటల ఫ్లయిట్‌లో నా ఇంఫాల్ ప్రయాణం మొదలైంది. పదిగంటలకి కోల్‌కత్తాలో దిగి, ఇంఫాల్ ఫ్లయిట్ కోసం ఎదురుచస్తున్నపుడు బాంబే, పూనే,

కలకత్తా గ్రూప్‌లు కలిసాయి. 12.30కి ఇండిగో విమానంలో బయలుదేరి 1.45కి ఇంఫాల్‌లో దిగాను. ముందు విమానంలో బయలుదేరి వెళ్ళిన ఆంధ్రాగ్రూప్‌లో సాక్షిలో పనిచేసే మంజరి, వార్తలో పనిచేసే జె. శ్యామల, వసంత, వనజారెడ్డి, ఎన్‌టివీలో పనిచేసే సమీర (మంజరి కూతురు) కలిసారు. అంజులిక కోసం ఎదురుచస్తుంటే గలగల నవ్వుతూ చిత్ర మా కోసం వాహనం తీసుకుని వచ్చింది. అందరం వాహనంలో ఎక్కి 'మంత్రిపుక్రి' అనే ప్రాంతానికి బయలుదేరాం. అక్కడే ఒక క్రిష్టియన్ సంస్థలో మా అందరికీ వసతి ఏర్పాటైంది. ఎయిర్‌పోర్ట్ నుండి మంత్రిపుక్రికి వెళుతుంటే, దారిపొడుగునా కనబడిన షాపులు, భవనాలు గమనించినపుడు మేము ఒక రాష్ట్ర రాజధాని నగరంలో ఉన్న భావం కలగలేదు. దుమ్ముకొట్టుకుపోయిన ఆ దారంతా చూస్తున్నపుడు ఏదో చిన్న పట్టణంలో వున్నామనిపించింది. మధ్యలో అరగంటపైగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. పెళ్ళిళ్ళ సీజనని చిత్ర ప్రకటించింది. మామూలు పౌరుల కన్నా తుపాకు లెక్కుపెట్టిన ఆర్మీ, అస్సామ్ రైఫిల్స్ సాయుధుల హడావుడి ఎక్కువగా వుంది. జీప్సీ వాహనాల్లో ట్రిగ్గర్ మీద వేలుంచి, తీక్షణంగా జనంవేపు చూస్తున్న వాళ్ళని చూస్తుంటే వెన్నులో జలదరించినట్లయింది.

మా వాహనం దుమ్ము రేపుకుంటూ మంత్రిపుక్రిలోకి ప్రవేశించింది. మెయిన్ రోడ్డుకి అరకిలోమీటర్‌లో రిట్రీట్ హౌస్ వుంది. దుమ్ము తుఫానును చీల్చుకుంటూ మా వాహనం ఓ చిన్నపాటి చెరువు పక్కనుంచి పాఠశాల భవనంలా వున్న రిట్రీట్ హౌస్ ముందు ఆగింది. అప్పటికి మూడు గంటలయ్యింది. ఎవరి సామానులు వాళ్ళు మోసుకుంట రెండస్తులు ఎక్కి లోపలికెళితే బోర్డింగ్ స్కూల్‌లో వున్నట్లు వరసగా ఓ ఇరవై మంచాలు కనబడ్డాయి. తలో మంచం దగ్గర లగేజ్ పెట్టి లంచ్ ఏర్పాట్లు ఏమిటా అని అడిగితే ఏమీ లేవు అని తెలిసింది. అందరి బ్యాగుల్లోంచి బిస్కెట్ పాకెట్లు, చిక్కీలు, చపాతీలు బయటకొచ్చాయి. అందరం వాటిని షేర్ చేసుకుని కబుర్లలో పడ్డాం. ఇరవైమందికి మూడే బాత్‌రమ్‌లున్నాయి. ఎవరెవరు ఎపుడు స్నానాలు చేయాలో జోక్‌లేసుకుంటూ నవ్వుకుంటూ వున్నపుడు ఎవరో వచ్చి మనకోసం రూమ్‌లు కూడా వున్నాయంట అంటూ ప్రకటించారు. మళ్లీ లగేజ్‌మోసుకుంటూ రూమ్‌లున్నవేపు వెళ్ళాం. నేను, కల్పనాశర్మ ఒక రూమ్‌లో సర్దుకున్నాం.

మొబైల్ ఫోన్లు మూగనోము పట్టడంతో మెయిన్‌రోడ్డు కెళ్ళి ఎస్‌టిడి ఫోన్ చెయాలని కొంతమంది బయలుదేరాం. రోడ్డు మీదకెళ్ళేవరకు మాకు తెలియని విషయం ఒకటుంది. అదే గత నెలరోజులుగా ఇంఫాల్‌లో సాయంత్రం ఐదు నుండి ఉదయం ఐదు వరకు కర్ఫ్యూ వుందని. మేము వెళ్ళేసరికి నాలుగున్నర అయ్యింది. ఇంక అరగంటే టైముంది. ఒకే ఒక్క ఎస్.టి.డి. బూత్ కనబడింది. ఫోన్లు చేసి, వాటర్ బాటిల్స్, ఏవో తినుబండారాలు కొనుక్కుని టీ కోసం చూస్తే ఒక్క హోటల్ కూడా కనబడలేదు. పోలీసుల విజిల్స్ వినబడసాగాయి. హడావుడిగా షాప్‌లు మూసేయసాగారు. ఒకామె టీకోసం మేం పడుతున్న అవస్థ చూసి, ఇంట్లోకి పిలిచి బ్లాక్ టీ పెట్టి ఇచ్చింది. పాలు లేవని చెప్పింది. అందరం దుమ్ము లేపుకుంటూ మా బసవేపు నడవసాగాం. తీరా రిట్రీట్ హౌస్‌కి చేరేసరికి చిమ్మచీకటి. పవర్ కట్ అట. కరెంట్ ఎపుడొస్తుందో ఎపుడు పోతుందో తెలియదట. చీకటి వల్ల వెన్నెల స్పష్టంగా కనబడుతోంది. చుట్టు పరుచుకున్న కొండల మీద తెల్లగా కురుస్తున్న వెన్నెల. పల్లెటూళ్ళల్లో కరెంట్ పోయినపుడు పౌర్ణమి ఎంత అందంగా కనబడుతుందో అష్టమినాటి చంద్రుడు అంత అందంగాను కనబడ్డాడు.

మా అదృష్టం బావుండి రూమ్‌ల్లో చిన్నచిన్న సోలార్‌లైట్‌లు వెలుగుతున్నాయి. ఎనిమిదింటికల్లా డిన్నర్‌కి రమ్మన్నారు. కట్టెలపొయ్యి మీద చికెన్ వొండుతుంటే లోపలికెళ్ళి చూసాన్నేను. అపుడే లిల్లీ పరిచయమైంది. రిట్రీట్ హౌస్‌లో వంట చేస్తుంది లిల్లీ. కూరల్లో ఉప్పు కారం అస్సలు లేవు. చికెన్ కొంచం బెటర్. క్యాబేజ్ ఎక్కువగా వాడారు. ఏదో తిన్నామన్పించి ఎనిమిదిన్నరకల్లా రూమ్‌ల్లో పడ్డాం. ఏంచెయ్యాలో ఎవరికీ అర్థం కాలేదు. కాసేపు కబుర్లయ్యాయి. ప్రయాణ బడలికతో అందర అలిసిపోయారు. అయినా నిద్దర రావట్లేదు. టీవీల్లేవు. చదువుదామంటే లైట్ లేదు. చుట్టూ చిమ్మచీకటి. ఉండుండి వినిపిస్తున్న పోలీసుల విజిల్స్. ముసుగేసి పడుకోవడం బెటరన్పించి తొమ్మిదికల్లా మంచమెక్కేసాం. నా రూమ్మేట్ కల్పనకి దుమ్మువల్ల బాగా జలుబుచేసి, రాత్రంతా చాలా ఇబ్బంది పడింది.

మర్నాడు ఐదుకల్లా మెలుకువ వచ్చేసింది. తొమ్మిదింటికల్లా రెడీ అవ్వాలని క్రితం రోజు చిత్ర చెప్పింది. ఓ గంటసేపు వాకింగ్ కెళితే టైమ్‌పాస్ అవుతుందని అనుకుని

బూట్లేసుకుని బయటకొస్తే బాగా చలిగా అన్పించింది. అప్పటికే మంజరి, సమీర వాళ్ళు కూడా బయటకొచ్చారు. అందరం కలిసి బయటపడి కనబడుతున్న కొండలవేపు బయలుదేరాం. చల్లగాలిలో నడవడం చాలా హాయిగా వుంది. చిన్నచిన్న ఇళ్ళు. ఎక్కువ భాగం వెదురు తడకలతో కట్టుకున్నవే. మేం నడుస్తూ వెళుతున్నపుడు ఒకామె ఇంటిముందు ఊడుస్తుంటే మాతో వున్న వసంత ఫోటో తియ్యడానికి ప్రయత్నించినపుడు మమ్మల్ని ఇంట్లోకి రమ్మని పిలిచింది. సన్నగా, సంప్రదాయ మణిపురి దుస్తుల్లో వున్న ఆమె పేరు సోసో. మమ్మల్ని ఎంతో ఆదరంగా పిలిచి, చిన్నచిన్నమోడాలు వేసి కూర్చోమంది. లోపల్నుంచి నలుగురు పిల్లలు వచ్చారు. తన పిల్లలని ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలని చెప్పింది. చక్కటి నవ్వుముఖాలతో, చికిలి కళ్ళతో వున్నారు వాళ్ళు. తన భర్త పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడట. వెదురు చాపలతో కట్టిన మూడురూముల ఇల్లు. శుభ్రంగా వుంది. లోపల్నించి కుంపటి తెచ్చి మామధ్య పెట్టి టీ తెస్తానని వెళ్ళింది. మేం పిల్లల ఫోటోలు తియ్యడంలో మునిగాం. ఆమె కొడుకు నవ్వుతుంటే ఎంత ముద్దొచ్చాడో. ఆ పిల్లాడి కళ్ళు, ముక్కు, పెదాలు అన్నీ నవ్వుతుంటాయి. సోసో వేడివేడి టీ తెచ్చి ఇచ్చింది. ఆ చలిలో వెచ్చటి టీ తాగుతూ సోసోతో బోలెడు కబుర్లు చెప్పాం. కర్ఫ్యూ గురించి అడిగితే, నవ్వుతూఅలవాటయిపోయింది అంది. మేము జర్నలిస్ట్‌లమని చెప్పాం. ఆమెకు థాంక్స్ చెప్పి బయటపడ్డాం.

తొమ్మిదింటికల్లా అందరం తయారై బస్సులో కూర్చున్నాం. దాదాపు 60 మంది జర్నలిస్టులం అప్పటికి ఇంఫాల్ చేరుకున్నాం. ఇంకా రావలసిన వాళ్ళున్నారు. మొదటిరోజు మీటింగ్ కాంగ్లా ఫోర్ట్ అనే చోట జరుగుతోందని చిత్ర చెప్పింది. మేము కాంగ్లా చేరేసరికి పదయ్యింది. సమావేశాన్ని ప్రారంభించే హాలులో కూర్చున్నాం. మణిపూర్ మహిళా కమీషన్ చైర్‌పర్సన్ సమావేశాన్ని ప్రారంభించారు. అదే రోజు ''అనుపవ జయరామన్'' అవార్డును ప్రదానం చేయడం జరిగింది. చాలా చిన్న వయస్సులో మరణించిన ''అనుపమ'' పేరు మీద ఆమె తల్లిదండ్రులు, జర్నలిస్టుల నెట్‌వర్క్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవార్డును 2008కి గాను అలీఫియ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్, హిందుస్తాన్ టైమ్స్, ముంబయ్‌కి ప్రదానం చేసారు.

ఆ తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత 'అరంబమ్ మెంచుబీ' మణిపురి స్త్రీల స్థితిగతుల మీద ఉపన్యసించారు. అరంబమ్ నాకు బాగా పరిచయమే. మేమంతా ''స్పారో'' ఏర్పాటు చేసిన జాతీయస్థాయి రచయిత్రుల సమావేశంలో ఐదు రోజులు ఖషీద్ (ముంబయి) లో కలిసివున్నాం. నన్ను గుర్తుపట్టి ఆప్యాయంగా పల్కరించింది. అక్కడే వుండే మరో మణిపురి రచయిత్రి బోర్‌కన్య గురించి వాకబుచేస్తే, మర్నాడు తనని తీసుకొస్తానని వాగ్దానం చేసింది అరంబమ్. ఆ తర్వాత మణిపురి వర్కింగ్ జర్నలిస్ట్‌లతో మాటామంతి జరిగింది. మణిపురి జర్నలిస్ట్‌లతోమాట్లాడుతున్న సందర్భంలోనే కాంగ్లా గేట్ ఉదంతం గురించి, ఆ గేట్ ముందు జరిగిన చారిత్రాత్మక మణిపురి స్త్రీల నగ్నప్రదర్శన గురించి మా అందరికీ వివరంగా తెలిసింది. నాలుగున్నర అయ్యేసరికి కర్ఫ్యూ హడావుడి మొదలైంది. మేమంతా హడావుడిగా బస్సెక్కేసాం. అందరూ ఎక్కేసరికి ఆలస్యం అవ్వడంతో కర్ఫ్యూ మొదలైంది. పోలీసులు, ఆర్మీ బెదిరింపుల మధ్య మా బస్సు భయంభయంగా బయలుదేరింది.

**కాంగ్లాఫోర్ట్, మనోరమాదేవి హత్య :**

2004, జులై 11వ తేదీన తన ఇంట్లో నిద్రపోతున్న మనోరమాదేవి అనే మహిళను అర్ధరాత్రి అస్సామ్ రైఫిల్స్ అరెస్ట్ చేసి తీసుకెళ్ళారు. తీవ్రవాది అనే అనుమానంతో ఆమెను అరెస్ట్ చేసారు. కొన్ని గంటల తర్వాత చిత్రహింసలకు గురిచేయబడి, ఒళ్ళంతా గాట్లు, కమిలిపోయిన శరీరభాగాలతో, సామూహిక అత్యాచారానికి గురైన మనోరమ శవం రోడ్డుమీద దర్శనమిచ్చింది.

ఈ సంఘటన మణిపూర్ స్త్రీలను తీవ్రంగా కలిచివేసింది. 12 మంది ''మైరా ఫెయిబి'' సంస్థకు చెందిన మణిపూరి స్త్రీలు ''ఇండియన్ ఆర్మి రేప్ అజ్'' అనే బేనర్‌తో పబ్లిక్ ప్రదేశంలో, కాంగ్లా గేటు ముందు నగ్నప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన దేశం మొత్తాన్నీ నివ్వెరపరిచి మణిపూర్‌లో ఏం జరుగుతుందో అర్థం చేయించింది. మనోరమ హత్యానంతరం కొన్ని నెలలపాటు మణిపూర్ మండిపోయింది. కమీషన్ ఆఫ్ ఎంక్వయిరీ వేసారు గానీ ఈ రోజుకీ ఆ రిపోర్ట్ బయటకు రాలేదు. స్త్రీల నగ్నప్రదర్శనానంతర ఉద్యమం వల్ల అస్సామ్ రైఫిల్స్‌కీ, ఆర్మీకి కేంద్ర స్థావరంగా వున్న కాంగ్లా ప్రాంతాన్ని ఖాళీ చేయించి, సివిల్ అధికారులకు అప్పచెప్పడం జరిగింది.

మేము బస్సులో మంత్రిపుత్రికి ప్రయాణం చేస్తున్నపుడు కాంగ్లా గేట్ ఉదంతం గురించి విన్నాం. మనోరమని తలుచుకుని కన్నీళ్ళ పర్యంతమయ్యామ్. తోటి స్త్రీకి జరిగిన అన్యాయన్ని ప్రశ్నిస్తూ నగ్నప్రదర్శనలాంటి తీవ్రచర్యతో తమ నిరసనను వ్యక్తం చేసిన పన్నెండుమంది మణిపురి స్త్రీలకు పాదాభివందనం చెయ్యాలన్పించింది. బస్సు మా బస దగ్గరికి దుమ్ములేపుకుంట వచ్చింది. అప్పటికే చీకటి పడింది. కరెంట్ లేదు. దూరంగా కొండలమీద మిణుకు మిణుకుమటూ వెలుగుతున్న దీపాలు. పిండారబోసినట్లు నవమి వెన్నెల. ''కొండలపైనా, కోనలలోనా గోగులుపూచే జాబిలి'' అని పాడుకుంటూ ఆ చీకట్లో చేసే పనేంలేక బయటే కూర్చుండిపోయం. చాలాసేపు కాంగ్లా గేట్ ఉదంతం మా మాటల్లో నలిగింది. డిన్నర్ అయ్యాక కొంతమందిమి ఒక గదిలో చేరి పాటలు పాడే కార్యక్రమం మొదలుపెట్టాం. బెంగుళూరు నుండి వచ్చిన వాసంతి రేష్మా 'చార్ దినోంకా' పాటని అద్భుతంగా పాడింది. అన్ని భాషల వాళ్ళు తలో పాటా అందుకుని హైపిచ్‌లో పాడుతూ, అల్లరి చేస్తుంటే రిట్రీట్ ఫాదర్ పాల్ వచ్చి నిశ్శబ్దంగా వుండాలని తొమ్మిది అవుతోంది, లైటు తీసేయాలని హుకుం జారీచేసాడు. బతుకుజీవుడా తొమ్మిదికే పడుకోవాలా అనుకుంటూ ఎవరి గదుల్లోకి వాళ్ళం ముడుచుకుపోయామ్. ఆ రాత్రి సరిగా నిద్రపట్టలేదు. కలల్లో కాంగ్లా గేట్, నగ్నస్త్రీలు కలవరపరిచారు. మనసు కలిచివేసి నట్లయింది.

మర్నాడు ఉదయమే ఆంధ్రా బ్యాచ్ ఎదురుగావున్న కొండ ఎక్కాలని బయలుదేరాం. నేను, వనజ, మంజరి, శ్యామల, సమీర, వసంత, అనూరాధ, వనజారెడ్డి అందరం హుషారుగా కొండెక్కుతున్నాం. కిందినుంచి చూస్తే కొండమీద ఏమీ కనబడలేదు గాని మేముపైకి వెళుతుంటే ఓ ఇల్లు కనబడింది. దానిపక్కనే ఓ గెస్ట్‌హౌస్ లాంటిది కనబడింది. కొండమీదికి వెళ్ళేటప్పటికి ఆ ఇంట్లోని కుటుంబమంతా ఉదయపు ప్రార్థనలో వున్నారు. మేం నిశ్శబ్దంగా నిలబడ్డాం. కొంతసేపటికి ప్రార్థన ముగించి ఒకాయన మాదగ్గరకొచ్చాడు. మేం ఫలానా అని చెప్పాం. తన పేరు అనమ్ అని, ఆ కొండపేరు ఖదిమ్ కొండ అని చెబుతూ ఖదిమ్ అనే అతను అక్కడ వుండేవాడని, ఈ గెస్ట్‌హౌస్ వాళ్లదేనని, తాను వాచ్‌మెన్‌నని చెప్పాడు. ఆ పక్కనే వున్న ఖదిమ్ భార్య సమాధినిచూపించాడు. మా ఎనిమిదిమందికి పొగలు కక్కే టీ తీసుకొచ్చి ఇచ్చింది అతని కూతురు. టీ తాగి అతని ఇంట్లోకి వెళ్ళాం. చిన్న ఇల్లు. అనమ్, అతని భార్య, ఇద్దరు కూతుళ్ళు వుంటున్నారు. ఆవులు, బాతులు పెంచుతున్నారు. మేం శెలవు తీసుకుని బయలుదేరబోతుంటే 'ఆప్ లోగ్ ఫిర్ ఆయియే' అంటూ ఆదరంగా చెప్పాడు అనమ్. మణిపూర్ వాస్తవ్యులు కొత్తవ్యక్తులతో కూడా చాలా ఆదరంగా, ఆప్యాయంగా మాట్లాడ్డం గమనించాం. సోసో, అనమ్ కుటుంబం మాకు బాగా గుర్తుండిపోయారు.

తొమ్మిదిన్నరకి రెండోరోజు సమావేశం మొదలైంది. నెట్‌వర్క్ సమావేశాలకు హాజరైన సభ్యుల పరిచయాలయ్యాయి. అంతకుముందురోజు మధ్యాహ్నానికి ఇంఫాల్ చేరిన 'నవోదయం' సభ్యులు తమని తాము పరిచయం చేసుకున్నపుడు సభ్యులందరూ కరతాళధ్వనులతో వారిని ఆహ్వానించారు. చిత్తరుకు చెందిన ఈ గ్రామీణస్త్రీలు ఎంతో ప్రతిభావంతంగా తామే ఎడిటర్లుగా, రిపోర్టర్లుగా పనిచేస్తూ నడుపుతున్న పత్రిక నవోదయం. స్వయంసహాయక బృందాలకు చెందిన ఈ పత్రిక చాలా సంవత్సరాలుగా నడుస్తోంది. ఆ టీమ్ సభ్యులు ప్రతి సంవత్సరం మహిళా జర్నలిస్టుల నెట్‌వర్క్ సమావేశాలకు హాజరవుతారు.

పరస్పర పరిచయలయ్యక నెట్‌వర్క్ గురించి, వెబ్‌సైట్ గురించి చర్చ జరిగింది. జాతీయస్థాయిలో మహిళా జర్నలిస్ట్‌ల నెట్‌వర్క్‌ను రిజిష్టర్ చేయలా వద్దా అనే అంశం మీద వేడైన వాడైన చర్చ జరిగింది. కొంతమంది రిజిష్టర్ చేస్తే బావుంటుందని వాదిస్తే మరికొందరు నెట్‌వర్క్ అందం అంతా రిజిష్టర్ చెయ్యకుండా, ఏలాంటి హెచ్చుతగ్గుల స్థాయిలు లేకపోవడంలోనే వుందని వాదించారు. అయితే ఎక్కువ శాతం రిజిస్ట్రేషన్ వైపు మొగ్గుచపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కల్పనాశర్మ చర్చను ముగిస్తూ దీనిమీద తొందరపడడం మంచిది కాదని మరింత చర్చ తర్వాత నిర్ణయం తీసుకుందామని చెప్పింది.

ఆ తర్వాత మణిపూర్‌లో ప్రస్తుత పరిస్థితి గురించి ముగ్గురు ప్రముఖ వ్యక్తులు ఉపన్యాసాలు ఇచ్చారు. హ్యూమన్ రైట్స్ అలర్ట్ అనే సంస్థ నుండి బబ్లూ లైటోంగ్‌బామ్ చాలా ఆసక్తికరమైన ప్రసంగం చేశారు. సభ్యులందరూనిశ్శబ్దంగా ఆయన ప్రసంగాన్ని విన్నారు. మణిపూర్‌లో తిరుగుబాటు నేపథ్యాన్ని గురించి ప్రస్తుతం ఎన్ని గ్రుపులు అండర్‌గ్రౌండ్‌లో వుండి పోరాటం చేస్తున్నదీ వివరించారు. నాగాలు, కుకీలు,

మైత్రేయులు, వైష్ణవులు, ముస్లిమ్‌ల గురించి వివరించాడు బబ్లూ. భారతదేశానికి స్వతంత్రం వచ్చేనాటికి మణిపూర్ రాచరికంలో వుందని, ఆగష్టు 14, 1947 రోజు అంటే ఇండియాకి స్వతంత్రం వచ్చిన ఒకరోజుముందే నాగా నేషనల్ కౌన్సిల్ బ్రిటీష్ రాజ్యం నుండి తాము స్వతంత్ర్యాన్ని పొందినట్టు ప్రకటించుకున్నారు. అయితే స్వాతంత్ర్యానంతరం ఇండియన్ గవర్నమెంట్ బలవంతంగా మణిపూర్‌ను ఇండియాలో విలీనం చెయ్యడాన్ని జీర్ణించుకోలేని అనేక గ్రపులు తిరుగుబాటు బాట పట్టాయి. ఈ తిరుగుబాట్లను అణిచివేసే నెపంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రూరమైన చట్టాలను తెచ్చాయి. అనేక గ్రూపులు చేస్తున్న ఈ తిరుగుబాట్లను లా అండ్ ఆర్డర్ సమస్యగానే ప్రభుత్వాలు చూస్తున్నాయి తప్ప వారి ఆత్మగౌరవ పోరాటాలుగా గుర్తించడం లేదు. ఈ తిరుగుబాట్లను అణచడానికి ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్ ఏక్ట్ 1958ని తీసుకొచ్చారు. సమస్యను పరిష్కరించడానికి బదులు మరింత జటిలం చేసి, మణిపూరీ ప్రజల మాన, ప్రాణాలను ఈ చట్టం హరిస్తోందని బబ్లూ వివరించారు. ఎన్నో దేశీయ గ్రూప్‌లు భారత ప్రభుత్వంతో పోరాడుతున్నాయని, ఆర్మీ, అస్సామ్ రైఫిల్స్‌కి చెందిన సాయుధులు ప్రజలను ఊచకోత కోస్తున్నారని బబ్లూ వివరించాడు.

బబ్లూ తర్వాత 'నాగా వుమన్ యూనియన్'కి చెందిన గ్రేస్ ఫట్‌సంగ్ నాగా స్త్రీల ఉద్యమం గురించి చెప్పారు. ఆమె ప్రసంగం తర్వాత డా: ఎస్. చోంగ్లాయ్‌మానవహక్కుల కోసం 'కుకి'లు చేస్తున్న పోరాటం గురించి ప్రసంగించారు. 1919లో నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌తో కలిసి బ్రిటీష్‌కి వ్యతిరేకంగా పోరాటం చేసిన, ఒకప్పుడు ''ఇండిపెండెంట్, హిల్, కంట్రీని'' ఏలిన దేశీయ ప్రజలైన 'కుకీ'లు ఈ రోజు అత్యంత దయనీయంగా బతుకుతున్నారని చోంగ్లోయ్ వివరించారు. వీరి ప్రసంగాలు చాలా ఆసక్తిదాయకంగా సాగి, మణిపూర్ చరిత్ర పూర్వాపరాలు, ప్రస్తుత స్థితిగతులను వివరిస్తూ మంచి చర్చను లేవనెత్తాయి.

ఆ తర్వాత ''వుమన్ విడోడ్ బై కాన్‌ఫ్లిక్ట్ ఇన్ మణిపూర్'' పేరుతో అంజులిక తీసిన డాక్యుమెంటరీ ఫిల్మ్ చూపించారు. సైన్యం విచక్షణారహితంగా కాల్చేసిన కుటుంబాల స్థితిగతులు, అతిచిన్న వయస్సుల్లో భర్తల్ని పోగొట్టుకుని విధవలైన స్త్రీలు హృదయవిదారకంగా రోదిస్త కాల్పుల నేపథ్యాలను వివరించినపుడు అందరం కదిలిపోయామ్. నలుగురు నుంచి ఐదుగురు పిల్లలతో భర్తల్ని పోగొట్టుకున్న ఆ స్త్రీల జీవితాల్లోని విషాదం చూస్తూ కన్నీళ్ళ పర్యంతమైనాం అందరం. అన్నిటికన్నా అత్యంత దుఃఖాన్ని నింపిన సన్నివేశం మిలిటెంట్ గ్రూప్ చేతుల్లో హత్యకు గురైన అంజులిక సోదరుడి భార్య ప్రసంగం. ప్రస్తుత ఇంఫాల్ కర్ఫ్యూకి కారణమైన దింగనమ్ కిషన్, (మణిపురి సివిల్ సర్వీస్‌కి చెందిన యువ అధికారి) దారుణహత్య. ఫిబ్రవరి 13న కిషన్‌ని, అతని డ్రైవర్‌ని, అంగరక్షకుడిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళి హత్య చేసారు. శోకదినాలను పాటిస్తూ తెల్లవస్త్రాలను ధరించి కిషన్ భార్య నెట్‌వర్క్ సమావేశాలకు వచ్చి జరిగిన దారుణాన్ని వివరించినపుడు మేమంతా దుఃఖాన్ని ఆపుకోలేకపోయామ్. అందంగా, అమాయకంగా, పుట్టెడు దుఃఖంలో వున్న ఆమె ముఖం ఈ రోజుకీ కళ్ళల్లోంచి పోకుండా కలవరపెడుతూనే వుంది.

లంచ్ తర్వాత ఆరుబయట మణిపురీ నృత్యప్రదర్శన ఏర్పాటుచేశారు. ముగ్గురు అమ్మాయిలు, ముగ్గురు అబ్బాయిలు కలిసి అద్భుతంగా నృత్యం చేసారు. మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శనను కూడా తిలకించిన తర్వాత మనం ఇపుడు ఇమా మార్కెట్ చూడ్డానికి వెళుతున్నామని, త్వరగా వెళ్ళి, కర్ఫ్యూ సమయానికి తిరిగి వచ్చెయ్యాలని అంజులిక ప్రకటించడంతో అందరం హడావుడిగా బస్సెక్కేసాం. కాంగ్లా గేట్‌కి ఎదురుగా, కిటకిటలాడుతున్న మార్కెట్ దగ్గర బస్సు ఆగింది. అప్పటికి టైమ్ నాలుగుంబావు అయ్యింది. బ్యాచ్‌లుగా విడిపోయి ఒక్కో బ్యాచ్‌కి ఒక్కో మణిపూరీ అమ్మాయి తోడురాగా మార్కెట్ వేపు వెళ్ళాం.మార్కెట్ యమ రద్దీగా వుంది. లోపలికెళ్ళినపుడు అక్కడున్న షెడ్‌లలో బారులుతీరి కూర్చున్న మణిపురీ స్త్రీలు వివిధ వ్యాపారాలు చేస్త కనబడ్డారు. అక్కడ దాదాపు 3000 మంది స్త్రీలు ప్రతిరోజూ వ్యాపారం చేస్తారని తెలిసింది. ఆ మార్కెట్ ఎప్పుడు మొదలైందనే దానికి స్పష్టమైన సమాధానం దొరకలేదు. అక్కడ వ్యాపారులందరూ ఆడవాళ్ళే. అదీ మధ్యవయస్సులో వున్నవాళ్ళు, అరవై దాటివాళ్ళు ఉన్నారు.తల్లుల మార్ఖెట్ అనే దీనికి పేరు. బట్టలు, వివిధ వస్తువులు, కూరగాయలు, చేపలు ఒకటేమిటి ఎన్నో అమ్ముతుంటారు. ఎక్కువగా వివిధ రంగుల్లో మణిపురీ చేనేత దుస్తులు కన్పించాయి.

ఈమార్కెట్ పేరు 'ఇమా' బజార్. అక్కడ కొనుక్కునే పురుషులు తప్ప అమ్మే పురుషులుండరు.

మేమంతా తలోదిక్కు వెళ్ళిపోయామ్. అందరూ

మణిపురి సంప్రదాయ లుంగీలు, షాల్‌లు కొన్నారు. ఎంతో హడావుడిగా అమ్మేవాళ్ళు అమ్ముతూ, సర్దుకునేవాళ్ళు సర్దుకుంటున్నారు. పిలిచి పిలిచి అమ్ముతున్నారు. కర్ఫ్యూ టైమ్ అయిపోతోంది. ఒక ముసలామె గంప నిండా వంకాయరంగు కలువపూలు తెస్తూ కనబడింది. నేను, మంజరి మూడేసి కట్టల పువ్వులు కొనేసాం. మాకు తోడుగా వచ్చినవాళ్ళు ఇంక పోదాం అంటూ కంగారుపెట్టసాగారు. మార్కెట్ వొదిలి రావాలని ఎవ్వరికీ లేదు. సరదాగా అట ఇట తిరుగుతూ ఆ స్త్రీలను పల్కరించాలని వాళ్ళతో మాట్లాడాలని వున్నా గాని, పోలీసుల విజిల్స్, సాయుధ సైనికులు తుపాకులెక్కుపెట్టి తిరుగుతున్న జీప్పీ వాహనాలు అందరినీ టెన్షన్ పెట్టేసాయి.మార్కెట్ కూడా చాలావరకు మూసేసారు. మేమంతా కంగారు కంగారుగా మా బస్సు ఆగివున్న చోటుకి పరుగులుపెట్టేం. ప్రతి ఒక్కరూ, ఏదో ఒక వాహనం పట్టుకుని, కిటకిటలాడే ఆటోలెక్కి ఇళ్ళకు వెళ్ళిపోసాగారు. బిజినెస్ ఊపందుకునే సాయంత్రం వేళ పాపం! ఆ మహిళలంతా దుకాణాలు మూసేసి ఇళ్ళకు వెళ్ళిపోవడం అదీ ఎంతో టెన్షన్‌గా వెళ్ళడం చాలా బాధన్పించింది. ఇళ్ళకెళ్ళాక మాత్రం ఏముంటుంది? కరెంట్ లేని చీకటి ఇళ్ళు మాత్రమే వాళ్ళకోసం ఎదురుచూస్తాయి. బహుశా సైన్యం ఇనుపబూట్ల చప్పుళ్ళే వాళ్ళకి వినోదమేమో! అంతకు మించిన చప్పుళ్ళు ఆ కర్ఫ్యూవేళ ఇంకేముంటాయి?

మా బస్సు వేగంగా మమ్మల్ని తెచ్చి రిట్రీట్ హౌస్‌లో దింపేసింది. అప్పటికి ఐదున్నర అయ్యింది. మార్కెట్ దగ్గర ఫోన్ చేద్దామని ప్రయత్నించినా ఎక్కడా ఎస్‌టిడి బూత్ కనబడలేదు. నేను మెయిన్‌రోడ్డు మీదకెళుతున్నా ఎవరైనా వస్తారా అంటే మంజరి నేను కూడా వస్తానంది. శ్యామల కూడా మాతో బయలుదేరింది. ఎస్‌టిడిబూత్ వుంటుందనే ఆశతో ఆ చీకట్లో బయలుదేరాం. కరెంటు లేకపోవడం వల్ల వెన్నెల తెల్లగా మెరుస్తోంది. మాకు ఒక మిలిటరీ జీప్ ఎదురొచ్చింది. మేం పక్కకు జరిగి నిలబడ్డాం. దుమ్ము లేపుకుంట వెళ్ళిపోయింది. కొంతమంది స్త్రీలు గుడ్డిదీపాలు పెట్టుకొని కూరగాయలు, చేపలు అమ్ముకుంటున్నారు. షాపులన్నీ మూసేసారు. వాటర్ బాటిల్స్ కొందామంటే దొరకలేదు. మేము అంతకుముందురోజు మాట్లాడిన ఎస్‌టిడిబూత్ మూసేసి వుంది. అర్జంటుగామాట్లాడాలి ఎలా? అనుకుంటూ అక్కడ నిలబడిన ఒకాయన్ని ఇక్కడ ఇంకో ఎస్‌టిడి బూత్ వుందా అని హిందీలో అడిగాం. మా వేపు ఎగాదిగా చూసి ఆ ప్రాంతానికి కొత్తవాళ్ళమని అర్థం చేసుకుని 'ఆయియే' అంటూ రోడ్డు మీదకు దారితీసాడు. మెయిన్‌రోడ్డంతా చీకటిగా, నిర్మానుష్యంగా వుంది. ఒక షాప్ ముందాగి తలుపు మీద కొడితే ఆ తలుపు ఓరగా తెరుచుకుంది. లోపల ఫోన్ వుంది. ముగ్గురం లోపలికెళ్ళగానే ఆ షాపతను తలుపు మూసేసాడు. తనివితీరా ఫోన్‌లో మాట్లాడి, మిత్రులకి ఎలాంటి పరిస్థితుల్లో మాట్లాడుతున్నామో చెప్పేసరికి వాళ్ళు కంగారుపడ్డారు. నా మిత్రురాలు ఒకామె అయితే నన్ను చివాట్లేసింది. అలాంటి ప్రమాదకర పరిస్థితులున్నచోట ఎడ్వంచర్లేమిటని కేకలేసింది.

షాపతనికి డబ్బులిచ్చేసి మొత్తంగా నిర్మానుష్యంగా మారిన రోడ్ల మీద నడుస్తూ, ఇంఫాల్ ప్రజల ముఖ్యంగా స్త్రీల కష్టాలకు బాధపడుతూ, ఇలా ఎన్నాళ్ళు కర్ఫ్యూనడుస్తుందా, జనం ఇలా ఎంతకాలం భరించాలా అని చర్చించుకుంటూ మా బసకు చేరాం.

మర్నాడు తొమ్మిదిన్నరకే మీటింగ్ మొదలైంది. నెట్‌వర్క్‌కి సంబంధించిన కార్యకలాపాల గురించి, వచ్చే సమావేశం ఎక్కడ నిర్వహించాలి అనే అంశం గురించి చర్చ జరిగింది. మేము నిర్వహిస్తాం అంటూ కేరళ బృందం ముందుకు రావడంతో నిర్వహణకు అవసరమైన వనరుల మీద, ఆ వనరుల్ని ఎలా సేకరించాలి అనే దానిమీద వాదోపవాదాలు జరిగాయి. బెంగుళూరుగ్రూప్ 'అనుపమ జయరామన్' అవార్డు నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చకు పెట్టారు. చాలా సీరియస్‌గా అందరం చర్చలో మునిగివున్న వేళ అంజులిక హఠాత్తుగా ఒక ప్రకటన చేసింది. ఇరామ్ షర్మిల ఆ రోజు విడుదల కాబోతోందని, మనమంతా ఇపుడు ఆమెను బంధించి వుంచిన ఆసుపత్రికి వెళుతున్నామని చెప్పడంతో అక్కడంతా ఒక ఉత్కంఠ నెలకొంది. నేను ఇంఫాల్‌కి వచ్చిన రోజే షర్మిలను కలిసే వీలుందా అని చిత్రని అడిగితే చాలా కష్టం అని చెప్పింది. రెండు సంవత్సరాల క్రితమే ''మణిపూర్ ఉక్కు మహిళ ఇరామ్ షర్మిల'' అని నేనుభూమికలో సంపాదకీయం రాసాను. ఆమె ధైర్యం, సాహసం ఎంతో స్ఫర్తిదాయకమైనవి. అలాంటి షర్మిలను కలుసుకునే అవకాశం రావడం అందరిలోను ఉద్వేగాన్ని రేపింది.

లంచ్ తిన్నామనిపించి అందరం బస్సులో ఎక్కేసాం. ఓ అరగంట ప్రయణం తర్వాత మేము షర్మిల విడుదల కోసం

రిలే నిరాహారదీక్షలు చేస్తున్న శిబిరం దగ్గర దిగాం. అప్పటికి 88 రోజులుగా మణిపురి స్త్రీలు రిలే నిరసనదీక్షలు చేస్తున్నారు. మేము కూడా శిబిరంలో కూర్చున్నాం.

**అద్భుత సాహసమూర్తి ఇరాం షర్మిల**

ఇరామ్ షర్మిల సామాజిక కార్యకర్తగా పనిచేసేది. భద్రతాదళాల చేతుల్లో హత్యలకు, అత్యాచారాలకు బలైన స్త్రీల కన్నీటికథనాలను వినేది. శాంతియాత్రల్లో పాల్గొనేది. 2000 సంవత్సరం నవంబరు 2న 'మాలోమ్' పట్టణంలోని బస్టాండులో అస్సామ్ రైఫిల్స్ సాయుధులు పదిమంది పౌరులను కాల్చి చంపేసిన దారుణ సంఘటన జరిగినపుడు షర్మిల తీవ్రంగా చలించిపోయింది. అంతకుముందు మణిపురి తిరుగుబాటుదారులు భద్రతాదళాల వాహనాలపై దాడిచేసినందుకు ప్రతీకారంగా అస్సామ్ రైఫిల్స్ ఈ దురాగతానికి దిగింది. 'మాలోమ్' పట్టణం ఇంఫాల్‌కి పదిహేను కిలోమీటర్ల దూరంలో వుంది. షర్మిల ఈ సంఘటన జరగడానికి ముందే ఒక శాంతియాత్రా నిర్వహణ కోసం మాలోమ్‌కి వచ్చి వుంది. ఆమె మాలోమ్‌లో వున్నపుడే ఈ దారుణ సంఘటన జరగడంతో, శాంతి ర్యాలీ ఆలోచనను విరమించుకుని అంతకంటే తీవ్రమైన కార్యాచరణకి పూనుకోవాలని నిర్ణయించుకుంది. భద్రతాదళాలకు విచ్చలవిడి అధికారాలు కట్టబెట్టిన Armed Forces Special Powers Act, 1958 (AFSPA) ని రద్దుచేయలంట ఆమరణ నిరాహారదీక్షకు దిగాలనే తీవ్ర నిర్ణయన్ని ఇరామ్ షర్మిల తీసుకుని తల్లితో చెప్పినపుడు ఆమె గట్టిగా వ్యతిరేకించి షర్మిలకు నచ్చచెప్పడానికి ప్రయత్నించింది. షర్మిల తన నిర్ణయానికే కట్టుబడడంతో తల్లి కఠినాతికఠినమైన నియమం పెట్టింది. షర్మిల తను మొదలుపెట్టిన కార్యంలో విజయం సాధించేవరకు తన ముఖం చూపించవద్దని నియమం పెట్టడంతో షర్మిల ఒప్పుకుని తన ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించింది. నవంబర్ 11, 2000లో షర్మిల ప్రారంభించిన ఈ దీక్ష తొమ్మిది సంవత్సరాలుగా కొనసాగుతూనే వుంది.

అమరణ నిరాహార దీక్షలో వున్న షర్మిలను ఆత్మహత్యా నేరం కింద ప్రభుత్వం అరెస్ట్ చేసి బలవంతంగా ముక్కుల్లోంచి ట్యూబ్‌లేసి, ద్రవాహారం పంపిస్తూ జె.ఎన్, ఆసుపత్రిలోని ఎంతో భద్రత కల్గిన వార్డులో బంధించి వుంచింది. ఈ నేరం కింద ఒక్క సంవత్సరమే ఖైదీలో వుంచే వీలుండడంవల్ల, ప్రతి సంవత్సరం ఒక రోజు విడుదల చేసి షర్మిల ఆహారం తీసుకోదు కాబట్టి మళ్ళీ అరెస్ట్ చేయడం ఎనిమిదేళ్ళుగా ఒక ''తన్తు''లాగా నడుస్తోంది. మేము ఇంఫాల్‌లో వున్నపుడే మార్చి 7న ఆమెను విడుదల చేసి, మార్చి 8 అంతర్జాతీయ మహిళాదినం రోజున అరెస్ట్ చేసి ఆసుపత్రి వార్డులో బంధించారు.

"షర్మిల కంబ లప్" పేరుతో ''మైరా పెయిబి'' స్త్రీలు ఆమెకు సహకరిస్తున్నారు. మణిపూర్ లోయలో ఈ మైరాపెయిబి స్త్రీలు అట్టడుగు స్థాయినించి సాంప్రదాయక స్త్రీల సంఘాలుగా ఏర్పడి పనిచేస్తుంటారు. చారిత్రకంగా తీసుకుంటే ఈ మైరాపెయిబీ స్త్రీలు బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కలిగివున్నారు. అలాగే మణిపూర్‌లో తాగుడు వ్యసనానికి, డ్రగ్స్‌కి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నది కూడా వీరే. అతిబలమైన సాయుధ దళాలను ధిక్కరిస్తూ వనవ హక్కుల ఉద్యమాన్ని నడుపుతున్నది కూడా మైరాపెయిబీ స్త్రీలే నన్నది నగ్నసత్యం. ప్రస్తుతం షర్మిల ఆమరణదీక్షకు మద్దతునిస్తున్నవాళ్ళు వీళ్ళే.

2006లో షర్మిల విడుదలైనప్పుడు, ఆమె తన సోదరుడు, మరో ఇద్దరు కార్యకర్తలతో ఢిల్లీకి వెళ్ళి జంతర్‌మంతర్ దగ్గర రోడ్డు మీద తన దీక్షను ప్రారంభించింది. పోలీసులు వెంటనే ఆమెను అరెస్ట్ చేసి ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో వుంచి ఆమెకు బలవంతంగా ముక్కు ద్వారా ద్రవాహారాన్ని పంపి ఆమె దీక్షని భగ్నం చేసారు. ఆ తర్వాత షర్మిలను ఇంఫాల్ తీసుకెళ్ళి జవహర్‌లాల్‌నెహ్రూ హాస్పిటల్‌లో నిర్బంధించారు. ఆమెని ప్రతి సంవత్సరం విడుదల చేసి, ఆమె తన దీక్షను కొనసాగించడంతో, ఆమెపై ఆత్మహత్యానేరం వెపి మళ్ళీ మళ్ళీ నిర్బంధిస్తూనే వున్నారు.మార్చి ఎనిమిదిన ఆమెను తిరిగి అరెస్ట్ చేసారు.

2009లో మేము ఇంఫాల్‌లో వున్నపుడు మార్చి 7న ఆమెను విడుదల చేసారు. ఆమె దీక్షకు మద్దతుగా మైరాపెయిబీ స్త్రీలు చేపట్టిన నిరసన శిబిరంలో మేము కూర్చుని వున్నపుడే మరో పదిహేను నిముషాల్లో షర్మిలను విడుదల చేస్తారనే సమాచారం వచ్చింది. మేమందరం శిబిరంలోంచి బయలుదేరి ఆసుపత్రికి కాలినడకనే చేరుకున్నాం. అప్పటికి సమయం మూడు కావస్తోంది. మేము వెళ్ళేసరికే అక్కడ పెద్దఎత్తున మీడియాకు చెందిన వాళ్ళు, స్త్రీలు, మైరాపెయిబికీ చెందిన కార్యకర్తలు గుమిగూడారు. షర్మిలను నిర్బంధించిన హై సెక్యూరిటీ వార్డు ముందు మేమంతా నిలబడ్డాం. ఎవరెవరో వస్తున్నారు. లోపలికి

వెళుతున్నారు. లోపలున్న పోలీసులు మాటిమాటికీ తలుపులు తీసి బయటకు తొంగిచూసి మళ్ళీ తలుపులు మూస్తున్నారు. 70 సంవత్సరాలు పైబడిన మైరాపెయిబీకీ చెందిన వృద్ధ స్త్రీలు చాలా ఓపికగా వార్డు మెట్ల మీద కూర్చుని షర్మిల కోసం ఎదురుచస్తున్నారు. 78 సంవత్సరాల కె.తరుణి అనే స్త్రీమాట్లాడుతూ అప్పని (AFSPA) రద్దుచెయ్యలి. షర్మిలని కాపాడాలి. ఈ దుర్మార్గ చట్టాన్ని రద్దుచెయ్యకపోతే మేము ఈసారి ఎవ్వరికీ ఓట్లు వెయ్యం. జరిగింది చాలు అంటూ దృఢమైన కంఠంతో చెప్పినపుడు ఆ వయస్సులో ఆమె కన్పరిచిన నిబద్ధత మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది. అలాంటి స్త్రీలు చాలామంది అక్కడ గుమిగూడి వున్నారు. వారంతా షర్మిల విడుదల కోసం 88 రోజులుగా రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు.

మాలో ఉత్కంఠ పెరగసాగింది. అక్కడ కూర్చునే చోటు లేదు.నిలబడ్డంకూడాకష్టంగానేవుంది.సమయంగడుస్తున్నకొద్దీ కర్ఫ్యూ భతం భయపెట్టసాగింది. నాలుగున్నర అయ్యింది. నిలబడి నిలబడి కాళ్ళు పీకుతున్నాయి. ఇంకో అరగంటలో కర్ఫ్యూ పెట్టేస్తారు. వార్డు లోపల్నుంచి పోలీసులు బయటకు వస్తున్నారు. తొంగి చూస్తున్నారు. గ్రిల్ చప్పుడైనప్పుడల్లా మా కళ్ళు గ్రిల్‌కు అతుక్కు పోతున్నాయి. ఐదు కావస్తోంది. మేము షర్మిలను చూడలేమేమో ననే సందేహం పీడించసాగింది. సరిగ్గా ఆ సమయంలో ఎవరో బిగ్గరగా ప్రకటించారు. ఆ రోజు కర్ఫ్యూ 7 గంటల వరకు పొడిగించారని. హమ్మయ్య అనుకుంటూ మళ్ళీ గ్రిల్ గేట్ చప్పుడు కోసం ఎదురుచడసాగాం.

5.30 అయ్యింది. వార్డు రూమ్ తెరుచుకుంది. గ్రిల్ గేట్ కూడా తెరిచారు. సూర్యుడు అస్తమించేవేళ, ఆ చిరుచీకట్లో వెలుగురేఖలా షర్మిల చాలా మెల్లగా అడుగులేస్తూ వస్తూ కనబడింది. తెల్లగా పాలిపోయిన ముఖం. ఒక్కసారిగా వెలిగిన మీడియా ఫ్లాష్‌లైట్లను తట్టుకోలేక కళ్ళు మూసుకున్న షర్మిల కనబడింది. సంప్రదాయ మణిపురి దుస్తుల్లో, భుజాల చుట్టు గులాబీ రంగు షాల్ చుట్టుకుని కళ్ళు మూసుకుని బయటకు వచ్చిన షర్మిలనుచూసి కొంతమంది చప్పట్లు కొట్టారు. కొంతమంది స్త్రీలు బిగ్గరగా ఏడ్చారు.

'మైరాపెయిబి' స్త్రీలు ఆమెకు రక్షణ కవచంలా ఏర్పడి, ఆమెను పసిపాపను పొదువుకున్నట్లు తమ చేతుల్లోకి తీసుకున్నారు. షర్మిల నిలబడడానికి కూడా శక్తి లేక తల వాల్చేస్తూ ఆ స్త్రీల చేతుల ఆసరాతో నడిచి మీడియా ముందుకొచ్చింది. నేను షర్మిలా పక్కనే వుండడంతో ఆమెను అతిదగ్గరగా పరిశీలించగలిగాను. తొమ్మిది సంవత్సరాలుగా నోటితో ఘనపదార్థం ఏమీ తినకుండా మణిపూరి ప్రజల కోసం, AFSPA 1958 చట్టం రద్దు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న 35 సంవత్సరాల షర్మిలను అతిసమీపంగా చూసినపుడు నా గుండె ఉద్వేగంతో వేగంగా కొట్టుకోవడంతో పాటు, ఆమె వజ్రసంకల్పం ముందు నా శిరస్సు వాలిపోయింది. పోరాట పటిమ, దృఢ సంకల్పం, ప్రాణాన్ని తృణప్రాయంగా వదిలేయడానికి సిద్ధంగా వున్న ఆ స్త్రీ మూర్తి ముందుమోకరిల్లాలన్పించింది.

చాలా బలహీనంగా వున్నప్పటికీ ఆమె ఏ వాహనంలోను ఎక్కకుండా, స్త్రీల సమూహంతో కలిసి అక్కడికి 500 మీటర్ల దరంలో వున్న నిరాహారదీక్షా శిబిరం వరకు నడవసాగింది. ఆమె వెంట మేమంతా, దాదాపు 70 మంది వివిధ భాషలకు చెందిన జర్నలిస్ట్‌లం నడిచాం. శిబిరం దగ్గరకు చేరగానే ఆమె కోసం పరుపు సిద్ధం చేసి కూర్చోబెట్టారు. ఆమె కాళ్ళకు మేజోళ్ళు తొడిగారు. ఆమె మెడను నిలపలేకపోతోంది. ఆమె శరీరం అటు ఇటు ఊగిపోతోంది. అక్కడ చేరిన అసంఖ్యాక మీడియా పదేపదే కోరగా ఆమె గళం విప్పింది. మెత్తగా, పీలగా ఆమె గొంతు విన్పించసాగింది. "నాకోసం ఎదురుచస్తున్న మీ అందరికి కృతజ్ఞతలు తెలపడానికి నాదగ్గర సరైనమాటలు లేవు. మీరు నాకు మరింత ధైర్యాన్నిచ్చారు. మణిపూర్ నుండి AFSPA 1958 చట్టాన్ని రద్దుచేసేవరకు నేను ఈ నిరాహారదీక్షని కొనసాగించదలిచాను. ఇమాస్ తో కలిసి ప్రచారాన్ని సాగిస్తానని చెప్పింది. షర్మిల మెల్లగా, స్పష్టంగా మాట్లాడుతూ ''ప్రపంచమంతా అంతర్జాతీయ మహిళాదినాన్ని జరుపుకుంటుంటే, ఇక్కడ మణిపూర్‌లో సారవంతమైన భూములతో, అపారమైన వనరులతో, చల్లటి గాలులు వీచే చోట, ప్రజలు ఎంతో స్నేహసుహృద్భావాలతో పల్కరించే చోట స్త్రీలు ఎదుర్కొంటున్న కష్టాలు, అణిచివేత బయట ప్రపంచానికి తెలియవు.'' అన్నప్పుడు అందరి కళ్ళు చెమ్మగిల్లాయి. ''నేను మాఅమ్మకు ఇచ్చిన మాట ప్రకారం ఆమెను చూడకుండానే ఇంతకాలం వున్నాను. తనకి చాలా అనారోగ్యం చేసినపుడు కూడా చూడాలంటే భయమన్పించింది. నువ్వెందుకు వచ్చావు. నన్నుచూడొద్దన్నాను కదా అంటుందేమోనని ఆమె వున్న ఆసుపత్రి వార్డు ముందు ఎంతోసేపు తచ్చాడాను.'' అన్నప్పుడు

అక్కడున్న స్త్రీలు దు:ఖాన్ని ఆపుకోలేక బోరున ఏడ్చారు. మాఅందరి కళ్ళల్లోను నీళ్ళు చిప్పిల్లాయి.

మెల్లగా చీకటి చిక్కనౌతోంది. షర్మిల ఆ రాత్రి శిబిరంలోనే గడపటానికి సిద్ధపడింది. కర్ఫ్యూ పెట్టే టైమ్ దగ్గరపడడంతో మేము కూడా వెళ్ళడానికి లేచాం. అప్పుడే అంజులిక షర్మిలకి సమీపంగా వెళ్ళి ఎంతోమంది మహిళా జర్నలిస్ట్‌లు ఆమె చూడడానికి వచ్చారని, వారంతా శిబిరంలో వున్నారని చెప్పగానే ''మీ అందరినీ చూడ్డం నాకు సంతోషంగా వుంది. ఇక్కడి స్త్రీలకు ఏం జరుగుతోందో మీరు దేశం నలుమూలలా తెలియచేస్తారని నాకు ఆశగా వుంది. మీ సోదరుడి హత్య నాకు చాలా దుఃఖాన్ని కలిగించింది'' అన్నప్పుడు అంజులిక బాధతో సతమతమైంది.

మేమంతా శిబిరంలోంచి బయటపడి బస్సులో ఎక్కాం. అందరం మౌనంగా కూర్చున్నాం. కాసేపట్లో కర్ఫ్యూ పెట్టేస్తారు. బస్సు రిట్రీట్ హౌస్ దగ్గర ఆగింది. యథాప్రకారం చీకటి. చిమ్మచీకట్లో కురుస్తున్న వెన్నెల. నాకురూమ్‌లోకి వెళ్ళాలన్పించలేదు. కాసేపు వెన్నెల్లో కూర్చుని కిచెన్ వేపు వెళ్ళాను. లిల్లీతో మాట్లాడాలన్పించింది. ''లిల్లీ! మేము రేపు పొద్దున్నే వెళ్ళిపోతున్నాం'' అన్నాను. మళ్ళీ రమ్మని, వచ్చినపుడు తనని కలవమని చెప్పింది. నీకు ఇక్కడి పనికి జీతమెంత ఇస్తారని అడిగితే 1200 ఇస్తారని, రెండుపూటలా తిండి పెడతారని చెబుతూ తనకి తొమ్మిది మంది చెల్లెళ్ళున్నారని, తండ్రి చనిపోయాడని, తన తల్లి కూడా వంట పనిచేస్తుందని చెప్పింది. ఇక్కడ ఫ్యామిలీ ప్లానింగ్ పాటించరా అంటే సిగ్గుపడుతూలేదని చెప్పింది. సోసో కూడా అదే మాట అంది. ఆడవాళ్ళు పిల్లల్ని కంటూ పోవాల్సిందే. ఫ్యామిలీప్లానింగ్ లేదు అంది.చూడ్డానికి చిన్నగా వుంటుంది సోసో. ఆమెకు నలుగురు పిల్లలు. డిన్నర్ చేసి లిల్లీకి బై చెప్పి నా రూమ్‌కు వచ్చేసాను.

8వ తేదీ ఉదయం సోసో ఇంటికెళ్ళాం. మళ్ళీ తప్పక రమ్మని కోరింది సోసో. ఆమెకు గుడ్‌బై చెప్పి, మళ్ళీ ఇంకో కప్పు టీ తాగి అక్కడి నుండి బయటపడ్డాం. పదిగంటలకి ఎయిర్‌పోర్ట్‌కెళ్ళాలి. అన్నీ సర్దుకుని అందరికీ వీడ్కోలు చెప్పి రూమ్‌లో ఏకాంతంగా కూర్చున్నపుడు ఇంఫాల్ అనుభవాలు ఒకటొకటే కళ్ళముందు కదలాడాయి. దుమ్ము కొట్టుకుపోయిన నగరం, చీకట్లో మగ్గుతున్న నగరం, కర్ఫ్యు పడగనీడ కింద కుములుతున్న మణిపూర్ రాష్ట్ర రాజధాని. ఇపుడిపుడే ''అభివృద్ధి'' నామజపం వినబడుతోందని, వందలాది కుటుంబాలు ఎయిర్‌పోర్ట్ విస్తరణలో నిర్వాసితమౌతున్నయని బబ్లూ చెప్పాడు. మీ హైదరాబాదు చాలా 'అభివృద్ధి' చెందిందటగా అని వ్యంగ్యంగా అడిగినపుడు షంషాబాద్ చుట్టుపక్కల కనుమరుగైన వందలాది గ్రామాలు, పూల, పండ్ల తోటలు గుర్తొచ్చాయి. చెట్టుకొకరుగా, పుట్టకొకరుగా చెదిరిపోయిన ఆ ఊళ్ళ ప్రజలు గుర్తొచ్చారు. ఆంధ్రదేశంలో ''అభివృద్ధి'' పేరు మీద ఏర్పాటవుతున్న ''సెజ్''ల గురించి జీవనాధారాల్ని కోల్పోతున్న ప్రజల్ని గురించి మేం చెప్పాం.

ఇంఫాల్‌లో వున్న నాలుగురోజుల్లో ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. ప్రజలెదుర్కొంటున్న కష్టాలు, స్త్రీలు పడుతున్న అగచాట్లు చూసాం. ఎక్కడ చూసినా ఏదో పనిచేస్తూ స్త్రీలు. ఇమా మార్కెట్‌లో వ్యాపారాలు చేసే వేలాది స్త్రీలు ర్ఫ్యూ వేళ ఉరుకులు పరుగులతో దుకాణాలు మూసేసి, కిక్కిరిసిన వాహనాల్లో ఇళ్ళకు చేరే స్త్రీలు. అన్నింటినీ మించి జీప్సీ వాహనాల్లో ప్రజల మీద తుపాకులెక్కుపెట్టి ఊరకుక్కల్లా వీధులెంబడి తిరిగే సైన్యం, అస్సామ్ రైఫిల్స్. ఎక్కడచూసినా సైన్యమే. 23 లక్షల మణిపూర్ జనాభాకి 53000 సాయుధ సైనికులు వున్నారంటే పరిస్థితి ఎంత భీతావహంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఎప్పుడెవరిని చంపేస్తారో, ఎవరిని అరెస్ట్ చేస్తారో? ఎవరిని మాయం చేస్తారో తెలియదు. మహిళల మీద అత్యాచారాలకి అంతేలేదు.AFSPA 1958 చట్టం సైన్యానికిచ్చిన పాశవిక అధికారాలతో ఎవరినైనా కాల్చొచ్చు. ఎవరినైనా చంపొచ్చు. ఊళ్ళకుఊళ్ళు తగలబెట్టొచ్చు. ఇవన్నీ కేవలం అనుమానంతోనే చెయ్యొచ్చు. తిరుగుబాటుదారులున్నారనే నెపంతో రోజుకి కనీసం రెండు హత్యలు జరుగుతున్నాయి. చిన్నవయస్సులో భర్తల్ని పోగొట్టుకుంటున్న స్త్రీలు. అయిదారుగురు పిల్లల్తో అనాథలవుతున్న స్త్రీలు. ఉపాధి లేక ఉద్యోగాల్లేక డ్రగ్స్‌కు, తాగుడుకు బానిసలౌతున్న యువత. నిరాశానిస్పృహలతో తిరుగుబాటుదారుల్లో చేరుతున్న యువకులు. 60 సంవత్సరాలుగా అగ్నిగుండంలా మండుతున్న మణిపూర్. 40 ఎత్నిక్ కమ్యూనిటీలున్న మణిపూర్‌లో 38 తిరుగుబాటు గ్రూపులున్నాయి. ప్రభుత్వాల మీద తిరుగుబాటు చెయ్యడంతో పాటు వాటిల్లో వాటికి ఎన్నో విభేదాలు, పరస్పర దాడులు.

'గ్రేస్ షట్‌సంగ్' నాగా వుమన్స్ యూనియన్ ప్రెసిడెంట్ మాటల్లో చెప్పాలంటే సాంప్రదాయకంగా మణిపురి స్త్రీలు

శాంతిప్రేమికులు. శాంతి స్థాపనకోసం స్త్రీలు పాటుపడుతున్నారు. మణిపురి స్త్రీలు తీవ్ర వివక్ష నెదుర్కొంటున్నారు. వారికి ఎలాంటి హక్కులూలేవు. నిర్ణయధికారం లేదు. సైన్యం చేతిలో అత్యాచారాలు, కాల్పుల్లో భర్తల మరణాలు, కుటుంబాల్ని కాపాడుకోవాల్సిన పెనుభారాలు. మణిపురి స్త్రీలు రెండువిధాలా సమస్యల్ని ఎదుర్కోవాలి. సైన్యం అత్యాచారాలొకవైపు, తిరుగుబాటుదారుల అవసరాలు తీర్చాల్సి రావడం మరోవేపు. అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్న మణిపూరి స్త్రీలు. మొత్తం మణిపూర్ కోసం ప్రాణాలను అడ్డం పెట్టి పోరాడుతున్న షర్మిల. నగ్నప్రదర్శనలాంటి తీవ్ర నిర్ణయలతో సైన్యం అకృత్యాలను అడ్డుకునే ప్రయత్నం చేసిన మైరాఫెయిబి కార్యకర్తల సాహసం. AFSPA లాంటి బలమైన చట్టం పెట్టుకుని కూడా మణిపూర్ ప్రభుత్వం మణిపూరి ప్రజల్ని కాపాడలేకపోతోంది. ప్రతిరోజూ సైన్యం కాల్పుల్లోనో, రెబెల్ తిరుగుబాటుదారుల చర్యలవల్లో నలుగురో, ఐదుగురో చనిపోవాల్సిందే. మేము ఇంఫాల్‌లో వున్నపుడే 13 ఏళ్ళ కుర్రాడు కాల్పుల్లో చనిపోయిన విషాద సంఘటన జరిగింది. మణిపూర్‌లో మామూలు పరిస్థితులు నెలకొనే ఆశ అయితే కనుచపుమేరలో కనబడ్డం లేదు. AFSPA చట్టం రద్దు అవ్వడం గానీ, ఇరాం షర్మిల ఆమరణ నిరాహారదీక్ష ముగియడం అనేవి కల్లోమాటగానే అన్పిస్తున్నాయి.

ఇంతటి విషాదకర పరిస్థితుల్లో ఎంతో హాయిగా నవ్వే మణిపురి స్త్రీలను చూస్తే ఎంత ఆశ్చర్యంగా వుంటుందో. హృద్యంగా నవ్వే చిత్ర, అంజులిక, సోసో, లిలీ, ఆరంభమ్. వీళ్ళ హాయైన నవ్వు చసి చిత్రతో అన్నాన్నేను ''magic of Manipur Is your smile''. మీరింత చక్కగా ఎలా నవ్వగలుగుతున్నారు. అంటే సమాధానంగా మరింత నవ్వే దొరికింది.

ఇంఫాల్ విమానాశ్రయంలో కూర్చుని గౌహతి వెళ్ళే విమానం ఎక్కేవరకు ఇవే ఆలోచనలు. మణిపూర్‌లో త్వరలో శాంతియుత పరిస్థితులు నెలకొనాలనే ఆశాభావంతో నేను తిరుగు ప్రయణమయ్యాను. మనస్సునిండా మణిపూర్ విషాదం నిండిపోవడం వల్ల అక్కడి నుండి అస్సాం, మేఘాలయ వెళ్ళిన అనుభవాలను ప్రస్తుతం రాయలేకపోతున్నాను. మేఘాలయలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన, ప్రపంచంలోనే తడిప్రాంతంగా రెండుసార్లు గిన్నిస్ బుక్ కెక్కిన చిరపుంజిలో, చెక్కలబళ్ళమీద ప్లాస్టిక్ బిందెలతో కిలోమీటర్ల దూరం నీళ్ళ కోసం వెతుకుతున్న స్త్రీలని మాత్రం నేనెప్పటికీ మర్చిపోలేను. నిత్యవర్షం కురుస్తుందని చెప్పుకునే చోట నీళ్ళకోసం వెదుకులాట నిజంగా ఎంత విషాదం. మరెప్పుడైనా ఈ విషయాల గురించి రాస్తాను.

మొత్తానికి, మహిళా జర్నలిస్టుల మూడురోజుల కాన్ఫరెన్సు, మణిపూర్ మహిళల విషాద జీవితాల్లోని మల్లెపువ్వులాంటి నవ్వులు, ఇరాం షర్మిల ఉక్కులాంటి పట్టుదల, మైరాపెయిబీ మాతృమూర్తుల మడమ తిప్పని పోరుబాట ఇవన్నీ నామీద గొప్ప ముద్రవేసాయి. తిరిగివచ్చాక కూడా మనసంతా ముసురుపట్టినట్లే వుంది. కర్ఫ్యూలో వున్నట్లే అన్పిస్తోంది. చీకటి గుయ్యారంలో మగ్గుతున్నట్లే వుంది. మణిపూరి మహిళల మందహాసం గుర్తొచ్చినపుడు మాత్రం చాలా హాయిగా, రిలాక్స్‌డ్‌గా అన్పిస్తోంది. నాతోపాటు నాలుగురోజులు గడిపిన మిత్రులందరూ పదేపదే గుర్తొచ్చినా, ఎక్కువగా నా మనసులో చోటు సంపాదించుకున్నది మాత్రం సమీర. షిల్లాంగ్‌లోని రెయిన్‌బో హోటల్ యజమాని హరీష్‌ని గురించి తప్పక రాయాలి. అతను చాలా ఎమోషనల్‌గా నన్ను కదిలించాడు. నేను అచ్చం తన చెల్లెలులాగా వున్నానని, కళ్ళు, ముక్కుతీరు తన చెల్లెల్ని గుర్తుకు తెస్తోందని చెబుతూ మా గురించి వివరాలు అడిగి, హెల్ప్‌లైన్ గురించి విని ఆశ్చర్యపోయాడు. ఇక్కడ ఎవరూ అలా పని చెయ్యరని, తనకి లా ఫామ్ పెట్టాలని వుందని మీరు హెల్ప్ చేస్తరా అని అడిగాడు. మాకు గౌహతిలో చౌకగా మూడు నక్షత్రాల హోటల్‌లోరూమ్‌లు మాట్లాడి పెట్టాడు. ఎనిమిది మందిమి రెండు రూమ్‌ల్లో సర్దుకోగలిగాం. హైదరాబాద్ వచ్చాక రెండు సార్లుమాట్లాడాడు. 'బెహేన్! ఆప్ ఫిర్ కబ్ ఆరే షిల్లాంగ్' అంటూ ఆప్యాయంగా మాట్లాడే హరీష్,గౌహతిలో నన్ను తన ఆటోలో కూర్చోబెట్టుకుని,కామాఖ్య కొండ మీదకి,బ్రహ్మపుత్ర నది మీదకి పడవ శికారుకి తీసుకెళ్ళి,నగరమన్తా తిప్పి చూపిన్చి భద్రమ్గా నన్ను ఎయిర్ పోర్ట్ లో దిన్చిన ఆటో వాలా కమల్ భాయ్, వందలకొద్దీ మా ఫోటోలు, వీడియోలు తీసి, ఫోటోలు మాకివ్వాలి సుమా అని అడిగినపుడు ఖర్చవుతుందని అల్లరిగా నవ్వే సమీర, ఖర్చంటే డబ్బులేనా ఏంటి అని వెక్కిరించే సమీర నాకు చాలా నచ్చింది.

మంజరి కూతురుగా కంటే బోలెడన్ని పుస్తకాలు చదివిన, సరదాగా, సంబరంగా నవ్వే సమీర మా గ్రూప్‌లో వుండడం మాకు గొప్ప ఎసెట్.

కథ

# ఊపిరి

**రమాదేవి బాలబోయిన**

**6281216735**



"పొద్దున ఎప్పుడనగా పోయిండు పిలగాడు. సందేళజొచ్చె జాడపత్తా లేదాయే" అనుకుంటూ నుదుటికి చేయి ఆనించుకుని వాకిట్లకొచ్చి తొంగి చూసి, మళ్ళీ ఇంటి అరుగుమీద కూలబడింది గౌరమ్మ. ఆమెకు కడుపుతీపితో ఊపిరాడట్లేదు. కొడుకు కోసం ప్రాణం కొట్టుకుంటోంది.

"ఏందే గౌరా.. గట్ల గాయి గాయి గాబడితివి. ఏమైందే పొల్ల" పక్క గుడిసెలో ఉండే చిన్నత్త సూరమ్మ ఆరా తీస్తూ అడిగింది.

'పోయి పోయి గీ పుండాకోరు ముసల్దాని కంట్లెనే పడాల్నా నేను. పోరడింటికి రాలేదంటే, వాడవాడంతా టమకేస్తది' అని ఒపక్క గులుక్కుంటూనే, "ఆ...ఏంలేదత్తా! మన ఎంకటేశుగానికి టౌనుకాలేజీల కాలర్ షిప్పు పైసలు ఇత్తరంటే పొద్దున్నే టౌనుకు పోయిండు. వాళ్ళ దోస్తుగాని ఇంట్ల ఏదో పబోజనమట, వాళ్ళు ఒక్కతీరుగ రమ్మన్నరట, అటు పోతనన్నడు. చేతిల పైసలుండంగ పోవుడెందుకురా.. సక్కగ ఇంటికే రా అన్నగని రానేరాలేదత్త" అన్నది గౌరి. చిటికెడు నిజానికి చారెడు అబద్ధపు రంగులు పూసి, అందమైన ఓ కథ అల్లేసింది గౌరమ్మ. "ఏపాటి పైసలస్తయే" బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది సూరమ్మ.

"నాలుగువెయ్యిలట అత్త"

"అబ్బో చాలా పైసలే బిడ్డా, వాడొత్తాంటె ఎవడన్న గుంజకపోయిండా ఏమన్నా"

"పైసలే లేకుంటమాయె అత్తా! వాడింటికి సక్కగా వస్తే సాలు" ఈసారి నిజంగా కొడుకేదైనా తప్పు పని చేసిండా, అనుమానం పీడించ సాగింది గౌరమ్మను.

బాగా చీకట్లు ముసురుకున్నాయి. బాటలో ఎవరి రాకపోకలు కూడా లేవు. చూడబోతే నడిజాము కొట్టిందేమో. గౌరమ్మ గుండెలు అతివేగంగా కొట్టుకోసాగాయి. "ఏమే గౌరా! పోరడొచ్చిండానే..."

"రాలేదత్తా" ఏదో అనుమానం పురుగు గౌరమ్మ తలలో తొలచడం మొదలు పెట్టింది. గౌరమ్మ గొంతు భయంతో పిడుచక కట్టుకపోతాంది. ఇంతలో ఓ పోలీసు జీపు వచ్చి గౌరమ్మ ఇంటిముందు ఆగింది. టకటకామని బూట్లు చప్పుడు చేస్తూ ఇద్దరు కానిస్టేబుళ్లు సరాసరి ఇంట్లోకి వచ్చేసారు. ఇంట్లో మూలమూలన వెదికి,

"ఎక్కడా ఏమీ కనబడలేదు సార్" అని అంటూ జీపెక్కి వెళ్ళిపోయారు.

"చూడమ్మా! నీ కొడుకు ఒక దొంగతనం చేసి పారిపోయాడు. ఒకవేళ ఇంటికి వస్తే, మాకు తెలియపరచండి. లేకపోతే కఠిన శిక్ష పడుతుంది." అన్న వాళ్ళ మాటలే ఆమె చెవుల్లో గింగిరులు కొట్టసాగాయి.

"ఆ బాధలో ఏమే గౌరా!పొల్లగాడు అచ్చిండానే" అత్త మాటలు ఇపుడు ఊరటగా అనిపిస్తున్నాయి. అసలేం జరిగిందో తెలియాలంటే ఇరవై యేళ్ళ క్రితం జరిగిన సంఘటన వైపు వెళ్ళాల్సిందే.

★ ★ ★

ఆరోజు గౌరమ్మ, శంకరిల పెళ్ళి. తాటాకుల పందిరికి మామిడి తోరణాలు కట్టి, రంగులకాయితాలు అంటించారు. వాకిట్ల దూదేకుల పెద్దసాయిబు తాషా చప్పుళ్ళకు అందరూ తామే ప్రభుదేవానో, మైకేల్ జాక్సనో అన్నంతగా శరీరాలను

కదిలిస్తూ నాట్యం చేస్తున్నారు.

శంకరి కూడా స్టెప్పులేస్తున్నడు. "నువ్వు కూడా పోయ్యే గౌరూ" కొందరు ఆడోళ్ళు గౌరమ్మను నెడుతున్నారు. శంకరితో పాటు ఆడమని. ఆ క్షణం గౌరమ్మ కు తెలియదు. జీవితమంతా శంకరి ఆడిచ్చినట్టు ఆడే బొమ్మలా మారిపోతానని.

పదహారు రోజుల పండుగనాడు గొంతికలదాక కల్లు దాగి, గౌరి తల్లిగారితరుపువాళ్ళని నానా మాటలు తిట్టి, గౌరమ్మను తన ఇంటికి లాక్కొచ్చి పడేసాడు.

"నువ్వు ఇయ్యాల్టి నుంచి నేను సచ్చేదాక ఆ ఇంటి గడపతొక్కద్దు. నా పరువుగాపాడాలే. నామీదొట్టే" అంటూ ఒట్టు పెట్టించుకుని మొసలి కన్నీళ్ళు కార్చాడు శంకరి. ఆ ఒట్టుకు కట్టుబడి, భర్తకూ, కొడుకుకీ మాటరానీ రాకుండా ఇంటిపరువు కాపాడుతోంది గౌరమ్మ.

భర్త, తాగినా, తిరిగినా ఎదురుతిరిగ లేదు. తాగి తాగి కడుపులో పుండ్లు పుట్టి చనిపోయినా ఏడవలేదు.

కానీ, ఇప్పుడు కొడుకు కూడా తండ్రి బాట పట్టి చెడ్డవాడిగా మారాడని తెలిసి, ఏండ్ల తరబడి దాచుకున్న బాధ అగ్నిపర్వతం పగిలినట్లు పలిగింది.

ఆలోచనల నడుమ, అటక మీద ఏదో కదులుతున్నట్లు కనబడేసరికి లాంతరు పెట్టి చూసింది. ఇంకెవరు? తన కొడుకే అక్కడ. ఇంక గౌరమ్మ ఓర్చుకోలేక పోయింది.

నిలదీసింది. తన ఇష్టమైనట్లుగా బతుకుతాననీ ఖరాఖండిగా మాట్లాడాడు కొడుకు. అంతే. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. అదే రాత్రి పోలీస్టేషనుకి తీసుకెళ్ళారు.

"ఏమే గౌరా! ఏమి చేస్తానవే..."

"ఊపిరి పీల్చుకుంటాన అత్తా" అని కాస్త ఆనందంగానే చెప్పింది.

**కవిత**

# అయినా



**నస్రీన్ ఖాన్**
**హైదరాబాద్ 9618683519**

ఎడారుల్లో నడుస్తున్నా
గమ్యానికి చేరే ఆశ ఉండాలి

అశాంతి వీపున కత్తియై వెంటాడుతున్నా
శాంతికోసమే మార్గాలు వెతకాలి

అడుగడుగునా దుఃఖాలు పలకరిస్తున్నా
సంతోషాలను పలవరించే సంసిద్ధత కావాలి

నిరాశలెన్ని ఉప్పెనలై మీద పడినా
వంచని వెన్నుతో విల్లును చేయాలి

చితికిన పాదాలనైనా
కత్తులు మొలిచిన నేలపై మోపాలి

మాటల ముళ్ళు దేహాన్ని తూట్లు పొడిచినా
నెత్తుటి నవ్వుల సుమాలే వికసించాలి

ఏ క్షణమైనా దాటిపోయేది కాలం
భూబంతిలో డోలాయమానమీ జీవితం

అయినా
చిక్కబట్టుకోవాలి
పగిలే గుండెను ఓదార్చుకోవాలి

మరణం ముద్దాడేవరకు
బతికే తీరాలి

వ్యాసం

# ఇక మారాల్సింది మహిళలే..!



నాంపల్లి సుజాత
9848059893

మహిళలపై హింస మానవ హక్కుల ఉల్లంఘన కాదా..! మానవుల్లో మహిళలు ఉండనే ఉండరా, ఉండకూడదా..!?

నేడు స్త్రీలపై హింస ఎంత సామాన్యమై పోయిందంటే, వారిని వివస్త్రలను చేసి వీధుల్లో ఊరేగించి, సామూహిక హత్యాచారాలకు, సజీవ దహనాలకు పాల్పడినా చీమ కుట్టినట్టన్నా లేకపాయే ఏలికలకు. కనీస భద్రత నన్నా కల్పించాలన్న ఇంగిత జ్ఞానం కరువాయే పాలకులకు.!

పుణ్యభూమి నాదేశం, ధర్మ భూమి నా దేశం, కర్మభూమి నాదేశం అంటూ కల్ల బొల్లి పదాలను వల్లిస్తూ వాటినే తిరిగేయడం తప్పా ఆకాశంలో సగం, అవనిలో సగం, అసలు మానవజాతి మనుగడకే ప్రాణం పోసిన మగువలకు ఏదీ రక్షణ ఈ దేశాన..! ఎక్కడా భద్రత..!? సమాజం వాళ్ళ పట్ల ఎంతటి మహోపకారం చేస్తున్నారో కళ్ళారా చూస్తున్నాం కదా.!?

ఇక్కడ మహిళలని సాటి మనుషులుగా గుర్తించి, గౌరవించే అలవాటే కానరాదు, యుగాల నుంచీ అదే హింస ఒకరు ఆమెను పందెంలో పెట్టి ఓడిపోతే, మరొకరు ఆమెను వీధుల్లో తిరిగి అమ్ముకుంటే, ఇంకొకరు నిండు చూలాలని చూడకుండా అడవుల్లోకి వదిలేసిన ఘటనలు ఎన్నెన్నో. అలాంటివి చెప్పుకుంటూ పోతే అదే సగం చరిత్ర అవుద్ది.!! స్త్రీల పట్ల నాటి నుంచి నేటిదాకా అమానవీయం, అమానుషం, అసమానత్వం, లెక్కలేని తనం. వీళ్లు మమ్మల్నేం చేస్తారు లే అనే చిన్న చూపు. లెక్కించకున్నా సరే హింసించడం మాని, వాళ్ల మానాన వాళ్ళని బతకనిచ్చినా ఎంతో మేలే.

రోజు రోజుకి సమాజం తిరోగమనం వైపే అడుగులు వేస్తుంది.!

ఆదిమ యుగాల్లో కూడా ఇంతటి హింస, రాక్షసత్వం రాజ్యమేలినట్టు కానరాదు. అడవుల్లోని క్రూర మృగాలు జంతువులు కూడా ఇంతటి హేయమైన పనులకు పాల్పడవు. జాతి జాతంతా కలిసే ఉంటాయి.

ఇప్పటికీ స్త్రీల పట్ల ఎన్నెన్నో రూపాల్లో ఎంతెంతో దౌర్జన్యం దోపిడీ హింస చెలరేగినా, దాంట్లోంచి ఒకటో రెండో వెలుగులోకి వచ్చినవే ఇవ్వి..! అంతటి దుఃఖాలని, ఆ అవమానాలని, ఆ అగ్నిపర్వతాలని లోలోపలే దాచుకుని, బాధని దిగమింగి క్రుంగి, కుమిలి కృషించిపోయేవాల్లే ఎక్కువ.

అన్నట్టు మనది అనాదిగా పురుషాధిక్య సనాతన సమాజం కదా! ఇక్కడ స్త్రీలను రెండవ జాతి పౌరులుగానే పరిగణిస్తూ సెకండరీ ప్రియారిటి మాత్రమే ఇస్తారు. చట్టాలూ ఉంటాయి, అందరికీ స్వేచ్ఛ సమానత్వం రాజ్యాంగ భద్రత అన్ని ఉన్నట్టే ఉంటాయి, కానీ వాటిని అమలుపరిచే తీరులోనే వేరువేరు,వాటిని ప్రశ్నించడానికి నువ్వెవరు నేనెవరని!? ప్రశ్నించినా పట్టించుకునేది ఎవరని!?

నేటికీ మహిళలని ఒక వస్తువుగా, ఒక పిల్లల్ని కని పెంచే యంత్రంగా, ఒక స్థిరాస్తిగా,ఒక బానిసగా చూస్తున్న సమాజం మనదే, పైగా అదీ, ఇదీ రావే, పోవే అంటూ సంభోదిస్తూ చిన్న చూపు చూడడం ఇక్కడ పరిపాటే.! అది అందరిలోనూ జీర్ణించుకున్న ముచ్చటే.

ఇంకా ఆశ్చర్యపడవలసిన విషయమేమిటంటే స్త్రీలను కొట్టడం, తిట్టడం, తన్నడం వాళ్ళ చెప్పు చేతుల్లో ఉంచుకోవడం అనాదిగా వస్తున్న పురా సంస్కృతి. భార్యని భర్త చెయ్యి చేసుకోవడం అనేది వాళ్ళ జన్మ హక్కుగా భావించే జాతి మనదే. చూసే వాళ్లకు అది పెద్ద తప్పుగా కూడా అనిపించదు. ఒకవేళ చూసినా ఎవ్వరూ నోరు మెదపరు.

ఎక్కడో ఒకతనైతే తన భార్య తల నరికి, ఆ తలతో ఊరంతా ఊరేగి చివరికి పోలీస్ స్టేషన్ కి వెళ్లి లొంగిపోతాడు. ఏముందీ నాలుగు రోజుల లోపల ఉండి తర్వాత జబర్దస్త్ గా తిరిగి రావచ్చని ధీమా ఆ ముఖంలో.! ఆ ఘటనలో ఆమె నేరమే చేసిందో, మరేదో తెలియదు గానీ, అంతటి శాడిజం, అంతటి క్రూరత్వం లోలోన నెలకొనే ఉంది.

అలనాడెప్పుడో ఉన్నారని చెప్పబడుతున్న రాక్షసుల్లో కూడా వినలేదు అంతటి దుష్కర్యల్ని.

నేడు స్త్రీల భద్రత వారి ఉనికి ప్రమాదంలోనే ఉంది. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మొద్దో భయపడే స్థితి. ఓ మహాను భావుడు అన్నట్టు వీళ్ళు ఒంటరిగా నడి రాత్రి నడిరోడ్డు మీద నడిచిపోతేనే స్వాతంత్రం వచ్చినట్టు అనీ, నడి రాతిరి కాదు కదా, పట్టపగలే నడిరోడ్డు మీద నడిచిపోలేని దౌర్భాగ్యపు రోజులు దాపరించినయ్..!

మహిళలకు హక్కులు ఉంటాయని, మానవ హక్కులు వీరికి వర్తిస్తాయని ఎందుకు మరిచిపోతారో సాటి మనుషులు

గృహహింస చట్టం, వరకట్న నిషేధ చట్టం, ఫోక్స్ చట్టం, నిర్భయ చట్టం, దిశా చట్టం ఇంకా ఎన్నో ఉంటాయి.. అవన్నీ ఎందుకు అక్కరకు రాని నాలుక గీక్కునే పుల్లల్లా వెలుగొందుతూనే ఉంటాయి. వాటిని సక్రమంగా అమలుపరిచే చిత్తశుద్ధి ఎవరికి ఉంటుందనీ !?

మహిళల రక్షణ విషయంలో ప్రజల ఆలోచనా విధానం మారాలి మన దేశానికి స్వాతంత్రం సిద్ధించి డెబ్బైఆరు వసంతాలు పూర్తి చేసుకున్నా.. స్త్రీలపై దాడులు హత్యలు అత్యాచారాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి..!

హక్కులంటే వ్యక్తుల యొక్క హేతుబద్ధమైన కోరికలే కదా, వాటికి చట్టపరమైన రక్షణ కలిగి ఉంటా యంటారు ఏదీ..!? ప్రపంచంలో మనది విశిష్ట, విశేష అతి పెద్ద రాజ్యాంగమూ అయితే ఏమిటి, వాటిలోని చట్టాలు ఇంకెవరికీ చుట్టాలు కాకుండా చిత్తశుద్ధితో అమలు పరచబడాలి కదా..!

ఆర్టికల్ 21జీవించే హక్కు, ఆర్టికల్ 14 చట్టం ముందు అందరూ సమానులే.. ఏవీ మహిళల వ్యక్తి గౌరవం, ప్రాథమిక హక్కులు కాల రాయబడుతున్నా, యదేచ్ఛగా బాహాటంగా ఉల్లంఘించబడుతున్నా.. ఏ చట్టము మరే న్యాయము సుమోటోగా రావు వాటిని అరికట్టవు.. ఎందుకంటే వాళ్లు పితృస్వామ్య వ్యవస్థలో ద్వితీయ శ్రేణి పౌరులు కదా..!

ఇంకెన్నాళ్లని ఈ హింసను మౌనంగా భరిస్తారు..!? ఎవరినని ఏమి లాభం, ఇప్పుడు మారాల్సింది మహిళలే.. వాళ్లని దహిస్తున్న నిప్పుని వాళ్లే విసిరేసుకోవాలి, వాళ్లను వాళ్ళే రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఇప్పుడు వాళ్ల పైనే ఉంది. వీళ్లు జన్మనిస్తేనే సమాజానికి పుట్టగతి..!

ఇక తక్షణ కర్తవ్యం వీళ్ళని కనడమా మానడమా ఆలోచించాల్సిందే..!!

కథ

# ఊహల మడుగు



వనజ తాతినేని
9985981666

అందంగా కనబడాలనే శ్రద్ధలో పావొంతు ప్రాజెక్ట్ పై పెడితే అనుకున్న విధంగా కంప్లీటైపోయేది.. మెత్తగా వ్యంగ్యంగా చురక అంటించాను నా ఇగోను సాటిస్ఫై చేసుకుంటూ.

మాతృభాష తెలుగైన వాళ్ళిద్దరూ ఉలిక్కిపడ్డారు. టీమ్ మేనేజర్ నైన నావైపు గుచ్చిగుచ్చి చూసారు. మాస్క్ తో పాటు గాగుల్స్ పెట్టుకుని వుండటం మూలంగా ముఖం పోల్చుకోవటానికి కష్టంగా వుంది. టీమ్ అంతా ఇతర దేశీయులవడం వల్ల తమకు అంటించిన చురక వేరెవరికీ అర్థం కాదని వూపిరి పీల్చుకుని యింకా జీర్ణం కాని అవమానం దాచుకుని బయటకు నడిచారిద్దరూ.

షిట్.. అంటూ భవిత కార్ డోర్ పై ప్రతాపం చూపిస్తే సబిత డ్రైవింగ్ సీట్లో కూర్చుని సీట్ బెల్ట్ వేసుకుంటూ... ఎవరే.. ఆ మహాతల్లి! ఎంతమాట అనేసింది? పేరు చూస్తే ఓ.ఆర్. విన్సెంట్. మాట్లాడిందేమో అచ్చుతెలుగు. సంవత్సరం కాలంలో ముఖం చూసిందే లేదు, కోవిడ్ మహమ్మారి మూలంగా రిమోట్ వర్క్ తోనే కాలం గడిచిపోయింది మరి.

''బయటకు వస్తుందిగా కాసేపు వెయిట్ చేయి ఆ మొహం చూద్దాం యెవరో యేమిటో'' అంది భవిత.

ఎదురుగా స్క్రీన్ పై కనబడుతున్న సి సి కెమెరా క్లిప్పింగ్స్ లో వారి హావభావాలను గమనిస్తూ వినబడని వారి మాటలను ఊహించుకుంటూ నవ్వుకున్నాను. ఇప్పుడు కాదు. కొన్నాళ్ళు వారివురుని వీలైనంత వుడికించి అప్పుడు నన్ను నేను వారికి చూపించుకోవాలి. వారు నన్ను చూసి ఆశ్చర్యపోవాలి. ఎన్నిసార్లు నన్నూ నా అవకరాలను గేలిచేశారు గాయపరిచారు. ఈవేళ వారికన్నా ఉన్నత స్థానంలో వుంది. అందంలో తెలివి తేటలలో స్టైల్ లో వారి కన్నా మిన్నగా వుంది. వారి కళ్ళల్లో ఆశ్చర్యాన్ని ఈర్ష్యను చూస్తే కానీ తన మనసు నెమ్మదిపడదు.

పుట్టుకతోనే వారికి బోలెడు డబ్బుంది.ఏమైనా డబ్బున్న వాళ్ళకు అహం ఎక్కువుంటుంది. బహుశా వారికి కావాల్సినవన్నీ అమరడం వల్లనేమో నాకేంటి అన్న తలబిరుసు వుంది. అసంతృప్తులు కూడా ఎక్కువే. ఇతరులను ఎద్దేవా చేయడమూ ఎక్కువే. వారు ఆత్మవిశ్వాసాన్ని కొనుక్కొంటారో తొడుక్కుంటారో కానీ ఎల్లప్పుడూ ఆకర్షణీయంగా కనబడతారు. మరి, నాలో దాగివున్న ఉక్రోషం ఆత్మనూన్యత మాత్రం వారినెలాగైనా దెబ్బతీయాలని ఎదురు చూడదూ!.

ఆశ్చర్యపోతున్న వారితో యిలా మాట్లాడాలని రిహార్సల్ వేసుకుంటున్నాను. మిమ్మలను కానీ మరికొందరిని కానీ ఇంప్రెస్ చేయాలని నేను అతిగా ప్రవర్తించిందీ లేదు. ఐడెంటిఫికేషన్ కోసం ప్రాకులాడింది లేదు. మీలా ఎన్నడూ ఐడెంటీక్రైసిస్ తో అలమటించిపోలేదు. నా శారీరక లోపాన్ని అధిగమించాలని అందరూ నాపట్ల చూపుతున్న అసహ్యాన్ని జాలిని సానుభూతిని దాటి నన్ను నేను నిలబెట్టుకోవటానికి ఆత్మవిశ్వాసంతో చేసిన ప్రయత్నమే నా ఎదుగుదల. డబ్బుంటే ముక్కొంకర మూతొంకర కన్నొంకరలు కాలొంకర అన్నీ సరిచేసుకోవచ్చు కానీ ఆత్మనూన్యత భావాన్ని పోగొట్టేది మాత్రం మనపై మనకున్న నమ్మకం విశ్వాసం కఠోరశ్రమే. అదృష్టమేమి నా తలుపు తట్టలేదు. ఎన్నోసార్లు నిరాశ ఎదురైనా పట్టుదలతో మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి ఈ స్థానాన్ని చేరుకోగల్గానని వారికి చెప్పాలని తహతహలాడుతున్నాను.

అంతే కాదు.. మీలాంటి అహంకారి మీ స్నేహితురాలి కూతురుకు తల్లినైనాను.ఆమె భర్తకు యిల్లాలినయ్యానని గర్వంగా చెప్పాలని ఉబలాటపడుతున్నాను. అప్పటికిగానీ

నామనసు నా ఊహల ప్రపంచం రెండూ శాంతించవు మరి. అవమానించబడ్డ మనసుకు ఊహలైనా శాంతి కల్గించేవే కదా! అదొక వరం కూడా కదా!

★ ★ ★

నాకు వారివి చిరపరిచితమైన ముఖాలు. నాకన్నా సంవత్సరం ముందు పుట్టిన నాకు అక్కైన రసజ్ఞ కు స్నేహితురాళ్ళిద్దరూ. వారు ముగ్గురూ అందంలోనూ చదువులు ఆటలు కళలూ అన్నింటిలోనూ ఆరితేరిన వారూనూ. తనేమో పుట్టినప్పడే గ్రహణం మొర్రితో మెల్లకన్నుతో అవకరంగా పుట్టినదీనూ. దానికి తోడు చిట్టి చిట్టి అడుగులేస్తున్న సంవత్సరంన్నర వయస్సులో హై ఫీవర్ లో వచ్చిన పోలియో వల్ల కాలు చచ్చుబడిపోయి నడక కష్టమై మంచానికి అతుక్కుపోయినదీనూ. అదృష్టం దురదృష్టం పక్కపక్కనే వున్నాయంటే యిదే కాబోలు. ఇద్దరి బిడ్డలలో వొకరలా వొకరిలా అని కళ్ళొత్తుకునే అమ్మ. ఏమి పట్టనట్టు నిర్వికారంగా చూసే నాన్న. నిర్విరామంగా మనసులో కుళ్ళుకుంటూ ఏడ్చుకుంటూ నేను. మొదటసారిగా నాకెదురైన అవమానం అక్క నుండే. తను వేసుకున్న అందమైన ఖరీదైన లేస్ గౌన్ లాంటిదే తనకూ కావాలని పేచీ పెట్టింది. "నీకెందుకే అంత మంచి గౌన్, నువ్వు నాలాగా లేచి నడిస్తేనూ డాన్స్ చేయగలిగితేనూ అలాంటి గౌన్ కావాలి కానీ" అంది. వెక్కి వెక్కి ఏడ్చింది తను. అమ్మ అక్కను మందలించి ఆ గౌన్ గుచ్చుకుంటుంది, నీ గౌను చూడు మెత్తగా హాయిగా వుంటుందని బుజ్జగించే ప్రయత్నం చేసింది.

అందరి చూపులలో కనబడే జాలి సానుభూతితో పాటు ఏ ముసుగు లేకుండా అసహ్యం కూడా కనబడింది అక్క స్నేహితురాళ్ళిద్దరి మాటల్లోనే కదా! అమ్మో.. రసజ్ఞా మీ యింటికైతే వస్తాము కానీ నీ రూమ్ లోకి రాము. అక్కడ మీ చెల్లిని చూస్తే మాకు అసహ్యం అనడం వినబడింది తనకు. అసహ్యం అనేది ఒకటి ఉంటుందని పరిచయమైనదపుడే.

నాన్నకీ అమ్మకు కూడా అక్క రసజ్ఞ అంటేనే ఎక్కువిష్టం. నేనంటేనే ఎవరికీ గిట్టదు. రాను రాను అమ్మంటే కూడా ద్వేషం ఏర్పడింది నాకు. సంగీతం చెప్పడానికి వచ్చే టీచరు దగ్గర తను కూడా సంగీతం నేర్చుకుంటానని అడిగింది. ఇపుడొద్దు తర్వాత నేర్చుకొందువు అనేది అమ్మ. టీచరు చెబుతుంటే వింటూ నేర్చుకుంటూ రాగాలాపన చేయబోయేది. ఉహూ.. అక్క పాడినంత మధురంగా వుండేదికాదు నేనెప్పుడు నోరు మూస్తానోనని ఎదురుచూసేవారు ఇంట్లో వారందరూ. నా ప్రయత్నం చూసి అమ్మ జాలిపడేది అక్క నవ్వుకునేది. అక్కనూ అమ్మనూ చంపేయాలనేంత ద్వేషం నాలో. నా పన్నెండేళ్ళ వయసప్పుడు ఆ ప్రయత్నం కూడా చేసాను. నాకిచ్చిన మందులన్నింటిని వొలిచి అక్క తాగే జ్యూస్ గ్లాస్ లో కలిపేసాను. ఎలాగైతేనేం అమ్మ కనిపెట్టింది. వెంటనే అక్కను పై రూమ్ లోకి నన్ను తన రూమ్ లోకి మార్చేసింది. నన్ను సైక్రియాటిస్ట్ దగ్గరకూ తిప్పుతుంటే అక్క టాలెంట్ షో లకు ఛానల్స్ లో వచ్చే సింగింగ్ ప్రోగ్రామ్స్ కు తిప్పుతూ వుండేవారు.

అమ్మ చెప్పే చదువు నాన్న కొని తెచ్చి యిచ్చిన పుస్తకాలు చదవడం అపుడపుడు హాస్పిటల్ కు చెకప్ లకు వెళ్ళడం నాలుగైదు ప్లాస్టిక్ సర్జరీల మధ్య ఇరవై యేళ్ళు వచ్చేసాయి. "ఎందుకంత డబ్బు ఖర్చు పెట్టడం ఇంట్లోనేగా పడి వుండేది" అంది అక్క వొకసారి. "నువ్వు సంపాదించిన డబ్బు ఖర్చు పెట్టడంలేదు నోర్మూయ్" అని కసిరింది అమ్మ.గాయంపై గాయం. మళ్ళీ మళ్ళీ అయితే అవి మానేదెలా? దుఃఖం కూడా రావడం లేదు మనసు బరువు తీర్చుకోవడానికి.

సర్జరీ తర్వాత అక్క కన్నా అందంగా వున్నానని మురిసిపోయేది అమ్మ. నాన్న సన్నగా నవ్వుకునేవాడు. నాకు తెలుసు అదంతా అబద్ధమని. ముఖమైతే చూడటానికి కాస్త బాగైంది కానీ నడకను ఏ నెమలి నుండి అడిగి ఎరువు తెచ్చుకోనూ. నా నడకలూ నాట్యాలూ అన్నీ ఊహలలోనే. శరీర గాయాలు మంచి కండ పట్టే ఆహారాలు తీసుకుంటే త్వరగా మానిపోతాయి మానసిక గాయాలెలా మానతాయి.

అయ్యో! నేననుకోలేదు అంత బాధ కల్గుతుందని అని అక్క సన్నాయి నొక్కులు. ఇతరుల అవకరాలను హేళన చేసే రాక్షసత్వం అదో పైశాచిక ఆనందం. వారికి ఎలాంటి శిక్షలూ వుండవా డాక్టర్ అని అడిగింది తను.

ఈ అమ్మాయికి శారీరక అవకరం కన్నా మానసిక బాధ యెక్కువుంది. మీరు తనపై చాలా శ్రద్ధ చూపాలి. ఆర్ట్ థెరపీ, మ్యూజిక్ థెరపీ బాగా పనిచేస్తాయి అని చెప్పారు సైక్రియాటిస్ట్. ఆ సలహా పుణ్యాన నా లోకంలో సంగీతం చదువూ మరలా ప్రవేశించాయి. నాలుగేళ్ళు గడిచాయి.

ఇపుడు అవసరమైతే మూడు భాషల్లో అవలీలగా మాట్లాడగలను. మేథ్స్ అర్ధమవక అందరూ వెర్రిముఖాలు వేసుకుని చూస్తుంటే నేను చిటికెలో సాల్వ్ చేయగలను. అక్క కన్నా శ్రావ్యంగా పాడగలను. కొద్దికొద్దిగా నా ఆత్మవిశ్వాసం పెరుగుతున్నట్టుంది. అమ్మ కళ్ళల్లో ఆనందపుతడి. నాన్న నా కోసం మరింత శ్రద్ధ తీసుకుంటున్నారు. నేను శరీరాన్ని మరిన్ని కోతలకు సంసిద్ధం చేసుకుంటున్నాను. ఆ నడకలు నెమలి నడక హంస నడక కాకపోయినా మంద గమన, సామజవరగమన అనిపించుకోవడం కోసమైనా నడక యజ్ఞం చేయాలి. ఏనుగు వెళుతుంటే కుక్కలు మొరగడం అంటారే అలాగున అప్పుడప్పుడూ ఇలా ఊహించుకుంటేనే వెర్రి ఆనందం.

★ ★ ★

చేతిలో నలుగుతున్న ఫోటో. అమ్మ చిన్నగా దగ్గింది మెలుకువ కల్గిస్తూ. చేతిలో ఫోటో ఆల్బమ్ తను అమ్మకు ఇచ్చేసిందో ఆమే నానుండి లాక్కుందో! ఫోటోలలో దృశ్యాలు కళ్లల్లో మెదులుతున్నాయి. మనసు ఈర్ష్యతో మండుతుంది. సవన్నా రివర్ స్ట్రీట్, అమెరికాలో జార్జియా రాష్ట్రంలో పర్యాటక స్థలం. ముఖ్యంగా నవదంపతుల విహారయాత్రకు అనువైన ఆకర్షణీయమైన విడిది. విద్యుత్ ధగధగలతో మెరిసిపోతున్న భవనాలను ఆనుకుని ఇరుకు విశాలం కాని ఒక మాదిరి రహదారులతో అనేకమంది జంటల కలలనూ సరదాలను నిజం చేస్తూ వారి సంతోషాన్ని మరింత వెదజల్లుతుంది. అర్ధరాత్రి పౌర్ణమి వెన్నెలకు తోడు దీపాల వెలుగులో ఆ నదీ తీరం యేదో మార్మికలోకాన్ని మరిపిస్తుంది. అక్క చేతిలో చెయ్యేసి నడుస్తున్న అందమైన ఇండో అమెరికన్ యువకుడు రోహిత్ విన్సెంట్.ఆ రాత్రి నదిలో నౌకా విహారం. మరి కొన్నాళ్ళు సవన్నా సముద్ర తీరంలో విడిది. అనేక యాంగిల్స్ లో దంపతుల విహారాన్ని సంతోషాన్ని బంధించుకున్న బోలెడు ఫోటోలు. అవి నిండిన ఆల్బమ్ లు. ఆమెకు ఆ అదృష్టం ఎలా పట్టిందంటే..

అక్క రసజ్ఞ పాటలు పాడి అలరించడానికి సాంస్కృతిక సంస్థల ఆహ్వానం అందుకుని అమెరికా దేశానికి వెళ్ళింది. అక్కడ అక్కను చూసి ఆమె పాటను విని రోహిత్ విన్సెంట్ మనసు పడ్డాడు. అక్క పెట్టిన షరతులకు ఇష్టపడి పెద్దలతో వచ్చి పెళ్ళి చేసుకుని తీసుకువెళ్ళాడు. పాడితే జీవిత గతులైన మారాలి అంటే ఇదే కాబోలు. దానికి అదృష్టం అందలం యెక్కిస్తే దీన్ని విధి వెక్కిరించిందని నాన్నతో చెబుతూ అమ్మ పదేపదే కళ్ళుతుడుచుకుంది. చందమామ కథలో చదివినట్టు రాకుమారుడు రెక్కల గుర్రం ఎక్కి రానూ వచ్చాడు అక్కను తీసుకువెళ్ళాడు. అక్క కళ్ళల్లో మరింత గర్వం. చూసావా నన్ను అని వెక్కిరించినట్లు వుండేవి చూపులు.

రోహిత్ విన్సెంట్ మొదటిసారి యింటికి వచ్చినపుడు చక్కగా పరిచయం చేసుకున్నాడు.భేషజాలు లేకుండా హాయిగా మాట్లాడాడు. తనపక్కన నాన్న తరువాత అంత దగ్గరగా కూర్చున్న వాళ్ళెవరూ లేరు. స్నేహంగా అనిపించాడు. ఉత్సాహంగా అనిపించింది. ఇంకొకసారి యింటికి వచ్చేటప్పటికి అతని చూపుల్లో ఏదో తేడా. అతని కళ్ళల్లో నా పట్ల జాలి సానుభూతి. భరించలేకపోయాను. మంచి రిహాబిటేషన్ సెంటర్ లో జాయిన్ చేయించండి అని నాన్నకు సూచిస్తున్నాడు. ఏమనుకుంటున్నాడతను? నేనొక శారీరక అవకరం మనిషిని మాత్రమే కాదు మానసిక రోగిని కూడా అనా!? అక్క నాగురించి విపరీతం చేసి చెప్పి వుంటుందనిపించింది. ప్రపంచాన్ని కూడా నాతో కలవనీయకుండా దూరం చేస్తుంది ఆ రాక్షసి. కోపంతో పళ్ళు నూరుకుంటూ పుస్తకాలు విసిరికొట్టాను. వాళ్ళు వెళుతున్నప్పుడు ముభావంగా వీడ్కోలు చెప్పానంతే.

ఏడాది గడిచింది అమ్మ అమ్మమ్మ అయింది. వారి ఉదయసాయంత్రాలు మనుమరాలి ముచ్చట్లతో వెలిగిపోతున్నాయి. నా గదిలో మదిలో చీకటే యెంత పారద్రోలినా అంగుళం కూడా కదలడం లేదు. అందుకే నేనూ

కళ్ళేలు లేని గుర్రాన్నెక్కి ఆశల ఆకాశంలో విహరిస్తున్నాను. మనుషులు ఒకరి జీవితాన్ని మరొకరు ఎన్నటికీ జీవించలేరు అన్న సంగతి నాకు అర్థమైనట్టూ అందరికీ అర్థమైతే బాగుండును. ఇతరులతో పోల్చి ముఖ్యంగా అక్కతో పోల్చి నన్ను బాధ పెట్టడం న్యాయంగా లేదు మరి.

అక్క హనీమూన్ ట్రిప్ ఫోటోలలో నేను మర్చిపోలేని ఒక ఫోటో. బిఫోర్ ఐ డై వాల్. సవన్నా రివర్స్ స్ట్రీట్ లో రహదారి పక్కనే వున్న పెద్ద బ్లాక్ బోర్డుపై వారి వారి విష్ లను వ్రాసుకుంటున్న టూరిస్ట్ లు. అక్క కూడా ఏదో రాస్తుంది. వెనుకనుండి నవ్వుతూ చూస్తున్న ఆమె భర్త. కాసేపు అక్క స్థానంలో నేనే అక్కడ వున్నట్టు ఊహించుకుంటాను... నేనైతే అక్కడ ఏం రాస్తానో?? ఉహూ.. యెవరూ ఊహించలేరు. నా మనసులో వుందే.. అదే రాక్షసత్వం. ఊహలు శాంతినిస్తాయి. అక్క నిజమే. అక్క స్నేహితురాళ్ళు నిజమే. మరి నేను??. అందరికీ అన్నీ నిజాలు కావు. కొన్ని భ్రాంతులు. భ్రాంతులలోనుండి బయటపడాలి. వాస్తవాలను అంగీకరించాలి. అప్పుడే నీకు మందులవసరం వుండదంటాడు సైక్రియాటిస్ట్. అయినా ఊహలలో కూడా శాంతిగా బతకనివ్వరా నన్ను. ఊహలకు కూడా రేషన్ పెడతారా? అమ్మ నాన్న పెట్టిన పేరును సార్థకం చేసుకునే భాగ్యం కూడా లేదన్నమాట.

★ ★ ★

ఢామ్మ్ అని ట్రాన్స్ఫార్మర్ పేలిన చప్పుడు. మధ్యాహ్నం ముసురులో విశ్రాంతి తీసుకుంటున్న కాకులన్నీ చెల్లాచెదురైపోయాయి.వర్షం సన్నగా కురుస్తున్న శబ్దం. ఎలక్ట్రిక్ బేట్ ఘాతాన్ని తప్పించుకున్న మశకమొకటి నా చుట్టూ తిరుగుతూ సంగీతాన్ని వినిపిస్తుంది.కాటేయడానికి ముందు ఆ మాత్రం వీనులవిందునందించాలని. అది కేరళలో విహారం చేస్తున్న జికా వైరస్ దోమైతే బాగుండును.ఆ వైరస్ మూలంగా మెదడు చచ్చుబడిపోయి యీ అనంతమైన ఆలోచనలకు శాశ్వతమైన ముగింపు వస్తుందని విరక్తి నిండిన ఆశ. లేదా ప్రపంచాన్నంతా కబళిస్తున్న కోవిడ్ కూడా నాపై జాలి చూపడం లేదు. ఆలోచనల్లో వుండగానే కళుక్కుమన్న నొప్పి కడుపులో పొడిచింది. అపరాధభావం వేలసార్లకు మరొకసారి తోడై స్వరం బలహీనమై అమ్మా అన్నానో లేదో ఏంటమ్మా అంటూ చేతిలో పనొదిలేసి అరక్షణంలో నా ముందుంది అమ్మ. తలొంచుకొని రెండు వేళ్ళు చూపించాను.నాలో మెదిలిన భావాలను పసిగట్టి చుబుకం పైకెత్తి నుదుటున చిన్న ముద్దిచ్చింది. అదొక టానిక్ అని అమ్మకు బాగా తెలిసిందీ మధ్య. మంచంపై వున్న నన్ను రెండు చేతులతో వాటేసుకుని పైకి లేపి కొంచం కష్టంగా నడుస్తూ బెడ్ పాన్ అమర్చిన చెక్కకుర్చీలో కూర్చోబెట్టి.. పేంట్ బొందు విప్పి కిందకి లాగి టిష్యూ పేపర్ అందుకుంది. మనిషనే అక్కుపక్షి రెక్కలు తెగి లోలోపల నిలువెల్లా రక్తమోడుతుంటే కాస్త వెన్నుతట్టి ఓదార్పునిచ్చి చిన్న ఊతమిస్తుంటే ఎంత బాగుంటుంది. అందరూ అమ్మలా ప్రేమను మాత్రమే పంచడం ఎంత బాగుంటుంది. అపుడు నా ఆలోచనలింత భయంకరంగా వుండవని అదో ఆశ. ఇతరుల చేతుల్లో వున్న బొమ్మను లాక్కోవాలనే ఉక్రోషపు ఆకాంక్ష మాత్రం నాకెందుకూ!?

వాట్సాప్ లో అక్క పిలుస్తుంది. అమ్మ ఫోన్ తీసుకుని “ఇంకాసేపు నీ కూతురుతో ముచ్చట్లు చెప్పుకో. నేను నా కూతురును చూసుకోవాలి” అని ఫోన్ పెట్టేసింది. ఎదురుగా బెడ్ పై చెల్లాచెదురుగా పడి వున్న అనేక పుస్తకాలనూ గాలికి రెపరెపలాడుతున్న పేజీలను చూస్తూ అనుకున్నాను. నాలాంటి శారీరక అవకరాలున్న మనుషులకు లోపలా బయటా ఎన్ని గాథలుంటాయి ఎన్నెన్ని గాయాలవుతాయి. కొన్ని కలలుంటాయి ఊహలుంటాయి. మరికొన్ని భ్రాంతులుంటాయి. వాటన్నింటిని రికార్డ్ చేద్దామని.. అంతే!

అన్నట్టు నా పేరు ఊహ. కొదవేమున్నది నాలో ఈ మాత్రం నవరసాల ఊహలకు విహారాలకూ, ఊహల మడుగున మునిగి తేలుతున్న నేనూ మనిషి నేగా, గాయపడిన మనసు నేగా.


★ ★ ★

ఈస్తటిక్_సెన్స్ కథాసంపుటిలో స్వీయ ప్రచురణ.

# వ్యవస్థను ప్రశ్నించే స్త్రీల కథలు



బి వి ఎన్ స్వామి
కరీంనగర్, 9247817732




మనిషి సంఘజీవి. సంఘంలో పుట్టి, పెరిగి, మరణించడం మాములు విషయం. ఇందుకు భిన్నంగా ఒంటరిగా బతకడం అనేది ప్రత్యేకం. సమూహం దూరంగా వెలివేస్తేనో, సమూహం కాదనుకుని వ్యక్తి తనకు తానుగా దూరంగా వెళ్ళిపోతేనో ఒంటరి అవుతాడు. తనకు నచ్చని సమూహంలో వున్నా, నచ్చిన విధంగా జీవించలేకున్నా కూడా మనిషి ఒంటరిగా మిగిలిపోతాడు. ఇది పరాయికరణ. దీన్ని భరించలేక ఇల్లు, కుటుంబం మరియు ఇతర సామూహికతల నుండి బయటకు రావడం జరుగుతుంది. అలా వచ్చిన స్త్రీలపై సమాజంలో చులకన భావం, చిన్న చూపు వుంటుంది. ఒంటరి మహిళ అనగానే భర్త చనిపోయిన స్త్రీలుగానో, విడాకులు తీసుకున్న స్త్రీలుగానో భావిస్తారు. వీరితో పాటు అనేక కారణాల వలన కూడా స్త్రీలు కుటుంబ వ్యవస్థ నుంచి బయటకు వచ్చి ఆత్మగౌరవంతో బాధ్యాయుతంగా జీవిస్తూ, తమను తాము నిలబెట్టుకున్న మహిళల జీవితగాధలే ఈ "స్వయంసిద్ధ" కథలు.

ఒంటరితనం, ఏకాంతం రెండూ వేరు వేరు. కోరి ఎంచుకోవడం ఏకాంతం. అది వ్యక్తిగతం. అది ఏకాకితనం. సమాజానికి వ్యక్తికి మధ్య వున్న లంకెను తెంపి మనిషిని ఒంటరి చేస్తుంది. దానికి కారణాలు అనేకం. సమాజంలో ఒంటరితనం మెల్లమెల్లగా వ్యాపిస్తున్నది. ఒంటరితనం అనేది సమాజంలో రెండు ధోరణలను మన ముందుంచింది. ఒకటి ఒంటరితనం ఐచ్ఛికంగా కోరుకోవడం, అనివార్యంగా ఒంటరిగా మిగిలిపోవడం రెండవది. "సోలో బతికే సో బెటర్" అని అనుకున్నవాళ్లను వదిలి వేసి, అనివార్యంగా ఒంటరి అయిన మహిళలను అర్థం చేసుకోవాలి. వారి పట్ల జాలి చూపడం కన్నా చేయూతనివ్వడం మిన్న. ఇందుకు భిన్నంగా వివక్ష, ఆపేక్ష, ఉపేక్షలు కనబడుతున్నాయి. ఈ తీరును చాలా కథలు కత్తి కాటుకు గురిచేసాయి. ఈ సంకలనంలోని కథలు సారాంశంలో ఒకటిగా వున్నా, భాష, సంస్కృతి, ప్రాంతం, కులం, వర్గం, మతం వంటి అస్థిత్వాల వల్ల కథల్లోకి భిన్నత్వం వచ్చింది. ఇల్లు, కుటుంబం నుంచి బయటకు వచ్చి కొందరు, అందులోనే ఉండి కొందరు

వ్యవస్థను ప్రశ్నించారు. స్త్రీ పాత్రల నిరసన ముందు పురుష పాత్రలు వెలవెల పోతాయి. సామాజికంగా, శారీరకంగా బలవంతుడైన పురుషుడు స్త్రీ ఎదుగుదలను సహించలేక కుంగుబాటుకు గురై హింసను ఆశ్రయిస్తాడు. అందుకే గృహ హింస చోటు చేసుకుంటుంది. సాంప్రదాయక కుటుంబ వ్యవస్థ 'సర్దుబాటు' అనే లక్షణాన్ని స్త్రీలకు మాత్రమే పరిమితం చేసింది. పురుషులకు ఈ విషయంలో వెసులుబాటు ఉంది. సర్దుబాటు కాలేక వేర్పాటును కోరుకునే మహిళ పై సమాజం శారీరక, మానసిక, సాంస్కృతిక, లైంగిక ఆధిపత్యాన్ని పురుషుల ద్వారా కొంత, మానవ సంబంధాల ద్వారా మరికొంత అమలు పరుస్తుంది. ఇలాంటి పితృస్వామ్య వ్యవస్థ పై గురిపెట్టిన బాణాలు 'స్వయంసిద్ధ' కథలుగా రూపొందాయి.

సర్దుబాటైనా,వేర్పాటైనాహింసలేకుండా ఉంటేఆనందమే. అనివార్యపు సర్దుబాటులో హింస తాండవించినట్లే, అందులోంచి బయటకు వచ్చిన వేర్పాటుపై కూడా హింస తాండవిస్తుంది. అఇంటిపని చేస్తూ ఇంటిపై ఆధారపడటం, ఇంటికి జీవనాదారంగా మారడం రెండూ కూడా సమాన విలువలుగా వున్నప్పుడు వెలుగులు పూస్తాయి. ఈ పునాదులపైనే ఉత్పత్తి, పునరుత్పత్తి శక్తులు కలిగిన మహిళలకు విలువ పెరుగుతుంది. ఈ మార్పును అభిలాషించిన కథలు ఇందులో ఉన్నాయి. అందుకోసం పోరాడిన, బతుకును ఫణంగా పెట్టిన, మార్పుకు దారులు వేసిన పాత్రలు కథల్లో తారస పడతాయి. కథకులు తమ అనుభవాలనో, ఇతరుల అనుభవాలనో కుర్చీ కథీకరించారు. ఈ క్రమంలో పెళ్లి అనే చట్రంలోనే వుండి వివాహ వ్యవస్థను దోషిగా నిలబెట్టిన కథలు, అందులోనుంచి బయటకు వచ్చి వ్యవస్థను దోషిగా చూపిన కథలున్నాయి. భర్త చనిపోయిన మహిళ, భర్త నుంచి విడిపోయిన మహిళ, ఆలస్యంగా విడాకులు తీసుకున్నందుకు పశ్చాత్తాపపడే మహిళ, ఉద్యోగం చేస్తూ హాస్టళ్లలో ఉంటున్న మహిళ లాంటి రకరకాలైన మహిళల జీవన గాథలు ఈ సంకలనంలో ఉన్నాయి. 'స్వయం ప్రకాశిత' కథలో సాహిత్య రంగంలో ఒంటరి మహిళకు ఎదురయ్యే అనుభవాలు ఉన్నాయి. జీవితాంతం భర్తతో కష్టపడ్డ మహిళ చరమాకంలో విడిపోయిన మహిళ కథ (సింగిల్ వుమెన్) ఉంది. 'అనగనగా ఓ అమ్మాయి' కథలో స్త్రీ పాత్ర 'బావా! పూజ తప్పిస్తే నీకు రొమాన్స్ చేయడానికి టైం ఉంటుందా' అని పొగరుగా అడుగుతుంది కథానాయిక. దానికి ప్రతిస్పందనగా అతనిచే అత్యాచారానికి ఆమె గురి అవుతుంది. కె.విశ్వనాథ్ "ఆపద్బాంధవుడు" సినిమా సంఘటనను ఇది తలపిస్తుంది. ఇలాంటి సన్నివేశాలు మరికొన్ని కథల్లోకూడా మనకు కనిపిస్తాయి.

స్త్రీ, పురుషులిద్దరిలో కుటుంబం ఎవరికి దగ్గరగా వుంటుందో "రత్తమ్మ" కథ ద్వారా తెలుస్తుంది. రత్తమ్మను చేసుకున్న రామారావు కాలం చేసినా, ఆమె బతుకులో రాజేసిన నిప్పుల కుంపటి ఆరాలేదు. అది ఎప్పటికి ఆరని చితి మంటనే. తనను కాదన్న రామారావును క్షమించిన గొప్ప వ్యక్తిత్వం ఆమెది. ఆ ఆత్మగౌరవం ముందు అన్ని దిగదుడుపే. సంకలనం మొత్తంలో ఈ సూత్రం విస్తరించింది. ఏ కారణం వల్ల గానీ, ఒంటరిగా మిగిలిన మహిళ పట్ల కథల్లో ఎక్కడా సామాజిక సానుభూతి కానీ, స్వయం ప్రకటిత బాధ కానీ కనబడదు. విడాకులు విరామంగా భావించిన తీరు "ఓ విరామం" కథలో కనబడుతుంది. భర్తకు దూరంగా ఉండి, అతని అసంబద్ధ చేష్టలను, వాటివల్ల తాను పడ్డ క్షోభను ఏకరువు పెడుతూ 'మనం లాయర్ గారింట్లో కలుద్దాం' అని తన వాయిస్ ను ఆడియో ద్వారా వినిపిస్తుంది. ఈ టెక్నాలజీని వాడడం వల్ల కథ చక్కగా కుదిరింది. సంకలనంలో శిల్పపరంగా ఎన్నదగిన కథలు కొన్ని వున్నాయి. డ్రమటిక్ ముగింపులు, సినిమాటిక్ మలుపులు కథల్లో తారసపడతాయి. ఆడపిల్లను ఎదగనీయండి. గుండెలమీద భారంగా చూడకండి అంటూ "భూదేవి" కథ చెబుతుంది. తనను తాను కోల్పోయే బంధాలలో వుండటం కన్న తనతో తానుండగలిగే ఒంటరి ప్రయాణమే మేలు అంటుంది "నా ఇల్లు" కథలోని పాత్ర. కోర్టు తీర్పుల వల్ల సామాజిక గమనంలో మార్పులు వస్తున్నాయి. కోర్టు తీర్పులను ఉటంకిస్తూ ట్రాన్స్ జెండర్ వెతలను చెప్పిన కథ "పురోగమనం". సింగిల్ పేరెంట్ ను సమర్థిస్తూ స్కూలు రికార్డుల్లో తండ్రి పేరు రావడాన్ని అంగీకరించని సన్నివేశం "తిరుగుబాటు" కథలో కనబడుతుంది. ఈ కథలో కోర్టు కేసును ఉదహరిస్తూ చర్చ వుంది. ఇలా ఒంటరి మహిళల జీవన పాఠ్యాలను నలభై రీతులుగా మనముందు వుంచింది ఈ కథా సంకలనం.

ఈ కథాసంకలనంలో విస్తృత శ్రేణుల్లో స్త్రీలు కూడా వున్నారు. ఉనికి కోసం వారు గొంతెత్తినపుడు, స్త్రీవాదం

వారిని గొంతుక అయింది. స్త్రీవాదపు తొలివెలుగుల్లో స్త్రీల సమస్యలనేకం చర్చకు వచ్చాయి. క్రమక్రమంగా స్త్రీలలో కూడా అనేక బేధాలు తలెత్తడం వల్ల స్త్రీవాదం పలు ధోరణులను జన్మనిచ్చింది. అలాంటి ధోరణులకు ప్రాతినిధ్యం వహించే కథలు కూడా ఇందులో వున్నాయి. ఒంటరి మహిళల్లో ఉన్న అస్తిత్వ భేదాలన్నిటిని విస్తృత ప్రాతిపదికన, ఒక విశాల దృక్పథంలో ఈ సంకలనం చోటిచ్చింది. ఈ సంకలనంలోకి రాని స్త్రీల జీవితాలు కూడా కొన్ని వున్నాయి. సమస్త రంగాలను అతలాకుతలం చేయగల రాజకీయ రంగంలో కూడా అనేకమంది మహిళలు ప్రభావిత పాత్రలను పోషిస్తున్నారు. మహిళా రిజర్వేషను కోసం ఉద్యమాలు జరుగుతున్నాయి. ఆ రంగం నుండి కూడా కథలు వస్తే సంకలనానికి సంపూర్ణత వుంటుందన్నది నా అభిప్రాయం.

ఒంటరి మహిళలు అనగానే చులకన, గయ్యాళి, శత్రుపూరిత వైఖరి లాంటి భావాలుంటాయి. వాటిని పూర్వ పక్షం చేస్తూ ఆత్మగౌరవం కలవారిగా, స్వయంసిద్ధలు సమాజం చూడాలనే ఎరుకతో సంకలనం కలిగిస్తుంది. నేటి కాలాన సింగిల్ పేరెంట్ వ్యవస్థ వేళ్లూనుకుని వున్నది. ఆ వ్యవస్థకు ఆధార భూమిక అవసరం. దానికోసం ఒక సామాజిక ఆమోదాన్ని, ప్రజాస్వామిక పద్ధతిలో తయారుచేయడానికి ఇలాంటి ప్రయత్నాలు దోహదపడతాయి. సంపాదకులిద్దరూ ఒంటరి మహిళలే. ఆ జీవితంలోని వివక్ష, అణచివేత, అవహేళన, చిన్నచూపు మొదలగు వ్యవహారములు వీరికి ఎక్కువ తెలుసు. ఆ అనుభవం పుస్తక తయారికీ ఉపకరించింది. ఇరువురి దృక్పథాలు వేరైనా , కథల ఎంపికలో సమన్వయాన్ని సాధించారు. వీరికి కథలు పంపిన రచయితలు కూడా వీరికి సహకరించారు. పుస్తకానికి కూర్చిన ముందుమాటలు సంపాదకుల ఉద్దేశ్యాన్ని ఆవిష్కరించాయి. ఇవన్నిటిని సమిష్టిగా వెలువడిన కథా సంకలనం తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ఒరవడికి చేర్పు.

కవిత

# ఆమె

- సరోజన బోయిని



గునపాల్లాంటి మాటలు గుండెల్లో గుచ్చుతున్న
గాయమైన గుండెకు
కన్నీటి లేపనాలు రాస్తూ కాలం గడుపుతున్న
ఆమెకు అవమానాలు ఎన్నో !
ఆమెకు ఛీత్కారాలు ఎన్నో !
ఆమెలోని సున్నితమైన బలహీనతలకు బలాత్కారాలు
ఎన్ని సార్లో..!

కాలం పగబట్టిందో ఏమో
చీకటితో చుట్టూ గిరేసి నిల్చోని కదలనంటోంది
ఇప్పుడు ఆమె ఆ కాలానికే ఓ సవాల్..
రేపటి తరం కోసం తనను తాను దహించుకుంటూ
రగిలే నిప్పు కణమై మెరుస్తుంది..!

ఇప్పుడు ఆమె ఆ కాలానికే సవాల్
రేపటి భవితకోసం ఉలి దెబ్బలు ఉసురు తీస్తున్న
ఆ ఆర్తనాదాలతో నిశ్శబ్దాన్ని ఛేధించే
వేల గొంతుకల గళమై ప్రశ్నిస్తుంది..!

ఇప్పుడు ఆమె,
తనని తానే కొత్తగా మలుచుకున్న అద్భుత
ప్రతిరూపం
నిశీధిలోనే ఆమె ఆలోచనలను
బందీ చేయాలి అనుకున్న
మూర్ఖపు సమాజ ధోరణిని నిలువునా కాల్చే అగ్ని
రూపం..!

వ్యాసం

# అవసరమైన అవగాహన




**శ్రీమతి అనురాధ రావు,**
**బాలల హక్కుల సంఘం అధ్యక్షులు.**
**9866342424**


అవగాహన లేని అజ్ఞానం అపోహలు, భ్రమలు కలిగించి అనేక కష్టాలకు గురిచేస్తుంది. కొందరి అజ్ఞానం మరి కొందరికి ఎదుటి వారి హక్కులను హరించేందుకు అవకాశాలు కల్పిస్తుంది. ఇటువంటి సంధర్భాలలోనే హక్కుల సంఘాలు నిస్వార్ధంగా పనిచేస్తూ బాధితులకు అవగాహన కల్పిస్తూ వారికి అండగా నిలుస్తాయి.

సృష్టికి ఆధారమైన తల్లి పిల్లల అనుబంధానికి జూలై, ఆగష్టు నెలల్లో కొన్ని ప్రత్యేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తారు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల వారు. వాటి గురించి బాలల హక్కుల సంఘం అధ్యక్షులు శ్రీమతి అనురాధారావు గారు చెప్పిన వివరాలు..

**“తల్లిపాల వారోత్సవాలు”**

“బిడ్డకు పాలివ్వడం ప్రతి తల్లి కర్తవ్యం” అనే నినాదంతో ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ‘తల్లి పాల వారోత్సవాలు’ జరపడం 1991 నుండి ప్రారంభం అయ్యింది. ఈ వారోత్సవాలు 120 దేశాల్లో తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంపొందించడానికి జరుపుతారు. సాధారణ కాన్పు అయితే బిడ్డ పుట్టిన ఒక గంట నుండి పాలు పట్టాలి. ఒక వేళ తల్లికి ఆపరేషన్ జరిగిన 3 గంటల నుండి పాలు పట్టాలి అని డాక్టర్లు చెబుతున్నారు. మొదట వచ్చే పాలను ముర్రు పాలు / లిక్విడ్ గోల్డ్ / కొలొస్ట్రమ్ అంటారు. ఈ పాలు చాలా మంచి పోషకాలు కలిగి ఉంటాయి. ఇవి వాక్సిన్ లా పని చేస్తాయి. చాలా వ్యాధులు రాకుండా అరికడుతాయి. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది ముర్రుపాల వల్ల. తల్లిపాల ద్వారా తల్లీ బిడ్డ బాండింగ్ పెరుగుతుంది. తల్లి పాల వల్ల పిల్లలకు ఇన్ఫెక్షన్స్ రావు. బిడ్డ పాలు తాగడానికి నిప్పల్ టచ్ వల్ల తల్లికి ఆక్సిటోసిన్ హార్మోన్ ఉత్పత్తి అవుతుంది. దాంతో పిల్లలకు కావాల్సిన పాలు వస్తాయి. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టాలి, ఆ తర్వాత ఘన పదార్థాలతో పాటు పాలు పట్టాలి. సంవత్సరం వరకు తల్లిపాలు ఇవ్వాలి. పాలు పట్టడం వల్ల తల్లికి చాలా ఉపయోగాలు ఉన్నాయి, తల్లి ఆరోగ్యంగా ఉంటుంది, మానసిక ప్రశాంతత ఉంటుంది. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ ప్రమాదం తక్కువ. కాంట్రాసెప్టివ్ లా పని చేస్తుంది. టైప్ 2 చక్కెర వ్యాధి ప్రమాదం తక్కువ. కానీ తల్లి పాలు అందని చిన్నారులు చాలా ఎక్కువ మంది ఉన్నారు. రకరకాల కారణాల వల్ల.. సరోగసి ద్వారా పుట్టిన పిల్లలకు, తల్లికి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నా, మానసిక ఆరోగ్యం బాగలేకున్న, పిల్లలను దత్తత తీసుకున్నా తల్లి పాలు దొరకవు. కాబోయే తల్లులు, బిడ్డకు జన్మనిచ్చిన తల్లులు ఈ విషయం పై అవగాహనతో పిల్లలకు పాలు పట్టాలి అని బాలల హక్కుల సంఘం విన్నపం.

**ఆపరేషన్ ముస్కాన్:**

9 వ ఆపరేషన్ ముస్కాన్ 2023 జులై 1 నుండి జులై 31 వరకు జరిగింది. ఆపరేషన్ ముస్కాన్ దేశం మొత్తం నిర్వహిస్తారు. వేల సంఖ్యలో చిన్నారులను రిస్క్యు చేశారు. మన తెలంగాణాలో ‘తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ లో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ పోలీసు సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, ఆరోగ్య శాఖ, సిడబ్ల్యుసి, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తారు. తల్లిదండ్రులు లేక కొందరు, ఇంటి నుంచి పారిపోయి వచ్చి కొందరు గమ్యం తెలియని పిల్లలు, బాలకార్మికులుగా ఉన్న పిల్లలు, డొమెస్టిక్ చైల్డ్ లేబర్ గా ఉన్న పిల్లలు, కూడళ్లలో

బిచ్చం ఎత్తే పిల్లలు, అక్రమ రవాణ లో చిక్కుకొన్న పిల్లలను గుర్తించి రెస్క్యూ చేశారు ఈ తొమ్మిదవ ఆపరేషన్ ముస్కాన్ లో 2617 మంది చిన్నారులను రిస్క్యూ చేశారు. దాంట్లో 263 మంది బాలికలు ఉన్నారు. మొత్తం సంఖ్యలో 387 మంది తల్లి తండ్రులు లేని పిల్లలను షెల్టర్ హోం/ రిస్క్యూ హోంకు తరలించారు. మిగిలిన చిన్నారులను ఇంక్లూడింగ్ 212 బాలికలను వారి వారి తల్లిదండ్రులకు / గార్డియన్స్ కు కౌన్సెలింగ్ చేసి అప్పచేప్పారు. 436 మంది ముఠా/ బాలకార్మికులను పెట్టుకున్న వారిని అరెస్టు చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే అవగాహన కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం చెందడం వల్ల, ఇంత మంది చిన్నారులు దొరుకుతున్నారు. అని బాలల హక్కుల సంఘం అంటుంది. జూన్ నెలలో 'బడి బాట కార్యక్రమం' ఫెయిల్ అవుతుంది అని, పిల్లలు హైదరాబాద్ నగర రోడ్ల కూడళ్లలో బిచ్చం ఎత్తుతున్న విషయం అధికారులకు కనిపిస్తుంది. కానీ వారిని రిస్క్యూ చేయడం లేదు. ఇది నిర్లక్ష్యానికి నిదర్శనం అని బాలల హక్కుల సంఘం అంటుంది. బాలకార్మిక వ్యవస్థ, అక్రమ రవాణ ఆపాలి అని బాలల హక్కుల సంఘం డిమాండ్.

**'ఒక సంఘటన పై స్పందన':**

బాలికలకు రక్షణ కల్పించడంలో పూర్తి వైఫల్యం చెందింది అనేందుకు ఇటువంటి అమానుష సంఘటనలే నిదర్శనం. మూడు రోజుల క్రితం జనగామ జిల్లా చెన్నూరులో జరిగిన నీచమైన ఘటన. సుధాకర్ అనే వ్యక్తి ఇద్దరు మైనర్ బాలికలను పనిలో పెట్టుకొని, డబ్బు దొంగతనం చేశారని, ఆ గ్రామ పంచాయతీ ఆఫీస్ దగ్గర చెట్టుకు కట్టేసి కారం చల్లి అమానుషంగా కొట్టాడు. ఎంత దీనంగా వేడుకున్నా వదలేదు. తల్లిదండ్రులను కూడా చితక బాదాడు. చుట్టూ చూస్తూ ఉన్న జనం కనీసం ఆపే ప్రయత్నం చేయలేదని.. ఆ బాలికలు విలపించారు. దీనికి బాధ్యులు అయిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంఘం డిమాండ్. చుట్టూ నిలబడి వింత చూసే వారికి కనీస విజ్ఞత ఉండాలి. బాల కార్మికులుగా పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం. మరి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయడం లేదు, అవగాహన కల్పించడం లేదు అని మళ్ళీ మళ్ళీ నిర్ధారణ అవుతుంది ఈ సంఘటన వల్ల. సుధాకర్ పై రెండు రకాలుగా కేసునమోదు చేసి, కఠినంగా శిక్షలు విధించాలని డిమాండ్.

మరో ఘటనలో మైనర్ బాలికను అపహరించి, సామూహిక అత్యాచారం చేసిన ఘటన పెద్దపల్లి జిల్లా అప్పన్న పేట్ లో ఆగస్టు 14న జరిగింది. వారం తర్వాత వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ నుండి వచ్చిన వలస కూలీ కుటుంబం, ఒక గృహ నిర్మాణ పనిలో పని చేస్తున్నారు. ఆ అమ్మాయి తల్లితండ్రులతో పాటు ఉంది. దుండగులు అమ్మాయిని ఎత్తుకెళ్ళి సామూహిక అత్యాచారం చేశారు. అధిక రక్తస్రావంతో అవస్థ పడుతున్న పాపను వారి గుడిసెల వద్ద వదిలి వెళ్ళారు. వారి ఊరికి హాస్పిటల్ కోసం వెళుతుండగా దారిలో చనిపోయింది. చాలా దారుణమైన సంఘటన ఇది. ప్రతి గృహ నిర్మాణం జరిగే చోట, కూలీలు పని చేసే చోట తప్పని సరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని బాలల హక్కుల సంఘం డిమాండ్. ఎవరు ఏం చేస్తున్నారు అని యజమానులు గమనించాలి. ఇంత దారుణమైన సంఘటనకు బాధ్యులు అయిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంఘం డిమాండ్. అమ్మాయిల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల సంఘం డిమాండ్.

ఎక్కడైనా పిల్లలు అనుమానాస్పద స్థితిలో కనిపిస్తే 9440700906 హెల్ప్ లైన్ కు కాల్ చేయాలి అని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు తెలిపారని, అనురాధా రావుగారు వివరించారు.

# పాలపుంతలు

- యేలూరి శేష బ్రహ్మం
9502477656

అనూష ఉద్యోగానికి రాజీనామా ఇచ్చిందన్న వార్త వినగానే, రాహుల్ మనసు మీద నల్లటి మేఘం కమ్మేసినట్లు అయింది. ఎగ్జిట్ సైన్ చెయ్యకుండానే ఆఫీసు బయటకు భారంగా నడిచాడు. నడకలో తడబాటు స్పష్టంగా తెలుస్తుంది. తత్తరపాటులో గొంతు దాటని మాటలేవో మాట్లాడుకుంటున్నట్లు పెదవులు పదే పదే వంకరగా కదులుతున్నాయి.

అబిడ్స్ రోడ్డంతా మ్యూట్ లో పెట్టినట్లుంది. రద్దీతో నిండిన ఆ ప్రాంతపు రణగొణ ధ్వనులేవి తన కర్ణభేరికి చేరట్లేదు. అర కిలోమీటరు నడిచాక అలవాటుగా పాన్ డబ్బా వెనుకున్న చెక్క బల్లపై కూలబడి నిస్తేజంగా కూర్చున్నాడు. షాపు మూసేసే సమయానికి భారంగా లేచి మొహం మీద కాస్త నీళ్లు జల్లుకుని రూమ్ కి కదిలాడు. తన విషాదపు పరిస్థితికి కారణమైన పేరును అప్రయత్నంగా అతని పెదాలు ఉచ్చరించాయి. 'అనూష ..... ఎంత మోసం చేశావే'.

రాహుల్ నాలుగు రోజులు చెప్పా పెట్టకుండా ఆఫీస్ కి రాకపోవడం, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో ఒకింత కంగారు పడిన కొలీగ్ అశోక్, బేగం పేటలోని రాహుల్ ఉంటున్న మానస అపార్ట్మెంట్ పెంట్ హౌస్ వద్దకు వెళ్ళాడు. రెండు నిముషాలు కాలింగ్ బెల్ కొట్టిన తరువాత రాహుల్ తలుపు తీసాడు. కళ్ళు ఎర్రబారిపోయి ఉన్నాయి. జుట్టు చింపిరిగా బట్టలు ఆసాంతం నలిగిపోయి ఉన్నాయి. రాహుల్ ని కూచోబెట్టి "ఏమైంది రాహుల్, ఆరోగ్యం బాగాలేదా ?" అన్నాడు గాబరాగా.

రాహుల్ నుండి ఏ సమాధానం లేదు. తనవైపు చూడకుండా, వేలితో బల్లపై ఏవో పిచ్చి గీతలు గీస్తూ నిముషాలు దొర్లిస్తుండటంతో, ఒకింత అసహనానికి గురైన అశోక్ "అసలేమైనది చెప్పరా" అని భుజాలు కుదుపుతూ గట్టిగా అడిగాడు.

అన్యమనస్కంగా రాహుల్ ఏటో దిక్కుకి చూస్తూ "అనూష మేడం తన జాబ్ కి రిజైన్ ఇచ్చిందటగా" అన్నాడు గద్గద స్వరంతో.

దానికి అశోక్ అయోమయంగా "సో వాట్? మన మేనేజర్ జాబ్ మానేస్తే నీకేంటి ప్రాబ్లెమ్? ఓహ్, అన్నట్లు అనూష మేడమే కదా, నీకు ఈ జాబ్ ఇప్పించింది. ఆమె కారణాలేంటో మనకేం తెలుసు, నెలల బిడ్డని చూసుకోవడానికి తప్పనిసరై జాబ్ కి రాజీనామా ఇస్తున్నట్లు తెలిపింది. అది సరే, ఆమె రాజీనామాకు నీ ఈ పరిస్థితికి సంబంధమేమిటో నాకర్థం కావట్లే, కొంపదీసీ మేడమ్ ని ఏమైనా ప్రేమిస్తున్నావా లేక ఏమైనా పెద్ద మొత్తంలో డబ్బులు అప్పుగా ఇచ్చావా ?" అని గట్టిగా అరిచాడు.

ఒక క్షణం తన ప్రవర్తనకు సిగ్గుపడి బుజ్జగింపుగా "ఏమైనా క్లియర్గా చెప్తేనే కదరా నాకు తెలిసేది" అని ఒత్తి పలుకుతూ రాహుల్ కళ్ళలోకి సూటిగా చూశాడు.

కొన్ని నిముషాలు మౌనం ఆవరించింది ఆ గదిలో, ఎంతసేపు అయినా విషయమేంటో తెలిసేదాకా కదలను అన్నట్లుగా కుర్చీలో జారగిలబడి కూర్చున్నాడు అశోక్.

రాహుల్ నాలుకతో పెదాలను తడి చేసుకుంటూ, వేళ్ళను తత్తరపాటుగా నలుపుకుంటూ "అనూష నేను పదవ తరగతి నుండి మంచి స్నేహితులం, ఇంటర్ మొదటి సంవత్సరం చివర్లో నేను తనకి ప్రపోజ్ చేసాక, వేసవి సెలవుల అనంతరం, రెండవ సంవత్సరం మొదట్లో తాను ఓకే చెప్పింది.

బాగా చదివి లైఫ్ లో సెటిల్ అయ్యి పెద్దవాళ్ళ దగ్గర మా పెళ్లి ప్రస్తావన తెద్దాము అనుకున్నాము. అదే ఉత్సాహంతో చదివి నేను స్పేస్ ఇంజినీరింగ్ లో సీటు సాధించాను. తాను మార్కెటింగ్ మేనేజ్మెంట్ చదివి టీమ్ లీడ్ స్థాయికి వచ్చింది. ఎవరి ద్వారానో మా ప్రేమ వ్యవహారం తెలుసుకున్న అనూష వాళ్ళ నాన్న, చస్తానని బెదిరించి, మూడవరోజునే వాళ్ళ మేన బావతో గుట్టు చప్పుడు కాకుండా గుళ్లో పెళ్లి చేశాడు. నేనప్పుడు బెంగళూర్ ట్రైనింగ్ లో ఉన్నాను. ఈ వార్త ఒక ఫ్రెండ్ ద్వారా తెలుసుకుని నిర్ఘాంత పోయాను. అనూషను మన ఆఫీసు బయట కలిసి ఎందుకిలా చేశావని అడిగాను. నీకేదో బలమైన కారణం లేకపోతే నువ్వీ పెళ్ళికి ఒప్పుకుని ఉండవు. మన ప్రేమ మీద నాకు అంతులేని విశ్వాసం ఉంది. నువ్వు దూరం అవుతావన్న బాధ తప్ప నా మనసులో మరింకే కొరవ లేదు. కానీ ఒకేసారి నా జీవితంలోనుండి నువ్వు వెళ్ళిపోయావు అనే విషయం జీర్ణించుకోవడానికి, నాకు కొంత సమయం పడుతుంది. అందుకని ఒక చిన్న కోరిక కోరుతాను కాదనకుండా నాకొక సహాయం చేయగలవా, నీ ఆఫీస్ లో, నీకు దగ్గర్లో ఏదైనా ఒక ఉద్యోగం ఇప్పించు. ఎప్పటికీ నువ్వెవరో తెలియని మనిషి లాగానే ఉంటా. నీకెటువంటి ఇబ్బందిగా అనిపించినా ఆరోజే నేను నీ జీవితంలోనుండి దూరంగా వెళ్ళిపోతా అని చిన్న పిల్లవాడిలా ప్రాధేయ పడ్డాను.

నిజానికి అది చాలా కష్టమైన పరిస్థితే, పెళ్లి చేసుకున్నాక ప్రేమించినవాడు ప్రతిరోజూ కంటి ముందు తిరుగుతుంటే అదోరకమైన ఇబ్బంది. తాను నా మనసుకి చేసిన గాయానికి ప్రతిహారంగా ఆ మాత్రం చెయ్యలేనా అనుకుని వెంటనే మార్కెటింగ్ వింగ్ లో ఫీల్డ్ ఆఫీసర్ జాబ్ లో పెట్టించింది. ఆరోజు మొదలుకుని ఏనాడు కలిపించుకుని అనూష మేడంతో నేను మాట్లాడిందే లేదు. నా పనేదో నేను చేసుకుంటున్నాను. మొదట్లో అనూషకు నా ప్రవర్తన విడ్డూరంగా అనిపించినా, ఆకాశానికి రాకెట్ ఎగరేయాల్సిన నేను మార్కెటింగ్ కాల్స్ చేసుకుంటూ నా పనిలో నిమగ్నమై పోవడాన్ని, మెల్ల మెల్లగా అలవాటు చేసుకోసాగింది. మేము కలిసి పనిచేసిన ఈ రెండేళ్లలో నా మొహంలో ఆమె కించిత్ విచారాన్ని కూడా చూడలేదు. తనకి కొన్ని మీటర్ల దూరంలో ఉన్నానన్న భావన నాకు చాలని అనూషకు అర్థం అయింది. అలాంటిది సడెన్ గా అనూష జాబ్ మానెయ్యడంతో నా మెదడు స్తంభించిపోయింది. ఇప్పుడు నాకు నిజమైన ద్రోహం జరిగినట్లనిపించింది" అని తన ఈ పరిస్థితికి కారణం చెప్పాడు.

"అది సరే ఇంతకీ అనూష మేడం ఎందుకు రాజీనామా ఇచ్చి ఉంటదంటావు? బాబుని చూసుకోవడమే కారణం అయితే ఎందరో జాబ్ చేస్తూ కూడా పిల్లల్ని పెంచుతున్నారు కదా! మరింకేమైనా కారణం ఉంటుందంటావా?" అన్నాడు సాలోచనగా అశోక్. లేనిపోని అనుమానాలేవో ఇద్దరి మెదళ్లను తొలవగా..

"ఒకసారి వెళ్లి చూసొస్తే" అనుకుని ఇద్దరు అనూష స్వగ్రామమైన వరంగల్ పక్కనున్న మట్టెవాడకు బైక్ మీద బయలుదేరారు. మూడు గంటల ప్రయాణం తరువాత మట్టెవాడకు చేరారు. పాత రోజులలో ఒకసారి ఎండాకాలపు సెలవులలో వాళ్ళ ఊరొచ్చి రహస్యంగా అనూషను కలిసి వెళ్ళాడు. కొంత ఊరు మారినా అంతగా కష్టపడకుండానే ఆమె ఇల్లు కనుక్కున్నాడు. ఇంటిదగ్గర వాళ్ళ అమ్మ మేము అనూష కొలీగ్స్ అని తెలిసి కన్నీటి పర్యంతం అయింది. అనూష నెల రోజుల నుండి హాస్పిటల్లో ఉన్నట్లు ఏడుస్తూ చెప్పింది.

డెలివరీ అయిందని తెలుసు కానీ, ఇంకా హాస్పిటల్ లో ఉండటం ఏమిటా.. అని ఆందోళనతో పేరు తెలుసుకుని హాస్పిటల్కి వెళ్లారు. ఐసీయూ వెయిటింగ్ హాల్లో అనూష భర్త జగదీశ్ ను గుర్తు పట్టి, తాము అనూష కొలీగ్ గా పరిచయం చేసుకుని, రాజీనామా ఎందుకు చేస్తుందో ప్రాపర్ రీజన్ కనుక్కొని రమ్మన్నారని, తనను మేనేజ్మెంట్ ఈ పనిగా పంపిందని చెప్పుకొచ్చారు. దానికాయన భారంగా నిట్టూరుస్తూ "బిడ్డ పుట్టాక తనూహించిన ప్రపంచం వేరు, ఇప్పుడు జరుగుతుంది వేరు, కనుక ఇక బిడ్డనే చూసుకుంటా.. జాబ్ చెయ్యను అని మొండిగా వాదిస్తుంది. ఆమె రొమ్ముకి ఆపరేషన్

చేసినప్పటినుండి పరిస్థితులు విచిత్రంగా మారాయి" అని చెప్పుకొచ్చాడు. పరిస్థితిలో మరింత క్లారిటీ కోసం అక్కడున్న డ్యూటీ డాక్టర్ని కలిసి, అనూష ఆరోగ్య పరిస్థితి తెలియచేయాలని రిక్వెస్ట్ చేశారు.

డాక్టర్ కేసు ఫైల్ చూసి "రీసెంట్ గా ఈ పేషేంట్ కి సిజేరియన్ జరిగింది. నెలరోజులు అవకుండానే మళ్ళీ బ్రెస్ట్ లంప్స్ సర్జరీ జరిగింది" అని చెప్పి అర్ధం అయ్యిందా అన్నట్లుగా చూసాడు. "లేదు సార్..కొంచెం వివరంగా చెప్తారా?" అనడిగాడు రాహుల్. "నిజానికి అవగాహన ఉంటే ఇది చాలా చిన్న సమస్య. తెలియనితనం వలన ఒక్కోసారి పెద్ద సమస్యగా మారుతుంది. ఈ పేషేంట్ కి అదే జరిగింది. సాధారణంగా ప్రసవం తరువాత కొన్ని గంటలకే పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలి. చను గుబ్బ మొత్తం పిల్లల నోటిలోకి తీసుకోకనో, లేక చను మొన లో కొంచెం చీలికలు (నిపుల్ క్రాక్స్) వచ్చో తల్లి సరిగా పాలు ఇవ్వలేకపోవచ్చు. ఏ కారణం చేతనైనా కొన్ని రోజులు పాలు ఇవ్వక పోతేనో, లేక ఒక పక్కనే ఇచ్చి మరోపక్క ఇవ్వకపోతేనో నిర్విరామంగా పాల ఉత్పత్తి జరుగుతూ రొమ్ములు భారంగా మారి, పాలు గడ్డలుగా మారుతాయి. వాటిని గుర్తించడంలో మరింత అలక్ష్యం చేస్తే ఆ గడ్డలకు చీము ఏర్పడి ఇన్ఫెక్షన్ అవుతుంది. తొలి దశలో ఈ పరిస్థితిని గుర్తిస్తే బ్రెస్ట్ పంప్ ద్వారా పాలను తీసేయవచ్చు. పరిస్థితి కొంచెం ముదిరితే యాంటీ బయోటిక్స్, ఆయింట్మెంట్స్ వగైరా ఉంటాయి. అతి కొన్ని సందర్భాలలో మాత్రమే తప్పని సరై బ్రెస్ట్ కి సర్జరీ చేసి ఆ గడ్డలను తీసి వెయ్యాల్సి ఉంటుంది. దీనిని లంపెక్టమీ లేక బ్రెస్ట్ లంప్స్ అంటారు. ఈ ఆపరేషన్ ప్రాణాంతకం కాకపోయినా కుట్లు వేయడానికి వీలుండదు కాబట్టి ఆ ఇన్ఫెక్షన్ లోపటి నుండి తగ్గుతూ రావాలి. అందుకని రోజు డ్రెస్సింగ్ చేసుకుంటూ జాగ్రత్త తీసుకోవాలి. ఇక పాలు ఉత్పత్తి కాకుండా కొన్ని రకాల మందులు ఇస్తాము కాబట్టి తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వలేకపోతున్నానన్న బాధతో, కొన్నిసార్లు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతుంది. ఆ సమయంలో ఈలోకంలో ప్రతి ఒక్కరు తనను, తన బిడ్డను విడదీయాలని ప్రయత్నిస్తున్నట్లు భ్రాంతికి లోనవుతారు. ప్రత్యేకంగా కొందరిపై తీవ్రమైన ద్వేషం కలిగి వుండే అవకాశమూ ఉంది. అది భర్త, తల్లి,అత్త లేక ఇంకెవరైనా కావచ్చు. ఈ సమయంలో వారి బలహీనమైన మనసును ఆసరాగా చేసుకుని.. నాటు వైద్యం, భూత వైద్యం లాంటివి తెరమీదకు వచ్చి వారిని మరింతగా కంగారు పెడతాయి. బాలింతలకు దెయ్యాలు ఆవహిస్తాయి లాంటి అనేక అపోహలు చుట్టుముట్టి, ఒక్కోసారి తీవ్రమైన ఆవేదనకు, ఆవేశానికి లోనవుతారు. మరుక్షణం వారు ఏమి చేసినది వారికే గుర్తుండదు. సహజంగా విదేశాలలో అయితే ఈ సమయంలో సైక్రియాటిస్టు సహాయం తీసుకుంటారు" అని ఏదో కాల్ రావడంతో టాపిక్ ముగించాడు. అశోక్ కి కూడా మరునాడు తప్పనిసరి మీటింగ్ ఉండటంతో బండి రాహుల్ కి ఇచ్చి బస్టాండ్ కి వెళ్ళిపోయాడు.

అనూష భర్త "మీరు నాకంతగా పరిచయం లేకపోయినా.. ఒక సహాయం అడుగుతాను చేయగలరా" అన్నాడు. అతని మాటలలో ఏదో ఆదుర్దా కనిపిస్తుంది. ఏదైనా ఆర్థిక సహాయం కాబోలు అన్న సహజమైన సందేహంతో "పర్లేదు చెప్పండి" అనడిగాడు రాహుల్. "ఇంటిదగ్గర బిడ్డ సాయంత్రం నుండి ఏడుపు ఆపట్లేదు. ఒళ్ళు కూడా వెచ్చగా ఉంది, పాలు తాగట్లేదు, పిల్లల హాస్పిటల్ కి తీసుకెళ్లాలి. మీరు కాసేపు ఇక్కడ ఉంటే, రెండు గంటలలో మా చెల్లెలు వస్తది, నేను కూడా బిడ్డకి చూపించుకుని వీలైనంత తొందరగా వస్తాను" అన్నాడు. "ఈలోపల మహా అంటే ఏదైనా టిఫిన్ తెచ్చివ్వమంటారు, అది కింద ఫ్లోర్ క్యాంటీన్లో దొరుకుతుది. అంతకంటే మీకేమి ఇబ్బంది ఉండదు" అని ఒప్పించే ధోరణిలో అడుగుతూ.. టిఫిన్ కోసమన్నట్లుగా వంద రూపాయల నోటు చేతిలో పెట్టె ప్రయత్నం చేసాడు.

"మరేం ఫరవాలేదు మీరు వెళ్ళిరండి నేను చూసుకుంటాను" అన్నాడు.

అరగంట తరువాత అనూష అటెండెంట్ అని పిలవగా రాహుల్ లోపలికెళ్ళాడు. అనూషా ఘాడ నిద్రలో ఉన్నట్లు ఉంది. ఏదో తెలియని బాధ అతనన్నావరించగా పాదాల కింద

చెమట పట్టింది.

అక్కడ నర్సు "మీరేనా పేషేంట్ అటెండర్, రోజూ ఇంకొకామె ఉంటుండెనే" అంది.

"హా ఆమె మా చెల్లెలు.." అనగానే ఈ పేషేంట్ పెనిమిటివి నువ్వేనా అనడిగింది.

కాదు అన్నట్లు తలూపడాన్ని పట్టించుకోకుండా.. "ఇవి పట్టుకో.." అని బ్యాండేజ్ వగైరా ఉన్న ట్రే చేతికిచ్చి, అనూషా కప్పుకున్న దుప్పటి తొలగించింది. ఒంటిమీదున్న ఆప్రాన్ కుడిపక్క ఓపెన్ చేసింది. ఎడమ పక్క రొమ్ముపై అంగుళమున్నర మేర కోసిన రెండు గాట్లు, దాని చుట్టూ ఎర్రగా కమిలిపోయిన రొమ్ము, తెరుచుకున్న కోతలలోనుండి బయటకు కనిపిస్తున్న చిన్న రక్తపు తిత్తులు. వెరసి కళింగ యుద్ధంలో లక్ష సైనికులు చనిపోయి కుప్పలా పడున్న రక్తపు ముద్దలా తోచింది. స్థనం లోపలి పొరల్లోని చీముని కాటన్ తో శుభ్రం చేసి ఆయింట్మెంట్ రాసి చుట్టూ యాంటిబయాటిక్ తో శుభ్రం చేసి ఆప్రాన్ ని కట్టింది. అంత మత్తులోను డ్రెస్సింగ్ చేసేప్పుడు అనూష బాధతో కదలడం అతను గమనించాడు. కను కొనలనుండి కారే కన్నీళ్ల చారికలు చెప్తున్నాయి, లోలోన ఆమెంత బాధను అనుభవిస్తున్నది.

డ్రెస్సింగ్ అయిపోయాక నర్సు పక్క బెడ్ కి వెళ్ళింది. అతను కొన్ని నిముషాలు ఆమెను చూస్తూ వుండిపోయాడు. 'ఎక్కువు సేపు ఐ సి యూ లో ఉండటం సరి కాదు' అనుకొని బయటకు రాబోతుండగా.. అనూష ఒక కుదుపుకి లోనయి పిట్స్ వచ్చిన మనిషిలా మూతి వంకర పోతుండగా, ఎడమ కాలు, చెయ్యి కొట్టుకోసాగింది. ఒక క్షణం రాహుల్ షాక్ కి గురయ్యాడు. "సిస్టర్... సిస్టర్.." అని పెద్దగా అరిచి, అనూషను కంట్రోల్ చేసే ప్రయత్నం చేసాడు. ఆమె కదలికలతో చేతికున్న కానులా ఊడిపోయి, నీడిల్ తో సహా బయటకు వస్తూ కొంత రక్తాన్ని బయటకు లాగేసింది. రక్తపు చుక్కలు అక్కడక్కడా పడుతుండగానే భళ్ళున వాంతి చేసుకుంది. అలాగే హిస్టీరిక్ గా అరుస్తూ, కళ్లింతగా చేసి తిప్పుతూ "నేను ముందే చెప్పాను గడ్డలైతన్నాయని. నువ్వే పట్టించుకోలేదు. అదంతా మామూలే అన్నావు, ఒకనాడు ముట్టి చూడలేదు, నీవల్లే ఇదంతా దెయ్యమా, నన్ను వదలవే, ఏ చేతబడి నన్నేమి చెయ్యలేదు" అని పెద్ద పెద్దగా అరుస్తూ ఒక్కసారిగా.. నీలిగిపోయి విహీనంగా మారసాగింది. ఆమె అరుపులకు ఐసీయూ లోని పేషేంట్స్ అందరూ లేచి కూర్చున్నారు. దాదాపు ఆమె మంచం మీద నుండి కింద పడబోతున్నట్లుగా వుంది. ఒకరకంగా తానొక్కడే ఆమెను నిలువరించలేకపోతున్నాడు. ఇంతలో ముగ్గురు సిస్టర్స్ వచ్చి ఆమెను కంట్రోల్ చేస్తూ డ్యూటీ డాక్టర్ కి సమాచారం ఇచ్చారు. అయన వచ్చిన వెన్వెంటనే అనూష తల క్రింద దిండ్లు తీసేసి, కాళ్ళు పైకెత్తి పట్టుకోమని చెప్పాడు. అర నిముషం తరువాత జలదరించినట్లుగా అనూష కళ్ళు తెరిచింది. సిస్టర్స్ సాధారణ స్థితిలో ఆమెను పడుకోబెట్టి వాంతి చేసుకున్న, రక్తపు మరకలంటిన దుప్పట్లు మార్చారు. అదృష్ట వశాత్తు ఆమె ఆపరేషన్ చేసిన రొమ్ముకు ఎటువంటి వత్తిడి తగలేకపోవడంతో అందరూ ఒకింత రిలాక్స్ అయ్యారు. రెండు నిముషాల తరువాత ప్రశాంతంగా కళ్ళు తెరిచిన అనూష 'ఏమైంది నాకు అన్నట్లు ప్రశ్నార్థకంగా చుట్టూ చూస్తూ, రాహుల్ ని చూసి, 'నువ్వేంటిక్కడ, ఎప్పుడొచ్చావు' అన్నట్లు కను బొమ్మలు ప్రశ్నార్థకంగా పెట్టింది. 'మళ్ళీ చెప్తా నువ్వు కూల్ గా ఉండు' అని సైగ చేస్తూ బయటకు వెళ్ళాడు.

ఆ రాత్రి ఇంచుమించుగా.. అంత కాకపోయినా, అలాంటి పరిస్థితిని రెండుసార్లు అనుభవించింది. వెయిటింగ్ హాల్లో కూర్చున్న రాహుల్ కి అంతా గజిబిజి గందరగోళంగా వుంది మనసు. రెండు మూడు నిముషాలు కళ్ళు మూసుకున్నా, ఏదో పీడ కలలాంటి ఆలాపనకు గురై, తలంతా పట్టినట్లుగా అనిపించేది. తెల్లవారుతుందనగా మఫ్లర్ చుట్టుకుని అనూష భర్త వచ్చాడు. "రాత్రి టిఫిన్ ఇచ్చారా, తిన్నదా" అని అడిగి, బిడ్డతో రాత్రంతా ఉండాల్సిన పరిస్థితిని, వర్షంలో చెల్లి రాలేకపోయిన పరిస్థితిని చెప్పుకొచ్చాడు. తనివద్ద విషయం దాచకుండా ఉంటే మంచిదని భావించిన రాహుల్, రాత్రి జరిగిన విషయమంతా వివరంగా చెప్పాడు. ఆమె ఆరోగ్యం

మరింత క్షీణిస్తుందేమో అన్న భయానికి ఆమె భర్త మరింతగా ఆందోళన చెందినట్లు అనిపించింది.

వారం రోజుల తరువాత అనూష హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయింది. ఆ తరువాత మానసిక వైద్యుడి వద్ద నాలుగు సిట్టింగులు కౌన్సిలింగ్ చేయించి, కొన్ని మందులు వాడాక, తాను కొంత నెమ్మదించింది. అందరి సహకారంతో సాధారణ స్థితికి వచ్చింది. చుట్టూ జరుగుతున్న పరిస్థితులను అవగాహన చేసుకుని, బిడ్డ కోసం తాను జాబ్ మానేయాలన్న డిప్రెషన్లో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అలాగే తల్లిని అపార్థం చేసుకుని పరుష పదజాలంతో నిందించిన సంఘటనలకు చాలా బాధ పడింది. తల్లికి కొన్ని సార్లు పైకి, మరెన్నో సార్లు లోలోపల క్షమాపణలు కోరుకుంది. మరో సంవత్సరం ఉద్యోగానికి సెలవు పెట్టి పాపను బాగా చూసుకుంది.

ఈ సమయంలోనే తనలాగా ఎవరు ఇలాంటి సమస్యతో బాధ పడకూడదని నిర్ణయించుకున్న అనూష.. తన భర్త జగదీశ్, కొలీగ్సయిళ రాహుల్, అశోక్, ఇంకా మరి కొందరు మిత్రులతో కలిసి 'పాలపుంతలు' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసింది. ఇందులోని కార్యకర్తలు, వైద్య నిపుణుల సలహా సూచనల మేరకు డెలివరీ అయిన బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పామ్ప్లెట్స్, వీడియోల రూపంలో ప్రచారం చేస్తూ నవజాత శిశువు తల్లులకు అనేక జాగ్రత్తలు చెప్పేవారు. ఏ బాలింత కూడా బ్రెస్ట్ లంప్స్ తో బాధ పడకూడదన్న కృత నిశ్చయంతో వాళ్ళ ప్రయత్నం కొనసాగించారు.

**కవిత**

# సిగ్గు ... సిగ్గు ...


**హిమజ**
**9441492737**




భూమిపొరల్లోని ఖనిజధనం కోసం
విచ్చుకత్తుల చేతులు
వలువలూడదీసిన కండకావరం

పచ్చని కొండకోనల్లో
లోయల మధ్యలోని
గూడెం గుండె లోతులను
ఛిద్రం చేసిన ముష్కరమూక

అధికారిక ప్రలోభాలు
స్వప్రయోజన రాజనీతి
జాతులు వర్గాల మధ్య
చిచ్చు రేపి
హత్యలు అత్యాచారాలతో
అధిష్టాన అస్మదీయులు
పన్నిన కుటిల కుతంత్రాలు

దేశమా !
కళ్ళు మూసుకో
అజ్ఞానపుటింద్రియాల ముందు
ఆక్రందనలన్నీ అరణ్యరోదనం
అమానుష మరణకాండతో
మణిపురి ఒక మరణపురి

దేశం పరువిప్పుడు
ఒక జెండా కాదు
చిరిగి పీలికలైన
అబల చీర

నగ్నత్వాన్ని ఊరేగించి గెలిచామనుకుంటారేమో
దేహాలు కాదిక్కడ
నగ్నంగా నడిచింది
నిస్సిగ్గుగా ఈ దేశం !!

కథ

# షీ




రోహిణి వంజారి
9000594630


అదిరిపడ్డాను ఒక్కసారిగా..!

మిన్ను విరిగి మీద పడ్డట్టు. ప్యూపాని ని బద్దలు కొట్టుకునిబయటకు వచ్చి , రంగురంగుల లేలేత రెక్కలను చాచి అప్పుడప్పుడే ఎగరడం నేర్చుకుంటూ పైపైకి ఎగిరే ప్రయత్నం చేస్తున్న సీతాకోక చిలుక చిన్ని చిన్ని రెక్కలను విరిచేస్తే, ఎగరలేక నేలమీద పడి గిలగిలా కొట్టుకున్నట్లు గుండెల్లో సుడులు తిరుగుతున్న బాధ.

ఫోటోని, కామెంట్ ని మార్చి మార్చి చూడడం వందోసారి అది. ఇదేమి ఘోరం. ఇదేమి అన్యాయం. గబా గబా ఆ ప్రొఫైల్ ఎవరిదో చూసాను. మెసెంజర్లోకి వెళ్ళాను. చేతులు వణుకుతున్నాయి. రాయాలనుకున్నది టైపు చేశాను. సెల్ ఆపేసి, మంచం మీదికి విసిరేసాను. తడబడే అడుగులతో, అదురుతున్న గుండెలతో హాల్లోకి వచ్చాను. హాలుకి వంటింటికి మధ్య కుడిపక్క మూలన మనిషంత ఎత్తున్న ఫ్రిడ్జ్ తలుపు తీసి, చల్లటి నీళ్ళ సీసా ఎత్తి గడగడా తాగేసాను.

★ ★ ★

జుట్టు పట్టి లాగి ఈడ్చి ముఖం మీద బలంగా కొట్టాడు అతను. ఆ దెబ్బకి విసురుగా పోయి, టేబుల్ కి గుద్దుకుంది ఆమె తల. టేబుల్ అంచు నుదుటికి తగిలి బొటబొటా ఎర్రటి, చిక్కటి నెత్తురు కట్ట తెగిన వరదలా నుదుటి మీదనుంచి కిందికి కారింది.

తల్లికి తగిలిన దెబ్బను, అబ్బాజాన్ ను భయం భయంగా చూసి, తల్లిని హత్తుకుని ఏడుపు ఎత్తుకుంది ఆ పసిపిల్ల. "హిజాబ్ వేయకుండా దాన్ని స్కూల్ కి పంపవద్దని ఎన్ని సార్లు చెప్పాలి నీకు" నిప్పులు చెరుగుతున్నాయి అతని కళ్ళు కొలిమిలో మంటల్లా

"యూకేజీ చదివే ఐదేళ్ల పసిదది. ఇప్పటినుంచే దానికి హిజాబ్ ఎందుకు. కాస్త పెద్దైనాక ఎలాగూ తప్పదుగా అని వేయలేదు" ఆమె కళ్ళల్లో దైన్యం నిస్సహాయంగా పాము నోటికి చిక్కిన కప్పలా.

"చిన్నదని ఇప్పుడు వదిలేస్తే రేపు పెద్దయినాక ఏకు మేకై కూర్చుంటుంది నీలాగే. నేను ఊర్లో లేనపుడు నువ్వు కూడా బురఖా తీసేసి ఆ పక్కింటి ముండలతో తిరుగుతున్నావట కదా. అందుకే నీకీ శిక్ష" ఆమెను హత్తుకుని ఏడుస్తున్న పసిపిల్లను లాగి, ఇద్దరినీ తోసేసి, విసురుగా బయటకు వెళ్ళాడు అతను.

నుదిటి మీది నెత్తురు గాయం కన్నా, అతని మాటలు గుండెల్లో కత్తిపెట్టి మెలితిప్పినట్లై, పసిదాన్ని గుండెల్లో పొదువుకుంది. కన్నీళ్లు ఇంకిపోయి కళ్ళు పొడిబారాయి ఎడారుల్లో నీళ్లు లేక ఎండిపోయిన మడుగుల్లా. ఎన్నాళ్ళు అనుభవించాలి నేను, నా బిడ్డ ఈ నరకం. మందు తాగి వచ్చినప్పుడల్లా అయినదానికీ, కానిదానికీ గొడ్డును బాదినట్లు తనని బాదడం అలవాటు అతనికి. మొగుడనే ఒక్క హక్కుతో బంధించి, పురుగును చూసినట్లు చూస్తాడు తనని. ఎట్లా ఇతని చెర నుంచి తను, తన బిడ్డ బయటపడేది.

★ ★ ★

బెడ్ రూమ్ లోకి వచ్చాను. సెల్ ఫోన్ చూస్తుంటే ఏదో గగుర్పాటు, జుగుప్స కలిగించేదాన్ని చూసినట్లు అసహ్యం, అణుబాంబును చూసినంత భయం కలిగాయి. అయినా మళ్ళీ ఇంకోసారి సెల్ ఫోన్ ని చేతులోకి తీసుకున్నాను. ఆన్ చేశాను. మళ్ళీ మరోసారి ఆ కామెంట్ ని చదివాను. ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది. ఆ కామెంట్ తర్వాత వరుసగా నాలుగు ఫ్రెండ్స్ విషెస్ చెప్పిన కామెంట్స్ ఉన్నాయి.

‘వీళ్ళు ఆ కామెంట్ ని చూశారేమో..మేడం కి తెలిస్తే ఎంత నామర్ద..! పని గట్టుకొని నేను అడగడం ఏంది, మేడం అంగీకరించడం ఏంది. ఛీ ఛీ.. ఇంకా ఎవరు చూడక ముందే కామెంట్ ని డిలీట్ చేసేయాలి. అనుకున్నదే తడవుగా కామెంట్ దగ్గర నొక్కి పట్టుకుని డిలీట్ సింబల్ రాగానే నొక్కేసాను. కామెంట్ ఎగిరిపోయింది. కామెంట్ అక్కడ నుండి మాయం అయింది కానీ సరాసరి నా మనసులోకి వచ్చి తిష్ట వేసింది. ఎంత డిలీట్ చేద్దామన్నా సాధ్యం కావడంలేదు.

చేతిలో సెల్ మోగింది “హలో..ఏం చేస్తున్నావే..! నీ పోస్ట్ దగ్గర ఆ కామెంట్ ఏంటే..? మేడం చూసి ఉంటారు. ఎంత బాధ పడుతుందో” పుండు మీద కారం చల్లినట్లున్న దాని మాటలు వినలేక సెల్ ఆఫ్ చేశాను.

బెడ్ మీద పడుకున్నాను. వారం రోజుల నుండి ఆతృతగా ఎదురు చూసాను ఈ రోజు కోసం. నిన్న రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. ‘ఎన్నాళ్ళో వేచిన ఉదయం’ పాట గుర్తుకు వచ్చింది. కంగారు నిద్రతో వేకువజామున నాలుగింటికే మెలుకువ వచ్చేసింది. లేడికి లేచిందే పరుగు అన్నట్లు పొద్దునే తయారై పదిగంటలకు ఒక్క క్షణం అటుఇటు కాకుండా మేడం చెప్పిన సమయానికి ఆమె ముందు ఉన్నాను.

ప్రోగ్రాం గంట పైనే జరిగింది. ప్రోగ్రాం వీడియోని స్క్రీన్ మీద చూపిస్తుంటే అసలు నేనేనా అది, ఎంత అందంగా ఉన్నాను, ఎంత ఆత్మవిశ్వాసంతో జవాబులు చెప్పాను. నా మీద నాకే అసూయ పుట్టేలా, అని ఆశ్చర్యపోవడం నా వంతైంది. ఇక ఎడిటింగ్ అయినాక చూస్తే ఇంకెంత బాగుంటుందని. వెళుతూ వెళుతూ మేడం తో ఫోటో దిగాలన్నాను. సంతోషంగా సరే అన్నారు. మేడం కూడా ఆ యెల్లో డ్రెస్సులో ఎంత అందంగా, హుందాగా ఉన్నారని. ఆత్రంగా ఇంటికి వచ్చి ఫేస్బుక్ లో మా ప్రోగ్రాం గురించి రాయడం ఏంటి, మేడంతో తీయించుకున్న ఫోటో పోస్ట్ చేయడం. ఎంత ఎగ్జైట్మెంటని.

ఈ సంతోషం రాత్రి వరకు కూడా మిగల్లేదు. కోపం, బాధ..ఎలా..? ఏం చేయగలను నేను. సెల్ ఆన్ చేశాను. మెసెంజర్ ఓపెన్ చేసి చూసాను. చేతులు తడబడుతున్నాయి. ఇందాక పోస్ట్ దగ్గర కామెంట్ చేసినవాడు. మెసెంజర్ లో నేను రాసిన దానిగా జవాబుగా వరుసగా ఐదారు మెసేజ్లు. అతి వక్రంగా, అతి రోతగా, అతి జుగుప్సాకరంగా. కాసేపు బుర్ర పని చేయలేదు. కోపం, రోషం స్థానే నిస్సత్తువ ఆవరించింది నన్ను. వెంటనే మెసెంజర్ బ్లాక్ చేశాను. ఇంతలో వాట్సాప్ నుంచి మెస్సేజ్లు. ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసే విధంగా. మెసెంజర్ బ్లాక్ చేసానని ఇక్కడికి వచ్చినట్లు ఉంది. ఇక్కడా బ్లాక్ చేశాను ఆ నెంబర్ ని.

బెడ్ మీద పడుకుని దిండులో ముఖం దాచుకున్నాను. కన్నీళ్లు దిండుని తడుపుతున్నాయి. ఎంత పొగరు. ఎంత లేకీ తనం. నేనేం చేయలేనా. మైండ్ బ్లాంక్ అయింది. నిద్ర కూడా దూరం అయింది.

అన్యమనస్కంగా ప్రాజెక్ట్ వర్క్ కంప్లీట్ చేసి, మా టీం లీడర్ కి మెయిల్ చేశాను. తల మిగిలిపోతోంది ఆలోచనలతో. కాంటీన్ కి వెళ్లి వేడివేడి కాఫీ తాగాలనిపించింది. సిస్టం క్లోజ్ చేసి, మేనేజర్ కి చెప్పి కాంటీన్ వైపు నడిచాను.

వెనుకే వచ్చింది తను. “ ఏంటే..వాడు..ఆ రోగ్, మేడం గురించి అంత నీచంగా కామెంట్ పెడితే నువ్వు వాడిని ఊరికే వదిలేస్తావా..? “

“మరి ఏం చేయను చెప్పు”

“వాడిని అలా వదిలేస్తే, మనం చేతకానివాళ్ళం అనుకుంటాడు. ఈసారి ఇంకొ అమ్మాయి గురించి నీచంగా కామెంట్ చేస్తాడు”

“అయితే ఇప్పుడు ఏం చేద్దాం మనం. ఏం చేయగలం మనం వాడిని “ ఎడతెగని ఆలోచనలతో తల పగిలిపోతోంది. ఆ నీచుడిని తల్చుకుంటే గుండె భగ్గున మండుతోంది. నాకు శక్తి ఉంటే ఆ మంటల్లో వాడిని నిలువునా తగలబెట్టాలని ఉంది. రేపు ఏం జరుగుతుందో అనే ఆత్రుత మొదలైంది మా ఇద్దరిలో.

★ ★ ★

బంజారా హిల్స్ ఏరియా లోనే పెద్ద పబ్ అది. లోపల డీజే సౌండ్ చెవులు చిల్లులు పడేలా మ్రోగిపోతోంది. అంతా ఫారెన్ సరుకే. తాగేవాళ్ళు తాగుతున్నారు. తినే వాళ్ళు తింటున్నారు. మందేసి, చిందేసి మత్తులో ఊగిపోతున్నారు మరికొందరు. అప్పటికే ఫుల్ బాటిల్ విస్కీ అతని కడుపులోకి పోయి అక్కడ తకిట తధిమి ఆడుతోంది. ముద్ద ముద్ద మాటలతో

"డార్లింగ్..ఆ గుండెల మీద చున్నీ ఎందుకు. నీ అందాల్ని కప్పేసే ఆ చున్నీ వేసుకోవద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు" బలంగా కుడిచేత్తో చున్నీని ఆమె గుండెలమీద నుంచి లాగి పక్కకు విసిరేసాడు అతను.

అతని ఎడం చేతిని బలంగా పట్టుకున్నారు వెనుకనుంచి ఎవరో.

తల తిప్పి చూసాడు. అతని చేతిని పట్టుకుంది ఆమె. పోలీస్ శాఖలో రాష్ట్ర షీ టీమ్స్ ఉన్నత అధికారి. ఆమె వెనుకే నలుగురు లేడీ కానిస్టేబుల్స్.

" ఆ నీచుడిని అరెస్ట్ చేయండి మేడం" అరిచింది ఆమె

అతను తేరుకునేలోగానే అతని రెండు చేతులకు బేడీలు వేసింది లేడీ కానిస్టేబుల్

"అడ వాళ్ళు అంటే అంత చులకనగా ఉందిరా నీకు..? సోషల్ మీడియా లో ఆడవాళ్ళ వస్త్రధారణ గురించి నువ్వు చేసిన నీచపు కామెంట్స్ కి,నీమీద చాల మంది అమ్మాయిలు కంప్లైంట్స్ చేసారు. నీమీద ఎఫ్. ఐ .ఆర్ నమోదు అయింది. నిన్ను అరెస్ట్ చేస్తున్నాం"

ఈడ్చుకెళుతోంది అతడిని పోలీస్ వాన్ దగ్గరకు కానిస్టేబుల్.

వ్యాన్ కి కాస్త దూరంగా పసిబిడ్డను ఎత్తుకుని ఆమె. కళ్ళు ఒత్తుకుంటూ.

"ఇంకో మాట. రోజు తాగి వచ్చి ఇంటిదగ్గర భార్య,బిడ్డను కొడుతున్నావని, బానిసలుగా చూస్తున్నావని, నీ భార్య గృహహింస కేసు నీ మీద పెట్టింది. ఈ రెండు కేసుల్లో బలమైన సాక్షాలు, ఆధారాలు మా దగ్గర ఉన్నాయి. నీకిక కటకటాల మధ్య చిప్పకూడే గతి. ఎక్కరా వ్యాన్. ముందుకు బలంగా తోచింది షీ టీమ్స్ ఇన్స్పెక్టర్ మేడం వాడిని.

నా కళ్ళల్లో వాడిమీద విజయం తాలుకు తృప్తి కదలాడింది ఆ క్షణం

**కవిత**

# ఎక్కడ చూసినా ఆమే!



**యలమర్తి అనూరాధ**
9247260206

పారిశుద్ధ్య శుభ్రతలో
ప్రజా పరిపాలన లో
నివారణ చర్యల్లో
పిల్లల ఆలనా పాలనలో
ఆన్లైన్ చదువుల్లో
సహకారం ఎక్కడ అవసరమంటే
అక్కడ నేనున్నాను అంటూ
బాధ్యత బరువు ఎంతున్నా
పట్టించుకునే స్థితిలో ఆమె లేదు
పోరాటంలో రుద్రమను తలపిస్తూ
అది పోలీస్ ఐనా
శాస్త్రవేత్తగా నైనా
పాత్రకు జీవం పోయటమే కర్తవ్యంగా
అడుగులు వడివడిగా కదిలిస్తోంది
అలల కెరటంలా ఉరుకుతూ
ఈ పరుగు అస్త్రంలా సాగుతూనే
లక్ష్యం దిశలో!

కథ

# ఊహల దెయ్యం ......



లంక సీత

ఢిల్లీ 9868145541

పిల్లలిద్దరూ సస్కూల్ కి వెళ్లారు. ఆయన టూర్ వెళ్లి 5 రోజులయ్యింది . సుజాతకి మనసంతా ఏదో గందరగోళంగా వుంది. ఫలానా కారణమని తెలియదు. కాలక్షేపానికి ఏదయినా చదువుదామంటే కొత్త పత్రికలేం లేవు. పిల్లలు రెండు గంటలకి గాని రారు. ఏం తోచక సుజాత అలా మంచం మీద వాలి పై కప్పు కేసి చూస్తూ ఆలోచిస్తోంది. ఆయన టూర్ వెళ్లి ఎందుకు ఫోన్ చేయలేదు, వుత్తరం గూడా రాయలేదు. ఎప్పుడు టూర్ వెళ్లినా దారిలోంచే పది సార్లు ఫోన్ చేయడం, చేరిన వెంటనే రెండు పేజీల వుత్తరం రాయడం......అందులో విశేషాలేం వుండవు. ముద్దులతో సుజికి అంటూ మొదలుపెట్టి..ఏదో నాలుగు లైన్లు రాసి మళ్ళీ నువ్వు లేకుండా ఒక్కడిని ఉండలేకపోతున్నాను అని వ్రాయడం తప్ప...ఇంటినుంచి వెళ్లిన మర్రోజే విశేషాలు యేముంటాయి నా మొహం....

అటువంటిది ఇప్పుడేమైంది. ఆయనలో ఏదో మార్పు కనపడుతోంది. ఆ మధ్య టూర్ లో పని ఎక్కువగా ఉంటోంది నెక్స్ట్ టైం నుంచి మా అసిస్టెంట్ రమ్య ని గూడా తీసుకు వెళ్ళాలి అన్నారు. ఈసారి టూర్ కి యిద్దరు కలిసే వెళ్లారు. ఏమయిందో మరి ? టెలిఫోన్ లేదు ఉత్తరము లేదు. అప్పుడే వెళ్లి ఐదు రోజులయింది. మళ్ళీ తనలో తానె తప్పుగా ఆలోచిస్తున్నానేమో అనుకుంది.

ఛ! ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను. ఆయనకు నేనంటే ప్రాణం. ఎప్పుడు పరాయి స్త్రీల గురించి మాట్లాడటం గాని కామెంట్స్ చేయడం గాని చేయని మనిషి ని గురించి తప్పుగా ఆలోచిస్తున్నాను అనుకుంది. పిల్లలు వచ్చేదాకా పోనీ టి. వి. చూస్తే కాస్త మనసు మారుతుందని హాల్లోకి వెళ్లి టి.వి. పెట్టింది.

టి.వి. లో సీరియల్ వస్తోంది...... స్టోరీ ఈ రకముగా వుంది..

రమేష్ ఆడిట్ డిపార్ట్మెంట్ లో పనిచేస్తున్నాడు. అతను ఆడిట్ పని మీద కర్నూల్ టూర్ వెడతాడు . అక్కడ ఆఫీస్ లో ఎక్కౌంట్స్ డిపార్ట్మెంట్ ఇంచార్జి నళిని యితని పక్కనే కూర్చుని అకౌంట్స్ గురించి వివరిస్తోంది. పొద్దున్న పది గంటల నుంచి ఆడిట్ వర్క్ నడుస్తోంది. అప్పటికే సాయంత్రము ఆరు గంటలయింది. నళిని "సర్ టైం ఆరయింది రేపు తొందరగా వస్తాను వర్క్ కంప్లీట్ చేయడానికి" అంది. ఓ.కె. అని మళ్ళీ వర్క్ లో పడ్డాడు రమేష్. అది చూసి నళిని "సార్ ఉదయమునుంచి వర్క్ చేస్తున్నారు మిగతాది రేపు చూసుకోవచ్చు" అంది.

బాగ్ భుజాన్ని వేసుకుని కొంచెం తటపాయిస్తూ "సర్ మీకు అభ్యంతరం లేకపోతె ఈ రోజు డిన్నర్ మా ఇంట్లో చేయండి" అంది. అంతకంటేనా! హోటల్ భోజనం కంటే ఇంటి భోజనమే మంచిది అనే ఉద్దేశ్యంతో సరే అన్నాడు. నళిని తో వాళ్ళ ఇంటికి వెళ్లాడు. నళిని ఒక్కర్తే ఉంటుందని రమేష్ కి తెలియదు. రమేష్ కాస్త ఇబ్బందిగా ఫీల్ అవుతుంటే నళిని చెప్పింది నేను మా తమ్ముడు ఉంటున్నాము. మా తమ్ముడు ఎలక్ట్రిసిటీ బోర్డు లో ఉద్యోగము. ఎనిమిది గంటకి వస్తాడు అని చెప్పింది. నళిని వంట పూర్తి అయి తమ్ముడు కోసం వెయిట్ చేస్తున్నారు. అప్పటికే రాత్రి 9 .30 అయింది. అప్పుడు వచ్చింది నళిని తమ్ముడు ఫోన్ "అక్కా ఈ రోజు నైట్ డ్యూటీ అతను రాలేదు అందుకనే నేను నైట్ డ్యూటీ కూడా చేయాలి నువ్వు భోజనం చేసి పడుకో " అని ఫోను చేసాడు. అప్పటికే ఆలస్యమైందని నొచ్చుకుంటూ నళిని తామిద్దరికి భోజనాలు వడ్డించింది. రమేష్, నళిని భోజనాలు చేసేప్పటికీ పదిన్నర అయింది. "ఇంత రాత్రి వేళ హోటల్ కేం వెడతారు మా తమ్ముడు రూమ్ ఖాళీయే ఇక్కడే పడుకోండి" అని మొహమాట పెట్టింది నళిని. పొద్దుటినుంచి ఆడిట్ వర్క్ తో కాస్త తల నొప్పి, అలసట అనిపించి హోటల్ కి వెళ్లే ఓపిక లేక సరే అన్నాడు.

సుజాత ఏ మూడ్ నుంచి బయట పడదామని టి. వి. పెట్టిందో అదే ఆలోచన టి. వి. వాళ్ళ సీరియల్ లో వస్తోంది. సుజాత భయపడిపోయింది టక్కున టి.వి. ఆఫ్ చేసేసింది.

ఇదేమిటి ఇలాంటిదే గనుక నిజమైతే నా బ్రతుకేం కాను అని వొణికిపోయింది.

ఇంతలో పిల్లలు స్కూల్ నుంచి వచ్చారు. అప్పటికి కాస్త తేరుకుని పిల్లలకి అన్నాలు పెట్టింది. "అమ్మా నువ్వు తినవా?" అని అడిగారు పిల్లలు. "నాకు కొంచెం తల నొప్పిగా వుంది తరువాత తింటాను " అంది. వెంటనే కొడుకు లేచి అమృతాంజనం తెచ్చి తల్లి నుదిటి మీద రుద్దాడు. వీడికి అన్ని వాళ్ళ నాన్న పోలికలే. ఆయనా అంతే నాకేమయినా వస్తే ఒకటే ఖంగారు పడిపోతారు ఆయనకీ నేనంటే ప్రాణం అనుకుంది. అటువంటి భర్తనా నేను అనుమానిస్తున్నాను పాపిష్టిదాన్ని అని మనసులో అనుకుంది.

అప్పుడు మోగింది హాల్లో టెలిఫోను. "సుజీ నేను........ గుంటూరు నుంచి మాట్లాడుతున్నాను. నేను ఇంటినుంచి బయలుదేరి ఎయిర్ పోర్ట్ కి వెళ్లి చెక్ ఇన్ అయి బోర్డింగ్ కోసం వెయిట్ చేస్తుంటే అమ్మకి సీరియస్ గా ఉందని వెంటనే బయలుదేరి రమ్మని నాకు ఫోను వచ్చింది. ఆ ఖంగారులో ఏమీ తోచలేదు. వెంటనే గుంటూరు వెళ్ళిపోయాను. గత ఐదు రోజులుగా అమ్మని ఐ.సి.యూ. లో ఉంచారు. రాత్రి పగలు ఏం వార్త చెబుతారో అని ఐ.సి.యూ. ముందరే కూర్చున్నాము. ప్రస్తుతము అవుట్ అఫ్ డేంజర్ అని చెప్పారు.

అందుకనే నేను నీకు ఫోను చేయడం గాని లెటర్ వ్రాయడం గాని చేయ లెకపోయాను" అని భర్త చెప్పడంతో సుజాత నిస్త్రాణగా ఫోను పట్టుకుని అలాగే నిలబడిపోయింది. ఇటు నుంచి ఏం సమాధానము లేకపోయేప్పటికీ సుజాతకి కోపం వచ్చింద ని అనుకుని.......

సారీ సుజీ....అదిగో నీకు కోపం వచ్చింది కదూ ...నేను వచ్చాక నీ కోపమంతా నా మీద చూపించు ఫరవాలేదు. నేను రావడానికి ఇంకా వారం పట్టచ్చు. అమ్మ డిశ్చార్జ్ అయి ఇంటికి తీసుకు వెళ్ళేదాకా ఉండి వస్తాను. నా కోసం బెంగ పెట్టుకుని అన్నం తినడం మానేయకు. పిల్లలు జాగ్రత్త. అని ఫోను పెట్టేసాడు. సుజాత అలాగే సోఫా లో కూలబడిపోయింది. నేనెంత పాపిష్టి దాన్ని దేముడు లాంటి భర్త ని అనుమానించాను అని తెగ పశ్చాత్తాపపడిపోయింది. ఆయన వచ్చాక కాళ్ళ మీద పది క్షమించమని వేసుకుంటాను అనుకుంది. ఎప్పుడెప్పుడు భర్త వస్తాడా అని ఎదురు చూస్తూ వుంది.

వారం రోజులు యిట్టె గడిచిపోయాయి. రాజీవ్ ఇంటికి వచ్చాడు. సుజీ ని చూస్తూనే ఆశ్చర్యపోయాడు. పీక్కుపోయిన మొహం, కళ్ళు గుంతలు కట్టి ఎన్నో రౌజుల నుంచి లంఖణాలు చేసిన దానిలాగా కనబడుతోంది. చూస్తూనే ఏమైంది సుజీ అంటూ ఖంగారుగా అడిగాడు. సుజాత ఒక్క సారిగా ఏడుస్తూ అతన్ని వాటేసుకుని వల వాలా ఏడ్చేసింది. రాజీవ్ ఖంగారు పడిపోయాడు. పిల్లలకేమయినా అయిందేమో, జరగ కుడనిదేమయినా జరిగిందేమో అని ఖంగారుపడ్డాడు. కొంత సేపు ఓదార్చక సుజాత ఏడుపు స్వరం తో ముందు "నన్ను క్షమించాననండీ " అంటూ అతని కాళ్ళ మీద పడింది. ఆమె భుజాలు పట్టుకుని లేపి సంగతేమిటని అడిగాడు. అప్పుడు తను అతని గురించి తప్పుగా ఆలోచన చేసిన సంగతి చెప్పి క్షమించానని అనేదాకా ఏడుస్తూనే వుంది.

ఓసి పిచ్చి సుజీ "నువ్వే కాదు ఏ ఆడదయినా అలానే ఊహిస్తుంది . ఇందులో నీ తప్పేమి లేదు అది స్త్రీ సహజ ఆలోచన" అన్నాడు. సరే ఇప్పుడు చెప్పు ఒక వేళ అలానే జరిగిందనుకో ఏం శిక్ష విధించాలనుకున్నావు " ? అన్నాడో లేదో గట్టిగా తన చేతితో అతని నోరు మూసింది. "నా భర్త శ్రీరామ చంద్రుడు అల్లా ఎప్పటికీ జరగదు." అంది.

ఆహా ! "అంత నమ్మకం వున్నప్పుడు అలాంటి ఆలోచనలు ఎందుకు వచ్చాయి ట? "అదంతా పీడ కలలాగా మర్చిపో " అంతే గాని ఇలా మొహం పీక్కు పోయి, నీరసించిపోయి లేనిపోని సమస్యలు తెచ్చుకోకు.

"నా కంటికి నువ్వు తప్ప ఎవరు కనపడరు. లే బాగా ఆకలి అవుతోంది అన్నము తిందాము పద. ఈ వారం, పదిరోజులనుంచీ నీ చేతి భోజనము చేయక ఎలా చిక్కిపోయానో చూడు" అంటూ వాతావరణము తేలిక పరుస్తూ సరసమాడాడు.

సుజాత తేలిక పడిన మనసుతో దేముడి ముందు మోకరిల్లి క్షమాపణ కోరుకుంది. వెంటనే భర్తకు ఆప్యాయంగా భోజనము వడ్డించింది.

కథ

# మోచేతి మోక్షము



కాంతి నల్లూరి

91 6300 328 040

అక్కా బాగాలేదా? రాజీ పరిశీలిస్తూ అడిగింది.

బాగానే ఉన్నాను రాజి.

లేదక్క మీరు ఏదో ఆలోచిస్తూ, పిలిచినా పరధ్యానంగా ఉంటున్నారు.

చెవుడు వచ్చిందెమో? రాజి నవ్వుతూ నిర్మల.

చెవుడు కాదు ఏమి కాదు. జోకులేయ్య వద్దు. ఈమధ్య చాలా మౌనంగా, నిర్లిప్తంగా ఉంటున్నారు. ఉమా కూడా అంది. రాజీ తను ఒక్కదానే కాదు అన్నట్లుగా

ఉమా ఏమంది? రాజి.

"గలగల నవ్వుతూ, పెద్దగా మాట్లాడుతూ, మన కన్నా ఎక్కువ గోలచేసే నిర్మలక్క ఏదోలా ఉంటుందని".

అబ్బో! నా మీద ఇద్దరు పి.హెచ్.డి చేస్తున్నారా? ఏంది రాజి యదా ప్రకారం నవ్వుతూ నిర్మల. అమ్మయ్య, ఇప్పుడు మామూలు నిర్మలక్కలా మాట్లాడేవు. అక్క కబుర్ల కొంగాని, వంటింట్లోకి పోదాం పద. నేను అంట్లు తోము కోస్తాను. నిన్నటి పప్పు ఉంది. ఆ బెండకాయ ముక్కలతో పులుసు చేసి, టి పెట్టెమ్. అని చకచకా అంట్ల దగ్గరకు వెళ్ళింది.

అక్కా చెప్పండి అంది రాజి 'టీ' ని ఆస్వాదిస్తూ.

ఏమి చేప్పేది. మన మహిళా సంఘం కబుర్లు ఏంటో నువ్వెచెప్పు.

చెప్తాను గాని, ముందు నువ్వు చెప్పక్క నాకు తెలిసినంత వరకు ఆర్థిక, కుటుంబ సమస్యల్లేవు. అన్న సంగతి తెలుసు. బందగి కూడా మంచమ్మాయె. బాగానే చదువుతుంది. అన్ని విషయాలు మీతో పంచుకుంటుంది. ఇంకేమి ఆలోచిస్తున్నావు. పట్టుదలగా అడిగింది రాజి.

'ఏం లేదు రాజి'. నవ్వుతూ నిర్మల.

నువ్వు మౌనంగా ఉంటే ఇల్లంతా మౌనంగా ఉంటుందక్క నేను కూడా తెలుసుకుంటాను కదా! చెప్పక్క, చెప్పెదాకా వదలనన్నట్లు రాజేశ్వరి మళ్ళీ మళ్ళీ అడిగింది.

ఏం లేదు రాజి. మనకు బ్రతకటం చేతకాదేమో అనుకుంటున్నానని ఆలోచిస్తున్నాను.

అందేంటక్క, ఎందుకు? అలా అనుకుంటున్నారు.

ఈ మధ్య బందగి మారవంటూ నన్ను కోప్పదుతుంది రాజి.

బందగి కోప్పదుతుందా? నిజమా? నిర్ఘాంత పోయింది రాజి. బందగి మనందరి మధ్య మంచిగా పెరుగుతున్న పిల్ల. తను సెకెండ్ క్లాసులోనే తన డైరీలో ఐ బికం ఎ గుడ్ హ్యూమన్ బియింగ్ (I Become a Good Human Being) అని రాసుకున్న మంచమ్మాయి. రాజీ ఆశ్చర్యపోతున్న దానిలా అన్నది.

నిజమే రాజి! బందగి మంచి పిల్లె, రూపాయి ఇయ్య మంటె ఐదురూపాయలు ఇస్తుంది. పెద్ద పెద్ద మాల్స్ కోనే దానికన్నా ఇంటిముందు బండ్ల మీద వచ్చే వారి దగ్గర కొంటె వారు బ్రతుకుతారు. బేరాలు చేయవద్దంటుందని తెలుసు కదా! బందగి మాట నిజమేనని వెల్లుల్లి, ధనియాలు, పళ్ళు, వేరుశనగలు, పేలాలు, శనిగముద్దలవాంటి వన్ని కొంటాను కదా రాజి.

ఆ శనగ ముద్దలమ్మేతను, ఇంత పొడుగు జుట్టు, గడ్డంతో మురికిగా ఉంటాడని వద్దు అనేది. కరోనా కాలంలో అతను బ్రతకాలి. ఆడోక్కు సైకిల్ మీద ఎంత దూరం తిరిగి అమ్ముతాడో? కొను తింటాను అంటుంది. తినకపోతే తంతాను

అంటు కొంటున్నాను. పాపం తింటుంది. వడియాలు, అప్పడాలు తనకసలు ఇష్టం ఉండదు. అతని దగ్గర అవి కొనిపించి తింటుంది. తనే వేపుకొని స్నాక్సులాగా. అవునక్క బందగిది జాలిగుండె. స్పందన లెక్కువే కదక్కా, అవును రాజి, ఇప్పుడు, బందగి మీద ఫ్రెండ్స్ ప్రభావం పడుతుందనిపిస్తుందరా. ఈ ఇల్లు, ఇక్కడ ఉండటం నచ్చటం లేదు. "ఎందుకమ్మా ఇక్కడ, ఈ పిచ్చిచోటులో, ఈ పిచ్చి ఇల్లు కట్టావంటుంది". ఇల్లు పిచ్చిదైనా మన కంటూ స్వంతది కదమ్మా. మనం చిమ్మక పోయినా ముగ్గులేయ్యక పోయినా, పూజలు చేయ్యక పోయినా ఏవరు, ఏమి అడగరు. ముందు అద్దె కట్టె బాధ లేదంటె అర్థం చేసుకుంది.

ఇప్పుడు, ఇంటి చుట్టు ప్రక్కల ప్రశాంతత లేదంటుంది. నిజమే, ఉత్పత్తిలో భాగం కాని, పనిలేని అడంగులందరు, ఇంటి ప్రక్కనున్న చెట్లకింద ఉదయం నుంచి సాయంత్రం దాకా దోయలాట గోలగలగా ఆడుతారు. పగలు మనం ఉండం కదా నో ప్రాబ్లం అంటె, ఉన్నరోజూ వీళ్ళగోలతో విసుగ్గా ఉంటుంది కదమ్మా. ఈ కరోనా కాలంలో కొద్దిసపు బయట కూర్చుందామన్నా ఆగోల భరించలేము వద్దు అంటావు. ఎంత సేపు ఇంట్లో ఉందాము? అని విసుకుంటుంది.

మనకున్న ఆర్థిక స్థితిని బట్టి. ఇప్పటి దాకా ఎక్కువగా స్లమ్స్ లోనే ఉన్నా ఏప్రాబ్లం లేదు. కాబట్టి ఇల్లు ఇక్కడ కట్టేము. మనం కట్టినప్పుడు ఇది స్లమ్, బాగానే ఉంది. ఈ పది ఏళ్ళుగా స్లమ్ నుండి మధ్య తరగతి వర్గంగా ఏరిగింది. రేకుల ఇళ్ళు, పూరిళ్ళను తీసి డాబాలు వేశారు. ఇది అభివృద్దే రాజి. ఇళ్ళు విశాలం అయినవి కాని, మైండ్లు ఇరుకు అయినవి. మనం మాట్లాడుతున్నా ఒక్క క్షణం నిల్చోని సమాధానం చెప్పరు.

ఐదు ఇళ్ళ అవతల ఉండే డాక్రా గ్రూపు యానిమేటరు ఇంటింది ఏదో ఒక పథకం. ఎలక్షన్స్ వచ్చినప్పుడు కాంపెయిన్సు, ఓట్ల డబ్బులు పంచి ఒక రాజకీయ నాయకురాలుగా తయారైంది. ఆమెను చూస్తే వీళ్ళందరికి భయం. ఏ పథకం రాకుండా చేస్తోందోనని. పంక్షన్స్కు కులాల వారిగా పిల్చుకుంటారు ఇక్కడ. ఈమెను మాత్రం అన్ని కులాల వాళ్ళు పిల్చి పీట వేయాల్చిందే, అప్పుడు కూడా వాళ్ళ మీద ఈమె పెత్తనం చేయాల్సిందే.

ఆవిడను మనం లెక్క వేసుకోం. ఆవిడ పెత్తనాన్ని మనం సహించం. ఆవిడ భర్త మన ఇంటి చెక్కపని చేసి, రెండు తలుపుల చెక్క లేపేశాడు, దానికని, దీనికని ఏదో ఒక రూపంలో చాలా డబ్బు తినేశాడు. మన పని చేసిన తరువాత అతని పని నచ్చక, వాళ్ళ ఫ్రెండ్స్కూ కూడా పని ఇవ్వలేదు. ఈ కోపమూ ఆవిడకు పీకలదాకా ఉంది. ఇక్కడున్నా పది ఇళ్ళతో మనకు వ్యతిరేకంగా గ్రూపు కట్టింది. వీళ్ళని అంత బ్రతిమాలాల్సిన పనేంటలే అని పెద్ద పట్టించుకోం. అంత తీరక, ఓపిక మనకెక్కడది. దేవుడు, దెయ్యం మనకు లేరు కాబట్టి ఆ పంక్షన్లకు వెళ్ళక పోతే ఏమి లేమ్మా అని బందగికి అర్థం చేయించాం.

ఈ మధ్య మళ్ళీ, మళ్ళీ, పిచ్చిచోట, పిచ్చిల్లు కట్టేవు, మన ఇంటి చుట్టు ప్రక్కలే ఇన్ని సమస్యలు, ఇంకెక్కడా వుండ వంటొంది. ఆలోచిస్తే నిజమే అనిపిస్తోంది రాజి.

గవర్నమెంట్ ఉద్యోగిగా గవర్నమెంట్ సోమ్మంతా మనమే తినేస్తు న్నామనుకుంటారో? వాళ్ళ పిచ్చి కబుంలో భాగం కాలేదనామంటారో? వాళ్ళతో చేరి కాలక్షేపం చేయ్యటం లేదనుకుంటారో? ఏమో? పెడసరంగా మాట్లాడతారు.

ఎడమ ప్రక్క బర్రెగొడ్ల వాళ్ళ గోల. వాటిని ఒదిలేసి మొదలకుండా ఉంటారు. ఇటువాళ్ళు, అటువాళ్ళు అయ్, అయ్ అని తోలుతారు. అన్ని మన ఇంటిముందే వుంటాయి. తరమడానికి మనం ఉండం. వాటి పేడ, ఉచ్చలు అన్ని ఇంటిముందే. వాటి పేడ, ఉచ్చలు అన్ని మన ఇంటి ముందె. వాళ్ళ ఆటోలతో, బళ్ళతో ఆవన్ని చింది గోడల నిండా మరకలే. తియ్యి మంటె బజారు అంటారు. పక్క బజారులో కుమ్మరి వాళ్ళ బర్రెగోడ్లు పోలానికి మేతకి పోతా, ఇంటికీ వస్తా పేడా పెడుతున్నాయని ఆ యానిమేటర్ నాయకత్వంలో పోలిస్ స్టేషన్ కెళ్ళి కేసు పెట్టారు.

బజారు కాదనను. బజారైతే రోజుకు ఒకసారి వస్తాయి, పోతాయి. అప్పుడు తియ్యక్కరలేదు. కట్టెయ్యకుండా వదిలేసి, ఇక్కడిక్కడే ఉంటూ పేడలు, బజారంటె కుదరదు తియ్యాల్సిందె ననటంతో గొడవలు. ముగ్గురన్నదమ్ములు, ముగ్గురక్కచెల్లెళ్ళు రేసు కుక్కల్లా వస్తారు తగాదకు. ఇదేవాళ్ళ బలం. పెద్దాయన కుటుంబానికే తప్ప మిగతా ఎవ్వరికీ, పిల్లలకు కూడా మోరలు వాల్యూస్ లేవు.

రాజకీయ నాయకులకు, పెద్ద మనుషులకు వీళ్ళ ముప్పై ఒట్లు ప్రదానం. మన రీజనింగ్కు సమాధానం చెప్పలేక దిగమింగుతున్నారనుకో. కొళ్ళు మందలు, మందులు పెంచుతారు. ఓపికున్నరోజో, సెలవురోజో, కడిగి ముగ్గు పెట్టి వస్తానా! గంట లోపలే సంక్రాంతి గోబ్బెమ్మలా పేడలు, కోడి పెంటలు.

కుడి ప్రక్క తాగుబోతోడి బూతు పురాణం. వింటున్నావుగా? వినిపిస్తోందా? వాడున్నప్పుడు బయటకు వెళ్ళాలంటేనే బందగి బయపడిద్ది. ఏడు, ఎనిమిదేళ్ళ పిల్లప్పుడైతే పందిని మేపుతున్నట్టు మేపుతున్నారు. కనుమ పంది బలిసినట్టు బలిసింది. దున్నలా ఉందనేవాడు. చూడమ్మా ఏలా అంటున్నారో అని ఏడ్చేది. అప్పటికి, తను స్కూల్ నుండి వచ్చేటప్పుడు, పోయేటప్పుడు మేం తీసుకొచ్చేవాళ్ళం. ఒక దశలో అయితే తిండి తినటం కూడా తగ్గించింది. తను కొంచం బొద్దుగా ఉంటుంది కదా. ఈ గోల వాళ్ళ అమ్మదినం రోజు మా అమ్మ ప్రక్కన కూర్చోని బందగిని తిడుతుంటె, మేం ఎవరినో అనుకున్నాం. మా అమ్మ ఏకళనుందో, ఇంకోక మాట అన్నావంటే నరికేస్తాను అంది. అప్పటి నుండి ఆ డైలాగులు తగ్గేయి. ఓ ఆరు నెల్ల తరువాత మా చెల్లితో ఏందే? మీ పెద్దమ్మకి అంత కోపం వచ్చిందంటే, అసలు విషయం అప్పుడు చెప్పింది. పిల్లను అన్నప్పుడల్లా అన్నను, తాగుబోతుడులే ఒదిలేయ్యి అనేదాన్ని, అన్న సంగతి తెలుసు కదా మాట్లాడలేదుకాని, కోపం వస్తే బాదుతాడని.

పెళ్ళామేమో పని పాట లేని పదిమందిని చేరవేస్తుంది. మనం బయటున్నామంటే రెచ్చిపోయి మాట్లాడతారు. తాగడానికీ డబ్బులిచ్చి, ఈ తాగుబోతోడిని రెచ్చగొట్టిది మరీ. ఈ గోల భరించ లేక అడిగితే కొట్లాట దాకా వెళ్ళి కేసు పెట్టింది.

పర్సనల్ గొడవలు. మన వాళ్ళకెందుకులే అని, మనలను బాగా ఉపయోగించుకున్న చుట్టాలబ్బాయికి ఫోన్ చేశాం. వీడికి అంత సీను లేదని అర్థమై, ఆ డాక్రా యానియేటర్కు చాన్సు చిక్కనివ్వకూడదని ఫోన్లు చెయ్యటం మొదలు పెడితే, దబదబా ఫ్రెండ్సందరు పోలీస్ స్టేషన్కు వచ్చారు, ఓ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.ఐకి ఫోన్ చేశాడు. లేకపోతే పోలీసులు మన మీద వచ్చిన అవకాశాన్ని వదులు కోనేవాళ్ళు కాదు కదా. మొగుడు పేళ్ళాలే స్టేషన్ చుట్టు చోటా మోట రాజకీయ నాయకులను వేసుకోని తిరిగి కేసు విత్ డ్రా చేసుకున్నారు.

అవునక్క! ఈ గోడవంతా టీ కప్పులో తుపాను అనుకున్నాం కదా! అప్పుడు.

మా చుట్టాలబ్బాయి మనతో అవసరాలు తీరగానే మా పెద్దావిడ వైపు చేరి, చిలువలు పలువలు చెప్పేడు. మిగతా ఇద్దరులా ఆమె పెత్తనాన్ని ఒప్పుకొని, అణిగి, మణిగి నేనుండను కదా! చావనైనా చస్తాను కాని, నన్ను నేను ఇంకొకరి దగ్గర దిగజాన్చుకొను అంటున్నాను. అలాగే ఆమె ఇంటి నుండి వచ్చిన ఈ ముప్పైఐదేళ్ళ నుండి బ్రతుకుతున్నాను. అలా బ్రతకటం ఆమెకు ఇష్టం లేదు. కనుక వచ్చిన అవకాశాన్ని, అన్న పనిచేసే సంఘాలన్నిటికీ లేఖలు రాసి, మా చెల్లి చాలా మంచిది, అమాయకురాలు, అతనిపై చర్యలు తీసుకొమంది.

అంతమంచి, అమాయక చెల్లిని ఇంటినుండి ఎందుకు గెంటి వేసిందక్క? రాజీ నవ్వింది అర్థం చేసుకొ అన్నట్లు.

అప్పుడు చెడ్డది, ఇప్పుడు మంచిది, అమాయకురాలైందిలే రాజీ. వాటిని వారు తీసి అవతల పడేయటంతో, మన నిజాయితి, ఆమె కమ్యూనిష్టు బండారం బయట పడిందనుకో.

పగలంతా పని చేసి అలసిపోయి వస్తామా? రాత్రిపూట నిద్రపోనియకుండా ఎదురింట కుక్కగోల, వాళ్ళు బెడ్రూం వెనక వైపు. ఆకుక్క గోల వాళ్ళకు వినపడదు. కుక్కను లోపట ఉంచి గేటు వేసుకొండి అంటే లోపల అరుస్తుందంటారు.

రెండో ఎదురింట్లో పిచ్చిపిల్ల గోల “కు....” మూసుకో మనే బూతులు ఆ పిల్ల పూర్తిగా పిచ్చిది కాదు. ఎవరనన్నా అంటుంటే తల్లి నోరు మూయిస్తుంది. మనలను అంటున్నప్పుడు తల్లి ఏమనదు. ఆవిడ చేవులు, కళ్ళు అసలు మొత్తం జ్ఞానేంద్రియాలు మన గోడలకే అంటించిద్ది.

అప్పుడప్పుడు మీ అన్న, నిమ్మి, సతి సావిత్రి మొగుడు కోసం పడ్డ కష్టాల కంటె, నీవు ఇంటి కోసం పడుతున్నవే ఎక్కువంటూ నవ్వుతాడు. వాళ్ళు వచ్చి నా మీద చేపుతున్న వింటాడు ఉత్తమ శ్రోతలా! ఎందుకలా వింటావంటె, వాళ్ళకు అది ఆనందం. మన గురించి మనకు తెలియదా అంటాడు.

రాజీ! ఇవన్ని చాలా చాలా చిన్న విషయాలుగా

ఉంటాయి బయటవాళ్ళకు. అనుభవించే వారికి "మోచేతి మోక్షం" సామెతలా భరించలేము, ఊరుకోలేం.

బందగి ఇవన్నీ అర్థం చేసుకుంటది కదక్క విషయాలన్ని రాజీకి తెలుసు కనుక, ఎందుకు చెపుతున్నానని అర్థం కానట్లు చూసింది.

అర్థం చేసుకుంటది. అప్పుడప్పుడు బాధ వేస్తుందను కుంటా! తొందరగా బయటపడదు కదా. ఇంతకి బందగికి నీ మీద కోపం ఎందుకు వచ్చిందక్క! నవ్వుతూ అడిగింది రాజీ.

ఈ కరోనా కాలంలో కొంతమందికి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించాను రాజి. నాకు ఫోన్, గూగుల్ పేలు లేవు కదా! రాజశేఖర్కు నెంబర్ పంపి, ఎంత పంపించాలో చెప్పేదాన్ని. పంపించి, తనకు తీరినప్పుడు వచ్చి డబ్బులు తీసుకోనేవాడు.

ఒకమ్మాయికి ఫోన్ పే లేక మరోకమ్మాయి నెంబరిస్తే, రాజశేఖర్ ఆ నంబర్కు డబ్బులు పంపేడు. ఆ అమ్మాయి నాకు ఎందుకు పంపేవు. నేనుమన్నా అడిగానా? అంటే, నిర్మలా మేడం పంపమని ఈ నెంబరిచ్చిందమ్మా అన్నాడట. ఆమె ఎవరో నాకు తెలియదు. నేను ఎవరిని అడగలేదు. అంత అవసరం నాకు లేదని అరిచిందట. డబ్బులు వెనక్కి పంపించింది మంచమ్మాయి. రాజశేఖర్ మరుసటి రోజు చేప్పేదాకా నాకు ఈ విషయం తెలియలేదు. ఫోన్ పే రిసిప్ట్ వాట్సాప్ పంపేను. వెంటనే మరుసటి రోజు ఫోన్ చేస్తే, మరచి పోయిందటక్క అంది. మళ్ళీ మరోక నెంబర్కో పంపి వెంటనే స్లిప్ వాట్సాప్ చేసి, ఫోన్ చేసి వాళ్ళకు చెప్పు అని చేప్పాను. నాలుగు రోజులైనా సమాధానం లేకపోతే డబ్బులు తీసుకున్నావా? అని వాట్సాప్ పెట్టగా, హా, అక్క తీసుకున్నా. అని వాట్సాప్ పెట్టింది.

మా స్టూడెంట్, యాక్సిడెంట్ జరిగి మంచంలో ఉన్నానంటే, రాజశేఖర్ రెండు వేలు పంపేడు. మేడం, మేడం చాలవంటే మాఫ్రెండ్ చేత మరోక రెండువేలు ఇప్పించాను. అందినాయి మేడం టి.క్యూ (థాంక్యూ) అని వాట్సాప్ మేసేజ్. మరో ఇద్దరికీ నాలుగువేలు, మూడువేలు రాజశేఖరే ఫోన్ పేలు చేశాడు. ఆంటీకి బాగాలేదంటె పదివేలు ఫోన్ పే రాజశేఖరే చేశాడు. పాపం రాజశేఖర్ని బాగానే విసిగించాను ఫోన్ పేలతో.

వీటన్నిటతో బందగికీ బాగా చిరుత్తు కొచ్చింది. అమ్మా! నువ్వు మారవు. ఇంతకు ముందు ఏమన్నావు. నువ్వు ఇంకొక పదేళ్ళు ముందు పుట్టుంటె, ఖర్చు పెట్టకుండా జాగ్రత్తగా ఉండేదాన్ని. అప్పుడు ఇంటి నిండా ప్రజా సంఘాల వాళ్ళు, చదువుకునే వాళ్ళు, పెళ్ళిళ్ళ కోసం వచ్చే వాళ్ళు, నానమ్మ, అత్తయ్య వాళ్ళు, వాళ్ళ ముగ్గురి పిల్లల చదువులు, పెళ్ళిళ్ళు, దినాలు, బయట వాళ్ళ పెళ్ళిళ్ళు, గొడవలు మొత్తం ఎవరైతేమి యాభై కుటుంబాల లిస్టు రాసేవు కదా!

ఇప్పుడు నేను పుట్టి పదిహేనేళుయింది. ఏమి మారావు? అన్నను బ్రతిమాలి ఫోన్ పేలు చేయిస్తున్నావు. అవి అందాయా? తీసుకున్నారా? లేదా? నువ్వే ఫోన్ చేసి అడగాలి. వాళ్ళు చెప్పరు. మొన్న ఆంటిని కూడా మీ స్టూడెంట్కు డబ్బులు పంపమని చెప్పేవు. ఇదంతా నీకు అవసరమా? నీవు పంపిన డబ్బులకు విలువుంటుందా? వాళ్ళకు ఏమన్నా గుర్తు ఉంటుందా? నీతో పెద్ద పరిచయం లేకున్నా అడగగానే మూడువేలు పంపించేవు. నువ్వేమన్నా రాజేంద్రప్రసాదు వనుకుంటున్నావా? ప్రతి దానికి ఏదో ఒక రిజన్ చేపుతావు.

నాకు తక్కువ అవుతుందని నేను అనటం లేదు. జీతం తగ్గినా పర్వాలేదు అంతదూరం వెళ్ళలేవు, ప్రమోషన్ వద్దనే అన్నాను. కొంచెం జాగ్రత్తగా ఉంటే ఇంతకన్నా చిన్నిల్లు అయినా కొంచెం మంచి ఏరియాల్లో, మీ టీచర్ల ఏరియాలో కట్టుకునే వాళ్ళం కదా. ఈ దిక్కుమాలిన ఏరియాలో ఇల్లు కట్టెవు. ఇది అమ్మెసి మరో చోట కట్టాలన్న స్థలం కూడా కొనలేమంటావు. నేను ఐసుక్రీం, బిర్యాని అంటే అమ్మో! ఎందుకంత ఖర్చు అంటావు. వేలకు వేలు ధాన ధర్మాలను సరిపోతుందని ఏక బిగువున మాట్లాడింది రాజీ.

ఈ గొడవులే కదా! ఆవిడ ఉత్తరాలు రాయడానికి, మీ చుట్టం పోజు లేయడానికి కారణం. ఆ యానియేటర్ మన చెక్క దొబ్బెయటమే కాకుండా నలుగుర్ని వెంటేసు కొచ్చింది. మన మెప్పుడన్నా పోలీసుస్టేషన్కు వెళ్ళామా? ఇవేకాదు రాజి. ఇంకా చాలా చాలా అంది. గుర్తోచినప్పుడు చేపాలే.

బందగి కోపంగా కంటె బాధగా మాట్లాడిందని పిస్తుందక్క.

తను మాట్లాడిన దానిలో రిజనింగ్, నిజాయితి ఉంది రాజి. బందగి అన్నట్లు నిజంగా నాకు బ్రతకటం రాలేదనిపిస్తుంది. నా దగ్గర నుండి ఎంత ఎక్కువ పొందారో వాళ్ళు అంత దూరమయ్యారు. ఎదురైనా, ఎవరో అన్నట్లు పీలింగ్ పేడతారు. అప్పుడు చాలా బాధగా అనిపిస్తుంది రాజీ నాకు కూడా.

బందగి ఇన్ని మాట్లాడిందంటే ఆశ్చర్యంగా ఉందక్క. తనకు ఎంత కోపం వచ్చిందో?

అవును రాజీ! పెద్దదవుతుంది. ఇక నుంచి అన్ని తనకు చెప్పిచేయ్యాలి. యాభై కుటుంబాల విషయం, బందగి మాటలు ఓ పెద్దాయను చెప్పేను.

ఆ పెద్దాయన "ఓ దొంగ ఓ ఇంట్లో దొంగతనానికి వెళ్ళి డబ్బు, నగలు దొంగలించాడు. కొంత కాలానికి ఆర్థికంగా స్థిర పడతాడు. ఆ దొంగ ఆ ఇంట్లో దొంగిలించినవి గుర్తు పెట్టుకుంటాడా! గుర్తుంసుకుంటే ఏదుగు తాడా? ఇది కూడా అంతె. నీ నుంచి దొంగిలించారనుకో అని ఫిలసాఫికల్గా చెప్పేరు.

అవునక్క! పెద్దాయన చెప్పింది చాలా బాగుందని రాజి నవ్వటంతో, నిర్మల కూడా మనసారా నవ్వింది.

ఈ విషయాలే కమ్యూనిష్టు రచయిత సుబ్బమ్మ గారికి చేప్పేను.

ఆమె గొప్ప మార్కిస్టు రచయిత. చాలా విషయాలలో ఆమె ఏమి చేపుతారు? అని ఏదురు చూసే వాళ్ళం కదక్క, ఆమె చెప్పిన దాన్ని చర్చించే వాళ్ళం కదక్క అవును ఏ విషయానైనా మార్కిస్టు కోణంలో వివరిస్తారు.

ఇంతకి ఆమే ఏం చేప్పారు? అక్క అని రాజీ కుతుహలంగా అడిగింది.

పేదలందరికి నిజాయితి ఉంటుందని, అందరు మంచిగా ఉంటారని చేసుకోవాలి. అనుకోవద్దు. వాళ్ళకు తెలియదసలు. దీన్ని మనం అర్థం చేసుకోవాలి. వాళ్ళకు పేదరికం ఒక్కటే తేడా. మిగతావి అన్ని పెట్టుబడి దారుల స్వభావమే, పాలకవర్గ లక్షణాలే ఉంటాయి. పెట్టుబడి దారులకు నూరు శాతం పెట్టుబడి దారీ స్వభావమే ఉంటుంది. లాభమే దోసుకోవడమే ఉంటుంది. శుభ్రంగా వుండటం కూడా పేదలకు తెలియదు. అసలు శుభ్రంగా ఉండటానికి కూడా వారికి అవకాశం లేదు. కావాల్సినన్ని నీళ్ళే వుండవు. వాళ్ళకు తెలిసేటట్లు చెప్పకపోవడం కమ్యూనిష్టు పార్టీలదే తప్పు. పేదల తప్పు కాదన్నారు.

ప్రతి ఒక్కటి కమ్యూనిష్టు పార్టీలు చెప్పాటం కుదరదు. ప్రజలు కూడా నేర్చుకొవటం బాధ్యతగా తీసుకోవాలి. డాక్రాగ్రూపులు, కులసంఘాలు, ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూసే సంఘాలు కాదు. రాజకీయ పార్టీలు, పాలకులు, మీడియా, ప్రజలను పారిన్ కోళ్ళలాగా, ఆత్మవిశ్వాసం లేని, బిక్షగాళ్ళగా చేస్తున్నాయి. అది పాలకుల స్వభావం.

వీటన్నిటిని బ్రేకు చేస్తూ ప్రతి సమస్య మీద, పనిచేసే ప్రతి చోట, ప్రతి ఫ్యాక్టరీలో, ప్రతి కాలనీకి, వ్యవసాయంలో, అమ్మెదగ్గర, కోనేదగ్గర, స్త్రీల, పిల్లల, విద్యార్థుల, యువజనుల, వృద్ధులకు కుడా సంఘాలు ఉండాలి. ఇవన్ని ఉంటెనే పాలకుల, పెట్టుబడి దారుల భావజాలాన్ని ఎండ గట్ట గలుగుతాము. కమ్యూనిష్టు పార్టీలు అభివృద్ధి చెందుతాయన్నారు.

రాజి నీకీ విషయం తెలుసా? యన్. టి. రామరావు హోటల్ రేట్లు పెంచగానే విద్యార్థులు రోడ్లమీద కొచ్చి, రేట్లు తగ్గించాలని ఉద్యమాలు చేసారు. విద్యార్థులకు హోటల్ రేట్లతో ఏం సంబంధం అనుకుంటె పెంచిన ఆ రేట్లు తగ్గెవికావు. ఈ విద్యార్థుల నుండె మెరిన్లాంటి కమ్యూనిష్టు కార్యకర్తలు తయారయ్యారు.

అక్కా! అవన్ని అంత సులభంగా జరుగుతాయా? నిర్మల మాటలకు, కలలకు బ్రేకు వేస్తూ రాజీ అనుమానంగా అంది.

సులభం కాకపోవచ్చు. కష్టమే కావచ్చు. ప్రయత్నిందాం రాజీ. మన ఇళ్ళనుంచే మొదలు పెడదాం.

బందగికి ఈ విషయాలే చెప్పాలి రాజీ. నిర్మల ఓ నిర్ణయానికి వచ్చినట్లు ధృడంగా అంది.

కవిత

# నేను




శైలజామిత్ర
9290900879


నేను
అందరినీ వదిలేసి వస్తున్నాను..
నవ్వుతూ పలకరించే ప్రకృతి కోసం
నవ్వించే మనుషుల కోసం
నన్ను మనిషిగా గుర్తించే మనసుల కోసం
ఎవ్వరూ నన్ను మాత్రం వదలటం లేదు
వెదురు కన్నులతో వెంటాడుతున్నారు
క్రూర మృగాలు నన్ను తరుముతూనే ఉన్నారు
ఇంటా బయటా
ముందు వెనకా
ఆ పక్క, ఈ పక్క
అన్ని దిక్కులోనూ ఒక్క క్షణం వదలకుండా
నన్ను వెంటాడుతూనే ఉన్నారు.
వేదికలు వేడుకలై అలరారుతూనే ఉన్నాయి
స్త్రీ మూర్తిత్వాన్ని ఏకరువు పెడుతూనే ఉన్నారు

పుడమిపైకి వచ్చి తిరుగాడే ప్రతి బిడ్డ సాక్షిగా
నాలోని సహనాన్ని వస్తువుగా చేసుకుని
కథలు కథలుగా నాకే ఏకరువు పెడుతూనే ఉన్నారు
ఇంతకీ.. నేను పురాణమా?
పౌరాణికమా?
సాంఘీకమా? ఆంఘీకమా?
నేనెవరిని?

ఆకాశమంత ఎత్తు ఎదిగినా మబ్బుల నిందలు
ఎదురవుతున్నాయి
అవనిలా మౌనంగా భరిస్తున్నా అవమానాలు
ఎదురొస్తున్నాయి..
వద్దని విసుగుతో విసిరేస్తున్నా బంతులై తరుముతున్నాయి
పట్టించుకోకుండా వదిలేస్తున్నా పరిస్థితులు
పునాదులు ఏర్పరుచుకుని స్థావరాన్ని
ఏర్పరుచుకుంటున్నాయి..
నన్ను వదిలేయండి...
తిట్టద్దు... పూజించవద్దు..
నాకంటూ ఒక కథ ఉంది. ఆ కథను వినండి
మెడలో గంటల శబ్ధం, కాళ్ళకు పట్టీల సవ్వడి
లేకుంటేనేం?
మోపుపై విశ్వ నర్తనాన్ని మోస్తూనే ఉన్నాం కదా?
కళ్ళల్లో కోరిక, కడుపునిండా కావేశంతో
శరీరాల్ని ఆక్రమిస్తున్న పశువులకేం తెలుసు? మాటలోని
మాధుర్యం?

ఇంకా ఇంకా పళ్ళకింద రాయి ఉన్నట్లే ఉంది...
అయినా సరే మాలో అమ్మతనం భరించే శక్తిని ఇస్తూనే
ఉంది..
మీ భవిష్యత్ కు బాట వేస్తూనే ఉంది...

కథ

# దిగ్బంధనం




జయంతి వాసరచెట్ల

9985525355


ఏమండీ..... ఏమండీ....!

అని భర్త ను పిలుస్తూ ఆత్రుతగా వస్తుంది ప్రకృతి.

'ఏంటి ప్రకృతి?

ఎందుకలా గాబరా పడుతున్నావ్!' అన్నాడు భర్త.

గాబరా కాకపోతే ఏంటండీ!

"మనం ఎన్నో విపత్కర పరిస్థితులను ఎదుర్కొని ఎన్నో సమాధానం దొరకని సమస్యలను కూడా ధైర్యంగా ఎదుర్కొన్నాం, కానీ.. ఇదేదో అర్థం కాని తేల్చుకోలేని అవస్థ. ఏంటో మనసేమీ బాగోలేదు అంది ప్రకృతి.

"మనమొక్కరమే ఫేస్ చేయట్లేదు కదా ! ప్రకృతీ... బీ బ్రేవ్ మనం ధైర్యంగా ఉండాలిప్పుడు" అన్నాడు ప్రకాశ్ .

"ఏమోనండీ నాకైతే చాలా భయంగా ఉంది!".

"ప్లీజ్ నీవు అధైర్యపడవద్దు నీకు నేనున్నాను కదా ..!"

అన్నాడు ప్రకాశ్.

ఇలాంటి ఒక సందిగ్ధ పరిస్థితి నాకు వస్తుందని నేను ఏ మాత్రం ఊహించలేదు. ఎందుకంటే, అనారోగ్య రీత్యా నేను ఇల్లు దాటి బయటకు రాను కాబట్టి ఒకవేళ బయటకు వస్తే ఎవరి ద్వారానైనా అంటుకుంటే ట్రీట్మెంట్ కు సరిపోయేంత డబ్బు మా దగ్గర లేదు.

అయినా ఇలాంటి మహమ్మారి బారిన పడాలని ఎవరైనా కోరుకుంటారా...? నా పిచ్చి గానీ....! మనసులోనే అనుకుంది ప్రకృతి.

★ ★ ★

ప్రకృతి, ప్రకాశ్ లు భార్యాభర్తలు. వాళ్ళు ఒక అపార్ట్మెంట్ లో ఉంటున్నారు. కోవిడ్ వల్ల సిటీలో లాక్ డౌన్ పెట్టినప్పటి నుండీ ఇంట్లోనుంచి బయటకు వెళ్ళడం లేదు. ప్రకృతికి గత నాలుగు రోజుల నుంచి తలనొప్పి, ఒళ్లు నొప్పులు, ఛాతిలో ఏదో బరువు పెట్టినట్లు భారంగా అనిపిస్తుంది. ఈరోజు నొప్పులు ఇంకా ఎక్కువయ్యాయి.

అదే మాటే ప్రకాశ్ తో చెప్పింది ప్రకృతి.

"నీవు వేసుకునే మెడిసిన్స్ ఏవైనా మర్చిపోయావేమో.. ప్రకృతి...! ఒకసారి చూడు"అన్నాడు.

"లేదండీ నేనెందుకు మర్చిపోతాను. లాస్ట్ ఇయర్ ఎంత ఇబ్బంది పడ్డానో.. ఆ జ్ఞాపకం ఎలా మర్చిపోతాను.. టైం టూ టైం వేసుకుంటున్నానండీ" ఏదో ఆలోచిస్తూ అంది ప్రకృతి.

పోయిన సంవత్సరం ప్రకృతి హెల్త్ పూర్తిగా పాడైపోయింది ఏమయ్యిందో ఏమో తెలియదు. బెడ్ సిక్ అయ్యే పరిస్థితి.

ఆమె వద్దు అన్నా వినకుండా, ఇంట్లో వాళ్ళు ఆమె పరిస్థితి చూసి హాస్పిటల్ కి తీసుకొని వెళ్ళారు.

డాక్టర్ పరీక్ష చేసి "ఇన్నాళ్ళూ ఏంచేసారు? ఈమె పరిస్థితి ఏం బాగోలేదు. బ్లడ్ చాలా తక్కువగా ఉన్నట్లు అనిపిస్తుంది. వెంటనే ఈ టెస్టులు చేయించి తీసుకొనిరండి. రిపోర్ట్స్ వచ్చాక తన కండీషన్ చూసి హాస్పిటల్ లో జాయిన్ చేయాల్సి రావచ్చు. అప్పటివరకూ ఈమెడిసిన్స్ వాడండి" అని చెప్పింది.

ప్రకాశ్ కు గుండె జారిపోయింది. ప్రభుత్వోద్యోగం అయినా తనకొచ్చే జీతం అంతంతమాత్రమే. ఇప్పుడా నెల మధ్యలో ఉన్నారు. ఖర్చు ఎంతవుతుందో ఏమో, అనుకుని అదే మాట డాక్టర్ తో అన్నాడు ప్రకాశ్ "మీరు నిమ్స్ కు వెళ్ళండి సర్ మీది గవర్నమెంట్ జాబ్ కదా?" అని.

"అవునండీ.." అన్నాడు.

"అయితే ఇంకేం హెల్త్ కార్డ్ తీసుకుని వెళ్ళండి. డాక్టర్ తో కన్సల్టేషన్ తీసుకుని నేను చెప్పిన టెస్ట్ లు ప్రిస్క్రిప్షన్ చూపించండి . వాళ్ళు రాసే ప్రిస్క్రిప్షన్ లో ఈ టెస్ట్ లు మెన్షన్ చేయమంటే చేస్తారు. ఇవన్నీ హెల్త్ కార్డ్ పైన అవుతాయి. ఒకవేళ కాకపోతే ఆటెస్ట్లకు మనీ పే చేయాల్సి ఉంటుంది. కంగారుపడకుండా రెండు రోజుల లీవ్ పెట్టుకోండి. ఒక్కరోజులో పని అవ్వదు" అంది డాక్టర్ భార్గవి.

మనసులోనే డాక్టర్ కు కృతజ్ఞతలు మరీమరీ చెప్పుకుని,

"నాకు ఇంతవరకూ తెలియదు డాక్టర్ గారు. ఇలాంటి వెసులుబాటు ఉంటుందని ఇందువల్ల మాకు కొంచెం హెల్ప్ అవుతుంది. ప్రతీ దానికీ ఇలా రావడం. హాస్పిటల్ చుట్టూ తిరగడం మాటిమాటికీ టెస్ట్లు చేయించడం ... చాలా ఇబ్బందిగా ఉంటుంది. మీరు చెప్పారుగా... ఇప్పుడే వెళ్ళి అప్పాయింట్ మెంట్ తీసుకుంటాను థాంక్యూ మేడం" అన్నాడు ప్రకాశ్.

"అంతవరకూ నేను రాసిన మెడిసిన్స్ వేసుకోండి మర్చిపోవద్దు" అంది డాక్టర్.

అలాగే అంటూ ప్రకాశ్, ప్రకృతి, వాళ్ళబ్బాయి బయటకు వచ్చి అప్పటికప్పుడే నీమ్స్ హాస్పిటల్ కు వెళ్ళి ఫిజీషియన్ దగ్గర అపాయింట్మెంట్ తీసుకుని వెళ్ళి చూపించారు.

డాక్టర్ భార్గవి రాసిన రిపోర్టు చూసి తనూ టెస్ట్ చేసి ఇంకా కొన్ని టెస్ట్ లు కలిపి రాసారు డాక్టర్. రేపు మళ్ళీ వచ్చి టెస్ట్ లకు ఇవ్వండి. ఇప్పుడు టైం అయిపోయింది అన్నాడు డాక్టర్ వెంకట్.

సరే అని బయటకు వచ్చి కాస్త ఊపిరి తీసుకుంటూ.. ఇన్నాళ్ళూ ఏవేవో ప్రయివేటు హాస్పిటల్ లచుట్టూ తిరిగి వాళ్ళు చేయించుకోమన్న టెస్టులన్నీ చేయించాం కానీ... ఫలితం ఏమీ లేదు. ఇప్పుడు ఇక్కడ నయం అవుతుందా.. అనే అనుమానం అందరిలో కలిగింది. ప్రకృతి మాత్రమే తన అనుమానం బయటకు అన్నది.

"మామ్ ఎందుకలా ఏదేదో అనుకుంటావు. మనకు హెల్త్ కార్డ్ పైనే కదా ట్రీట్మెంట్ కూడా. సో డోంట్ వర్రీ. ఏదైనా ఉంటే చెప్తారు" అని సముదాయించాడు కొడుకు రోహణ్.

"రిపోర్ట్స్ లో ఏముంది డాక్టర్!" అని సీరియస్ గా రిపోర్ట్స్ ను చూస్తున్న డాక్టర్ వెంకట్ ను అడిగాడు ప్రకాశ్.

"సిమ్టమ్స్ అన్నీ కాస్త అనుమానంగా అనిపిస్తున్నాయి.

వన్ మినిట్ అంటూ" కంప్యూటర్ లో ఏదో సెర్చ్ చేసాడు.

"యా ఐ గాట్ ఇట్.." అంటూ వీళ్ళవైపు తిరిగి మీరు ఇమ్యూనిటీ డిజార్డర్ తో బాధపడుతున్నారేమో.. అనే డౌట్ వస్తుంది. మీరొక్కసారి టెన్షన్ పడకుండా నేను చెప్పేది వినండి" అన్నాడు డాక్టర్ వెంకట్.

వాళ్ళకు ఏమీ అర్థం కాలేద "అదేమన్నా పెద్దజబ్బాండీ..!"

అంది ప్రకృతి.

"అదేం లేదమ్మా. సరిగ్గా మెడిసిన్స్ వాడితే త్వరలో నే తగ్గుతుంది. మీరు రుమటాలజీ డిపార్ట్మెంట్ కు వెళ్ళి డాక్టర్ ఫణి గారిని కలవండి" అన్నాడు

"ఎందుకు డాక్టర్" అన్నాడు ప్రకాశ్.

"ఏమీ లేదండీ.. ఆ డిపార్టుమెంటు ₹లో అయితే మీకు ప్రాబ్లం ఏమిటి అనేది కరెక్ట్ గా తెలుస్తుంది. అనుమానం తీరుతుంది కదా! అందుకే వెళ్ళమన్నాను" అన్నాడు డాక్టర్.

సరే అని అందరూ వెళ్ళి లైన్లో నిలబడి వీళ్ళనెంబర్ వచ్చేవరకు వేయిట్ చేసి ఎట్టకేలకూ డాక్టర్ ను కలిసి మాట్లాడారు. అక్కడ ఎంతోమంది ఏవేవో వ్యాధుల తో బాధపడుతున్న వాళ్ళున్నారు. కాస్త భయపడింది ప్రకృతి.

★ ★ ★

టెస్ట్ లు మళ్ళీ చేయించారు. బ్లెడ్ చాలా తక్కువగా ఉంది. మినిమం 13% ఉండాలి. మీకు 6% మాత్రమే ఉంది. ఇలాగే ఉంటే ప్రాణాలకే ప్రమాదం అంటూ ఏదేదో వివరించి చెప్పాడు డాక్టర్ ఫణి. ఆ సంభాషణ సారాంశం మీకు ఎనీమియా వచ్చింది అని. ఇదేంటీ మనం ఏదో అనుకుంటే ఏదో చెప్తున్నారు అనుకున్నారు వాళ్లు.

మెడిసిన్స్ కంటిన్యూగా వన్ ఇయర్ వాడాలి.

కూరగాయలు ఆకుకూరలు బాగా తినాలి అన్నారు.

అప్పటినుండి ఎప్పుడు వేసుకునే మెడిసిన్స్ అప్పుడే వేసుకుంటూ క్యారెట్ జ్యూస్, బీట్రూట్ జ్యూస్ తాగుతూ కంట్రోల్ చేసుకునే ప్రయత్నం చేస్తుంది ప్రకృతి.

టైంకు మందులు వేసుకుంటే త్వరగా తగ్గుతుందని అన్నాడు డాక్టర్. అందుకే "ఏమీకాదులే మమ్మీ .... ముందు ఇది చెప్పు నీకు ఇంకా ఏమేం అనిపిస్తుంది" అంది దగ్గరగా కూర్చొని కూతురు క్రాంతి.

"లోపల జ్వరం ఉన్నట్లుంది, బాడీ పేయిన్స్ ఉన్నాయి, తలనొప్పుంది, దగ్గు వచ్చినట్లు అనిపిస్తుంది, ఛాతిలో బరువు పెట్టినట్ల గా ఉందమ్మా" అంది ప్రకృతి.

ఒకసారి టెంపరేచర్ చూద్దాం అని చూసారు.

కూతురు,భర్త ఇటువైపు ఒకరు అటువైపు ఒకరు కూర్చుని పదినిమిషాలకు ఒకసారి చెక్ చేసారు. (100 .1) ,(99.7),(100.2 ) ఇలా ఒకే గంటలో ఇన్ని రకాలుగా చూపించింది.

"బయట వాతావరణం అసలు బాగాలేదు ఎందుకైనా మంచిది 'కోవిడ్ 'టెస్ట్ చేయిద్దామని డయాగ్నొస్టిక్ సెంటర్ కి తీసుకెళ్లి టెస్ట్ కు ఇచ్చాడు ప్రకాశ్."

★ ★ ★

ఈరోజు రిపోర్ట్స్ వస్తాయి. అంటూ భయపడసాగింది ప్రకృతి. నీరసంతో అలాగే పడుకుంది. రెండో తేదీ నుండి ఇలాగే ఉంది టెస్ట్ రిపోర్ట్స్ వచ్చేవరకూ ఎవరూ నాదగ్గిర కూర్చోకండి అని ఒక్కతే సపరేట్ రూంలో ఉంటుంది.

మనం ఎవరికీ అన్యాయం చేయలేదు ఎట్టి పరిస్థితుల్లో మనకు ఏం కాదు. ధైర్యంగా ఉండు అన్నాడు ప్రకాశ్.

"ఇది న్యాయాన్యాయాల గురించి మాట్లాడుకునే సమయం కాదు మన గురించి మనం జాగ్రత్తగా ఉండే సమయం. మన ఇంటికి మన అమ్మాయి ఫ్రెండ్ వచ్చింది వెళ్ళింది కదా...! ఆ అమ్మాయి ఓగంటసేపు ఇక్కడే ఉండి వెళ్ళింది. ఆ అమ్మాయి కి పాజిటివ్ వచ్చిందంట తను నాతో చాలా సేపు గడిపింది కాబట్టి కోవిడ్ వచ్చిందేమో అనుకునుకుంటున్నాను" అంది.

అది నిజమే కదా అనుకున్నారు వాళ్ళు కానీ ...!

"నీవు వర్రీ కాకు మమ్మీ నీకు ఏంకాదు. ఒకవేళ వచ్చినా ధైర్యంగా ఉండాలి" అని ధైర్యం చెప్పింది కూతురు.

మాటల్లోనే డయాగ్నొస్టిక్ సెంటర్ నుండి మేయిల్ వచ్చిందని ఫోన్లో ఓపెన్ చేసి చూసుకుంది ప్రకృతి.

కళ్ళల్లో నీటితెరలు కట్టాయి. ఏడుస్తూనే ఉంది. అందరూ ఓదార్చారు. అయినా, ఏడ్వడం ఆగలేదు.

అమేరికాలో ఉన్న కొడుకు ఫోన్ చేసాడు. ఏడుపు ఇంకా పెంచింది ప్రకృతి.

"మామ్ ఎందుకేడుస్తున్నావ్?" అన్నాడు రోహణ్.

తల ఎత్తి చూసింది.. రోహణ్ కళ్ళు ఎర్రబడి ఉన్నాయి.

"అయ్యో నీవెందుకు ఏడుస్తున్నావ్" అంది చిన్నపిల్లలా ప్రకృతి.

"ఏడుపు రాదా మరి. నేనేమో ఇంతదూరంలో ఉన్నాను. నీవు ఏడుస్తుంటే నాకెలా ఉంటుంది మామ్" అన్నాడు రోహణ్.

కూతురు భర్త ప్రకృతికి చెరోవైపు కూర్చున్నారు.

"మీరిద్దరూ నా దగ్గరనుండి లేవండి. మీరెందుకు కూర్చున్నారు. మళ్ళీ మీరు అంటించుకోవడానికా?" అంది

ఇప్పుడే ఆన్లైన్లో డాక్టర్ అపాయింట్మెంట్ తీసుకుని ట్రీట్మెంట్ స్టార్ట్ చేయిద్దాం అన్నారిద్దరూ...!!

మెడికల్ షాపు కు వెళ్ళి ఏవైనా మెడిసిన్స్ తీసుకొద్దామనుకున్నారు.

తండ్రీ కూతురు ఇద్దరూ కలిసి వెళ్ళారు....

కోవిడ్ కిట్స్ అయిపోయాయండీ ... మీకు అర్జెంటుగా కావాలంటే... పదివేలు అవుతుంది... అన్నాడతను ....

కిట్ అంటే ఏమేముంటాయి అందులో అన్నది క్రాంతి..

చెప్పాడు మెడికల్ షాపు అతను.

లెక్కలేసింది అదేంటీ ...ఈ మెడిసిన్స్ అన్నీ కలిపితే వెయ్యికూడా కాలేదు నీవు పదివేలు అవుతుంది అంటున్నావ్... ప్రశ్నించింది.

లాక్ డౌన్ కదా !మేడం ట్రాన్స్పోర్టేషన్ కి చాలా ఖర్చు అవుతుందండీ .... మీరు ఎవరిని అడిగినా ఇదే రేటు ఉంటుంది అన్నాడు షాపు యజమాని.

ప్రిస్క్రిప్షన్ లేదు ఆన్లైన్ అపాయింట్మెంట్ దొరకట్లేదు. ఇలా కొంటే ఇస్తారా.. అన్నది క్రాంతి.

ఎందుకు మేడం మనదగ్గర డాక్టర్ కూడా ఉంటారు. ఒక

కన్సల్టేషన్ వెయ్యి అవుతుంది అన్నాడతను.

అంతనా...! అన్నట్లు ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

పేషెంట్ ఇక్కడికిరావాలా ...? డాక్టర్ ఇంటికి వస్తాడా...? ఎలా చేయమంటారు...అన్నది క్రాంతి.

ఇంటికొస్తే...మరో ఐదొందలు ఎక్కువ మేడం అన్నాడు షాపతను...!

ఏదేమైనా కానీ...!

ఇప్పుడు మనకు డాక్టర్ వచ్చి చూస్తేనే తెలుస్తుంది...!

ఎంతడబ్బైనా సరే ఇంటికి రమ్మని చెప్దామని అనుకున్నారు.

చూడండి ఇంటికి వెళ్ళి కాల్ చేస్తాను లొకేషన్ మీకు షేర్ చేసాను ఓ గంటలో రమ్మని చెప్పండి అని ఇంటికొచ్చారు ప్రకాష్, క్రాంతి.

ప్రకృతి మూలుగుతూ కనిపించింది. ఏంచేయాలో ఎవరికి తెలియట్లేదు.

ఒకసారి నీమ్సులో ఆరోజు పరిచయం అయిన డాక్టర్ ఉందిగా ఆమెకు ఫోన్ చేసి అడుగు ఏం మందులు వాడాలో తెలుసుకో...! అంది క్రాంతి.

ఆరోజు ఏదో అపాయింట్మెంట్ కోసం వెళ్ళినప్పుడు డాక్టర్ ఫణి గారు నాకు వచ్చిన డిసీజ్ గురించి ఎక్స్ ప్లేయిన్ చేయమని ఆమె దగ్గరకు పంపాడు అంతే! మనల్ని గుర్తుపడుతుందా...? అంది కూతురు తో ప్రకృతి.

అమ్మా... ఓసారి మెసేజ్ చేద్దాం పోయిందేముంది. నీనెంబర్ వాళ్ళతో ఉంది కాబట్టి నీఫోన్ నుంచే మెసేజ్ చేయాలి. అలాగైతే గుర్తు పడతారు అని తల్లితో చెప్పి ఫోన్ తీసుకుని తనే మెసేజ్ చేసింది క్రాంతి..

వాట్సాప్ మెసేజ్ పెట్టాను... చూద్దాం ఇప్పుడు ఇంత రాత్రి ఎవరూ రెస్పాండ్ కావట్లేదు అయితే మనం లక్కీ ... లేకపోతే మెడికల్ షాప్ అతను డాక్టర్ ను పంపుతానన్నాడు క్రాంతి అంటున్నంతలోనే..,!

కాల్ వచ్చింది ....

అమ్మా డాక్టర్ కాల్ ....!!

డాక్టర్ ఫోన్ చేసింది.

ఏం జరిగిందని అడిగింది.

డాక్టర్ కు విష్ చేసి పలానా రోజు నీమ్స్ లో మిమ్మల్ని కలిసాము...." ఏదైనా ప్రాబ్లం అయితే కాల్ చేయమని మీ నెంబర్ ఇచ్చారు కదా..!

ఇప్పుడు ఆ ప్రాబ్లం కాదు కానీ, మమ్మీకి కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ఇంతరాత్రి టైం లో ఎవరూ అందుబాటులో లేరు. మీరు ట్రీట్మెంట్ ఇస్తారేమో నని మెసేజ్ పెట్టాను మామ్...సారీ. మమ్మీ ఏడుస్తూనే ఉంది తోచక టెక్స్ట్ చేసాను" అంది క్రాంతి.

"పర్వాలేదమ్మా ...!! ఇప్పుడు చాలా మందికి ఆన్లైన్ లోనే ట్రీట్మెంట్ ఇస్తున్నాము. ఇలాంటి పేషెంట్స్ కోసం టోల్ ఫ్రీ నెంబర్ కూడా పెట్టారు. మీరు కంగారు పడకండి.

సిమ్టమ్స్ ఏంటో చెప్పండి" అంది డాక్టర్.

చెప్పింది క్రాంతి.

మీరు టెస్ట్ లు చేయించిన రిపోర్ట్స్ నాకు వాట్సాప్ చేయండి చూసి ప్రిస్క్రిప్షన్ రాస్తాను అంది డాక్టర్.

సరేనని రిపోర్ట్స్ డాక్టర్ కు ఫార్వర్డ్ చేసింది క్రాంతి.

మేడం.... మీరు ట్రీట్మెంట్ చేసినందుకు మీకు అమౌంట్ ఫోన్ పే చేస్తామండీ ...అంది క్రాంతి. తటపటాయిస్తూనే.

దానికి డాక్టర్ అదేం అవసరం లేదమ్మా...

ఇప్పుడు బయట అంతా కోవిడ్ ఎక్కువగా ఉంది. నాకు చేతనైనంత నేను అడిగిన వారికి ఇలా మెడిసిన్స్ రాసిద్దామనుకుని చేస్తున్నాను అంతే మీ మమ్మీకి తగ్గితే చాలు. అంది డాక్టర్...

క్రాంతి కి ఏడుపొచ్చింది... ఎందుకంటే.. అంతకు ముందు వాళ్ళ డాడీ తో పాటు రెండు మూడు హాస్పిటల్స్ తిరిగి అడిగింది. సీరియస్ గా ఉంటేనే అపాయింట్మెంట్ చేసుకుంటామని చెప్పారు. ఒ.పీ చూడము అని చెప్పారు.

మెడికల్ షాపు అతను డాక్టర్ ను పంపిస్తాను.

అని రేపు ఉదయం పంపుతానని ఫోన్ చేస్తే చెప్పాడు....

ఎలా చేయాలని తండ్రి కూతురు బయట ఏడ్చి ఇంట్లోకి

వచ్చారు. "ఎందుకేడుస్తున్నావ్ క్రాంతి" అంది డాక్టర్.

ఏమీలేదు మామ్ మమ్మీ ఏడుస్తుంది. అందుకే ఏడుపొచ్చింది" అంది.

"మమ్మీకి ఫోన్ ఇవ్వు నేను మాట్లాడుతాను" అంది డాక్టర్.

ప్రకృతితో ఫోన్ లో మాట్లాడుతూ.. మీరు ఏడవకూడదు చాలా ధైర్యంగా ఉండాలి. మీరు కోలుకునేదాకా నాతో టచ్ లో ఉండండి. ఎనీటైం కాల్ చేయండి నేనేం అనుకోను. ఎవ్రీ టూ అవర్స్ కు ఒకసారి పల్స్ చెక్ చూసుకుని నాకు వాట్సాప్ చేయండి. ఆవిరిపట్టండి, వేడి నీళ్ళు తాగండి. మెడిసిన్స్ కరెక్ట్ గా వేసుకోండి. అన్నింటికీ మించి మీరు ధైర్యంగా ఉండాలి. ధైర్యంగా ఉంటేనే త్వరగా కోలుకుంటారు" అంది డాక్టర్ .

సరేనని తలూపుతూ.. "మీ పేరు డాక్టర్...?"అని ప్రశ్నించింది ప్రకృతి.

"ఓ.. నా పేరు తెలియదు కదూ నాపేరు శ్రీజిత.

రుమటాలజీ డిపార్ట్మెంట్ లో ట్రైనీ డాక్టర్ ను" అంటూ ఎంతో ఆప్యాయంగా సొంతమనిషిలా మాట్లాడేసరికి ప్రకృతి లో ఆత్మవిశ్వాసం పెరిగింది.

కోవిడ్ పేషెంట్ లాగా కాకుండా ఎక్కువ టెంపరేచర్ తో జ్వరం వస్తే ఎలా ఫీల్ అవుతుందో అలా ఫీల్ అవ్వసాగింది.

★ ★ ★

మెడికల్ షాపు లో పల్స్ ఆక్సీమీటర్ , ఆవిరి పెట్టుకునే మిషన్, పద్నాలుగు రోజుల పాటు వాడడానికి మెడిసిన్స్ ఇంకా బలానికి కావలసిన పండ్లు అన్నీ తెచ్చారు. ప్రకాశ్ కూతురు క్రాంతితో కలిసి ....

మంచి ఆహారంతో పాటు మంచి మాటలు రూమ్ ముందే దూరం గా కూర్చుని మార్కులు పెట్టుకుని మాట్లాడేవారు.

ప్రకృతి తన ఆఫీసు వర్క్ చేసుకునేది. అలా వారం తిరిగేసరికి కాస్తా కోలుకుంది ప్రకృతి. అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

అమెరికా లో ఉన్న వాళ్ళబ్బాయికూడా రోజూ మాట్లాడేవాడు .. కాబట్టి తనకు కోవిడ్ వచ్చిన విషయమే మర్చిపోయింది.

ఇదే ట్రీట్మెంట్ కోసం మన రామేశం మామయ్య వాళ్ళు,గణేష్ వాళ్ళు రోజు కు ఎన్నో లక్షలు కట్టారంట!.ఆ భగవంతుని దయవల్ల మనకు దేవతలాంటి డాక్టర్ సమయానికి దొరికింది. అన్నాడు ప్రకాశ్.

★ ★ ★

ప్రకృతి ఐసోలేషన్ అయిపోయింది. టెస్ట్ సాంపిల్స్ తీసుకెళ్ళడానికి విజయా డయాగ్నొస్టిక్ సెంటర్ వాళ్ళను ఆన్లైన్ లో బుక్ చేసాడు ప్రకాష్.

అతను వచ్చి సాంపిల్స్ తీసుకుని వెళ్లాడు. రిపోర్ట్స్ మెయిల్ లో వచ్చాయి. డాక్టర్ రిపోర్ట్స్ వచ్చాయి మీకు వాట్సాప్ చేసాను అని క్రాంతి ఫోన్లో డాక్టర్ శ్రీజితకు చెప్పింది.

చూసాను....! మీరు చాలా త్వరగా కోలుకున్నారు !.... 'కంగ్రాట్స్ 'అని చెప్పింది డాక్టర్ శ్రీజిత.

మీ వల్లే నేను త్వరగా కోలుకున్నాను .

మీకు చాలా చాలా థాంక్స్ మేడం మీ మేలు ఈ జన్మలో మర్చిపోలేము. .మాకుటుంబం మొత్తం మీకు రుణపడి ఉంటాము అంది ప్రకృతి.

మీరు కోలుకున్నారు నాకు అదే చాలా సంతోషంగా ఉంది.

మళ్ళీ ఏమైనా ప్రాబ్లం అవుతే ఫోన్ చేయండి.

నేను వర్క్ లో ఉన్నాను. అని ఫోన్ పెట్టేసింది డాక్టర్.

ఎంతమంచి డాక్టర్ కదూ!

ఈ కాలంలో అది....ఈ కోవిడ్ టైంలో హాస్పిటల్స్ లో పేషెంట్స్ దగ్గర దొరికిన వారు దొరికినంత దోచుకుంటున్నారు.

పేషెంట్స్ యొక్క ఆర్థిక పరిస్థితి ఎలాంటిదో కూడా చూడకుండా బిల్లులు వేస్తున్నారు.

పేషెంట్ ప్రాణాలు కోల్పోయిన విషయం కూడా

ఒక్కోసారి ఇంటివాళ్ళకు చెప్పడం లేదు.

దహనసంస్కారాలుకూడా వాళ్ళే చేసేస్తున్నారు.

భార్యను భర్త....భర్తను భార్య .... తల్లిదండ్రుల ను

పిల్లలు...పిల్లలను తల్లిదండ్రులు కూడా కడసారి చూపులకు నోచుకోలేని పరిస్థితి.

ఇదే మరో ప్రయివేటు హాస్పిటల్ ల్లో అయితే ...'ఈపాటికి మనం అప్పులపాలై పోయేవాళ్ళం'. దేవుడున్నాడు !అన్నాడు ప్రకాశ్.

అవును డాడీ దేవుడు ఉన్నాడు .

ఇప్పుడు మనకు ట్రీట్మెంట్ చేసింది 'మనిషి రూపంలో ఉన్న దేవత '!అంది క్రాంతి.

అప్పుడే అమెరికా లో ఉన్న వాళ్ళ అబ్బాయి ఫోన్ చేసాడు.

మమ్మీకి నెగెటివ్ వచ్చింది బేటా అన్నాడు ప్రకాశ్.

ఇక ఇప్పటినుండి మనందరం ఇంకా జాగ్రత్తగా ఉండాలి అన్నాడు వాళ్ళబ్బాయి.

బయటకు వెళ్ళేటప్పుడు మాస్క్ పెట్టుకుని వెళ్ళాలి అన్నాడు ప్రకాశ్.

అవును డాడీ...

కూరగాయలు, ఆకుకూరలు ,పాల ప్యాకెట్లు బయటనుండి తెచ్చిన వెంటనే ఇంట్లోకి తీసుకొని రాకూడదు. ఒక పక్కగా ఉంచాలి. కాసేపాగి నీళ్ళతో శుభ్రంగా కడిగి తీసుకోవాలి అంది క్రాంతి.

తుమ్మువచ్చినప్పుడు నోటికి చెయ్యి అడ్డుగా పెట్టుకోవాలి.

తరువాత చేతులు సానిటైజర్ తో శుభ్రపరుచుకోవాలి. అన్నాడు వీడియో కాల్లోవాళ్ళబ్బాయి రోహణ్.

అందరూ 'ఆనందంగా ఊపిరి పీల్చుకున్నారు'!

ఇప్పుడు ఆ కుటుంబం ముంపుకుగురైన ఇంటిని మళ్ళీ పొందినంత ఆనందంగా ఉన్నారు.

"వైద్యో నారాయణో హరిః" అంటారు కదా !

ఇలాంటి వైద్యులు కలకాలం చల్లగా ఉండాలి.

అని ఎవరికి వారే వారి మనసులో అనుకున్నారు.

కవిత

# జెండా పండుగ

**చల్లా సరోజినీ దేవి**
**9849826634**



అదిగదిగో, అల్లదిగో నీలాల నింగిలో రెప రెప లాడుతున్నది మన జెండా. మువ్వన్నెల జెండా.
ముచ్చటైన జెండా.
ఇదే మన వునికికి ఎజెండా. ఎందరెందరో త్యాగ ధనులు
తమ మాన ప్రాణాలను తృణ ప్రాయం చేసి సాధించిన అమృత ఫలం ఈ జెండా.
మూడు రంగుల గుడ్డ ముక్కగా తలచవద్దు. ముప్పు తిప్పలు పెట్టిన తెల్ల వాడి పీచమడిచి ,
స్వాతంత్ర్య దివ్య జ్యోతులను వెలిగించి
భరత మాత దాస్య శృంఖలాలు త్రెంచి సగర్వంగా నిలువెత్తు ఎగిరిన జెండా అని మరువ వద్దు..
"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరియసీ" అన్న మాట
నిత్యం మది తలచి ,
అమ్మ లాగే దేశ మాతనే కాదు దేశ జండానూ కొలవాలి. మహిళలు అందరిలో అమ్మను చూసే నిర్మలాంత రంగులై
ప్రజలంతా నిలవాలి.
నాడు కదా నిజమైన జెండా పండుగ.
త్యాగ ధనులైన దేశ భక్తులు పైనుండి నవ్వగలరు నిండుగా.

కవిత

# ఏ పేరు పెట్టాలి

సోని కట్కూరి
8374261002



ఆగని కన్నీళ్ల ఆవేదనలు
హృదయాలను  కకావికలం చేసే ఆర్తనాదాలు
దారుణమైన హింసల్లో అసువులు బాసిన మహిళలు
అత్యాచారాల హింసలతో  దేశం అట్టుడికి పోతుంటే...
పాలకులు మౌనం ప్రజల మౌనం
మత సిద్ధాంతమై
స్త్రీలకు జీవించే హక్కు లేదని నినదిస్తుంటే...
ఏ పేరుతో పిలవాలి
ఏ పేరు పెట్టాలి

ఇంకేం జరగాలి నాశనం
ఇంతకన్నా ఇంకేం చూడాలి మనం
ఇంకెప్పుడు మారాలి జనం
ఇంకెన్నటికి మాట్లాడునో మౌనం
నిర్లజ్జ మతాలు  మానవాళిని
రాక్షసంగ కర్కషంగ
వెచ్చటి నెత్తుటితో స్నానమాడుతుంటే

చరిత్రలో నరకబడ్డ ప్రశ్నల తలలు..
ప్రస్తవనలో శిధిలాలైన చైతన్య సంకేతాలు..
కనుమరుగైన నిజాయితీ జీవితాల ఆనవాళ్ళు..
విస్తారమై విస్తృతిలో విరుచుకు పడుతున్న
స్వార్థచింతనలు..

మతాల
బానిస సర్పాలై స్త్రీ జాతిజపై విషంచిమ్ముతుంటే..
ఎడతెరిపి లేని దాడుల తుఫానుతో
ఆధిపత్యసముద్రం  ఉప్పొంగి
అభాగ్యబ్రతుకులను    ముంచేస్తుంటే..
ఊపిరాగి శవమై తేలిన సమాజం..

నిజమే....
మాతృభూమి పై  భారతమాతను  నగ్నంగా
ఊరేగించగలిగే స్వేచ్ఛ ఉన్నది

నిజమే....
మానవత్వ మాతృత్వపు
జీవ ప్రధాతను  జీవచ్ఛవంలా ఊరేగించే  స్వాతంత్రం
ఉన్నది

నిజమే .....
రుధిర క్షేత్రాలు ఖైర్లాంజులు నిర్భయహస్థినాలు కతువ
హత్రాసులు  మనిపూరులను  దేశముఖచిత్రంగా
మార్చుకున్న చరిత్ర ఉన్నది

నిజమే.....
శీల పరీక్షల పాతివ్రత్యాలు బాంధవ్యాల బంధువుల
నడుమ  స్త్రీని వివస్త్ర చేసిన పంచమ వేదాలుగా
రాసుకున్నది

నిజమే...
పతి చితిపై సతిని తగలబెట్టిన సంస్కరణలు
పసి గుడ్డు మొదలు పండు ముసలి వరకు
అత్యాచారాల హింసలతో  ప్రపంచ ప్రఖ్యాతిలో కీర్తి
గడించింది

వంశ వారసత్వంతో హింస..
వదలక వేధించే వంటింటిలో హింస..
వద్దంటున్న వేటాడి ఒంటిపై హింస..
చావే జాలి చూపించేంత హీనమైన హింస..
వేశం సమానత కుటిలత్వంలో..
దేశం అసమానతల చీలికల చీకట్లో.. ఆచరణ
అసంఖ్యాక వివక్షలో..
అదృశ్యమైన మహిళా రక్షణలో..
శతాబ్దాల స్త్రీ హింసలకు పట్టాభిశేకం.

మానవతా పరిమళాలను మతదుర్గంధం కమ్మేస్తుంటే
క్రూరముగాల జంతు సంస్కృతిని
పాలకులు అమలు చేస్తుంటే
మహిళల్ని కిరాతకంగా
పురుషాధిక్యం కబలిస్తుంటే
సిగ్గుమాలిన ప్రజలు పాలకుడి పాదప్రదక్షణలతో
మౌనం వహిస్తూ ఉంటే..
బట్టలు ఇప్పబడ్డ భారతావనికి
 ఈ పేరు పెట్టాలి

# బంగారు మురుగు

## రచయిత : శ్రీరమణ - స్మృత్యంజలి

నాకు ఆరేళ్ళప్పుడు మా బామ్మకి అరవై ఏళ్ళు. మా అమ్మానాన్న ఎప్పుడూ పూజలు పునస్కారాలూ, మళ్ళూ దేవుళ్ళూ గొడవల్లో ఉండేవారు. స్వాములార్లు పీఠాధి పతులూ ఎత్తే పల్లకి దింపే పల్లకీలతో మా ఇల్లు మఠంలా ఉండేది. అమ్మ తడిచీర కట్టుకొని పీఠాల్ని సేవిస్తూ, నే దగ్గరకు వెళితే, 'దూరం దూరం తాక్కూడదు,' అనేది.

బామ్మకి ఈ గొడవలేం పట్టేవి కావు. అమ్మానాన్నా, చుట్టం పక్కం అన్నీ నాకు బామ్మే. మా బామ్మకి కాశీ, రామేశ్వరం అన్నీనేనే. ఓ కంచంలో తిని ఓ మంచంలో పడుకొనేవాళ్ళం.

పెద్దతనపు నస, అత్తగారి సాధింపులూ, వేధింపులూ బామ్మ దగ్గర లేవు. ఎవరేనా, 'ఈ ముసలమ్మకి భయమూ, భక్తి లేవు.... అంటే 'దయ కంటే పుణ్యం లేదు, నిర్దయ కంటే పాపం లేదు. చెట్టుకి చెంబెడు నీళ్ళు పోయడం, పక్షికి గుప్పెడు గింజలు చల్లడం, పశువుకి నాలుగు పరకలు వెయ్యడం, ఆకొన్న వాడికి పట్టెడు మెతుకులు పెట్టడం నాకు తెలిసిందివే అనేది.

బామ్మకి పుట్టింటివాళ్ళిచ్చిన భూమి నాలుగ్గైదెకరాలు ఇంకో ఊళ్ళో ఉండేవి. మా ఊరికి పది కోసుల దూరం. ఏటా పంటల కాలంలో కౌలు చెల్లించడానికి రైతులు వచ్చేవాళ్ళు. వచ్చీ రాగానే వాళ్ళని ఆప్యాయంగా పలకరించేది. పుట్టిన ఊరు విశేషాలన్నీ గుక్క తిప్పుకోకుండా అడిగేది. వాళ్ళు బదులు చెప్పకుండానే మళ్ళీ ప్రశ్న– ప్రశ్న మీద ప్రశ్న వర్షం కురిపించేది. రైతులేమో పంట తెగుళ్ళ గురించి, అకాల వర్షాల గురించి సాకులు చెప్పి పావలో బేడో చేతులో పెట్టి వెళ్ళాలనే ఆలోచనతో దిగులు మొహాలు తగిలించుకు వచ్చేవాళ్ళు. ఆ మాట ఎత్తడానికి బామ్మ అవకాశం ఇస్తేనా?

"ఎండనపడి వచ్చారు కాళ్ళు కడుక్కోండర్రా," అనేది. వడ్డన ఏర్పాట్లలో పడిపోయేది. విస్తరి వేసిం దగ్గర్నుంచి పెరుగు అన్నంలోకి వచ్చేదాకా వాళ్ళతో ఊరివాళ్ళ కబుర్లన్నీ వాగించేది..

తీరా పెరుగన్నం చివర్లో, "ఏరా అబ్బీ ఈ ఏడాది పంటలేలా ఉన్నాయిరా?" అని అడిగేది. వాళ్ళకి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టయేది. కమ్మటి భోజనం కొసరికొసరి వడ్డిస్తే తిని, పైగా తిన్న విస్తరి ముందు కూచుని, 'పంటలు పోయాయ'ని చెప్పడానికి నోరాడక, "ఫర్వాలేదమ్మా దేవుడి దయవల్ల," అనేవాళ్ళు. ఇంకేం చేస్తారు పాపం, అణాపైసలతో శిస్తు అప్పగించి వెళ్ళేవాళ్ళు. వెళ్ళేటప్పుడు, "ఇదిగో బుల్లి పంతులూ! మీ అవ్వ గట్టి పిండమే," అని ఎగతాళి చేసి వెళ్ళేవాళ్ళు.

బడికి వెళ్ళనని మారాం చేసినపుడల్లా బామ్మ నాకు అండగా ఉండేది. "పసి వెధవ, గ్రాహ్యం వస్తే వాడే వెళ్తాడు. అయినా ఒక్కగానొక్కడు బతకలేకపోతాడా...." అంటూ నన్ను చంకనేసుకు బయటకు నడిచేది.

మా ఇంటి పెరడు దాటగానే పెద్ద బాదంచెట్టు ఉండేది. అది మా స్థావరం. రోజులో మూడొంతులు అక్కడే మా కాలక్షేపం. బాదంచెట్టు పచ్చటి గొడుగు పాతేసినట్టు ఉండేది. రాలిన పండు ఆకులు విస్తరి కుట్టుకుని బామ్మ భోజనం చేసేది. దాని చుట్టూ చిన్న మట్టి అరుగు ఉండేది. "దీన్ని కాపరానికొచ్చేప్పుడు మా పుట్టింటి నుంచి తెచ్చా... అప్పుడు జానా బెత్తెడుండేది. నువ్ నమ్మవ్... పిచ్చిముండకి మూడే ఆకులు బుల్లిబుల్లివి ఉండేవి. రోజూ ఒకసారైనా ఈ మాట నాకు చెప్పేది. నే కాపరానికొచ్చి ఎన్నేళ్ళ ఈ పిచ్చిమొద్దుకి అన్నేళ్ళు.' అంటూ మానుని చేత్తో తట్టేది ఆపేక్షగా..

ఇప్పటికీ బామ్మ చెంబెడు నీళ్ళు దానికి పోస్తూనే ఉంటుంది. మానుకి రెండు తొర్రలుండేవి. పై తొర్రలో రెండు రామచిలకలు కిలకిలలాడుతూ కాపరం చేస్తుండేవి. ఇంకో తొర్రలో బామ్మ నాకోసం చిరు తిళ్ళు దాచేది. కొమ్మకి తాళ్ళ ఉయ్యాల ఉండేది. కాకులు పడేసిన బాదంకాయలు వైనంగా కొట్టి నాచేతబాదం పప్పులు తినిపించేది. ఆ బాదం చెట్టు మా ఇద్దరికీ తోడూనీడా...

ఊరు లేచేసరికి వాకిలంతా తీర్చిదిద్ది ముగ్గులు పెట్టేది బామ్మ. రాత్రి నాకు జోల పాడుతూ రేపటి ముగ్గు మనసులో వేసుకొనేది. ముగ్గులు అయ్యేదాకా నేను బామ్మ వీపుమీద బల్లిలా కరుచుకుని పడుకుని కునుకు తీస్తుండేవాణ్ణి.

"అసలే నడుం వంగిపోయె... పైగా ఆ మూట కూడా

దేనికి?" అని మా అమ్మ అంటే, "వాడు బరువేంటే, వాడు వీపున లేకపోతే ముగ్గు పడదే తల్లీ... చూపు ఆనదే అమ్మా" అనేది బామ్మ.

సమస్త దేవుళ్ళకీ మేలుకొలుపులు పాడుతూ వాకిలి నాలుగు దిక్కుల్నీ ముగ్గుతో కలిపేది. అప్పుడు మా మండువా లోగిలి నిండుగా పమిట కప్పుకు నిలబడ్డ పెద్ద ముత్తయిదువులా ఉండేది. "పాట పాడి దేవుళ్ళని లేపకపోతే వాళ్ళు లేవరా," అని అడిగితే, "పిచ్చిసన్నాసీ దేవుళ్ళు నిద్దరోతార్రా! దేవుడు నిద్దరోతే ఇంకేమైనా ఉందీ! మేలుకొలుపులు మనకోసమే, చక్రపొంగలి మనకోసమే," అనేది బామ్మ:

తెల్లారగానే నూనె రాసి, నలుగు పెట్టి కాకర పందిరి కింద ముక్కాలిపీట మీద కూచోపెట్టి వేడి నీళ్ళు పోసేది. "చిక్కిపోయాడమ్మా పిల్లాడు... పొడుగు సాగుతున్నాడో ఏమో." అని బామ్మ రోజూ నలుగు పెడుతూ దిగులు పడేది. ఒంటిమీద చిన్న గాటో, దెబ్బో, పొక్కో కనిపిస్తే, "అఘాయిత్యం: వెధవ్వి, ఎక్కడ తగిలించుకున్నావ్," అని గారాబంగా కేకలేసి తెగ దిగులు పడిపోయేది. నాకప్పుడు ఎంతో హాయిగా అనిపించేది.

నెలకోసారి భజంత్రీవాడు వచ్చేవాడు. బాదం చెట్టుకింద నేను, మా బామ్మ తలపని చేయించు కొనేవాళ్ళం. ముందు నా వంతు–

"ఒరేవ్ జాగ్రత్తగా చెయ్. పిల్లాడి క్రాపు తెల్లదొర క్రాపింగ్ ఉండాలి." అని హెచ్చరికలూ, సలహాలూ ఇస్తూ ఎదురుగా కూర్చునేది బామ్మ. అయినా వాడి పద్ధతిలో వాడు తిరపతి మెట్లతో డిప్పకొట్టుడు కొట్టేసేవాడు. తనవంతు వచ్చినపుడు చేతిన ఉన్న బంగారు మురుగు తీసి నా చేతికి తొడిగేది. స్నానం చేశాక కుంకుడు రసంతో ఆ బంగారుమురుగుకి మెరుగు తెప్పించి తన చేతికి వేసుకొనేది. మెరుస్తున్న చేతిని తృప్తిగాచూసుకునేది.

బజారు చిరుతిళ్ళు తినకూడదని నామీద గట్టి ఆంక్ష ఉండేది. ఆరోగ్యం కంటే కుటుంబ మర్యాద దెబ్బ తింటుందని. నాకవేం తెలిసేవి కావు. బెల్లపు జీళ్ళు, పీచు మిఠాయి, జంతికలు, తేగలు కొనుక్కు తివాలని నాలిక పీకేది. బామ్మని అడిగితే, 'ఓస్ అంతేకదా! పద' అని కోరినన్ని కొనిపెట్టేది. మరికొన్ని బాదంచెట్టు భోషాణంలో దాచి పెట్టేది. బామ్మ నా పాలిట వరాలిచ్చే దేవత.

మనవడికి అడ్డమైన గడ్డీ కొని పెడ్తోందని తెలిసి, బామ్మకి డబ్బు దొరక్కుండా ఇంట్లో కట్టడి చేశాడు. దీనిమీద ఇంట్లో చాలాసార్లు గొడవలు జరిగాయి. బామ్మ మీద నిఘా వేసిన నా చిరుతిళ్ళకి లోటు రాకుండా చూస్తోంది. బియ్యం ఒళ్ళో పోసుకొచ్చి జీళ్ళు తేగలూ నైవేద్యం పెట్టేది నాకు. అదీ తెలిసిపోయింది. బియ్యం డబ్బాకి తాళం పడింది. దాంతో నా నోటికి కూడా. అత్తగారి ఆట కట్టిందని అమ్మ సంతోషించింది.

"ఇంటి దీపానివి, చక్రవర్తివి నీకీ కరువేంటి నాయనా," అని బామ్మ బాధపడింది. ఆరోజు పీచుమిఠాయి వాడు ఊళ్ళోకి వచ్చాడు. వాడు రోజూ రాడు. సంతరోజు మాత్రమే వస్తాడు. మూడువైపులా రేకు, ఓవైపు సరుకు కనిపించేలా అద్దం ఉన్న డబ్బా విచ్చిన గులాబీలు కుక్కినట్టు డబ్బా . నిండా పీచుమిఠాయి పొత్తులు– వాడు డబ్బా చప్పుడు చేస్తూ. "పిచ్మిఠా. అని చిత్రంగా అరుస్తూ వీధిన వెళ్తుంటే నా నోరెంత ఊరిందో బళ్ళో ఉన్న నాకు తెలుసు, ఇంట్లో ఉన్న మా బామ్మకి తెలుసు. 'పిచ్మిఠా' అరుపు దూరం అవుతున్నకొద్దీ నాలో బెంగ ఎక్కువవుతోంది. ఆ క్షణంలో బామ్మ బడి గుమ్మంలో ప్రత్యక్ష మైంది.

పంతులుగారు ప్రభవ విభవలు చెప్పిస్తున్నారు. బామ్మ రాకతో ప్రమోదూత దగ్గర ఠక్కున వల్లింపు ఆగి తరగతి నిశ్శబ్దం అయింది. నరసింహంపంతులు గారంటే గండభేరుండం! పిల్లలూ పెద్దలూ హడిలిచచ్చేవారు. ఆయనకి బుర్ర మీసాలు, కళ్ళద్దాలు, గుండూ పిలక, చేతిలో బెత్తం, నాలుగువైపులా చూడగల మిడిగుడ్లు ఉండేవి. మా బామ్మ బడి గుమ్మంలోకి వస్తూనే, "ఒరే నరసింహా నా మనవణ్ణి పంపరా" అంది.

ఆయన నావైపు చూసి పోరా అనేలోగానే పలకా పుస్తకంతో నిలబడి ఉన్నాను. ' అనడమేమిటి తొర్రలో రామ చిలకలా తుర్రున దాటుకున్నాను.

అవతల వీధి చివర పిచ్మిఠా వాడు నాకోసమే నిలబడి ఉన్నాడు. అప్పటికే వాడితో బేరసారాలు పూర్తిచేసింది బామ్మ. రెండు మిఠాయి పొత్తులు, నాలుగు పుంజీల జీళ్ళు ఇప్పించింది. జీళ్ళు జేబులో పోసుకొని, బామ్మ కొంగు చాటు చేసుకొని మిఠాయిలు రెండూ మింగేశాను. ఆ రంగుకి నోరు ఎర్రగా హనుమంతుడి మూతిలా అయి పోయింది.

"ఈ మొహంతో ఇంటికెళ్తే ఏమన్నా ఉందీ.." అంటూ కాసేపు బజారు పెత్తనం చేయించి, బడిగంట కొట్టాక బావి దగ్గర మూతి కడిగి, కొంగుతో తుడిచి ఇంట్లో ప్రవేశ పెట్టింది.

తెల్లారి పొద్దున దేవతార్చనలో ఉండే బుల్లి కంచు గంట

కనిపించలేదని అమ్మ కంగారుగా వెదికేస్తోంది. "ఎక్కడికి పోతుంది. ఎలిక ముండలు లాక్కెళ్ళి ఉంటాయి.." అని బొమ్మ పట్టిపట్టనట్టు సర్దేస్తూ మాట్లాడుతోంది. "అయినా ఎలికలు గంటనేం చేసుకుంటాయి బామ్మా" అంటే, "పిల్లికి కడతాయ్.. వెధవాయ్,"

అని అరిచి నా నోరు నొక్కి బయటికి లాక్కెళ్ళింది. "తొర్రలో దాచుకున్న నాలుగు పుంజీల జీళ్ళు రెండ్రోజుల్లో పూర్తయినాయి.

మళ్ళీ సంతరోజు వచ్చింది. ఇంట్లో పెద్ద గాలి దుమారం లేచింది. నాన్న అరుపుల ముందు బామ్మ ముద్దాయిలా నిలబడి ఉంది. వాకిట్లో పీచుమిఠాయిల వాడు నిలబడి ఉన్నాడు. క్రితం వారం వాడికి బామ్మ. కంచుగంట ఇచ్చిందట. ఆ లెక్కలో వాడు మనకి నాలుగు మిఠాయిలు ఆరు పుంజీల జీళ్ళు ఇంకా బాకీ ఉన్నాట్ట! అవి ఇచ్చేసి వెళ్ళామని సరాసరి వాడు ఇంటికి వచ్చాడు. అది గొడవ. సడీ చప్పుడు చెయ్య కూడదనుకున్న గంట గణగణా భామ్మ గుండెల్లో మోగింది.

"దేవుడి గంట పాపభీతి కూడా లేకపోయ "హంత పాట పడాల్సిందేముందీ... అయ్య 'అంది అమ్మ విష్టూరంగా, మంటలో ఉంటాడా దేవుడు పనివాళ్ళ బొజ్జలో

"దేవుడి గంటనే పాపభీతి కూడా లేకపాయె..." అంది అమ్మ నిష్టూరంగా..

"హంత పాపభీతి పడాల్సిందేముందీ.. అయినా ఘంటలో ఉంటాడా దేవుడు, పసివాళ్ళ బొజ్జలో ఉంటాడు గానీ...

బామ్మ సాయకారం తీసింది.

"ఈ మెట్ట వేదాంతాలకేం లెండి... ఇట్లాగే వదిలేస్తే అవ్వ మనవడు కలిపి ఆ చేతి మురుగు కూడా కరిగించేసుకు తింటారు," అంది అమ్మ నాన్నకి బోధపడాలని.

నాన్న కలిగించుకు మాట్లాడేలోగా బామ్మ కోపంగా గొణుక్కుంటూ చరచరా వెళ్ళి బాదం చెట్టు కింద కూచుంది. నేను వెనకే భయంభయంగా వెళ్ళా. కొంచెం దూరంగా నిలబడ్డా. "నువ్వు కాదుగాని...ఛీ.. నీతో

నా చావు కొచ్చిందిరా. ఇన్నేళ్ళాన్ని ఆహరికి నా బతుకు దొంగబతుకైె పోయింది...ఫా అసలు నా ఛాయలకి రావద్దు. మీ అమ్మానాన్న ఉన్నారుగా.. వాళ్ళతోనే ఊరేగు... వారి అనుకొంటే దుఃఖం... కాదు అనుకొంటే సుఖం.. అంటూ బామ్మ బావురుమని ఏడ్చింది. కంటిరాద ఎండిన బాదం ఆకుల మీద టపటపా రాలాయి. పిడుగులు రాల్తున్నంత చప్పుడు నా చెవికి... దేవుడు ఏడుస్తుంటే ఎంత భయం వేస్తుంది... దిక్కులేనివాళ్ళకి? ఒక్కసారి బేరమని పెద్దగా ఏడ్చాను. బామ్మ తటాలున చేతులు . జాపి ఒళ్ళోకి లాక్కుంది. అక్కడే చెట్టు కింద ఎండాకుల మీద ఎండాకుల మీద బామ్మ ముడుచుకు పడుకొంది. నేను బామ్మ పక్కునే ఒరిగి దిగాలుగా కూచున్నా బామ్మ గుర్రు పెట్టి నిద్రపోయింది. బామ్మ మీద గండుచీమలు పాకుతుంటే వాటిని దులిపేస్తూ వెన్ను మీద చెయ్యి వేసి నా పక్కలో కూచునే బామ్మలా కూచున్నాను, కాకి రాల్చిన రెండు బాదం కాయలు గుండు మీద పడితే బామ్మ ఉలిక్కిపడి లేచింది. నాకు నవ్వొచ్చింది. సంగతి అర్థం కాగానే బామ్మ కూడా పక్కున నవ్వింది. ఆ నవ్వు కొండంత ధైర్యమై వరించింది.

★ ★ ★

దసరా రోజులు వచ్చాయి.

ఒక పెద్ద పీఠం మందీమార్బలంతో మా ఇంట్లో దిగింది. స్వాములారు, శిష్య గణం, సేవకులు,వంటలక్కలు, గున్న ఏనుగు, నాలుగు ఆవులూ, వాటి దూడలూ, జింకపిల్ల, రెండు పల్లకీలు, ఇవిగాక బోలెడు సాధన సామగ్రి నాలుగు గూడు బళ్ళ నిండా దిగాయి.. ఇల్లంతా ఆక్రమించుకొని సిపాయిల్లాగా వాళ్ళే ఎక్కడెక్కడ ఏమేమిటి ఎట్లా అమర్చుకోవాలో చూసుకొంటున్నారు. నేను, బొమ్మ పరాయివాళ్ళలా చోద్యం చూస్తున్నాం..

"ఇవాల్టి నుంచి మన కొంప సర్కస్ డేరా అనుకో." అంది బామ్మ..

వాళ్ళు మాట్లాడే భాష కూడా చిత్రంగా ఉంది. మా నాన్నని గృహస్థు అని పిలిచే వాళ్ళు. సామాజికులు, పూర్ణ దీక్షా పరులు, శిష్య పరమాణువులు, పాద రేణువులు.. ఏవిటో నాకు అర్థంకాని మాటలు చాలా వినిపించేవి. అంటే ఏవిటని బొమ్మని అడిగితే, "అంతా మనుషులేరా అబ్బీ ఉత్తదే అదో ఆడంబరం," అన్నది బామ్మ

గున్న ఏనుగుకి రోజూ బెల్లంబుట్ట, అరటిపళ్ళ గెల అందించేవారు. దాని సేవకి ఇద్దరు మావటీలు. శ్రీ మావటీగారిని మంచి చేసుకొని నన్ను ఒక్కసారైనా ఏనుగు ఎక్కించాలని బామ్మ తంటాలు పడింది కాని వారు సాధ్యపడదన్నారు. పల్లకీపైన

ఉండే శాటిన్ వస్త్రం చుట్టేసి , పల్లకీలని దేవిడీలో జాగ్రత్త చేశాడు. పల్లకి ఎక్కించమని హఠం చేస్తే, "ఆ సన్నాసి పల్లకి మనకెందుకురా.... నీ పెళ్ళికి దీని జేజెమ్మలాంటి పూసలపల్లకి పెట్టించి ఊరూ పేటా ఊరేగిస్తా అని బామ్మ సముదాయించింది. అందరూ నిద్దర్లు పోయాక సాములారి జింక చర్మం మీద నన్ను కాసేపు పడుకో బెట్టింది. బామ్మ. భలే మెత్తగామా, తమాషాగానూ ఉంది. జింకపిల్లతో ఆడుకోవాలనిపించేది. కాని బామ్మ దాన్ని శత్రువర్గంగా భావించి దూరంగా ఉండేది. మా ఇంట్లో అర్చనలు, దీక్షలూ, హోమాలూ ఘోటకంగా సాగుతున్నాయి. వచ్చే పోయే భక్తులు,

–బంధువులు అంతా కోలాహలంగా ఉంది.

స్వామివారు వెండిరేకులు తాపడం చేసిన సింహాసనం మీద కూచుని తావళం తిప్పుతూ ఉండేవారు. ఎప్పుడూ గంభీరంగా ఉండేవారు. ఎప్పుడేనా ఒక చిరునవ్వు ప్రసాదించేవారు భక్తులకి. అలౌకిక విషయాల్లోనూ, లౌకిక విషయాల్లో కూడా తల దూర్చేవారు. వంటలూ, పిండివంటలూ, కూరలూ, పులుసులూ అన్నీ ఏమేం ఎట్లా చెయ్యాలో ఆయనే చెప్పేవారు. చెప్పడం అనకూడదుట, ఆదేశించారు అనాలిట! చూట్టానికి వచ్చార కూడదు దర్శనానికి వచ్చారనాలిట.

"పాదాలివ్వండి స్వామి," అని ప్రాధేయపడేవాళ్ళు. వాళ్ళకి ప్రాప్తం ఉంటే పాదాలిచ్చేవారు. లేని వాళ్ళు పాంకోళ్ళకి మొక్కి వెళ్ళిపోతుండేవారు. సాములారు భోజనం చేశాక (అపచారం భిక్ష స్వీకరించాక) వెండి గొలుసుల ఉయ్యాలబల్ల మీద బాలీషుల మీదవాలి అరమోడ్పు కన్నులతో భుక్తాయాసం తీర్చు కొనేవారు. వింజామరలు విసరడానికి మేవంటే మేవని వంతుల కోసం పోట్లాడుకొనే వాళ్ళు భక్తులు. "జార్జి చక్రవర్తిదే భోగం– మళ్ళీ మీ స్వామివారిదే భోగం," అనేది శిష్యుల దగ్గర మా బామ్మ వాళ్ళు దానికెంతో గర్వపడేవాళ్ళు. సాయంత్రం ఆయన వేదాంత విషయాలు బోధించేవారు. అర్థం అయినా కాకపోయినా అంతా శ్రద్ధగా వినేవాళ్ళు. అయ్యవారికి శాలువలు, అమ్మవారికి పట్టు వస్త్రాలు, పళ్ళు, రొక్కం కానుకలుగా సమర్పించుకొనే వాళ్ళు.

ఒకరోజు శిల్కు లాల్చీ, నాలుగువేళ్ళకి ఉంగరాలు, మెడలో పతకపు గొలుసుతో ఆర్భాటంగా గుర్రబ్బండి దిగాడొక భక్తుడు. వస్తూనే స్వామివారి పాదాల మీద వాలాడు. స్వామివారు వాత్సల్యంతో వందనం స్వీకరించారు. జోడించిన ఉంగరాల చేతుల్ని తమ చేతుల్లోకి తీసుకొని, "ఎట్లా ఉందిరా వ్యాపారం?" అని అడిగాడు.

"అంతా తమ దయ" అన్నాడా భక్తుడు.

"రాహువు ఇల్లు మారుతున్నాడు ఇక నీకు తిరుగులేదురా. పట్టిందంతా బంగారమే," అన్నాడు. స్వామి భక్తుడి చేతులు వదిలిపెడుతూ భక్తుడి నడిమి వేలు నున్న ఎర్రాయి ఉంగరం స్వామి చేతిలోకి వచ్చింది. పక్కనే ఉన్న శిష్యుడి దోసెట్లో వేసి, "అమ్మవారికి ముక్కెర చేయించండి," అని చిరునవ్వుతో ఆదేశించారు. ఆ భక్తుడికి వేలు ఊడినంత బాధ కలిగింది. పెదాలు తడారిపోయినాయి. బిక్కచచ్చి, "తమ చిత్తం," అన్నాడు ఎప్పటికో తేరుకొని,

"కాదు తల్లి ఆజ్ఞ," అన్నారు స్వామి గంభీరంగా...

మనోవాక్కాయ కర్మల మీద స్వామివారు ప్రసంగం కొనసాగించారు. బామ్మ నవ్వాపుకోలేక సభలోంచి జారుకొంది. శిష్యుడు ఎదురైతే, "మీ దేవుడికి పట్టిందంతా బంగారమే," అని ఎగతాళి చేసింది. లోగడ విడిది చేసినప్పుడు ఆయన చూపు బామ్మ బంగారుమురుగు మీద పడిందిట. "తల్లి చిట్టికాసులు పేరు కావాలని గోల చేస్తోంది. నువ్వు చెయ్యి విదిలిస్తే తల్లి కోరిక తీరుస్తా." అన్నారట స్వామి బామ్మతో .

"అయ్యో.. ఆ తల్లికి నేనిచ్చేపాటి దాన్నా, సాక్షాత్తూ మహాలక్ష్మి, ఆమెకేం తక్కువ స్వామీ, అని బామ్మ భక్తిభావంతో సవినయంగా సమాధానం చెప్పిందిట.

"ఒరేవ్ హనుమంతుడి ముందా కుప్పిగంతులు? ఇచ్చేదాన్నయితే ఆనాడు గాంధీగారు గుమ్మంలో కొచ్చి స్వరాష్ట్రం కోసం జోలెపట్టిన రోజే ఇద్దును కదా... మహా మహా ఆయనకే ఇవ్వలేదు.. ఈ పర్కస్ కంపెనీకి ఇస్తానా...." అంది బామ్మ అది తీర్థప్రసాదాల సమయం.

భక్తులంతా కాళ్ళకి మొక్క, తీర్థం పుచ్చుకొని మళ్ళీ మొక్కి వెళ్తున్నారు. నేనూ వెళ్ళి చెయ్యి జాపా, స్వాములారు ఉగ్రంగా గుడ్లురిమి, "ఫో అవతలికి," అని గపిరాడు. చొక్కా తొడుక్కుని మొక్కడం, తీర్థాలు తీసుకోవడం మహాపచారంట! ఇంకేముంది కొంపలు మునిగిపోయినట్టు అందరూ హాహాకారాలు చేయడం మొదలెట్టారు. ఆ సందట్లో నాలాగూ చొక్కా విప్పేసి ఒంటి మీద నూలుపోగు లేకుండా ఆయన ముందు నిలబెట్టారు. అయినా ఆయన కటాక్షించలేదు. నన్ను బయటికి పంపెయ్యమని

తీర్థపుశంఖుతో సైగ చేశారు. తెలియక జరిగిన అపచారానికి మన్నింపు కోరాలని అమ్మ వెళ్ళి ఆయన ముందు నిలబడితే, మరీ రెచ్చిపోయి, "ఇవాళ అమృతం ఎవరికీ ప్రాప్తం లేదు. అపచారానికి ప్రాయశ్చిత్తం..." అన్నారు కఠినంగా శంఖు కింద పెట్టేసి తాళం అందుకొని ధ్యానంలోకి వెళ్ళిపోయారు.

భక్తులు, శిష్యులు అంతా నన్ను దోషిని చూసినట్టు చూస్తున్నారు. ఇదంతా చూస్తున్న మా నాన్నలో సహనం చచ్చిపోయింది, నన్ను బయటికి బరబరా లాక్కెళ్ళి, పూనకం వచ్చిన మనిషిలా చావగొట్టారు. ఒంటి మీద ఆచ్ఛాదన కూడా లేదేమో ఒళ్ళంతా వాతలు తేలాయి. గుక్క పెట్టి పరుగెత్తాను. బామ్మ పరుగుపరుగున ఎదురొచ్చి రెండు చేతులా నన్నెత్తుకొని గుండెలకు పొదువుకుంది. భయం, బాధ, ఉక్రోషం, ఒంటరితనం– ఇవన్నీ ఆవరించిన నాకు మా బామ్మ వెయ్యి చేతులు వాకోసం జాపిన అమ్మవారిలా కన్పించింది. గబగబా బాదంచెట్టు కిందకి తీసుకెళ్ళింది. వాతలు చూసింది. వలవలా ఏడ్చింది. ఒళ్ళంతా నిమిరింది. పై కొంగు కప్పింది. "ఆ బడుద్దాయికి నిన్ను కొట్టేందుకు చేతులెలా వచ్చాయిరా దూర్వాసపు పుటకా వాడూ.... అంటూ నాన్నని తిట్టింది. నా ఏడుపు ఎక్కిళ్ళు స్థాయికి తగ్గింది. బామ్మ మాత్రం బుసలు కొడుతోంది. ఇంతలో స్వాములవారి అంతరంగిక శిష్యుడు మడి ధోవతులు ఆరెయ్యడానికి పెరడువైపు వచ్చాడు.

"దీక్షితులూ ఇట్రా," అని గద్దింపుగా పిలిచింది. ఆ పిలుపుకి ఆయన ఉలిక్కిపడ్డాడు. ఆ సంభోధన.

ఆ ధాటీ– దీక్షితులుగారంటే స్వాములారి తర్వాత స్వాములారంతటివాడు. పెద్దాయన అలవాట్లు, ఇష్టాయిష్టాలు, వేళావేళలు, కళాకళలు అన్నీ తెలిసినవాడు. స్వామివారికి జలుబు చేస్తే దీక్షితులు గారికి తుమ్ములు వస్తాయి. అలాంటిది వారి సంబంధం, దీక్షితులు సంకోచిస్తూనే నాలుగడుగులు బామ్మవైపు చేశాడు.

"ఏం స్వాములారయ్యా బోడి సాములారు. పసివెధవని ఎలా వాతలు తేలాయో చూడు... పైన చొక్కా ఉంటేనే అంట్లవెధవ అయిపోయాడా అభంశుభం తెలియని పసిబిడ్డ.. ఆ మాటకొస్తే దేహశుద్ధి లేని పుండాకోర్లు చాలామందున్నారు మీ గుంపులో చేతనైతే వాళ్ళ చర్మాలు ఒలిపించి తీర్థాలు పోయమను, ఊరికే బృహదారణ్యాలు భగవద్గీతలు పల్లిస్తే లాభంలేదు. మానికతో జొన్నలు కొలిస్తే బలం వస్తుందా? దంచాలి, వండాలి, తినాలి, హరాయించుకోవాలి. అప్పుడొస్తుంది బలం బలం... ఔనా? మీ పీఠాయికి చెప్పు.. నాకేం భయంలేదు... వీడి బోడి శాపం వన్నేం చేయదు. బుసలుకొట్టే బామ్మ మాటలకి దీక్షితులు బుర్ర తిరిగిపోయింది. పిలక తడుముకొంటూ పిల్లిలా జారుకొన్నాడు. అయినా బామ్మ ఆగలేదు. "ధిక్కారమును సైతునా అని వేమూరి గగ్గయ్యలా గుడ్లూ వీడూనూ.. పిచిక మీద బ్రహ్మాస్త్రం అని.. ఒకపక్క నుంచి ఎకరాలు హరించిపోతున్నా తెలీడంలేదు... అరిశెల్పి. ఆప్పాల్ని వదల్లేనివాడు అరిషడ్వర్గాల్నేం వదుల్తాడు.."స్వాములారిని, మా నాన్నని కలగలుపుగా దీక్షితులు వెళ్ళిన అరగంట దాకా బొమ్మ తిడుతూనేఉంది.

రాత్రి అమ్మ నన్ను గట్టిగా కరుచుకొని కంటి నిండా ఏడ్చింది. నూనె రాసింది. నాన్న రోజంతా అన్నం తినలేదు. "ముందే ఉండాలి. నిగ్రహం... ఉపాసం ... ఉంటే పిల్లాడి వాతలు పోతాయా.. అంత తామసం కూడదు," అని బామ్మ మందలించింది.

తలదించుకొన్నారుగాని నాన్న గారు మాట్లాడలేదు. స్వాములారి మీద కాదు యావత్తు పీఠం మీద బామ్మ కత్తి కట్టింది. పాఠశాలలో వంటవాడి మీద దాష్టీకం చేసి నాలుగు చిట్టిగారెలు కొంగులో వేసుకొచ్చి వేడివేడిగా నాచేత తినిపించింది. దీక్షితుల్ని పనిమాలా పిలిచి, "ఇదిగో మహా నివేదన కాకుండానే చిట్టిగారెలు పిల్లాడికి పెట్టా చెప్పుకో దిక్కున్న చోట... మొక్కలి చెంబుడు నీళ్ళు పొయ్యడం.. పక్షికి గుప్పెడు గింజలు చల్లడం, పశువుకి నాలుగు పరకలు వెయ్యడం, ఆకొన్నవాడికి పట్టెడన్నం పెట్టడం ఇదే నాకు తెలిసిన బ్రహ్మమంత్రం.. సవాలు చేసింది బామ్మ. పాపం దీక్షితులుకి బామ్మంటే సింహస్వప్నమయింది. ఎప్పుడు పిలిపిస్తుందో తెలీదు. ఏం తిడుతుందో తెలీదు.

రెండోరోజు సాయంత్రం వేదాంతసభలో నన్ను పిలిచి ఒళ్ళో కూచోబెట్టుకొన్నారు స్వామివారు. జామ పండు ఇచ్చి, "మొత్తం తినాల్రా. అని తినిపించారు. నాకు పులి మీద కూచున్నట్టుంది. రుద్రాక్షలు గుచ్చు కొంటున్నాయి. అయినా ఎటూ కదలడానికి లేదు. తర్వాత మరికాస్త ముద్దుచేసి వారి పాంకోళ్ళు తొడిగించి, నడవమన్నారు. నేను టక టకా చప్పుడు చేస్తూ సభలో తప్పటడుగులు వేస్తుంటే, "ఏవమ్మో నీ మనవడు బాలకృష్ణుడు...." అన్నారు స్వాములారు పెద్దగా నవ్వుతూ. శిష్యులంతా ఆమోదిస్తున్నట్టు ముఖాలు వికసింపజేశారు.

"అంతా తమరి వాత్సల్యం... పసివాడి అదృష్టం అంది

బొమ్మ. ఈ సంఘటన తర్వాత దీక్షితులు సుఖంగా ఊపిరి పీల్చుకున్నాడు.

ఆ పీఠం మరోచోటికి తరలింది. బొమ్మ మేలుకొలుపులు పాడుతూనే ఉంది.

ముగ్గులు వేస్తూనే ఉంది. కాని నా చిన్నతనం బామ్మ వీపు నుంచి జారిపోయింది. నా కంచం నాదే. నా మంచం నాదే. హైస్కూలు చదువులో పడ్డాను. ఇప్పటికే ఆలస్యం అయిపోయిందనీ, నాకు వడకపోగు వెయ్యాలనీ నిర్ణయించారు. వారం ముందుగానే సందడి ప్రారంభమైంది. గురు పరంపరతో బాటు బంధు మిత్రులతో ఇల్లు నిండింది. మా అత్తయ్యా, మామయ్యా, వాళ్ళమ్మాయి కళ్యాణి వచ్చారు. కళ్యాణికి పదేళ్ళుంటాయి. ప్రతి ఇంట్లోలాగే మేనత్త కూతురు కాబట్టి, 'నీ పెళ్ళాం వచ్చిందిరోయ్. అని పాత సరసం ఆడారంతా. అత్తయ్య వస్తూనే బామ్మని చూసి ఏమిలే అమ్మా అంతగా చిక్కిపోయావ్.." అని బాధ నటించింది. నేను చెప్పేదాన్ని కాదులేనే ఎవరికీ, నువ్వు బాధపడకు. అంది వ్యంగ్యంగా బామ్మ.

"చూడు. ఆ చేతులు పుల్లల్లాగా అయిపోయాయ్... బావిలో చేద వేసినపుడు ఆ మురుగు జారి నూతిలో పడ్తుందేమో చూసుకో.. 'సలహాగా అత్తయ్య అంటే–

"నువ్వు వెయ్యి చెప్పు లక్ష చెప్పు... చచ్చినా నా చేతి మురుగు నీకివ్వను " తెగేసినట్టు అన్నది బామ్మ అత్తయ్య కస్సున లేచింది ఆ మాటకి, "అంటే నీ ముష్టి మురుగు కోసం పడి చస్తున్నావా.

"ముష్టిది కాదది బంగారపుది– సువీ అంటే రోకలి పాటని తెలుసులేవే... అంది బామ్మ.

"ఒక్కగానొక్క ఆడపిల్లని... కన్న కూతుర్ని.. దయా పేక్షలు లేవు. మీ పెట్టుపోతలకి మేం ఎప్పుడైనా ఏడ్చామా..." అని గద్గద స్వరంతో అత్తయ్య విజృంభించింది.

తల్లీకూతుళ్ళు వాదులాట విని అమ్మ లోపల్లోపల ఆనందపడ్డది. మాటామాటా మరీ పెరక్కుండా.

నాన్న సర్దుబాటు చేశారు. నా చెవిలో నాన్న బ్రహ్మోపదేశం చేశారు. మెడలో జందెపు పోగు చెవులకి బంగారు పోగులు నాకు కొత్త అలంకారాలైనాయి.

బాదంచెట్టు పండుటాకులు కాలుస్తూ కొత్త ఆకులు తొడుగుతోంది. తొర్రలో పాత చిలకలు: ఎగిరిపోయి కొత్త చిలకలు వచ్చి వాస్తున్నాయి. బొమ్మకి అరణంగా ఇచ్చిన ఆవుదూడకి అయిదోకారు దూడ పుట్టింది.

కంటిచూపు తగ్గినా బాగా చెయ్యి తిరిగిన బామ్మ ముగ్గులు గడి తప్పకుండా వేస్తూనే ఉంది. పీఠాధిపతుల తాకిడీ తగ్గింది. తాతలనాటి క్షేత్రాలు తరిగిపోయాయి. అంటు మామిడితోట గృహస్థు పేరు మీద లేదిప్పుడు. దేవిడీని గోడలు తప్ప పై పెంకులు లేవు. ఒంట్లో ఓపిక తగ్గినా బామ్మ మాట చురుకు తగ్గలేదు.

"మా ఉయ్యాల వెండి గొలుసుల్ని గున్న ఏనుగు మింగేసింది," అని చాలా సరసంగా చెప్పే నవ్వేది. అమ్మకి అకాల వార్ధక్యం వచ్చింది. తడి చీరల శిక్ష తప్పింది. నాన్న నిర్లిప్తంగా ఉంటున్నారు. అప్పటి .

వైభవం లేదు. అట్లాగని దరిద్రము లేదు. నాకు తెలిసిన వైభవం బామ్మ బాదంచెట్టూ అవి ఇప్పుడూ ఉన్నాయి. 'నాది అనుకొంటే దుఃఖం, కాదు అనుకొంటే సుఖం, బామ్మ చెప్పిన బ్రహ్మ సూత్రం నిజమే అన్పించింది.

నా ఎఫ్.ఎ. పూర్తయింది. బందరులో సర్కారు ఉద్యోగం వచ్చింది.

అయినవి కానివి పెళ్ళి సంబంధాలు రావడం మొదలైంది. మేనత్త కూతురు కళ్యాణి ప్రస్తావన వచ్చింది. కానీ బామ్మ ససేమిరా వచ్చింది.

"ఆ పిల్ల పేరుకి కళ్యాణే గాని ఉత్త నత్త గవ్వ, దాని తల్లి గడుసు దయ్యం. దాంతో నువ్వు సుఖపడలేవ్.. పరాయి సంబంధమే చేసుకొందాం." అని బామ్మ స్పష్టంగా చెప్పింది.

అత్తయ్యా వాళ్ళు కూడా నాకాళ్ళు కడిగి పిల్లనివ్వడానికీ, పుట్టింటి బంధం నిలిచిపోవాలని ఏ మాత్రం ఆరాటపడలేదు. వాళ్ళకి ఒక్కతే పిల్ల కావలసినంత ఉన్నవాళ్ళు. మాకిప్పుడు ఈనాములూ లేవు. నేను బారిస్టర్ కాదు.

చూసిన రెండుమూడు సంబంధాల్లో చిన్నప్పుడు చదువు చెప్పిన నరసింహం పంతులుగారి ద్వారా వచ్చిన సంబంధం నచ్చింది. బామ్మకి మరిమరీ వచ్చింది. తాంబూలాల దాకా వచ్చాక నాలుగు కాసుల బంగారం దగ్గర తేడా వచ్చింది. అటూ ఇటూ నరసింహంగారు మాటలు నడిపారు గాని చివరికది చిలికిచిలికి గాలివాన అయింది. పెద్దవాళ్ళ మధ్య సొమ్ము కంటే పంతాలు అడ్డచ్చాయి.

“పిల్ల పొందగా ఉందిరా... పచ్చగా దొరసానిలా ఉంది.. కళ్ళు కజ్జికాయల్లా ఉన్నాయి... నాలుగు కాసుల బంగారం ఒక్క ముద్దుకి చెల్లు. అంటూ బామ్మ తెగ ఊరించడం మొదలు పెట్టింది.

లోపల వంతం పెట్టుకొని పైకి మాత్రం, ‘వాడిష్టం అని నాలిక చివరిమాట అంటున్నారు అమ్మానాన్న నేను ఎటూ తేల్చుకోలేని స్థితిలో పడ్డాను.

బాదంచెట్టు కింద ఒంటరిగా కూచోబెట్టి బామ్మ హితోపదేశం మొదలు పెట్టింది.

‘పిల్ల పేరు గాయిత్రి....”

“అయితే...”

“రోజూ పదిసార్లు పిలిచినా దాలు పుణ్యం పురుషార్ధం... పదిమందిలో పుట్టి పెరిగిన పిల్ల...”

“అయితే...

“కష్టసుఖాలు తెలుస్తాయి... అరటిదూట కూర ఆవపెట్టి కమ్మగా వండు తుందిట పెద్ద పెద్ద ముగ్గులు వేస్తుంది...”

“అయితే..”.

“ఒరే కోర్నాసీ దూటకూరకి, ముగ్గులకీ బోలెడు ఓర్పూ, ఓపికా కావాలా– పనితనమూ ఉండాలి.... పిల్లకి రుక్మిణీ కళ్యాణం కంఠతా వచ్చుట టీకా తాత్పర్యంతో సహా.”

“అయితే”

“అయితేనా? ఇష్టమైన వాడికోసం ఏదైనా చేసే జాణతనం ఉందని.. నువ్విట్టాగే మీనమేషాలు లెక్కిస్తూ కూచుంటే ఆ పిల్లే నిన్ను లేవదీసుకుపోతుంది.. సరేనా...” అంది నాకు రోషం తెప్పించాలని, అయినా నేనేమీ చలించలేదు. మర్నాడు ప్రయాణం రోజు వెళ్ళబోతూ నాన్న ముందు మౌనంగా నిలబడి మాట్లాడ్డానికి తటపటాయిస్తుంటే, ఆయనే అందుకొని, “నీ ఇష్టంరా. నేనేం నిధినిక్షేపాలిచ్చానని నీమీద పెత్తనం చెలాయిస్తాను. నువ్వు అన్ని విధాలా స్వతంత్రుడివి... నీకు ఇష్టమైతే మాదేవుంది.. వచ్చి పీటల మీద కూచుంటాం..” అన్నారు.

విషయం తేలిపోయింది.

రకరకాల ఆలోచనలతో రాత్రంతా నిద్ర పట్టలేదు. బామ్మ ఒక రాత్రివేళ చీకట్లో తరుముకొంటూ నా గదిలోకి వచ్చింది. నా మంచం మీద కూచుంది. మెల్లగా లేపాలని తరుముతోంది. “లేచే ఉన్నాలే చెప్పు అన్నాను. “నువ్వు నిద్రపోవని తెలిసే వచ్చానా... చూడబ్బాయ్ మీ నాన్నకి ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువ...

మీ అమ్మకి మొగుడు చెప్పిందే వేదం. ఈ కోపతాపాలు నాల్రోజులుంటాయ్ అనక పోతాయ్... మిగిలేది నిక్షేపంలాంటి పిల్ల... అంచేత నిష్కర్షగా గాయిత్రినే చేసుకొంటానని తేల్చి మరీ వెళ్ళు.”

నేను ఏమీ చెప్పకుండా అటు తిరిగి పడుకొన్నాను.

“ఒరేవ్ అధిక మాసాలతో ఎనభై దాటేశా... నీ పెళ్ళి చూడాలని ప్రాణం ఉగ్గ బట్టుక్కూచున్నా... పిల్ల గోరింటాకుతో పారాణి పెట్టుకొంటే నీ కాళ్ళు పండాలి. నువ్వు ఆకువక్క వేసుకొంటే అమ్మడు నోరు పండాలి. అదీఇదీ అయి ఆనక మీ కడుపు పండాలి. నేను మళ్ళీ నీ ఇంటికి రావద్దు. బామ్మ గొంతు జీరబోయింది. కన్నీటిచుక్క నా గుండెమీద పెద్దగా రాలింది.

ఉద్యోగం ఊరు చేరగానే గాయిత్రి సంబంధమే ఖాయం చేయమని నాన్నకి మూడుముక్కలు ఉత్తరం రాశా. పోస్టు చేయకుండానే, ‘ముహూర్తం నిశ్చయమైంది.. ఉన్న పళంగా పదిహేను రోజులు సెలవు పెట్టి రమ్మ’ని టెలిగ్రాం వచ్చింది. ఇంట్లో అడుగు పెడుతుండగానే బామ్మ ఎదురొచ్చి, “దిగివచ్చార్రోయ్... నీలాంటి అల్లుణ్ణి వదులుకుంటారా.... ఏదో కాస్త బెట్టు చేశారు... పాపం వాళ్ళదీ పెద్ద కుటుంబం– నాలుక్కాసులు ఒక్క ముద్దుకి చెల్లురా అంటే నువ్వూ విన్నావు కాదు.. చివరికి మన నరసింహం సానుకూలం చేశాడు. “ అని తెగ సంబరపడిపోతూ చెప్పింది.

కలతలూ, కలహాలూ లేకుండా పెళ్ళి అయిపోయింది. ఒళ్ళంతా కళ్ళు చేసుకొని బామ్మ మా పెళ్ళి! చూసి ఆనందించింది. “ఒరేవ్ ఎప్పుడో నీ చిన్నప్పుడు స్వాములారి పల్లకి ఎక్కించమని హటం చేశావ్ జ్ఞాపకం ఉందీ? ఇహ ఊరేగు. బతుకంతా సుఖంగా అందరి కళ్ళూ మీమీదే ఉండేట్టు ఊరేగండి,” అని బొమ్మ మా జంటని దీవించింది.

అక్కర తీరింది.

మర్నాడు, “నా మనవడు నచ్చాడా పిల్లా,” అని బామ్మ కొంటెగా అడిగితే, ఔను కాదు అనకుండా, “మీ మనవడు నాకిప్పుడు మూడొందల అరవై కాసులు బాకీ– ఎట్లా తీరుస్తారో

ఏమో..." అందిట బుంగమూతి పెట్టి పెళ్ళికూతురు.

ఆ మాటకి అదిరిపడి, "ఓసి పిడుగా," అని బామ్మ గాయిత్రిని ముద్దు పెట్టుకొంది.

బందరులో కాపరం పెట్టాం. బామ్మ మాటలో చెప్పాలంటే ముగ్గులోకి దిగాం. ఒంటి గది– కొత్త

కాపురం– బామ్మ దీవెనలా పూసలపల్లకీలో ఊరేగుతున్నట్టుంది.

ఆవిడ కాళ్ళ గోరింటాకు అతడి కాళ్ళకి ఎట్లా పండుతుందో అనుభవమైంది. నేను తాంబూలం నమిలే గాయిత్రి నోరు ఎందుకెరుపెక్కేదో ఎరుకైంది.

బామ్మని బందరు వచ్చి నా దగ్గర ఉండమన్నాను.

"నా ఊరు. నా నేల.. ఇక్కడే మట్టయిపోవాలిరా.. మీ అమ్మ దొడ్డ ఇల్లాలు.. నాకేం తక్కువ జరగదులే." అంది దర్జాగా.. బామ్మ చివరిక్షణాల్లో చూడ్డానికి వెళ్ళాం. మాట స్పష్టత లేదు. "కొత్త కాపురం బావుందా," అని అడిగింది. ఇద్దరం తల ఊపాం.

"కాపురం, కత్తిపీట కొత్తల్లో కంటే కొంచెం పదునుపడ్డాకే బావుంటాయి..." అంది మాట పెగుల్చు కొని, మేం నవ్వితే బామ్మ పెదవి కదిలింది. ముఖం వెలిగింది. మా ఇద్దరి చేతులూ చేతిలోకి తీసుకొంది. "ఒక మొక్కకి చెంబెడు నీళ్ళు... గింజలు... అన్నం పెట్టాలి... ఆ ఫలం నాకు దక్కింది. నా బతుకు హాయిగా వెళ్ళిపోయింది... నేను ఇపుడో... కాసేపో..." బామ్మ మాటలకి నాకు దుఃఖం పొర్లుకొచ్చింది.

"నిన్ను వదిలి ఎక్కడికి పోతాన్రా వెర్రి నాగన్నా.. అలా వెళ్ళి కాసేపు పెత్తనం చేసి మళ్ళీ నీ ఇంటికే వస్తాగా...." అంటూ ధైర్యం చెప్పి బామ్మ వెళ్ళిపోయింది.

భరించలేనంత శూన్యం నాలో నిండుకుంది. అమ్మానాన్న చుట్టంపక్క దయ దేవుడూ అన్నీ, అంతా,

అందరూ ఒక్కసారి వదిలి వెళ్ళిపోయినట్టయింది. వెళ్ళి పిచ్చిగా బాదం చెట్టు చుట్టూ తిరిగాను, డెబ్బై ఏళ్ళ ఆ పిచ్చిమొద్దుకి బామ్మ పోయిందని తెలియదు. రేపట్నించి చెంబెడు నీళ్ళెవరు పోస్తారు? పై తొర్రలో కిలకిల లాడే చిలకలకి తెలియదు బామ్మ పోయిందని రేపట్నించి గుప్పెడు గింజలు ఎవరు జల్లుతారు? చిన్నప్పుడు చిరుతిళ్ళు దాచుకొన్న తొర్రలో చెయ్యిపెట్టి వెదికాను. దాన్నిండా బాదంకాయలు దాచి ఉన్నాయి. రేపట్నించి రాలిన బాదంకాయలు ఎవరు ఏరతారు?


బాదంచెట్టుని చుట్టుకున్న బామ్మ జ్ఞాపకాలు ఎన్నేళ్ళయినా మర్చిపోలేను. ఆ చెట్టు నీడలో నా చిన్నతనం చెక్కు చెదరకుండా ఉంది.

కర్మకాండ ముగిసింది. బామ్మ ఆరో ప్రాణంగా చూసుకొన్న బంగారు మురుగు తూకానికి పెడితే గిల్టు నగ అది అని తేలింది. అమ్మానాన్న, అత్తయ్య అంతా మొహామొహాలు చూసుకొన్నారు. మనవడికి మంచి పెళ్ళాం రావాలని బంగారు మురుగు కరిగించిందని వాళ్ళకి తెలియదు. పెళ్ళిపెద్దగా కథ నడిపించిన నరసింహం పంతులుగారు చెప్పేదాకా నాకూ తెలియదు..

బామ్మ మా ఇంటికి వస్తుంది. అన్నమాట ప్రకారం ఆవిడ బంగారు మురుగు ఆవిడకే .. గాయిత్రి సాక్షిగా

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక కథ సెప్టెంబర్ 1993)

(సత్య బాలాంత్రపు గారి సౌజన్యంతో)



**శ్రీరమణ**

**జననం1952 సెప్టెంబరు 21 - మరణం: 2023 జులై 18.**

**వీరు ప్రముఖ కథకుడు, వ్యంగ్య వ్యాస రచయిత. సుప్రసిద్ధమై, సినిమాగా కూడా మలచబడిన మిథునం' కథా రచయితగా సుప్రఖ్యాతుడు. పత్రికల్లో వ్యంగ్య హాస్య భరితమైన కాలమ్స్ నడిపిన కాలమిస్టుగా, కథకుడిగా, సినిమా నిర్మాణంలో నిర్వహణ పరంగా పలు విధాలుగా సాహిత్య, కళా రంగాల్లో ప్రసిద్ధి వహించారు. ఆయన "పత్రిక" అనే మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా ఉన్నారు. ఆయన హాస్యరచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం 2014 కీర్తిపురస్కారాన్ని అందుకున్నారు.**


**వీరి పూర్తి పేరు వంకమామిడి రాధాకృష్ణ కామరాజు రామారావు.**


# బాల చిత్రకారిణి కొత్త పరిచయం






హాసిని యేలూరి భారతీయ సంతతి కి చెందిన అమెరికన్ చిత్రకారిణి. పిన్న వయసులోనే అత్యద్భుత చిత్రాలు గీసి పలు అవార్డులు పొందటంతో బాటు ప్రసిద్ధ చిత్రకారుల మన్ననలు పొందుతుంది. ఇంతకీ తన వయసు ఇప్పుడు 14 ఏళ్ళే. ప్రస్తుతం ఎనిమిదవ తరగతి పూర్తీ చేసుకున్న తాను ప్రఖ్యాత పెన్సిల్వేనియా ఫైన్ ఆర్ట్స్ వారు నిర్వహించబోతున్న వారం రోజుల పోర్ట్రెట్ పెయింటింగ్ వర్కుషాప్ కి సెలెక్ట్ అయింది. గత సంవత్సరం నార్త్ కరోలినా స్టేట్ పోలీస్ డిపార్ట్మెంట్ వారు డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో హాసిని ప్రధమ స్థానాన్ని పొందినది. తాను వేసిన చిత్రం విద్యార్థులను ఆలోచింప చేసేదిలా ఉండటంతో నెలరోజుల పాటు ఆ చిత్రాన్ని ప్రదర్శనకు ఉంచారు. అలాగే అక్కడి సిటీ సెంట్రల్ లైబ్రరీ వారు నెలరోజులు హాసిని చిత్రాల ప్రదర్శనకై ఉచితంగా తమ గ్యాలరీ ని కేటాయించారు. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించిన 21 రోజుల బ్రహ్మం కళా యజ్ఞ పోటీలలో ‘ హైలి కమాండబుల్ అవార్డును సొంతం చేసుకుంది. ఈ అవార్డును పొందిన పిన్న వయస్కురాలు తనే. ఇటీవల ప్రైమరీ స్కూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన గ్రాడ్యుయేషన్ డే లో వారి స్కూల్ లోని టీచర్స్ అందరూ వచ్చి హాసిని తో సెల్ఫీలు దిగుతూ ‘ భవిష్యత్తులో గొప్ప చిత్రకారిణి అవుతావు, అప్పుడు నువ్వు మా స్టూడెంట్ వి అని చెప్పుకోవడానికి ఒక ఆధారం ఉండాలి కదా అందుకే ఈ సెల్ఫీలు’ అని వారి బెస్ట్ విషెస్ చెప్పారు. వారి మాటలు నిజమై చిత్రకళ జగత్తులో మహోన్నత శిఖరాలకు ఎదిగి, మన దేశానికి మంచి పేరు తెస్తుందని ఆశిద్దాము. ఆల్ ది బెస్ట్ హాసిని.

**–సేకరణ : యేలూరి శేష్రబ్రహ్మం**






**హాసిని యేలూరి**
**USA**
**8 th class**




# బాల బహుళ






సాన్వి కలిత,
4 వ తరగతి
బెంగళూరు






శ్రేష్ఠ సాయి తుంగతుర్తి,
6 వ తరగతి
విశాఖపట్టణం





ఇషిక సిద్ధి
3వ తరగతి
హైదరాబాదు





ఏవ సిద్ధి
1 వ తరగతి
U.S.

# తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ మహిళా కథల పోటీకి ఆహ్వానం

www.bahulabyjwalitha.com

www.telugutalli.ca

HRC LITERARY FOUNDATION KHAMMAM

**బహుళ అంతర్జాల అంతర్జాతీయ త్రైమాసిక స్త్రీవాద పత్రిక, తెలుగు తల్లి కెనడా మాసపత్రిక, హెచ్.ఆర్.సి.లిటరరీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కథల పోటీకి కథలకు ఆహ్వానం.**

**అంశం :** తెలంగాణ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించాలి.

**చివరి తేదీ : 30 ఆగస్టు 2023.**

### నిబంధనలు:

1. కథలను యునికోడ్ లో కానీ వర్డ్ ఫైల్ కానీ పంపాలి.
2. (ఏ ఫోర్ సైజ్ పేపర్) 7 పేజీలు మించకుండా కథ ఉండాలి లేదా 2200 పదాలకు మించకుండా, అక్షర దోషాలు లేకుండా జాగ్రత్తగా చూసుకొని కథలు పోటీకి పంపండి .
3. ఒక్కొక్కరు ఒక్క కథ మాత్రమే పంపాలి.
4. కథ పై పేరు రాయకూడదు.
5. హామీపత్రంలో మీ కలం పేరు, అసలు పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఈమైల్ ఐడి, మీ స్వంత రచన అని, ఈ పోటీ కొరకు రాసిన కథ అని రాయాలి. వ్యక్తిగత వివరాలతో పాటు మీ పాస్పోర్ట్ సైజ్ ఫోటో జోడించాలి.
6. పోటీకి పంపిన కథలతో సంకలనం వెలువడుతుంది. అంత వరకు వేరే పత్రికలకు పంపకూడదు.

**పోటీ ఫలితాలు వెల్లడి: 15 అక్టోబర్ 2023.**

### విజేతలకు

1. ప్రథమ బహుమతి 5000
2. ద్వితీయ బహుమతి 4000/-
3. తృతీయ బహుమతి 3000/-
4. ఐదు ప్రత్యేక బహుమతులు ఒక్కొక్కరికి 1000/-


**కథలు పంపవలసిన చిరునామా:**

telanganamahilakathalu@gmail.com    వివరాలకు : Mobile +917995820736

# కొత్త పుస్తకాలు




కొత్తచూపు
(స్త్రీల కథలు 2023)
సంపాదకులు: జ్వలిత
పుటలు: 136, వెల: 180/-
ప్రచురణ: జె.డి. పబ్లికేషన్స్, హైదరాబాద్.
ఆగస్టు 2023.
ప్రతులకు: 9989198943.




ఇంతియానం
(స్త్రీల యాత్రాకథనాలు)
సంపాదకురాలు: స్వర్ణ కిలారి
పేజీలు - 314, వెల: 300/-
ప్రచురణ - అన్వీక్షకి పబ్లిషర్స్ ప్రై.లి. హైదరాబాద్,
జూలై 2023.
ప్రతులకు: 9705972222, 9849888773




ఎడారి చినుకు
(దీర్ఘ కవిత)
రచన: ఝాన్సీ కొప్పిశెట్టి
పుటలు: 54, వెల: 150/-
ప్రచురణ: నాగమణి పబ్లికేషన్స్,
హైదరాబాద్. జూన్ 2023.
ప్రతులకు : 98660 59615


Printed at JD Publications, Hyderabad


Price : 100/-